

ఈనాడు



కరీంనగర్ 9-10-2024 బుధవారం సిటీ సంపుటి 51. సంచిక 60
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50. పేజీలు 20 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కొలువుల పండుగ





DSC - 2024

11,062 ఉపాధ్యాయ నియామకాలు

తేదీ
09 అక్టోబర్, 2024
04:00 PM

వేదిక
ఎల్బీ స్టేడియం,
హైదరాబాద్



నియామక పత్రాలు అందజేయనున్న గౌ॥ ముఖ్యమంత్రి
శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు

ప్రజాపాలనలో నెరవేరుతున్న యువత కలలు

6,956 — 31 జనవరి, 2024
నర్సింగ్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు

441 — 07 ఫిబ్రవరి, 2024
సింగరేణిలో కారుణ్య నియామకాలు

13,444 — 14 ఫిబ్రవరి, 2024
పోలీస్, ఫైర్, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్, జైళ్ల శాఖ

1,997 — 15 ఫిబ్రవరి, 2024
లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు, పీజీటీలు

5,192 — 04 మార్చి, 2024
లెక్చరర్లు, టీచర్లు, మెడికల్ సిబ్బంది

687 — 26 సెప్టెంబర్, 2024
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు

1,635 — 06 అక్టోబర్, 2024
లైబ్రేరియన్లు, పీఈటీలు, ఏఈఈలు, వ్యవసాయ అధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు

కొలువుల తెలంగాణ.. యువత భవితకు చిరునామా!

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

(c) eenadu

అజహరుద్దీన్‌ను ప్రశ్నించిన ఈడీ



ఈనాడు, హైదరాబాద్: నిధుల దుర్వినియోగం కేసులో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు అజహరుద్దీన్ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఆధునికీకరణ పనుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై అవినీతి నిరోధకశాఖ(అనిశా) కేసు నమోదు చేసింది. దాదాపు రూ.20 కోట్లతో జరిపిన కొనుగోళ్లు, అగ్నిమాపక వ్యవస్థ ఏర్పాటు వంటి పనుల్లో అవకతవకలు జరిగాయని, అదనపు చెల్లింపులతోపాటు చేయని పనులకు కూడా బిల్లులు మంజూరు చేశారన్నవి ప్రధాన అభియోగాలు. ఫోరెన్సిక్ ఆడిటింగ్‌లోనూ అనుమానాస్పద లావాదేవీలు ఉన్నట్లు తేలడంతో అనిశా అభియోగపత్రం దాఖలు చేసింది. దీని ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసింది. అవకతవకల వ్యవహారంలో నిధుల మళ్లింపు జరిగిందని భావిస్తున్న ఈడీ.. దీన్ని నిర్ధారించేందుకు దర్యాప్తు మొదలుపెట్టింది. ఇందులో ఈ నెల 3వ తేదీన తమ ఎదుట విచారణకు హాజరు కావాలని అజహరుద్దీన్‌కు నోటీసులు జారీ చేసింది. అనివార్య కారణాల వల్ల తాను ఆ తేదీన హాజరు కాలేనని, వారం రోజుల గడువు కావాలని కోరుతూ ఈడీ అధికారులకు ఆయన ఈమెయిల్ పంపారు. దీంతో 8వ తేదీన హాజరు కావాలని ఈడీ అధికారులు మరో నోటీసు పంపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో అజహరుద్దీన్ ఈడీ కార్యాలయానికి వచ్చారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి తమ దర్యాప్తులో వెల్లడైన అంశాల ఆధారంగా అధికారులు ఆయన్ని ప్రశ్నించారు. రాత్రి 8.30 గంటల వరకూ ప్రశ్నించి వాంగ్మూలం నమోదు చేశారు.

'కుట్రపూరితంగా కేసులు'

తనపై కుట్రపూరితంగా కేసులు పెట్టారని అజహరుద్దీన్ ఆరోపించారు. ఈడీ విచారణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై పెట్టిన కేసులన్నీ అక్రమమేనని, ఎక్కడా ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. హెచ్‌సీఏ కేసులోనే తనను విచారణకు పిలిచారని, ఈడీ అధికారులకు సహకరించానని చెప్పారు.

నేడు పట్నం మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ శాసనమండలిలో చీఫ్ విప్‌గా నియమితులైన పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 10:30 గంటలకు శాసనమండలిలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకుల సమక్షంలో ఆయన బాధ్యతలు చేపడతారు.

నేడు గాంధీభవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి'

'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమం బుధవారం గాంధీభవన్‌లో జరగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కానున్నారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి ఆయన వినతులు స్వీకరిస్తారు.



పని చేస్తూ.. లోపాలు సరిదిద్దుకోండి!

ఒక్క చిన్న లోపమూ లేని ప్రణాళికను ముందే తయారుచేసుకోవడం చాలా చాలా కష్టం! దాదాపు 97% ప్రణాళికలు ఆదిలో లోపభూయిష్టంగానే ఉంటాయి. అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత ఆ లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగేవారే విజయవంతమవుతారు. పని మొదలుపెట్టకుండా లోపాల గురించే ఆలోచించుకుంటూ ఉంటే జీవితంలో పురోగతి సాధించలేం.

– జిమ్ హెస్కెల్, బ్రాండ్ స్ట్రాటజిస్ట్

హైదరాబాద్‌కు విదేశీ వర్సిటీలు?

- ఇటీవల యూజీసీకి మలేసియా వర్సిటీ దరఖాస్తు
- ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్, ఆక్స్‌ఫర్డ్‌లను రప్పించడంపై దృష్టి
- నగర బ్రాండ్ పెంపే ప్రభుత్వ లక్ష్యం



లింకన్ వర్సిటీ

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు, ఫార్మా, ఐటీ కంపెనీలకు నిలయంగా మారిన హైదరాబాద్‌కు ప్రఖ్యాత విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లను రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఒక్క విదేశీ వర్సిటీనైనా హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించాలని, తద్వారా మన విద్యార్థులకు అత్యుత్తమ అవకాశాలు కల్పించడంతోపాటు నగర బ్రాండ్‌ను మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల విదేశీ పర్యటనలో అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ, యూకేకు చెందిన ఆక్స్‌ఫర్డ్ యాజమాన్యాలతో సమావేశమై హైదరాబాద్‌లో క్యాంపస్‌లను నెలకొల్పాలని ఆహ్వానించారు. రాష్ట్ర విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాలని, అందుకోసం టాప్ వర్సిటీల యాజమాన్యాలతో మాట్లాడి క్యాంపస్‌లు ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నిస్తున్నామని ఇటీవల సీఎం వెల్లడించిన విషయం తెలిసిందే.

గత నవంబరులోనే కేంద్రం అనుమతి

భారత్ నుంచి ఏటా 12 లక్షల మంది ఉన్నత విద్య కోసం అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, యూకే, జర్మనీ తదితర దేశాలకు వెళుతున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉంటున్నారు. ఈ క్రమంలో విదేశీ వర్సిటీల ప్రాంగణాలను దేశంలో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 2023 నవంబరులో అనుమతిచ్చింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో టాప్ 500 వర్సిటీలు యూజీసీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. దీంతో దాదాపు 10కిపైగా వర్సిటీలు దరఖాస్తు చేసుకున్నట్లు యూజీసీ వర్గాల సమాచారం. ఆస్ట్రేలియాకు చెందిన డైకిన్ వర్సిటీ అహ్మదాబాద్‌లోని గిఫ్ట్ సిటీలో క్యాంపస్ ఏర్పాటుకు యూజీసీ నుంచి అనుమతి పొందింది. అక్కడ ప్రస్తుత విద్యా సంవత్సరం(2024-25)లోనే తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంగణంలో సైబర్ సెక్యూరిటీలో పీజీ కోర్సుకు 3,500 దరఖాస్తులు రావడం విశేషం. మన దేశంలో ప్రాంగణాన్ని ప్రారంభించిన తొలి విదేశీ వర్సిటీగా ఇది గుర్తింపుపొందింది. తాజాగా యూకేకు చెందిన సౌతాంప్టన్ యూనివర్సిటీ గురుగ్రామ్‌లో క్యాంపస్ ఏర్పాటుకు యూజీసీ నుంచి ప్రాథమిక అనుమతి (ఎల్‌ఓఐ) పొందింది. మలేసియా, కెనడా వర్సిటీలు సైతం దరఖాస్తు చేసి అనుమతి కోసం ఎదురు చూస్తున్నాయి.

రాష్ట్రంపై లింకన్ వర్సిటీ ఆసక్తి

రాష్ట్రంలో ప్రాంగణం ఏర్పాటుకు మలేసియాకు చెందిన లింకన్ వర్సిటీ కొద్ది నెలల క్రితమే యూజీసీకి దరఖాస్తు చేసింది. ఇది క్యూఎస్ ప్రపంచ ర్యాంకింగ్‌లో 301-340 పరిధిలో ఉంది. యూజీసీ ఇంకా దీనికి అనుమతివ్వలేదు. ఆ వర్సిటీని హైదరాబాద్ శివార్లలో నెలకొల్పే అవకాశం ఉందని ఉన్నత విద్యామండలి అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ), బిట్స్ పిలానీ క్యాంపస్, నల్సార్, ఐఐటీ, సెంట్రల్ వర్సిటీలతో ఇప్పటికే హైదరాబాద్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. స్కిల్ యూనివర్సిటీకి ఇటీవల ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటికితోడు ప్రపంచ స్థాయి వర్సిటీల ప్రాంగణాలు సైతం ఏర్పాటైతే.. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా ఎదిగేందుకు దోహదపడతాయని సర్కారు భావిస్తోంది.



వనదుర్గ.. జగద్రక్ష

దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాతను కాత్యాయనిదేవిగా అలంకరించారు. ఆలయం వద్ద వరద ప్రవాహం ఉండటంతో రాజగోపురంలో నిత్యపూజలు కొనసాగుతున్నాయి. సమీపంలోని గోకుల్‌షెడ్‌లో నవరాత్రోత్సవాల కోసం ప్రతిష్ఠించిన అమ్మవారికి పూజలు, అలంకరణలు నిర్వహిస్తున్నారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, పాపన్నపేట

కొండా సురేఖను చట్టప్రకారం శిక్షించండి

- ఆమె దురుద్దేశపూరిత వ్యాఖ్యలు మా కుటుంబ ప్రతిష్ఠను దెబ్బతీశాయి
- పరువునష్టం కేసులో సినీ నటుడు అక్కినేని నాగార్జున వాంగ్మూలం



పరువు నష్టం కేసులో వాంగ్మూలం ఇచ్చేందుకు నాంపల్లిలోని ప్రత్యేక న్యాయస్థానానికి వచ్చిన అక్కినేని నాగార్జున, అమల, నాగచైతన్య

ఈనాడు, హైదరాబాద్: తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాజకీయ దురుద్దేశంతో వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సినీ నటుడు అక్కినేని నాగార్జున నాంపల్లి ప్రత్యేక కోర్టును కోరారు. కొండా సురేఖపై దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో మంగళవారం ఆయన న్యాయస్థానం ముందు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. ఆయనతో పాటు భార్య అమల, కుమారుడు నాగ చైతన్య ఉన్నారు.

సంచలనాల కోసమే...

"తెలుగు సినీ చరిత్రలో నా తండ్రి అక్కినేని నాగేశ్వరరావుకు పేరు ప్రఖ్యాతులున్నాయి. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ కుటుంబ పరువు, ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసేలా నేను, నా భార్య అమల, కుమారుడు నాగ చైతన్య నడుచుకుంటున్నాం. నాగ చైతన్య, సమంతలకు 2017లో వివాహం కాగా, వ్యక్తిగత విభేదాలతో 2021లో విడాకులు తీసుకున్నారు. నాగ చైతన్య, సమంత విడాకుల అంశం.. మాజీ మంత్రి కేటీఆర్‌తో ముడిపడి ఉందంటూ తాజాగా మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. 'ఎన్‌కన్వెన్షన్ విషయంలో సమంతకు సంబంధించి అసభ్యకరమైన ప్రతిపాదనను కేటీఆర్ నా ముందు ఉంచినట్టు, దానికి నేను మద్దతు ఇచ్చినట్టు' మంత్రి హోదాలో ఆమె చేసిన వ్యాఖ్యలు నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా బాధించాయి. నా వ్యక్తిగత, వృత్తిపరమైన, కుటుంబ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. నిరాధార ఆరోపణలు టీవీ, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయి. దురుద్దేశ రాజకీయ లబ్ధి, సంచలనాల కోసమే ఆమె ఆ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నాం. ఆ వ్యాఖ్యల అనంతరం కుటుంబసభ్యులు, సహోద్యోగులు, ఇతరుల నుంచి నాకు అనేక ఫోన్‌కాల్స్ వచ్చాయి. వారంతా ఆందోళన చెంది నన్ను సంప్రదించారు. ఇందులో యార్లగడ్డ సుప్రియ, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. ఈ క్రమంలోనే మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ 'ఎక్స్' ద్వారా బహిరంగ ప్రకటన చేయాల్సి వచ్చింది. ఆ వ్యాఖ్యలతో అపఖ్యాతి పాలయ్యా. మానసిక క్షోభకు గురయ్యా. నేరపూరిత పరువు నష్టంగా పరిగణించి మంత్రి సురేఖను చట్టప్రకారం శిక్షించాలి" అని నాగార్జున తన వాంగ్మూలంలో కోర్టును కోరారు. అనంతరం నాగార్జున మేనకోడలు యార్లగడ్డ సుప్రియ సాక్షిగా వాంగ్మూలం ఇచ్చారు.

■ నాగార్జున తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ మాట్లాడిన వీడియోలను కోర్టుకు సమర్పించినట్లు చెప్పారు. ఈ నెల 10న మరో సాక్షి వాంగ్మూలం రికార్డు చేస్తామని తెలిపారు. అదే రోజు మంత్రికి నోటీసులు జారీ చేసే అవకాశం ఉందన్నారు.

న్యాయపరంగా ముందుకెళ్తాం..: తిరుపతివర్మ, మంత్రి కొండా సురేఖ తరపు న్యాయవాది

సినీనటుడు నాగార్జున మంత్రిపై దాఖలు చేసిన పిటిషన్ నిలబడదని భావిస్తున్నా. ఆయన పిటిషన్‌లో ఒకటి చెప్పి, వాంగ్మూలంలో మరొకటి చెప్పారు. న్యాయస్థానం సాక్షులను పరిగణనలోకి తీసుకుని.. మంత్రికి నోటీసులు జారీ చేసే పక్షంలో న్యాయపరంగానే ముందుకెళ్తాం. మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో కొందరు పెడుతున్న పోస్టులపై బుధవారం డీజీపీకి ఫిర్యాదు చేస్తాం.

పది వేల మందితో సద్దుల బతుకమ్మ

- 10న ట్యాంక్‌బండ్‌పై ఘనంగా నిర్వహిస్తాం
- ఏర్పాట్లపై సమీక్షలో సీఎస్ శాంతికుమారి



సచివాలయంలో బతుకమ్మ ఆడుతున్న సీఎస్ శాంతికుమారి, ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: సద్దుల బతుకమ్మ వేడుకలను ఈ నెల 10న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి తెలిపారు. వేడుకల ఏర్పాట్లపై మంగళవారం సచివాలయంలో ఆమె ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... "గురువారం సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల మధ్య ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయి. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు అమరవీరుల స్మారక కేంద్రం నుంచి పది వేల మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌కు బయలుదేరుతారు. వీరితోపాటు వందల మంది కళాకారులు తమ కళారూపాలతో ప్రదర్శనగా వస్తారు. ఉత్సవాలకు ప్రజాప్రతినిధులూ హాజరవుతారు. ఈ సందర్భంగా బుద్ధుడి విగ్రహం, సంజీవయ్య పార్కుల నుంచి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షో ప్రదర్శన ఉంటుంది. ఉత్సవాలను పురస్కరించుకొని... హైదరాబాద్‌లోని 150 ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయాలి. నగరంలోని వివిధ జంక్షన్లు, అన్ని ప్రధాన కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలి. ట్యాంక్‌బండ్‌లోని పిల్లల ఉద్యానవనంలోని బతుకమ్మ ఘాట్‌తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి" అని ఆదేశించారు. సమావేశంలో ఉన్నతాధికారులు వాణీప్రసాద్, దానకిశోర్, క్రిస్టినా చోంగ్తూ, సీవీ ఆనంద్, హరిచందన, రొనాల్డ్‌రాస్, ఆమ్రపాలి కాటా, అశోక్‌రెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తీరొక్క పూలతో సందడి

డా.బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాలకు మంగళవారం సీఎస్ శాంతికుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఉద్యోగినులు, వారి పిల్లలు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు.

సాధ్యమైనంత త్వరగా కులగణన

- ప్రారంభించిన నెల రోజుల్లో పూర్తి
- 2-3 రోజుల్లో సీనియర్ మంత్రులతో కీలక సమావేశం
- మంత్రి పొన్నం నేతృత్వంలో భేటీలో నిర్ణయాలు

ఈనాడు, హైదరాబాద్: సాధ్యమైనంత త్వరగా కులగణనను ప్రారంభించాలని, ప్రారంభించిన తేదీ నుంచి నెల రోజుల్లోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కులగణన షెడ్యూల్ ఖరారు చేయడానికి రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో సచివాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. ఇందులో బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాల మాయాదేవి, లా సెక్రటరీ రాజశేఖర్, ఇతర ముఖ్య అధికారులు, బీసీ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కులగణనను సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో మానిటరింగ్ చేయాలని సమావేశం అభిప్రాయపడింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం.. వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన సబ్ కమిటీ సమావేశాలు కొనసాగుతుండటంతో.. అందుకు కులగణన సర్వే నివేదిక కూడా అవసరం ఉంటుందన్న అంశంపై చర్చించారు. నివేదిక పారదర్శకంగా ఉండడానికి.. జీఏడీ లేదా పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల్లో దేని ద్వారా కులగణన నిర్వహించాలనే అంశంపై రెండు, మూడు రోజుల్లో సీనియర్ మంత్రులతో కీలక సమావేశం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటకలో బీసీ కమిషన్, బిహార్‌లో జీఏడీ, ఏపీలో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా జరిపిన కులగణన సర్వేలపై చర్చించారు. మూడు రాష్ట్రాల్లో అవలంబించిన విధానాల్లో ఉత్తమమైనదాన్ని ఇక్కడ అమలు చేయాలని నిర్ణయించారు.

అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయవచ్చా?

- ఎన్డీఎస్‌ఏను సంప్రదించనున్న రాష్ట్ర బృందం
- దిల్లీలో సమావేశం కోసం ఛైర్మన్‌కు లేఖ

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల బ్యారేజీల విషయంలో మళ్లీ నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ)ని సంప్రదించాలని నీటిపారుదలశాఖ నిర్ణయించింది. ఇప్పటివరకు జరిగిన పరీక్షలను పరిగణనలోకి తీసుకుని.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి అవకాశముందో లేదో చెప్పాలని కోరనుంది. ఎన్డీఎస్‌ఏ సిఫార్సుల మేరకు ఇప్పటివరకు చేసిన పరీక్షలు, ఇంకా మిగిలిన పరీక్షలు, ఇవి పూర్తి చేయడానికి పట్టే సమయం తదితర అంశాలపై చర్చించేందుకు సమావేశం ఖరారు చేయాలని కోరుతూ ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఛైర్మన్‌కు నీటిపారుదలశాఖ తాజాగా లేఖ రాసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 11న దిల్లీలో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది ఖరారైతే.. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా హాజరుకానున్నారు. మంత్రి ఉత్తమ్ మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో దీనిపై సమావేశం నిర్వహించగా.. నీటిపారుదలశాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ)లు అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, హరీరాం తదితరులు హాజరయ్యారు. మేడిగడ్డలో నీటిని నిల్వ చేయలేకపోయినా.. అన్నారం, సుందిళ్లలో ఇప్పటివరకు జరిగిన పరీక్షల ఆధారంగా నిల్వకు అవకాశం ఉందో లేదో ఎన్డీఎస్‌ఏతో చర్చించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అన్ని పరీక్షలు పూర్తయ్యేవరకు ఆగాలా లేక నీటిని నిల్వ చేయడానికి అవకాశం ఉందా అనే అంశంపై ప్రధానంగా ఎన్డీఎస్‌ఏ నిపుణులతో సంప్రదించనున్నారు. మంత్రితో సమావేశానంతరం స్టేట్ డ్యాం సేఫ్టీ ఛైర్మన్‌గా ఉన్న ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) ఈఎన్సీ నాగేందర్‌రావు.. ఎన్డీఎస్‌ఏకి లేఖ రాసినట్లు తెలిసింది.

మేడిగడ్డ డిజైన్లలో మార్పులను అనుమతించారా!

- నాటి ఎస్‌ఎల్‌ఎస్‌సీ సభ్యుడు శ్రీనివాస్‌ను ప్రశ్నించిన విజిలెన్స్
- వర్క్స్ అండ్ ఎకౌంట్స్ డైరెక్టర్ ఫణిభూషణ్‌కూ ప్రశ్నలు

ఈనాడు, హైదరాబాద్: 'కాళేశ్వరం ఎత్తిపోతలలోని ప్రధాన బ్యారేజీ అయిన మేడిగడ్డ ఆకృతులు (డిజైన్స్), డ్రాయింగ్స్‌లో చోటుచేసుకున్న మార్పులకు స్టేట్ లెవెల్ స్టాండింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌ఎస్‌సీ) అనుమతించిందా?.. ఆ రోజు కమిటీ తీసుకున్న నిర్ణయాలేంటి?' అంటూ నాటి కమిటీలో సభ్యుడు, ప్రస్తుత ఆదిలాబాద్ సీఈ శ్రీనివాస్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రశ్నించినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని విజిలెన్స్ కార్యాలయంలో మంగళవారం ఈ విచారణ జరిగింది. రెండు దఫాలుగా దాదాపు ఐదుగంటల పాటు శ్రీనివాస్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. ఎస్‌ఎల్‌ఎస్‌సీలో మీ పాత్ర ఏంటి? మేడిగడ్డ డిజైన్లలో మార్పులకు కమిటీ ఆమోదం తెలిపిందా అన్న ప్రశ్నలకు.. ప్రాజెక్టు సీఈ ఎస్‌ఎల్‌ఎస్‌సీలో కన్వీనర్‌గా ఉంటారని, ఆయన ప్రతిపాదించిన వాటినే కమిటీ చర్చిస్తుందని శ్రీనివాస్ సమాధానమిచ్చినట్లు తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ అంచనాలను ఎన్నిసార్లు సవరించారు? ఆ సమాచారం ఏదని ప్రశ్నించగా.. రెండుసార్లు అంచనాల సవరణ జరిగినట్లు గుర్తు అని.. సీఈ ప్రతిపాదనను కమిటీలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి ఆ వివరాలు పంపామని శ్రీనివాస్ పేర్కొన్నట్లు తెలిసింది. బ్యారేజీ నిర్మాణ ప్రదేశంలో ఏమైనా తేడాలున్నాయా? క్షేత్రస్థాయిలో మీరు పరిశీలన చేశారా అని ప్రశ్నలు వేసినట్లు సమాచారం. క్షేత్రస్థాయి పరిస్థితులపై కమిటీ సభ్యులకు అంచనాలు ఉండవని, కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించే ప్రాజెక్టు సీఈ ప్రతిపాదననే పరిగణనలోకి తీసుకుంటామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. వర్క్స్ అండ్ ఎకౌంట్స్ డైరెక్టర్ ఫణిభూషణ్‌శర్మకు కూడా విజిలెన్స్ అదనపు ఎస్పీ ఆనంద్‌కుమార్ పలు ప్రశ్నలు వేసినట్లు సమాచారం. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) మాజీ ఈఎన్సీ నరేందర్‌ను బుధవారం విజిలెన్స్ విచారించనుంది.

ఐటీడీఏ పరిధిలో చీరల పంపిణీ 15 తర్వాతే

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఐటీడీఏ పరిధిలోని గిరిజన మహిళలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు పంపిణీ కోసం వచ్చిన చీరలను ఈ నెల 15 తర్వాతే అందజేయాలని తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజా రామయ్యర్ ఉత్తర్వులిచ్చారు. ఐటీడీఏ పరిధిలోని భద్రాద్రి జిల్లాతోపాటు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాలకు టీజీఎస్‌సీవో బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదం..

- ప్రముఖ న్యాయవాది సుంకర సతీమణి మృతి
- విహార యాత్రలో ఘోరం.. పది మందికి గాయాలు
- చంద్రబాబు దిగ్భ్రాంతి



సుంకర జ్యోత్స్న

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో విహారయాత్రగా రాజస్థాన్ పర్యటనకు వెళ్లిన విజయవాడ న్యాయవాదుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వీరు ప్రయాణిస్తున్న బస్సు అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై, ఒకరు మృతి చెందగా, మరో పది మంది గాయాలపాలయ్యారు. బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు, కుటుంబ సభ్యులు మొత్తం 78 మంది ఈ నెల ఒకటిన విహార యాత్రకు వెళ్లారు. 10వ తేదీ నాటికి తిరిగి విజయవాడకు చేరుకునేలా ప్రణాళికలు వేసుకున్నారు. సోమవారం రాత్రి రెండు బస్సుల్లో జైస్వాల్ నుంచి అజ్మేర్‌కు బయల్దేరారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు అందరూ నిద్రలో ఉండగా, వీరు ప్రయాణిస్తున్న బస్సు అజ్మేర్ సమీపంలోని విరాట్ టోల్‌గేట్ వద్ద రోడ్డు పక్కన నిలిపిన ట్రక్కును ఢీకొట్టింది. ప్రమాద ధాటికి బస్సు నుజ్జునుజ్జయి అద్దం ఊడిపోయింది. ముందుభాగంలో కూర్చున్న బెజవాడ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జ్యోత్స్న (55) కింద పడిపోయి, అక్కడికక్కడే మృతి చెందారు. తలలు ముందు సీట్లకు కొట్టుకుని బీజేపీ కార్యదర్శి అరిగెల శివరామప్రసాద్, వేల్పుల పద్మజ, జంగా జయలక్ష్మి, చందు నాగరాజు, అరుణాదేవి, గంగాభవానీ, శ్రీనివాసరావుతో పాటు మరికొందరు గాయపడ్డారు. వీరిని స్థానికులు, పోలీసులు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ పరామర్శించారు. అజ్మేర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రభాన్ ఘటనాస్థలానికివచ్చి, వైద్య సేవల్లో సాయపడ్డారు. సుంకర రాజేంద్రప్రసాద్.. బెజవాడ బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదిగా సుపరిచితులు. ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) కార్యనిర్వాహక అధ్యక్షుడిగానూ వ్యవహరిస్తున్నారు. జ్యోత్స్న సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. బాలోత్సవ్ కమిటీలో ఉంటూ బాలల మనో వికాసానికి కృషి చేశారు. మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

రాజస్థాన్ సీఎంతో ఫోన్‌లో మాట్లాడిన చంద్రబాబు

ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన సాయం అందించాలని కోరారు. న్యాయవాదులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవడానికి సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాద కారణాలపై తన కార్యాలయ అధికారులనూ చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు.

జస్టిస్ ఎన్వీ రమణ విచారం

సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి, ఉద్యమకారిణి గుళ్లపల్లి జ్యోత్స్న దుర్మరణంపై సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జ్యోత్స్న ఆత్మకు శాంతి చేకూరాలని, రాజేంద్రప్రసాద్ కుటుంబానికి సాంత్వన చేకూర్చాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నానన్నారు. గాయపడిన న్యాయవాదులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బెజవాడ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, సీనియర్ న్యాయవాదులు చలసాని అజయ్‌కుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జ్యోత్స్న మృతి విద్యార్థి, మహిళా, సామాజిక సమస్యలపై పోరాటంలో తీరని లోటు అని ఐలు రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది.

'సారథి.వాహన్ పోర్టల్'లోకి తెలంగాణ

- వాహనాల ఫిట్‌నెస్ పరిశీలనకు 37 కేంద్రాల ఏర్పాటు: పొన్నం

హైదరాబాద్, న్యూస్‌టుడే: కేంద్ర మోటారు వాహన చట్టంలో భాగంగా 'సారథి.వాహన్ పోర్టల్'లో తెలంగాణ రవాణాశాఖ చేరాలని నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాహనాల ఫిట్‌నెస్ చెకింగ్ కోసం రాష్ట్రంలో 37 'ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లు' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వాహనాల స్క్రాపింగ్ పాలసీని అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబరితితో కలిసి మంత్రి మంగళవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'దేశంలో 28 రాష్ట్రాలు ఇప్పటికే 'సారథి.వాహన్ పోర్టల్' అమలు చేస్తున్నాయి. తెలంగాణలోనూ అమలు చేయబోతున్నాం. కేంద్ర ప్రభుత్వ అనుమతితో ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున, హైదరాబాద్‌లో అదనంగా 4 కలిపి మొత్తం 37 ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాం. ఒక్కో సెంటర్‌కు రూ.8 కోట్ల చొప్పున రూ.296 కోట్లు ఖర్చవుతుంది.

15 ఏళ్లు దాటిన వాహనాలకు తుక్కు విధానం

15 సంవత్సరాలు పైబడిన ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు, 8 సంవత్సరాలు పైబడిన రవాణా వాహనాలకు తుక్కు విధానం అమలు చేస్తాం. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి సుప్రీంకోర్టు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన 8 వేల మంది లైసెన్సులను ఇప్పటికే రద్దు చేశాం. రోడ్డు భద్రతపై యూనిసెఫ్ సహకారం తీసుకుంటున్నాం. కొత్తగా 113 మంది వెహికల్ ఇన్‌స్పెక్టర్లు విధుల్లోకి రాబోతున్నారు' అని మంత్రి పొన్నం తెలిపారు.

రవాణాశాఖ కమిషనర్ ఇలంబరితి మాట్లాడుతూ.. 'వాలంటరీ వెహికల్ పాలసీ ద్వారా వ్యక్తిగత వాహనం 15 సంవత్సరాలు దాటిన తర్వాత స్వచ్ఛందంగా తుక్కుగా రిజిస్ట్రేషన్ చేయించినవారు తర్వాత 2 సంవత్సరాలలో కొత్త వాహనం కొనుగోలు చేస్తే వాహనం లైఫ్ ట్యాక్స్‌లో తగ్గింపు ఉంటుంది. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు తుక్కుకు పంపించకుండా మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే అదనంగా పన్ను కట్టాల్సి ఉంటుంది' అని స్పష్టం చేశారు.

గల్ఫ్ మృతుల ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకు రూ.10.60 కోట్లు విడుదల: మంత్రి పొన్నం

గల్ఫ్ మృతుల ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకు రూ.10.60 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవో ప్రతులను పీసీసీ ఎన్నారై సెల్ ప్రతినిధులు వినోద్‌కుమార్, భీంరెడ్డి, శ్రీనివాస్‌రావులకు మంత్రి మంగళవారం సచివాలయంలో అందించారు. 2023 డిసెంబరు 7 తర్వాత గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల వారసులు జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, కాంగ్రెస్ నాయకులకు ఎన్నారై సెల్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన తెలంగాణ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకానికి సెర్చ్ కమిటీ సమావేశం మంగళవారం సచివాలయంలో ముగిసింది. మూడు రోజుల క్రితం జరగాల్సిన సమావేశం వాయిదా పడగా.. దాన్ని మంగళవారం నిర్వహించారు. ఇప్పటివరకు ఎనిమిది వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలు పూర్తయ్యాయి. మిగిలిన అంబేడ్కర్, ఆర్కిటెక్చర్ వర్సిటీల సమావేశాలను కూడా రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తారని సమాచారం. దసరాలోపు ఉపకులపతుల నియామక ఉత్తర్వులు ఇస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

(c) eenadu

సోనోవిజన్‌లో దసరా స్క్రాచ్ కార్డ్ స్కీమ్
సోనోవిజన్ స్క్రాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటోంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6%, చాలా మందికి మరింత ఎక్కువ ఎమౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 9-10-2024 బుధవారం సిటీ సంపుటి 51. సంచిక 60 | రూ. 6-50. పేజీలు 20 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి
దసరాకు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. అన్ని పెద్ద కంపెనీల నుండి ఎల్.ఇ.డి, వాషింగ్ మెషిన్స్, రిఫ్రిజిరేటర్స్, ఎ.సి, మొబైల్స్ & ల్యాప్‌టాప్స్ మరియు గృహోపకరణములు అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి. ముఖ్యంగా సోనోవిజన్ స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌లో 20% వరకు లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత.

అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ,చాల పెద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి బుచ్చినయమ్మ,
దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గమాయమ్మ కృతాబ్ధి ఇచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్



దసరా శుభాకాంక్షలతో...

సోనోవిజన్ దసరా సేల్

మీరెంతగానో అభిమానించి ఆదరించిన స్క్రాచ్ కార్డ్ స్కీమ్

ప్రతి ₹ 2000/- కొనుగోలుతో స్క్రాచ్ కార్డ్ పొందండి
₹100/- నుండి ₹1,00,000/-
వరకు తక్షణ నగదు బహుమతి అందుకోండి. (సెలక్టెడ్ మోడల్స్‌పై)

BAJAJ FINSERV	HDB FINANCIAL SERVICES	IDFC FIRST Bank	HDFC BANK	
Upto 10000/- క్యాష్ బ్యాక్ 1EMI Free	Upto 21000/- క్యాష్ బ్యాక్ 1EMI Free	Upto 22500/- క్యాష్ బ్యాక్ 1EMI Free	Upto 10000/- క్యాష్ బ్యాక్ 1EMI Free	Upto 22.5% క్యాష్ బ్యాక్
క్రెడిట్ కార్డ్ హోల్డర్స్‌కు, బజాజ్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు పేపర్ ఫైనాన్స్‌పై. షరతులు వర్తిస్తాయి.	క్రెడిట్ కార్డ్ హోల్డర్స్‌కు మరియు HDB పేపర్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు. షరతులు వర్తిస్తాయి.	క్రెడిట్ కార్డ్ హోల్డర్స్‌కు మరియు IDFC పేపర్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు. షరతులు వర్తిస్తాయి.	HDFC పేపర్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు. సెలెక్టెడ్ మోడల్స్. షరతులు వర్తిస్తాయి.	క్రెడిట్ కార్డ్ EMI కొనుగోలుపై సెలెక్టెడ్ మోడల్స్. షరతులు వర్తిస్తాయి.

స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులు, అందరికి అభినందనలు

రూ. 1,00,000/- విజేత

శ్రీ యస్. జగదీష్ చంద్రప్రసాద్
బొల్లిగూడెం, హైదరాబాద్.
7780195487

రూ. 1,00,000/- విజేత

శ్రీ సుమంత్ చౌదరి
గాజువాక, విశాఖపట్నం.
7093717999

రూ. 1,00,000/- విజేత

శ్రీ సి.హెచ్. రవితేజ
విజయవాడ.
8919467487

రూ. 1,00,000/- విజేత

శ్రీ యం. వెంకటరామారావు
వెలుగుబంద విలేజ్, రాజమండ్రి.
8500002002

రూ. 1,00,000/- విజేత

శ్రీ వెంకటేశ్వర్లరెడ్డి
నీలారెడ్డిపల్లి, అనంతపురం
8500397227

రూ. 50,000/- విజేత

శ్రీమతి కొనపాక సునీత
నాగేంద్రటెంపుల్ దగ్గర, మిర్యాలగూడ.
8374921263

రూ. 50,000/- విజేత

శ్రీమతి జుబేదా
హైదరాబాద్.
8238136343

రూ. 50,000/- విజేత

శ్రీ తుమ్మల వెంకట కుటుంబరావు
మైత్రినగర్, ఖమ్మం
9182628030

రూ. 25,000/- విజేత

శ్రీ చిట్లజల్లు శ్రీనివాస్
బుర్హాన్‌పురం, ఖమ్మం
9885124991

రూ. 25,000/- విజేత

శ్రీ యం.డి. ఇఫ్తెఖార్
శ్రీరామ్‌నగర్, ఖమ్మం.
9908801361

రూ. 25,000/- విజేత

శ్రీ ఎ. నాగేష్
ఓల్డ్ పాలమూరు, మహబూబ్‌నగర్
9032851402

రూ. 25,000/- విజేత

శ్రీ యండి. గౌసిమియా
చమన్‌పల్లి, కరీంనగర్
8790733703

రూ. 25,000/- విజేత

శ్రీ కాసాని శ్రీనివాస్
బొమ్మనపల్లి, కరీంనగర్
9908332388

రూ. 25,000/- విజేత

శ్రీ ఎ. హరీష్
భద్రాద్రి, కొత్తగూడెం.
9492870736

రూ. 25,000/- విజేత

శ్రీ బి. రవి
సరూర్‌నగర్, హైదరాబాద్
9701710598

రూ. 25,000/- విజేత

శ్రీ మద్దెల సాయికుమార్ ముదిరాజ్
సంతోష్‌నగర్, హైదరాబాద్.
8886848976

LG Life's Good

Home Theatre
208 Cm (83") Ultra HD 4K OLED
165 Cm (65") Ultra HD 4K QLED

SAMSUNG **SONY**

189 Cm (75") LED 4K Ultra UHD
164 Cm (65") LED 4K Ultra HD Smart

iPhone

16, 16+ Upto 5000/- Cash Back
16 Pro, 16 Pro Max Upto 4000/- Cash Back
Smart WATCH 9/0, 12/0, 12/4 Schemes Available
24/0, 9/0, 12/0 Schemes Available SBI, ICICI, Kotak Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)

SAMSUNG
S-24 Ultra 5G
Upto 12000/- Cash Back
A-55 5G

9/0, 12/0, 24/0 Schemes Available

vivo
5G V-40, V-40 Pro Ram Expandable

Upto 4000/- Cash Back
7/1, 6/0, 9/0, 12/0, 24/0 Schemes Available

oppo
5G Reno 12 Pro, 12 Pro+

6/0, 8/0, 11/2 Schemes Available

ONEPLUS
5G 12 & 12 Pro, Ram Expandable

Instant CashBack ICICI Credit Card 12/4 Scheme Available

realme
5G 13 Pro, 13 Pro+

6/0, 8/2, 10/3 Schemes Available

mi Redmi
5G Note13, Note 13 Pro

6/0, 8/0, 10/2, 12/4 Schemes Available

hp LAPTOP 12/4 Scheme Available
DELL LAPTOP 15/4 Scheme Available
ASUS LAPTOP 12/4 Scheme Available
MacBook LAPTOP 24/0 Scheme Available 10000/- Cash Back
Conditions Apply

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

పర్ణశాల ఎదురు, వైరా రోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38	కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634	వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635	భద్రాచలం రోడ్డు, రైల్వేస్టేషన్ దగ్గర, కొత్తగూడెం. 9154867825, 26, 27	వి. పార్క్ ఎదురుగా, సీతారాంపురం, జగిత్యాల రోడ్, కరీంనగర్. 8712635843, 44, 45.	వేములవాడ రోడ్, మంకమ్మ తోట, కరీంనగర్ - 8712635841, 42.
ఆర్ & బి సాగర్ రోడ్, Opp. వైష్ణవి గ్రాండ్ హోటల్, మిర్యాలగూడ, నల్గొండ. ఫోన్ : 8712635848, 49, 50	పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181, 9154281183, 84	మెట్రోస్టేషన్ దగ్గర, బిగ్‌బజార్ ప్రక్కన, కూకట్‌పల్లి, హైదరాబాద్. 9154281180, 81, 82	హైదర్‌నగర్, మియాపూర్, హైదరాబాద్. 7331149363, 64, 65	మలక్‌పేట, హైదరాబాద్. 9154281187, 8333924932, 33	ఎల్.బి.నగర్, హైదరాబాద్. 9154281188, 8333924940, 41	గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, మెట్టుగడ్డ, మహబూబ్‌నగర్ 8712635851, 52, 53

(c) eenadu

దసరా శుభాకాంక్షలతో...

సోనోవిజన్ దసరా సేల్

LG 208 Cm (83") 4K OLED Flexi EMI : 6999/-

SAMSUNG 189 Cm (75") LED 4K Ultra UHD Flexi EMI : 3990/-

SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart Flexi EMI : 6500/-

Panasonic 108 Cm (43") LED 4K HD EMI : 2791/-

Haier 139 Cm (55") LED 4K HD Smart Flexi EMI : 1994/-

LLOYD 108 Cm (43") LED 4K HD EMI : 2167/-

BPL 108 Cm (43") 4K HD Ultra LED EMI : 2210/-

iPhone16, 16+ 10000/- Cash Back 12/0 & 24/8 Schemes Available Selected Bank Cards (Exchange Bonus) EMI : 2933/-

vivo V-40 - 5G V-40 Pro - 5G Ram Expandable 7/1.6/0 & 9/0 Schemes Available EMI : 4666/-

SAMSUNG S-24 Ultra Mobile 12000/- Cash Back 24/0 Scheme Available EMI : 4875/-

oppo F-27 PRO 5G 8/0, 9/0 Schemes & 12/1 Scheme Available EMI : 2500/-

ONEPLUS 12 & 12 Pro 5G Ram Expandable Instant Cash Back ICICI Credit Card 12/4 Scheme Available EMI : 3750/-

realme 5G 13 Pro, 13 Pro+ 6/0, 8/2, 10/3 Schemes Available Selected Models EMI : 3700/-

Smart Watch Ear Buds Mobile Accessories Boat, Realme, Fastrack, Hapipola

hp 12/4 Scheme Available EMI : 4333/-

DELL 15/4 Scheme Available EMI : 4583/-

ASUS 12/4 Scheme Available EMI : 3960/-

Lenovo 12/4 Scheme Available EMI : 4166/-

MacBook 24/0 Scheme Available EMI : 4166/-

Sound Bar

LG 5Star & 3Star Dual Inverter A.C Starting EMI : 2959/-

LLOYD 5Star & 3Star Inverter A.C Starting EMI : 3000/-

BLUE STAR 5Star & 3Star Inverter A.C Starting EMI : 3042/-

DAIKIN 5Star & 3Star Inverter A.C Starting EMI : 3000/-

VOLTAS 5Star & 3Star Inverter A.C Starting EMI : 2875/-

HITACHI 5Star & 3Star DC Inverter A.C Starting EMI : 3000/-

Haier 5Star & 3Star Inverter A.C Starting EMI : 2916/-

LG Side by Side 633 Litres Refrigerator EMI : 13250/-

SAMSUNG Side by Side 653 Litres Refrigerator EMI : 5917/-

Whirlpool Frost Free Double Door 260 Litres Refrigerator EMI : 1750/-

LG Frost Free Double Door 240 Litres Refrigerator EMI : 1900/-

Haier Frost Free Double Door 240 Litres Refrigerator EMI : 1691/-

Godrej Frost Free Double Door 233 Litres Refrigerator EMI : 1778/-

LG Front Load Automatic Washing Machine 9 KGS EMI : 2765/-

SAMSUNG Front Load Automatic Washing Machine 8 KGS EMI : 3050/-

BOSCH Front Load Automatic Washing Machine 6.5 KGS EMI : 2667/-

IFB Top Load Automatic Washing Machine 7 KGS EMI : 1667/-

Whirlpool Top Load Automatic Washing Machine 7.5 KGS EMI : 1292/-

Panasonic Top Load Automatic Washing Machine 8 KGS EMI : 1584/-

LLOYD Semi Automatic Washing Machine 6.5 KGS EMI : 734/-

HOME APPLIANCES

Water Dispenser Rs:8000/-
Water Purifier RO Rs:12000/-
Water Geyser 10 Litres Rs:6200/-
Microwave Oven Rs:6600/-
Air Chimney Rs:8100/-
3 Burner Glass Cooktop Rs:5000/-
Wet Grinder Rs:3400/-
Rice Cooker Rs:1650/-
Mixer Grinder 3 Jar, 750 Watts Rs:2900/-
Juicer, Air Fryer, Kettle, Iron Box, Blender

T & C Apply

Carrier, EUREKA FORBES, KENT, pureit, Sunflame, Preethi, Butterfly, FABER, KAFF, V-GUARD, KEELINE, AOSmith, UNISTAB, Crompton, MAHARAJA WHITELINE, HAVELLS, hindware, morphy richards, BAJAJ

You can take EMI with finance anywhere, wherever you are
No local address proof required

Special Offers On Mobiles & Laptops
AMAZON PAY Upto 2000/- CASH BACK Selected Bank Cards, Conditions Apply

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1 ద్వారకా నగర్, వైజాగ్ 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
ద్వారకానగర్ 2వ లైన్, పోలక్స్‌స్కూల్ ఎదురు, వైజాగ్. 8712635857, 858, 859.
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్,గాజువాక. 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్,గోపాలపట్నం 9100991704, 9154281129
భారత్ పెట్రోల్ బంక్ ఎదురు, గోపాలపట్నం. 8712635833
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613

తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి. 9246662288, 9246666212
జె.యన్.రోడ్, రాజమండ్రి. 9100991700, 9154281119
సాయికృష్ణ థియేటర్, ఇన్నీస్‌పేట, రాజమండ్రి. 9154281197, 98, 99
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
యన్.సి.సి.బోట్ క్లబ్ ఎదురు, సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78

శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
చెన్నయ్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు.- 8712600519, 20, 21

పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్, భీమవరం. 8333924936, 9154281175
బడేటి పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
అంబికాదేవి టెంపుల్, సత్రంపాడు, ఏలూరు - 8712635838, 839
పైడిపర్రు రోడ్, తణుకు. 8333924938, 9154281115

తాడేపల్లిగూడెం
గొల్లగూడెం సెంటర్, తాడేపల్లిగూడెం. 8712635854, 55, 56

విజయనగరం
3 లాంతర్ల సెంటర్, 9246666208, 9390006630
ఐస్ ఫ్యాక్టరి జంక్షన్, 8712600523, 8712600535

శ్రీకాకుళం
రామలక్ష్మణ్ జంక్షన్, జి.టి.రోడ్, శ్రీకాకుళం. - 9154281140, 41

విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
ఎనికేపాడు, విజయవాడ. 9100991703, 9154281626
ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్, గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47

గుడివాడ
ఏలూరు రోడ్, గుడివాడ. 9100991708, 9154281178, 79

మచిలీపట్నం
మునిసిపల్ పార్క్ ఎదురు, రామనాయుడుపేట, కోనేరు సెంటర్, మచిలీపట్నం - 7331149379, 80, 81

గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడీపేట్, గుంటూరు. 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368

ఒంగోలు
బాపూజి మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279911

రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43,
అమ్మా హాస్పిటల్ సెంటర్, సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
హెచ్.పి.పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యన్.ఆర్.రాజీవ్ పార్క్ కడప - 9154281194, 96
పలమనేరు రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు. 8712600528, 8712600530
తపోవనం స్కూల్ ఎదురు, వెల్లూరు రోడ్డు, చిత్తూరు. 8712635836, 46, 47
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527

ఖమ్మం
కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
పర్ణశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38

కొత్తగూడెం
కొత్తగూడెం, భద్రాచలం రోడ్. 9154867825, 26, 27

మా నూతన షోరూం సందర్శించండి మహబూబ్‌నగర్
గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, మెట్టుగడ్డ - 8712635851, 52, 53

మా నూతన షోరూం సందర్శించండి మిర్యాలగూడ
ఆర్&బి సాగర్ రోడ్, వైష్ణవిగ్రాండ్ దగ్గర 8712635848

హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి. 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188

కరీంనగర్
వి. పార్క్ ఎదురుగా, జగిత్యాల రోడ్ 8712635843, 44, 45
వేములవాడ రోడ్, మంకమ్మతోట 8712635841, 42

(c) eenadu

ఈనాడు

కరీంనగర్ 9-10-2024 బుధవారం సిటీ సంపుటి 51. సంచిక 60

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 20 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



(c) eenadu


సాంప్రదాయానికి
సౌందర్యానికి వారధి
VAARAHI
SILKS
బంగారు మనసున్న
తెలుగుదనాల నిలువెత్తు రూపం
శ్రీ బాలయ్యబాబు గారి
చేతుల మీదుగా
రేపే బ్రహ్మాండమైన
ప్రారంభం
సమయం: మధ్యాహ్నం 1:44 ని॥లకు
#1604 మెట్రో పిల్లర్ ఎదురుగా, రోడ్ నెం.36,
జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, హైదరాబాద్
బ్రాండ్ అంబాసిడర్
మీనాక్షి చౌదరి సినీ నటి
ప్రారంభోత్సవ సందర్భంగా గ్రాండ్ ఆఫర్స్
GOLD OFFERS
2 Gm గోల్డ్ కాయిన్ On Purchase of Rs. 1,00,000/-
1 Gm గోల్డ్ కాయిన్ On Purchase of Rs. 50,000/-
0.5 Gm గోల్డ్ కాయిన్ On Purchase of Rs. 25,000/-
ప్రత్యేక లక్కీడ్రా
రూ. 50,000/- కంటే ఎక్కువ కొనుగోలు చేసే ముగ్గురుకి అన్‌కట్ డైమండ్ నెక్లెస్ గెలుచుకునే అద్భుత అవకాశం.
1వ బహుమతి రూ.5 లక్షల అన్‌కట్ డైమండ్ నెక్లెస్
2వ బహుమతి రూ.3 లక్షల అన్‌కట్ డైమండ్ నెక్లెస్
3వ బహుమతి రూ.2 లక్షల అన్‌కట్ డైమండ్ నెక్లెస్
షరతులు వర్తిస్తాయి.
ఈ ఆఫర్స్ అక్టోబర్ 10 నుండి అక్టోబర్ 30, 2024 వరకు



ఈనాడు



కరీంనగర్ 9-10-2024 బుధవారం సిటీ సంపుటి 51. సంచిక 60
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50. పేజీలు 20 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



జాన్ హాప్‌ఫీల్డ్

ఏఐ రూపశిల్పులకు పట్టం

6లో

- హాప్‌ఫీల్డ్, హింటన్‌లకు భౌతికశాస్త్రంలో నోబెల్


జెఫ్రీ హింటన్



భాజపా హ్యాట్రిక్.. ఎన్‌సీ మ్యాజిక్

హరియాణాలో మూడోసారి కమలం పాగా • జమ్మూ కశ్మీర్ ఇండియా కూటమిదే

- హరియాణాలో చతికిలపడిన కాంగ్రెస్ • సీఎంగా నాయబ్ సింగ్ సైనీనే..
- లోయలో ఎన్‌సీ విజయఢంకా • జమ్మూలో భాజపా హవా
- పెద్దగా ప్రభావం చూపని కాంగ్రెస్, పీడీపీ • ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా

దిల్లీ, చండీగఢ్, జమ్మూ, శ్రీనగర్: హరియాణా, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) సత్తా చాటాయి. హరియాణాలో వరుసగా మూడోసారి అధికారం నిలబెట్టుకుని భాజపా హ్యాట్రిక్ కొట్టగా.. పదేళ్ల తర్వాత జరిగిన కశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి ఎన్‌సీ అధికారం చేజిక్కించుకుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ రెండు చోట్లా ప్రజలు స్పష్టమైన ఆధిక్యాన్ని కట్టబెట్టారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో భాజపా మెరుగైన ఫలితాలను సాధించగా.. కాంగ్రెస్ డీలా పడింది. రెండు చోట్లా సరైన ఫలితాలను సాధించలేకపోయింది. అయితే కశ్మీర్‌లో ఎన్‌సీతో కలిసి అధికారాన్ని పంచుకోవడం ఆ పార్టీకి కాస్తంత ఊరట. ముందుగా ప్రకటించినట్లుగానే హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ (54) మరోసారి బాధ్యతలు చేపట్టనుండగా. . కశ్మీర్ సీఎంగా ఒమర్‌అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన తండ్రి ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు.

...మిగతా 2లో



హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా జయకేతనం సందర్భంగా దిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద బాణసంచా కాలుస్తున్న కార్యకర్తలు

సుపరిపాలనకు హరియాణా పట్టం కట్టింది: ప్రధాని మోదీ

జమ్మూకశ్మీర్‌లోనూ మెరుగుపడినందుకు గర్వపడుతున్నానని వ్యాఖ్య

2లో



శ్రీనగర్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా


హరియాణా



భాజపా:	48
కాంగ్రెస్:	37
ఐఎన్‌ఎల్‌డీ:	2
స్వతంత్ర:	3

ఓట్ల శాతం	
భాజపా	39.94
కాంగ్రెస్	39.09
ఐఎన్‌ఎల్‌డీ	4.14

జమ్మూ కశ్మీర్



ఎన్‌సీ	42
భాజపా	29
కాంగ్రెస్	6
పీడీపీ	3
జేపీసీ	1
సీపీఎం	1
ఆప్	1
స్వతంత్ర	7

ఓట్ల శాతం	
భాజపా	25.64
ఎన్‌సీ	23.43
కాంగ్రెస్	11.97
పీడీపీ	8.87

సర్టిఫికెట్ రద్దు..

ఒప్పందానికి విరుద్ధం

- అప్పుడు పనులు పూర్తయ్యాయని.. ఇప్పుడు కాలేదంటారా?
- ఏకపక్షం.. అంగీకరించబోం
- కాళేశ్వరం ఎస్‌ఈకి ఎల్‌అండ్‌టీ లేఖ

ఈనాడు, హైదరాబాద్: పని పూర్తయినట్లు నిర్ధారించి ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని (కంప్లీషన్ సర్టిఫికెట్) ఇప్పుడు రద్దు చేయడమేంటి? ఇలా చేయడం ఒప్పందానికి విరుద్ధమే కాదు.. చట్టప్రకారం కాంట్రాక్టర్ హక్కులను కూడా ఉల్లంఘించడమే. సర్టిఫికెట్‌ను రద్దు చేస్తున్నట్లు.. అదీ పని పూర్తయిన 1500 రోజుల తర్వాత ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని తాము అంగీకరించబోమని మేడిగడ్డ బ్యారేజి నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం రామగుండం ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్‌ఈ)కి లేఖ రాసింది. పని పూర్తయినట్లు నిర్ధారించేవరకు.. పెండింగ్ పనులేమీ నోటీపై చేయకుండా.. ఇప్పుడు పెండింగ్ పనులున్నాయంటూ పేర్కొనడాన్ని తప్పుపట్టింది.

...మిగతా 2లో

దిగి వచ్చిన వెండి



- రూ. 4,500 తగ్గిన కిలో

ఈనాడు వాణిజ్య విభాగం: ఇటీవల చుక్కలనంటుతున్న బంగారం, వెండి ధరలు మంగళవారం దిగి వచ్చాయి. అంతర్జాతీయ విపణిలో ధరలు తగ్గడానికి తోడు, దేశీయంగా అధిక ధరల వద్ద కొనుగోళ్లు నెమ్మదించడం ఈ పరిస్థితికి కారణమని బులియన్ వర్గాలు చెబుతున్నాయి. సోమవారం హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ. 78,100 (జీఎస్‌టీతో కలిపి) ఉండగా, మంగళవారం రాత్రి 11.30 గంటలకు రూ. 77,100 వద్ద స్థిరపడింది. వెండి కిలో ధర సోమవారం నాటి గరిష్ఠం రూ. 95,000తో పోలిస్తే రూ. 4,500 తగ్గి రూ. 90,500కు వచ్చింది.

ఉపాధ్యాయ కొలువుల్లో... కొత్త అధ్యాయం!

- నేడు 10,006 మందికి నియామక పత్రాల అందజేత
- కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- కోర్టు కేసులు, ఇతర సమస్యలతో 1,056 పోస్టులు పెండింగ్

9లో

మెట్రో రెండోదశ అంచనా వ్యయం రూ. 24,269 కోట్లు

9లో

- ఫోర్త్‌సిటీ మినహా ఐదు మార్గాలకు వేర్వేరుగా డీపీఆర్‌ల రూపకల్పన
- క్యాబినెట్ ఆమోదించాక కేంద్రానికి..

అదనపు కలెక్టర్ల విధులేంటో?

నిర్దిష్ట జాబ్‌చార్ట్ లేకుండానే నియామకం • కొత్త నియమావళి రూపకల్పనకు ప్రభుత్వ కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: జిల్లా కలెక్టర్ తర్వాత అంతటి బాధ్యతలు నిర్వర్తించే అదనపు కలెక్టర్లు ఏ అధికారంతో పనిచేస్తున్నారు... ఏ మార్గదర్శకాలను అనుసరిస్తున్నారంటే ఎవరూ ఏమీ చెప్పలేని పరిస్థితి. రాష్ట్రంలో నాలుగేళ్ల క్రితం అదనపు కలెక్టర్ల వ్యవస్థను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. 2020 ఫిబ్రవరి 21న రెవెన్యూ పర్యవేక్షణకు ఒకరు, స్థానిక సంస్థల పర్యవేక్షణకు మరొకరు చొప్పున ప్రతి జిల్లాకు ఇద్దరేసి అదనపు కలెక్టర్లను నియమించింది.

ఏదైనా పోస్టు ఏర్పాటు చేస్తే... దాని ప్రాధాన్యం, విధులు, అనుసరించాల్సిన మార్గదర్శకాలు, పదోన్నతి, పేస్కేల్ తదితర అంశాలను ప్రభుత్వం రూపొందించాల్సి ఉంటుంది. కానీ, అదనపు కలెక్టర్లకు ఇవేమీ లేవు. రెవెన్యూ అంశాలను పర్యవేక్షించే అదనపు కలెక్టర్లుగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తున్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్, జేసీ తర్వాత జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో) పోస్టు ఉంటుంది. ప్రస్తుతం అదనపు కలెక్టర్లు డీఆర్‌వో తత్సమానమైన హోదా కలిగి ఉన్నారు. ఆమేరకు వేతనం(పేస్కేలు)



మాత్రం అందడం లేదు. అదనపు కలెక్టర్లు ఒకరకంగా జేసీ జాబ్‌చార్ట్‌ను అనుసరిస్తున్నారు. పౌరసరఫరాల శాఖలో ఎక్స్‌అఫీషియో హోదాలో జేసీ వ్యవహరిస్తారు. ఇనాం, సీలింగ్ చట్టాల అమలు, పర్యవేక్షణ అధికారం జేసీకే ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో జేసీ పోస్టులు లేకపోవడంతో... ఆ విధులను అదనపు కలెక్టర్లు అనధికారికంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తర్వాత సెలెక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. స్పెషల్ గ్రేడ్ తర్వాత కన్‌ఫర్డ్ ఐఏఎస్ హోదా రానివారికి సెలెక్షన్ గ్రేడ్ కేటాయించనున్నారు.

అధ్యయనానికి కమిటీ ఏర్పాటు

అదనపు కలెక్టర్ జాబ్‌చార్ట్ రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో కమిటీ ఏర్పాటుకు మంత్రి పొంగులేటి ఆదేశించారు. అదనపు కలెక్టర్ పోస్టుల ప్రాధాన్యం, ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలు, నిర్వర్తించాల్సిన విధులు తదితరాలపై కమిటీ విధివిధానాలను రూపొందించనుంది. ఇతర శాఖల్లో అత్యున్నత క్యాడర్ పోస్టులు చాలా ఉన్నాయి. రెవెన్యూలో మాత్రం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌కే పరిమితం చేశారు. ఈ నేపథ్యంలో ఇతర శాఖల్లోని మార్గదర్శకాలను కూడా కమిటీ అధ్యయనం చేయనుంది. మరోవైపు, గత ప్రభుత్వంలో రెవెన్యూశాఖ మంత్రి పోస్టు సీఎం వద్దే ఉండిపోవడంతో ఫైళ్ల పరిశీలన కుంటుపడింది. వీటిపై సమీక్షించిన మంత్రి పొంగులేటి... దాదాపు 700 వైద్య బిల్లులు, విధులపరమైన అభియోగాలకు సంబంధించిన 200 ఫైళ్లకు క్లియరెన్స్ ఇచ్చారు.

సాయం ఆపితే మావోయిస్టులపై పోరు కష్టమే!

- కేంద్రానికి విన్నవించిన తెలంగాణ పోలీసులు

10లో

ఇదీ సంగతి!





చుక్‌చుక్ బండి.. క్రాసింగ్ సమస్య తీరిందండి

బల్లార్షా నుంచి కాజీపేట వైపు వచ్చే రైళ్లకు క్రాసింగ్ సమస్య తీరింది. హనుమకొండ జిల్లా వడ్డేపల్లి సమీపంలోని ఉనికిచెర్ల వద్ద నిర్మించిన సొరంగ మార్గం నుంచి మంగళవారం ప్రయాణికులతో కూడిన రైళ్లు నడిచాయి. ఒకరోజు ముందు గూడ్స్ రైలును నడిపిన అధికారులు, అంతా సవ్యంగా ఉందని నిర్ధారించుకొని ప్రయాణికుల రైళ్లను అనుమతించారు.

–ఈనాడు, హనుమకొండ; న్యూస్‌టుడే, కాజీపేట



(c) eenadu



అధిక విలువను జోడిస్తేనే..

ప్రస్తుతం ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా ఉన్న ఎలాన్ మస్క్ జీవితాన్ని పరిశీలించండి. ఆయన నిరంతరం దృష్టిపెడుతూ వచ్చింది డబ్బు సంపాదనపై కాదు.. తన ఉత్పత్తులకు అత్యధిక విలువ జోడించడంపై! అలా తయారైన మేలిమి ఉత్పత్తులు ఆయనకు బాగా డబ్బు సంపాదించి పెట్టాయి. మీరూ అన్నింటికంటే ముందు- మీ పనికి/ఉత్పత్తులకు అధిక విలువ జోడించడంపై దృష్టిపెట్టండి.

– స్టిన్ నూర్‌మాన్, కంటెంట్ క్రియేటర్



గరుడ వాహనంపై తిరుమలేశుడి వైభోగం

ఈనాడు, తిరుపతి: సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం శ్రీవేంకటేశ్వర స్వామివారు తనకు ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల దివ్యక్షేత్రంలో సాయంత్రం 6.30కి మొదలైన గరుడ వాహనసేవ అర్ధరాత్రి వరకూ కొనసాగింది. శ్రీవారి మూలవిరాట్టుకు అలంకరించే లక్ష్మీహారం, మకరకంఠి ఆభరణాలను ఏటా దీనిలో ఒక్కసారి.. అదీ గరుడసేవ రోజు మాత్రమే ఉత్సవమూర్తి అయిన శ్రీమలయప్పస్వామికి అలంకరిస్తారు. ఉదయం స్వామివారు సర్వాలంకార భూషితుడై మోహినీ అవతారంలో శృంగార రసాధి దేవతగా భక్తులను తన్మయపరిచారు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై అభయమిచ్చారు. వాహన సేవల్లో తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు. వాహన సేవ తూర్పు మాడవీధి దాటిన తర్వాత అప్పటి వరకు గ్యాలరీల్లో ఉన్న భక్తులను వెలుపలికి పంపించి, మళ్లీ కొత్త భక్తులతో నింపింది. ఒక్కో మాడవీధి నుంచి సుమారు 20 వేల మందికి దర్శనభాగ్యం లభించింది. క్యూలైన్లలో మేదరమిట్ట నుంచి మాడవీధుల్లోకి ప్రవేశించే మార్గంలో తోపులాట కారణంగా పలువురు ఇబ్బంది పడ్డారు. హెచ్‌వీసీ కాంప్లెక్స్ ఎదురుగా కూడా స్వల్పతోపులాటలు చోటుచేసుకున్నాయి. ఉదయం మోహినీ అవతార వాహనసేవ సందర్భంగా మాడవీధుల్లో నడుస్తున్న ఏనుగుల వెనక్కు ఓ కుక్క వచ్చింది. ముందున్న ఏనుగు ఒక్కసారిగా పక్కకు తిరగడం, దాని వెనకనున్న గజరాజులు సైతం పక్కకు తిరిగి ముందుకు వెళ్లకపోవడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. మావటీలు అప్రమత్తమై గజరాజులను నియంత్రించారు. సిబ్బంది కుక్కను బయటకు తరిమారు.

'ఆపరేషన్ కగార్'పై సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి సరికాదు

ఆదివాసీ హక్కుల పోరాటసమితి సంఘీభావ వేదిక విమర్శ

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: 'ఆదివాసీల నిర్మూలన దిశగా ప్రభుత్వాల దాష్టీకాలు కొనసాగుతున్నాయి. ఆపరేషన్ కగార్ పేరిట ఈ నెల 4న అబూజ్‌మడ్‌లో ఆదివాసీలు, మావోయిస్టులపై జరిగిన హత్యాకాండ అందుకు నిదర్శనం. పౌర ప్రజాస్వామిక వాతావరణం కల్పించే దిశగా ఆపరేషన్ కగార్‌ను దిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో రేవంత్‌రెడ్డి వ్యతిరేకిస్తారని ఆశిస్తే.. మద్దతిస్తూ వ్యవహరించడం తగదు. ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేయాలి' అని ఆదివాసీ హక్కుల పోరాట సమితి సంఘీభావ వేదిక డిమాండ్ చేసింది. ఎన్‌కౌంటర్లను ఆపాలని డిమాండ్ చేస్తూ నవంబరు 3న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తామని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి.. అమాయకులైన ఆదివాసీల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ అమానవీయ అభివృద్ధి నమూనాపై పౌర సంస్థలు, ప్రజాస్వామికవాదులు మాట్లాడాలని, ఆదివాసీలకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. పోరాటకమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఓ వైపు బేటీ పఢావో - బేటీ బచావో అని చెబుతూనే మరో వైపు అబూజ్‌మడ్‌లో 15 మంది ఆదివాసీ మహిళలను హత్య చేశారని ధ్వజమెత్తారు. అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత కె.గోవర్ధన్, విరసం నేత పాణి తదితరులు ప్రసంగించారు. ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, సంఘాల నేతలు సత్యక్క (ఏఐఎంఎస్), నారాయణరావు (సీఎల్‌సీ), బల్ల రవీంద్రనాథ్ (టీఎల్‌పీ), మార్వాడీ సుదర్శన్ (దళిత లిబరేషన్ ఫ్రంట్), జాన్ (పీడీఎం) పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్. చిత్రంలో రవీంద్రనాథ్, ప్రొ.అన్వర్‌ఖాన్, గడ్డం లక్ష్మణ్

భాజపా హ్యాట్రిక్.. ఎన్సీ మ్యాజిక్

(మొదటి పేజీ తరువాయి)

హరియాణాలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారయ్యాయి. భాజపా అప్రతిహత విజయం సాధించింది. కాంగ్రెస్ అతి విశ్వాసం కొంపముంచింది. 90 సీట్లలో 48 గెలుచుకున్న భాజపా అధికారం చేజిక్కించుకుంది. ఉదయం కౌంటింగ్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు కనిపించింది. గంట తర్వాత క్రమంగా ఫలితాలు తారుమారవడం ప్రారంభించింది. చివరకు భాజపా విజయం సాధించింది. కాంగ్రెస్ 37 సీట్ల వద్దే ఆగిపోయింది. కొన్ని చోట్ల మెజారిటీలు అత్యల్పంగా నమోదు కావడంతో రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా స్వల్పంగానే ఉంది.

◆ ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డీ) కేవలం రెండు స్థానాల్లో విజయం సాధించగా.. జన్‌నాయక్ జనతాపార్టీ (జేజేపీ) ఖాతా తెరవలేదు. ఆప్‌నకు ఒక్క స్థానమూ దక్కలేదు.

◆ ఉదయం సమయంలో కాంగ్రెస్ ఓట్ల శాతం 40.5గా, భాజపా ఓట్ల శాతం 38.7గా చూపించింది. సాయంత్రం 3.45 గంటలకు భాజపా విజయం సాధించాక ఆ పార్టీకి 39.89%, కాంగ్రెస్‌కు 39.05% ఓట్లు పడ్డాయని నిర్ధారణ అయింది.

◆ కాంగ్రెస్‌కు ఏకంగా 11% ఓట్లు పెరగ్గా.. భాజపా 3% ఓట్లను పెంచుకుంది.

◆ విజయం సాధించిన వారిలో ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, ప్రతిపక్ష నేత భూపిందర్‌సింగ్ హుడా, రెజ్లర్ వినేశ్ ఫొగాట్, ప్రముఖ పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ తదితరులున్నారు.

◆ సైనీ క్యాబినెట్‌లోని 8 మంది మంత్రులు ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ స్పీకర్ జ్ఞాన్ చంద్ గుప్తా పంచకులలో ఓడిపోయారు.

◆ రాష్ట్రంలో విజయం సాధించినందుకు నాయబ్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాలు తమను ఆదరించాయని వ్యాఖ్యానించారు.

◆ మరోవైపు ఎన్నికల ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ఫలితాలను అంగీకరించేది లేదని స్పష్టం చేసింది.

అబ్దుల్లాలదే కశ్మీరం

జమ్మూ కశ్మీర్‌లో ఇండియా కూటమి ఘన విజయం సాధించింది. ఆర్టికల్ 370 రద్దు, కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్సీ, కాంగ్రెస్ కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంది. కూటమిలోని ఎన్సీ 42, కాంగ్రెస్ 6, సీపీఎం 1 సీటును గెలుచుకున్నాయి. భాజపా 29 సీట్లతో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది. భాజపా ఓట్ల శాతం 23 నుంచి 25.64కు పెరిగింది. 2014లో 20.77% ఓట్లను సాధించిన ఎన్సీ ఈసారి 23.43% ఓట్లను సాధించింది. పీడీపీ ఓట్ల శాతం 22.67 నుంచి 8.87కు పడిపోయింది. కాంగ్రెస్ ఓట్ల శాతం 18 నుంచి 12కు పడిపోయింది.

◆ విజయం సాధించిన ప్రముఖుల్లో ఒమర్ అబ్దుల్లా (రెండు చోట్ల..), పీసీసీ అధ్యక్షుడు తారిక్ హమీద్ కర్రా, పీడీపీ నేత వహీద్ పారా, భాజపా నేత దేవేంద్ర రాణా ఉన్నారు.

◆ ఓడిపోయిన వారిలో మాజీ ఉప ముఖ్యమంత్రి ముజఫర్ హుస్సేన్ బేగ్, కాంగ్రెస్ నేత తారా చంద్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ్ భల్లా, భాజపా అధ్యక్షుడు రవీందర్ రైనా ఉన్నారు.

◆ జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ముగ్గురు మహిళలే విజయం సాధించారు.

◆ జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు చేపట్టనున్నారు. రెండుచోట్ల పోటీ చేసి గెలిచిన ఆయనే ముఖ్యమంత్రి అని ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు.

సుపరిపాలనకు హరియాణా పట్టం



హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం అభివృద్ధి రాజకీయాలకు, సుపరిపాలనకు ప్రజలు పట్టం కడతారని అనేందుకు సంకేతం. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో శక్తివంచన లేకుండా పని చేస్తాం. వరుసగా మూడోసారి భాజపా సర్కారుకు మెజారిటీ ఇచ్చిన హరియాణా ప్రజలకు కృతజ్ఞతలు. మా ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఎంతో శ్రమించిన పార్టీ కార్యకర్తల కృషితోనే భాజపా ఈ చారిత్రక విజయాన్ని సాధించింది. జమ్మూకశ్మీర్‌లోనూ మేము మెరుగుపడినందుకు గర్వపడుతున్నా. ప్రశంసించదగ్గ ఫలితాన్ని చూపిన నేషనల్ కాన్ఫరెన్స్‌కు అభినందనలు. 370, 35 (ఎ) అధికరణాల తొలగింపు తర్వాత జరిగిన ఈ తొలి ఎన్నికలు జమ్మూకశ్మీర్‌కు ఎంతో ప్రత్యేకం. భారీగా పోలింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్యంపై విశ్వాసం చూపిన అక్కడి ప్రజలకు అభినందనలు.

- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

అమ్మో.. కేసు వాపసు తీసుకో!

- కోడలికి వాట్సప్ వీడియోకాల్ చేసి అభ్యర్థన
- గృహహింస కేసు నమోదుతో మనస్తాపం
- భర్త, అత్తమామల ఆత్మహత్యాయత్నం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఆ జంటకు పెళ్లయి ఎనిమిది నెలలు కూడా కాలేదు. విభేదాల నేపథ్యంలో ఆమె తన భర్త, అత్తమామలపై ఇటీవలే కేసు పెట్టింది. దీంతో భయపడిన వారు... ఆత్మహత్యకు ప్రయత్నించిన వైనమిది. సికింద్రాబాద్ మహంకాళి పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగోల్‌కు చెందిన పద్మావతి, భావనారాయణ దంపతుల ఏకైక కుమారుడు సుజన్ ఒక ప్రయివేటు కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 14న అతడికి కొత్తగూడెం సమీపంలోని చుంచుపల్లికి చెందిన యువతితో వివాహం జరిపించారు. కొద్ది రోజులకే అత్తింటివారితో మనస్పర్థల కారణంగా... కోడలు పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల భర్త, అత్తమామలపై చుంచుపల్లి పోలీసుస్టేషన్‌లో గృహహింస కేసు పెట్టింది. దీంతో అరెస్టవుతామన్న భయంతో వారు ఈ నెల 5న ఇల్లు వదిలి, సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నారు. బుకింగ్ ప్రకారం... మంగళవారం ఉదయం వారు ఖాళీ చేయకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి మరో తాళంతో గది తలుపు తీశారు. అప్పటికే ముగ్గురూ అపస్మారకస్థితిలో ఉండడంతో పోలీసులకు తెలిపారు. అనంతరం ముగ్గురినీ గాంధీ ఆసుపత్రికి తరలించారు. జ్యూస్‌లో అధిక మోతాదులో నిద్రమాత్రలు కలుపుకొని తాగడంతోపాటు ఇన్సులిన్ ఇంజక్షన్లు కూడా తీసుకున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి ముందు ఫోన్

భావనారాయణ దంపతులు సోమవారం రాత్రి కోడలికి వాట్సప్ వీడియో కాల్ చేసి, కేసు వాపసు తీసుకోవాలని బతిమిలాడినట్లు తెలుస్తోంది. ఆమె అంగీకరించకపోవడంతోనే బలవన్మరణానికి ప్రయత్నించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన కొన్ని ఫొటోలు కూడా కోడలికి పంపినట్టు పోలీసులు గుర్తించారు. మహంకాళి ఏసీపీ సర్దార్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాం, ఎస్సై జాన్ పరదేశి, క్లూస్‌టీమ్ సిబ్బంది గదిలో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణకు నూతన పర్యాటక విధానం: మంత్రి జూపల్లి

ఈనాడు, హైదరాబాద్: సంప్రదాయం, ఆధునికతల కలబోత అయిన తెలంగాణ వారసత్వాన్ని కాపాడుకునేందుకు నూతన పర్యాటక విధానాన్ని రూపొందిస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. అమెరికా లాస్‌ఏంజెల్స్‌లోని డబుల్ ట్రీ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ టూరిజం రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు ప్రపంచస్థాయి మౌలిక వసతులతో పర్యాటకులకు, పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణను ఆవిష్కరిస్తామన్నారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో భారీగా పెట్టుబడులు పెట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా కాన్సుల్ జనరల్ చిట్టిరెడ్డి శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ రద్దు.. ఒప్పందానికి విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

దీనికి సంబంధించిన నేపథ్యం ఇలా ఉంది. . మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న భాగాలకు మరమ్మతులు చేయాలని కోరినా పట్టించుకోలేదని, కొన్ని పనులు పూర్తి చేయకుండా పెండింగ్‌లో ఉండగానే పూర్తయినట్లు సర్టిఫికెట్ ఇవ్వడం అక్రమమని, దాన్ని రద్దు చేయాలని కోరుతూ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ- జనరల్)కు నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. ఈఎన్సీ నుంచి కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ద్వారా వచ్చిన లేఖ ఆధారంగా సర్టిఫికెట్‌ను రద్దు చేశామని, ఒరిజినల్ సర్టిఫికెట్ వెనక్కు ఇవ్వాలని ఎల్‌అండ్‌టీ పీఈఎస్‌కు రామగుండం ఎస్ఈ లేఖ రాశారు. దీనిపై నిర్మాణ సంస్థ స్పందించి, ఎస్ఈకి ప్రత్యుత్తరం రాసింది. గత నెల 18వ తేదీతో ఎస్ఈ రాసిన లేఖ 24వ తేదీన ఈ-మెయిల్ ద్వారా, 28వ తేదీన పోస్టు ద్వారా అందిందని, ఈ నేపథ్యంలో కొన్ని అంశాలను మీ దృష్టికి తెస్తున్నామని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఎల్‌అండ్‌టీ లేఖలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

పెండింగ్ పనులున్నట్లు నోట్‌పై వేయలేదు

◆ సబ్‌స్టాన్షియల్ కన్‌స్ట్రక్షన్ కంప్లీషన్ సర్టిఫికెట్‌ను 2019 సెప్టెంబరు 10వ తేదీన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) జారీ చేయగా, బ్యారేజి నిర్మాణం పూర్తయి 2019 జూన్ 21న ప్రారంభోత్సవం జరిగినట్లు ఎస్ఈ నిర్ధారించారు. అప్పటి నుంచి బ్యారేజి నిర్వహణలో ఉంది.

◆ అదనపు పనులు సహా అన్నీ పూర్తయ్యాయని 2020 నవంబరు 13న జరిగిన రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్ధారించి.. ఒప్పందంలోని క్లాజు 45.2 ప్రకారం రిటెన్షన్ మనీ బ్యాంకు గ్యారంటీలను విడుదల చేయాలని నిర్ణయించింది.

◆ అన్ని పనులు పూర్తయినట్లు 2021 మార్చి 15న ఈఈ కంప్లీషన్ సర్టిఫికెట్‌ను జారీ చేయగా, ఒప్పందం ప్రకారం బ్యారేజి నిర్మాణం, అనుబంధ పనులు 2020 జూన్ 29 నాటికి పూర్తయి బ్యారేజిని ప్రారంభించినట్లు ఎస్ఈ నిర్ధారించి, కౌంటర్ సంతకం చేశారు.

◆ 2016 ఆగస్టు 26న జరిగిన మొదటి ఒప్పందం, 2018 జులై 2న జరిగిన మొదటి అనుబంధ ఒప్పందం ప్రకారం చేయాల్సిన అన్ని పనులను పరిశీలించి పూర్తయినట్లు నీటిపారుదలశాఖ డాక్యుమెంట్ చేసింది. 2020 జూన్ 29 నాటికి పని పూర్తయినట్లు, ఒప్పందం ప్రకారం డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ప్రారంభమైనట్లు కాంట్రాక్టు సంస్థ అండర్ టేకింగ్ ఇచ్చిన తర్వాత 2021 మార్చి 15న కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చారు.

◆ 2022 మే 9న జరిగిన రెండో అనుబంధ ఒప్పందం ప్రకారం.. కొన్ని కొత్త పనులకు సంబంధించి 2022 మే 2న, 2023 మే 17న కాంట్రాక్టు సంస్థ నీటిపారుదలశాఖకు లేఖలు రాసినా, సరైన స్పందన రాలేదు.

◆ 2024 సెప్టెంబరు 18న నీటిపారుదలశాఖ రాసిన లేఖలో.. 2020 జూన్ 29వ తేదీ నాటికి ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నాయో స్పష్టంగా చెప్పలేదు. మా వరకు అన్ని పనులను 2020 జూన్ 29వ తేదీ నాటికి పూర్తి చేశాం. ఒప్పందంలోని నిబంధనలు 42.1, 50.1 ప్రకారం 2020 జూన్ 29కి ముందు కానీ, 2021 మార్చి 15 వరకు కానీ పెండింగ్ పనులున్నట్లు నీటిపారుదలశాఖ నోట్‌పై చేయలేదు.

◆ 2022 మే 9న కొత్త పనులకు జరిగిన రెండో అనుబంధ ఒప్పందం (2021 మార్చి 15న పని పూర్తయినట్లు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత) ప్రకారం చేయాల్సిన పనుల గురించి 2022 మే 2న, 2023 మే 17న రాసిన లేఖల్లో వివరించాం.

◆ పై విషయాలన్నింటి బట్టి.. ఒప్పందం ప్రకారం పని పూర్తయిన తర్వాత నిబంధనల ప్రకారం కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. దీన్ని అక్రమమని ప్రకటించడం తగదు. దీన్ని మేం అంగీకరించడంలేదు' అంటూ ఎల్‌అండ్‌టీ తరఫున సురేష్‌కుమార్ నీటిపారుదలశాఖ ఎస్ఈకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

వివరాలేమీ లేకుండానే మెమోలా?

కంప్లీషన్ సర్టిఫికెట్ జారీ చేయడంలో నిబంధనలు ఉల్లంఘించిన తీరును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొంది. దెబ్బతిన్న భాగాలకు మరమ్మతులు చేయకపోతే మరింత ప్రమాదం ఉంటుందని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఇంజినీర్లు నిర్మాణసంస్థకు లేఖలు రాయడం, దెబ్బతిన్న పనుల గురించి నిర్మాణ సంస్థ రాసిన లేఖలో ప్రస్తావించడాన్ని ఆ నివేదికలో గుర్తుచేసింది. తర్వాత అటు ఇంజినీర్లు, ఇటు నిర్మాణ సంస్థ దెబ్బతిన్న పనులను, పూర్తి చేయాల్సిన పనులను పక్కన పెట్టి కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని విజిలెన్స్ వివరంగా నివేదించింది. అయితే.. కంప్లీషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలంటూ నీటిపారుదలశాఖ కార్యదర్శి ఇచ్చిన ఆదేశాల్లో కానీ, దీని ఆధారంగా ఈఎన్సీ నుంచి సీఈకి, తర్వాత ఎస్ఈకి అందిన మెమోల్లో కానీ, సర్టిఫికెట్‌ను రద్దు చేస్తున్నట్లు ఏజెన్సీకి ఎస్ఈ రాసిన లేఖలో కానీ.. రద్దుకు కారణాలేమిటి, విజిలెన్స్ ఏయే అంశాలను లేవనెత్తింది వంటి వివరాలేవీ పేర్కొనకపోవడం గమనార్హం.

పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపాల్‌రెడ్డి



శ్రీపాల్‌రెడ్డి



దామోదర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ టీఎస్(పీఆర్‌టీయూటీఎస్) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి(వరంగల్ జిల్లా), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పుల్గం దామోదర్ రెడ్డి(కామారెడ్డి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరిగాయి. ఈ సందర్భంగా కొత్త అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను దసరా కానుకగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్‌రెడ్డి, రవీందర్, రాష్ట్ర సంఘం మాజీ బాధ్యులు వెంకట్‌రెడ్డి, కమలాకర్‌రావు, చెన్నకేశవరెడ్డి, లక్ష్మణ్, మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ప్రధాని నరేంద్ర మోదీతోపాటు, కేంద్ర మంత్రులకు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం, అరకు కాఫీ పొడి బాక్స్‌ను అందించారు. శ్రీవారి లడ్డూను ఇప్పుడు స్వచ్ఛమైన నెయ్యితో తయారుచేసినట్లు ఆయన ప్రధానమంత్రితో వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

గ్రహం అనుగ్రహం

9–10–2024 బుధవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం
షష్ఠి: ఉ. 7-24 తదుపరి సప్తమి
మూల: రా. 1-29 తదుపరి పూర్వాషాఢ
వర్జ్యం: ఉ. 9-02 నుంచి 10-41 వరకు
తిరిగి రా. 11-50 నుంచి 1-29 వరకు
అమృత ఘడియలు: సా. 6-54 నుంచి 8-33 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-24 నుంచి 12-11 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5.55; సూర్యాస్తమయం: సా.5.41
సరస్వతీపూజ, దేవీ త్రిరాత్ర వ్రతం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	35.0	25.0
కడప	35.0	25.0
మెదక్	34.6	21.0
ఖమ్మం	34.4	25.2
నిజామాబాద్	33.3	24.5
సూర్యాపేట	33.0	26.5
హనుమకొండ	33.0	23.5
ఆదిలాబాద్	32.8	24.2
రామగుండం	32.4	25.8
కరీంనగర్	32.0	22.0
హైదరాబాద్	31.6	23.9
మహబూబ్‌నగర్	30.0	24.1
నల్గొండ	30.0	23.6

రూ.40 కోట్లతో అత్యాధునిక ఆహార ప్రయోగశాలలు

తిరుమల, కర్నూలులో ఏర్పాటు చేయనున్న ఎఫ్ఎస్ఎస్ఏఐ

ఈనాడు, అమరావతి: ఏపీలో ఆహార భద్రతా ప్రమాణాలు పెంపొందించే చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల మధ్య రూ.88.41 కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరాయి. దిల్లీలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇనోషిశర్మ, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ సి.హరికిరణ్ ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల ప్రకారం.. రూ.40 కోట్లతో తిరుమల, కర్నూలులో ఎఫ్ఎస్ఎస్ఏఐ అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ ఫుడ్ ల్యాబ్‌లను, రూ.13 కోట్లతో ఏలూరు, ఒంగోలులో ప్రాథమిక ఆహార పరీక్షల ప్రయోగశాలలను ఏర్పాటు చేయనుంది.

PROFESSOR JAYASHANKAR TELANGANA AGRICULTURAL UNIVERSITY
(formerly Professor Jayashankar Telangana State Agricultural University) Administrative Office:
Rajendranagar: Hyderabad-30, Telangana, India
NOTIFICATION FOR ADMISSION INTO PG COURSES FOR THE AY- 2024-25
Advt.No. 5468/PG/2024 Date:08-10-2024
ONLINE applications are invited for admission into PG courses of the University for the AY 2024-25. The information booklet and other details are available on University Website: www.pjtsau.edu.in
P. RAGHU RAMI REDDY, REGISTRAR
DIPR R.O.No. 5138-PP/CL/ADVT/1/2024-25, Dt. 8-10-2024

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
Kukatpally, Hyderabad - 500 085, Telangana, India
MBA from JNTUH & CMU-USA Admission Notification 2024-25
Advt.No. JNTUH/ Admissions/CMU-MBA/2024 Dt.09.10.2024
Applications are invited through online mode from the eligible candidates for admission into MBA program in collaboration with Central Michigan University (CMU), USA for the academic year 2024-25.
Course duration: Two years, one year of study at JNTUH and the second year at CMU, USA.
Eligibility Criteria, Application Format, Instructions, Time Table for entrance test etc., are available on the University website www.jntuh.ac.in. Interested candidates can submit online application with all necessary documents with Registration fee of Rs.2000/- on or before 30.10.2024.
DIPR R.O.No.5148-PP/CL/ADVT/1/2024-25, Dt. 8-10-2024 Sd/- REGISTRAR

TELANGANA COUNCIL OF HIGHER EDUCATION HYDERABAD
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TGEAPCET-2024 (Bi.PC STREAM) ADMISSIONS
FIRST PHASE, FINAL PHASE AND SPOT ADMISSIONS
NOTIFICATION
PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING.
The Qualified candidates of TGEAPCET-2024 (Bi.P.C) desirous of seeking Admission into B. Pharmacy, Pharm D, Pharmaceutical Engineering, Bio-Medical Engineering and Bio-Technology Courses are informed that the Admission counselling process will commence on 19-10-2024. Minority candidates who have not qualified or not appeared in TGEAPCET-2024 (Bi.P.C), but passed in 10+2 examination or its equivalent examination (with Bi.P.C group subjects) can also attend for counselling to consider them for admission into Minority Colleges in leftover vacancies. Further details and counselling schedule, can be seen in the website: https://tgeapcetb.nic.in
Sd/-
Date: 08-10-2024 A. SRIDEVASENA, IAS
Place: Hyderabad CTE & Convener, TGEAPCET-2024(Bi.P.C)
DIPR R.O.No. 5135-PP/CL/ADVT/1/2024-25, Dt. 8-10-2024

CAUTION TO PUBLIC AT LARGE BY CMR TEXTILES & JEWELLERS (P) LTD
Public are hereby informed that recently a false and mischievously created post/screenshot which appears to be an image of a hoarding and underneath the image there is a statement stating that "MUSLIM MALE COMING WITH A HINDU GIRL/ FEMALE WILL GET 10% TO 50% DISCOUNT" is being circulated severely at a widespread in all the social platforms. This is to caution the public at large in the states of Andhra Pradesh, Telangana, Karnataka, Odissa and other states of India, that CMR Textiles & Jewellers Private Limited never advertised by making such a hoarding as depicted in the said created image which is duly posted. This is to further caution the Public, that our CMR Textiles & Jewellers Private Limited never announced such type of discount i.e., MUSLIM MALE COMING WITH A HINDU GIRL/ FEMALE WILL GET 10% TO 50% DISCOUNT through any advertising media and further CMR Textiles & Jewellers Private Limited will never announce such type of discounts which cause religious disharmony in the society, as we are running the business concern with all reputation since 40 years and at no point of time our CMR Textiles & Jewellers Private Limited made such type of advertisement. Therefore, we representing the CMR Textiles & Jewellers Private Limited at a whole duly condemn the said false post which is in circulation.
The Public are hereby further cautioned with an emphasis that please do not circulate this type of false posts if at all any one of you receive the same from any existing social platform and the public are further cautioned that this logo is a protected logo of CMR Textiles & Jewellers Private Limited for our exclusive use. Hence therefore if at all anybody misuses our protected logo then they will be prosecuted under law for causing infringement of copyright and Trade Mark of our protected logo.
The public are hereby informed that our CMR Textiles & Jewellers Private Limited could able to identify certain individuals who are actually involved in creating the said false posts and thereby our CMR Textiles & Jewellers Private Limited immediately reported the same to the concerned police officials by way of a written complaint dated:07.10.2024, to take action against the said persons as according to law in order to punish them for their acts.
The Public are hereby cautioned that, if at all even after going through this caution notice, if anybody receives the said false posts through any existing social platform and if by any circumstances he/she circulates the said post and if that is identified by our CMR Textiles & Jewellers Private Limited then our CMR Textiles & Jewellers Private Limited will be constrained to take appropriate Legal Action as enshrined under Bharatiya Nyaya Sanhita, 2023 and as well according to Civil Procedure Code against such person.
Sd/- M.RAMDAS, Advocate,
47-11-13, Dwarakanagar, VISAKHAPATNAM-530016,
Ph: 9348186105


తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
తి.తి.దేవస్థానములు, మార్కెటింగ్ విభాగమునకు గాను 06 నెలల కాలానికి దేశవ్యాప్తముగా నున్నటువంటి డెయిరీల నుంచి "అగ్‌మార్క్‌తో కూడిన 10,00,000 కేజీల స్పెషల్ గ్రేడ్ ఆవునెయ్యి ఈ-టెండర్ల ద్వారా" సరఫరా నిమిత్తం ఈ-టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు లాగాన్ అవ్వవలసిన వెబ్‌సైట్: http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in. తదుపరి వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం: 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నెం: 0877-2264554.
TTD-40021(31)/1/2024-PRO SEC (Adv.No:172), Dt: 08-10-2024 కార్యనిర్వహణాధికారి

తెలంగాణ గిరిజన సహకార సంస్థ: ఏటూరునాగారం
E mail: dmgccetn@gmail.com., Phone No. 9490796064
ఎలక్ట్రానిక్ టెండర్ ప్రకటన
తెలంగాణ గిరిజన సహకార సంస్థ ఏటూరునాగారం పరిధిలో గల వెంకటాపురం, ఏటూరునాగారం, నర్సంపేట, ములుగు, మహదేవపూర్ మరియు మన్ననూర్ గోదాముల నందు నిలవ ఉంచిన ఒక్కసారి వాడిన ఖాళీ బియ్యం సంచుల (322370 సంచులు), ఖాళీ డ్రమ్ములు (209) మరియు ఖాళీ అర డ్రమ్ములు(63) అమ్మకమునకు ఆసక్తి గల వ్యాపారుల నుండి బిడ్లు కోరబడుచున్నవి. వివరముల కొరకు http://tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు. వేలంలో పాల్గొనుటకు చివరి తేది 22.10.2024 సా. 5 గం. వరకు. ధరావతు సొమ్ము రూ 1.50 Lakhs. ఇతర వివరాల కొరకు శ్రీ జి.ప్రతాప్ రెడ్డి డివిజనల్ మేనేజర్ గారిని ఫోన్: 9490796064 నందు సంప్రదించగలరు.
Tender ID: 550071, Rc No. 163/2023-D చిత్ర మిశ్రా., IAS, ఛైర్మన్
DIPR R.O.No.5137-PP/CL/ADVT/1/2024-25, Dt.8-10-2024 అమ్మకము కమిటీ ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ ఏటూరునాగారం

కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్
కరీంనగర్, తెలంగాణ
NIT No. /KSCCL/2024-25, తేది: 8.10.2024
కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో బాలసదనంవద్ద నూతన భవన బ్లాక్ నిర్మాణం కొరకు తెలంగాణ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ www.tender.telangana.gov.in ద్వారా KSCCL టెండరును కోరుతున్నది. స్మార్ట్ సిటీస్ మిషన్ క్రింద కరీంనగర్‌లో బాలసదనంవద్ద నూతన భవన బ్లాక్ నిర్మాణం. అంచనా వ్యయం రూ.200 లక్షలు. 1. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది, సమయం: 9.10.2024 సా.4.00 గం.నుండి. 2. దాఖలుకు చివరి తేది, సమయం: 19.10.2024 సా.4.00 గం.వరకు.
DIPR R.O.No. 5124-PP/CL/ADVT/1/2024-25, తేది: 8.10.2024 సం/- మేనేజింగ్ డైరెక్టర్, KSCCL

పరకాల పురపాలక సంఘ కార్యాలయం, హనుమకొండ జిల్లా
Roc. No.E1/168/MCP/2024 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 08.10.2024
కొటేషన్ నోటీసు కొరకు పనుల సంగ్రహం: పని పేరు: 1.పరకాల పురపాలక సంఘానికి 3 నెం.ల ఐషర్ ట్రాక్టర్లు కొనుగోలు చేయుట (రూ.30.00 లక్షలు), 2. పరకాల పురపాలకసంఘానికి సెంట్రల్ లైటింగ్ మెటీరియల్ కొనుగోలు చేయుట (రూ.5.00 లక్షలు). వివరాలు: కొటేషన్లు 09.10.2024 నుండి స్వీకరించబడతాయి. కొటేషన్ల స్వీకరణకు చివరి తేది: 14.10.2024 మ.3.00 గం.వరకు (కొటేషన్లు అదే రోజున మ.3.30 గం.లకు తెరువబడతాయి). 2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ కొరకు టెండరు నోటీసు: రూ.74.97 లక్షల మొత్తం అంచనా వ్యయంతో వివిధ గ్రాంట్ల క్రింద మొత్తం పనుల సంఖ్య: 8 నెం.లు. 3వ పునఃపిలుపు పనుల సంఖ్య: 2 నెం.లు (52.57 లక్షలు): బిడ్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 09.10.2024 ఉ.11.00 గం.నుండి. బిడ్స్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 11.10.2024 ఉ.11.00 గం.కు. బిడ్స్ తెరుచు తేది మరియు సమయం: 11.10.2024 ఉ.11.10 గం.కు. 2వ & 3వ పిలుపు పనుల సంఖ్య: 06 నెం.లు (22.40 లక్షలు): బిడ్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 14.10.2024 ఉ.11.00 గం.నుండి. బిడ్స్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 19.10.2024 ఉ.11.00 గం.కు. బిడ్స్ తెరుచు తేది మరియు సమయం: 19.10.2024 ఉ.11.10 గం.కు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల గురించి తదుపరి వివరాలను www.tender.telangana.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చును (ఫోన్ నెం.9347945697). ఏ కారణం తెలుపకనే టెండరును రద్దు చేయు హక్కు కమిషనర్‌కు కలదు.
సం/- కమిషనర్,
DIPR R.O.No. 5128-PP/CL/ADVT/1/2024-25, తేది: 08.10.2024 పరకాల పురపాలక సంఘం

(c) eenadu


SMART BAZAAR
పండుగ కొనుగోలు పూర్తి చేసుకోవటానికి, స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
రుచికరమైన వంటకం చేసుకోండి
పండుగలోని మాధుర్యం పెంచుకోండి
Reliance
ప్యారీస్ వైట్ లేబుల్ సల్ఫర్ ఫ్రీ చక్కెర 5 kg
₹209 (₹41.80/kg)
విజయా ఘీ 1 L
₹559
గుడ్ లైఫ్ ఆల్మండ్ / జీడిపప్పు (W320) 500 g
₹375/ ₹479
200 g
BUY ANY 1 GET ANY 1 FREE
BUY ANY 2 GET ANY 1 FREE
బిస్కెట్స్ 275 g మొదలుకుని / లోట్టే చాకో పై 336 g (12 Pcs) (సెలెక్ట్ వేరియంట్స్)
115.5 g
అందంగా పండుగ జరుపుకోండి
ప్రతిఒక్కరికి తగిన గిఫ్ట్
పండుగ వేడుకలు చేసుకోండి
దీపావళి ఎల్ఈడి లైట్ రేంజ్
₹99
డ్రైఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్ అసార్టెడ్ 225 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY 1 GET 1 FREE
₹4999
బ్రాండెడ్ 3 పీసెస్ ట్రాలీ సెట్ (ఎపిక్ శ్రేణి)
BUY ANY 3 GET ANY 1 FREE
స్ప్రైట్ / కోకో-కోలా / థమ్సప్ / మాజా 600 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఆండ్రాయిడ్ స్మార్ట్ ఎల్ఈడి టివి 80 cm (32 inch)
బ్యూటీ ఎసెన్షియల్స్ 0.35 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
50%
₹89
మంగళదీప్ అగర్బత్తి 213 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
₹699
ఓపల్ వేర్ డిన్నర్ సెట్ 12 యూనిట్స్
BUY 1 GET 2 FREE
కాటన్ డబుల్ బెడ్ షీట్ (సెలెక్ట్ వేరియంట్స్)
₹7499
NVY Official LED TV Partner of RCB
స్లింగ్ బ్యాగ్ విలువ ₹1499 ₹299
కొనండి ఏవైనా 2 జీన్స్ విలువ RRP ₹700 ప్రతి జీన్స్ లేదా అంతకుమించి
ICICI Bank
10% Instant Discount* on Credit & Debit Cards
On Min. Transaction of ₹3,000/- Max Discount up to ₹500/- Valid From 7th Oct. to 13th Oct. 2024 Valid Once per Card
వద్ద కూడా లభ్యం
JioMart
fresh Signature
SMART SUPERSTORE
ఇప్పుడు తెరవబడింది
SMART BAZAAR
SMART SUPERSTORE


MARUTI SUZUKI
NEXA
STEP UP IN LIFE WITH THE GRAND VITARA DOMINION EDITION.
ENJOY SPECIAL SUV EXCHANGE BENEFITS & MORE.
DOMINION EDITION
GET ACCESSORY PACKAGE OF UP TO ₹52 699*
GRAND VITARA
GRAND CONSUMER OFFERS UP TO ₹20 000#
GRAND MARUTI SUZUKI SMART FINANCE OFFER
GRAND EXCHANGE BONUS UP TO ₹85 000#
PER LAKH EMI STARTING FROM ₹1 475#
MAHABUBNAGAR: NEXA MAHABUBNAGAR SOUTH (SRI JAYARAMA MOTORS PVT. LTD. PH: 08062511495),
MANCHERIAL: NEXA MANCHERIAL CENTRAL (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 08062512041), WARANGAL: NEXA WARANGAL EAST (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 08062216904),
KARIMNAGAR: NEXA RAMPUR (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 08062511741), NIZAMABAD: NEXA NIZAMABAD EAST (VARUN MOTORS PH: 08062512353),
NALGONDA: NEXA NALGONDA NORTH (PAVAN MOTORS PVT LTD PH: 08062512011), KHAMMAM: NEXA WYRA ROAD (PARAMSHIVA MOTORS PH: 08062511063).
Contact us at 1800-200-[6392], 1800-102-[NEXA] and visit www.nexaexperience.com to book online.
3 years 100 000 km WARRANTY* EXTENDABLE UPTO 6 YEARS
Creative visualisation. For details on functioning of safety features, including airbags, kindly refer to owner's manual. *All offers are brought to you by NEXA dealers only. Offers may vary subject to the model and variant purchased. Maruti Suzuki reserves the right to withdraw offers at any point in time without any advance notice. Consumer offers applicable for Oct '24 model while stocks last. For more details regarding offers please contact your nearest NEXA dealership. T&C apply. Features and accessories shown may not be part of standard fitment. Black glass shade on the vehicle is due to lighting effect. *3 years or 100 000 km whichever is earlier.

ఈనాడు

కాంగ్రెస్ చేజేతులా...

అతి చేస్తే గతి చెడుతుందని సామెత! హరియాణా తమ చేతికి చిక్కేసిందనే అత్యుత్సాహంతో నిన్న ఎన్నికల ఫలితాల వెల్లడికి మునుపే మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులకు తలతిరిగి ముద్ద నోట్లోకి వచ్చింది. ఎగ్జిట్ పోల్స్ పండితులందరూ మరోసారి పప్పులో కాలేసిన వేళ, హరియాణా ప్రజానీకం వరసగా మూడోసారి భాజపాకే పట్టంకట్టింది. కమలదళం సాధించింది చరిత్రాత్మక విజయమైతే- కాంగ్రెస్‌ది అంతా స్వయంకృతాపరాధం! ఆలూ లేదు, చూలూ లేదు, కొడుకు పేరు సోమలింగం అన్నట్లు- హరియాణా కాంగ్రెస్ నేతలు కొన్నాళ్లుగా ఊహలపల్లకిలో ఊరేగుతున్నారు. ఆరునూరైనా తమ గెలుపు ఇక లాంఛనమేనన్న అతివిశ్వాసాన్ని వారు అడుగడుగునా ప్రదర్శించారు. పోలింగ్‌కు ముందే సీఎం పదవి కోసం సిగపట్లకూ దిగారు. భూపీందర్ సింగ్ హుడ్డా, కుమారి సెల్జా వంటివారు అలా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించిన దాని ఫలితమే కాంగ్రెస్ ఓటమి. ప్రభుత్వ వ్యతిరేక ఓటుపైనే గంపెడాశలు పెట్టుకున్న హస్తం పార్టీ- తనవైన అభివృద్ధి సంక్షేమ ప్రణాళికలతో హరియాణా ఓటర్లకు చేరువకాలేక చివరికి చతికిలబడింది!

హరియాణా రాజకీయాలన్నీ ఒకప్పుడు దేవీలాల్, భజన్‌లాల్, బన్సీలాల్ చుట్టూనే పరిభ్రమించేవి. పాత కోటలను కుప్పకూల్చి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలను చేజిక్కించుకుని అధికారం చేపట్టిన భాజపా- 2019 సార్వత్రిక సమరంలో రాష్ట్రంలోని లోక్‌సభ సీట్లన్నింటినీ తన ఖాతాలోనే వేసుకుంది. అయితే, ఆపై కొద్దినెలలకే జరిగిన శాసనసభ ఎన్నికల్లో అది 40 స్థానాలకే పరిమితమై, దుష్యంత్ చౌతాలా పార్టీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. సాగు చట్టాలను నిరసిస్తూ రైతులు రోడ్డెక్కడం, సైన్యంలో నియామకాలకు సంబంధించిన అగ్నిపథ్ పథకంపై యువతలో ఆగ్రహావేశాలు పెల్లుబకడం, నిరుద్యోగ సమస్య ప్రబలం కావడం తదితరాలతో హరియాణాలో గడచిన అయిదేళ్లలో భాజపా సర్కారు సంకటస్థితిని ఎదుర్కొంది. 2024 లోక్‌సభ ఎలెక్షన్లలో రాష్ట్రంలోని పది సీట్లలో అయిదు చోట్ల ఓడిపోయింది. కానీ- ముఖ్యమంత్రిని మార్చడం, కొత్తవారికి ఎక్కువగా టికెట్లు ఇవ్వడం, జాట్‌యేతర జనవర్గాలను తనవైపు తిప్పుకోవడం ద్వారా ప్రభుత్వంపై వ్యతిరేకతను భాజపా సులువుగా అధిగమించగలిగింది. దానికితోడు విపక్షాలు వేటికవి విడివిడిగా పోటీపడటంతో తాజా ఎన్నికల్లో కమలదళం గెలుపు నల్లేరుపై నడకైంది!

జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికలకు పదేళ్ల తరవాత మళ్ళీ నగారా మోగినప్పటి నుంచి ప్రజాతీర్పు ఎలా ఉండబోతోందోననే ఉత్కంఠ నెలకొంది. మూడు దశల పోలింగ్‌లో స్థానికులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఫలితాలపై ఆసక్తి ఇంకా పెరిగింది. హంగ్ అసెంబ్లీ తప్పదంటూ వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి స్పష్టమైన ఆధిక్యంతో విజయకేతనం ఎగరవేసింది. ఆర్టికల్ 370 రద్దు దరిమిలా మొట్టమొదటి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో కశ్మీరీల ఓట్లను భావోద్వేగాలే ఎక్కువగా ప్రభావితం చేసినట్లు ఫలితాలను బట్టి వెల్లడవుతోంది. జాతిభద్రత దృష్ట్యా జమ్మూకశ్మీర్ స్థితిగతులు సాధారణ రాజకీయాలకు అతీతమైనవి. అక్కడ ప్రజాస్వామ్యం తిరిగి ఊపిరిపోసుకోవడం వాంఛనీయమే కాదు, అత్యావశ్యకం కూడా. జాతీయ స్రవంతిలో జమ్మూకశ్మీర్ భాగస్వామి కావాలంటే- ప్రధాని మోదీ హామీఇచ్చిన మేరకు దాని రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి. అభివృద్ధి, ఉపాధి కల్పన ద్వారా కశ్మీరీల జీవితాల్లో వెలుగులు నింపడానికి కేంద్రం, జమ్మూకశ్మీర్ సర్కారు కలిసి నడవాలి!

బడి అంటే- పెద్ద భవనమూ నాలుగు గోడల మధ్య కుర్చీలూ బల్లలూ కాదు. విద్యావంతులైన, ఆదర్శనీయులైన ఉపాధ్యాయులుండాలి. వారు విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం చేయాలి. ప్రతి విషయంపైనా చర్చ జరపాలి. పిల్లలకు ఆలోచించే, తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం ఇవ్వాలి.

– గోపబంధుదాస్, విద్యావేత్త, సంఘసంస్కర్త

సరస్వతీ... భగవతీ!

'ప్రణో దేవీ సరస్వతీ' అంటూ వాగ్దేవి వైభవాన్ని రుగ్వేదం సముచిత రీతిలో కీర్తించింది. తనకు నమస్కరించే వారినందరినీ కాపాడే సరస్వతి మనల్నీ కాపాడుతుందని దాని అర్థం. అజ్ఞానమనే చీకటిని దూరం చేస్తూ విజ్ఞాన కాంతి కిరణాలను నిరంతరం వెదజల్లే జ్ఞాన ప్రదాయిని సరస్వతీదేవి. సరస్వతి అంటే- అక్షరం, అక్షయం, ఆద్యంత రహిత శక్తిస్వరూపం. సరస్వతి అమ్మ వీణాపాణి, గీర్వాణి, వేదవాణి, వాక్కులరాణి. సర్వవిద్యలకు, సకల శాస్త్రాలకు అధిదేవత. సర్వత్రా వ్యాపించిన ఒక మహత్తర చైతన్యస్రవంతి.



బ్రహ్మాండపురాణం ప్రకారం- మాఘ శుద్ధపంచమి నాడు ఆవిర్భవించిన సరస్వతీదేవిని శరన్నవరాత్రి పూజల్లో మూలా నక్షత్రం రోజున ప్రత్యేకంగా ఆరాధించడం దక్షిణాదిన ఆనవాయితీ. ఆరోజు ఆదిశక్తిని మహాసరస్వతి రూపంలో కొలుస్తారు. సరస్వతి తన నాలుగు చేతుల్లో పుస్తకం, మాల, నీటికుండ, వీణలను ధరించి ఉంటుంది. పుస్తకం వేదాలకూ జ్ఞానానికీ ఆధ్యాత్మిక పరిపక్వతకూ చిహ్నం. స్ఫటిక మాల నిరంతర ధ్యానసంపదకు ఆలవాలం. నీటికుండ లోకంలోని మంచిచెడుల విచక్షణకూ జ్ఞానామృతానికీ గుర్తు. 'కచ్ఛపి' వీణ ప్రపంచంలోని సకల సృజనాత్మక విజ్ఞానానికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. సరస్వతీదేవిని పూజించిన వారికి విద్యాసంపదను, ధనధాన్యాలను ప్రసాదిస్తుందంటారు. అందుకే ఆ తల్లిని 'వాజేభిర్వాజినీవతీ, ధీనామ విత్ర్యవతు' అని రుగ్వేదం స్తుతించింది. అమ్మ ధరించే ధవళ వస్త్రాలు స్వచ్ఛతకు, కమలం వికాసానికి సంకేతం. నీటిని వేరుచేసి హంస కేవలం పాలను మాత్రమే ఎలా స్వీకరిస్తుందో, అలా మనం కూడా చెడును వదిలేసి మంచిని మాత్రమే గ్రహించాలనే పరమార్థాన్ని హంసవాహనం సూచిస్తుంది.

చదువులతల్లి ప్రఖ్యాత ఆలయాలుగా కశ్మీర్‌లోని మహాసరస్వతి శక్తిపీఠం, శృంగేరిలోని శారదాపీఠం పేరొందాయి. తెలుగు రాష్ట్రాల్లోని బాసర జ్ఞానసరస్వతి, వర్గల్ విద్యా సరస్వతి, ఇందుపల్లి జ్ఞానసరస్వతి ఆలయాల వంటివి ఎంతో ప్రసిద్ధిగాంచాయి. సరస్వతీదేవిని బౌద్ధంలో మంజుశ్రీగాను, జైనంలో శ్రుతసదనగాను, షోడశ విద్యాదేవతగాను ఆరాధిస్తారు. మనదేశం నుంచి చైనా ద్వారా జపాన్ చేరిన సరస్వతి అక్కడ 'బెంజైటెన్' పేరుతో జ్ఞానదేవతగా పూజలందుకుంటోంది.

సరస్వతీ అమ్మ అనుగ్రహం వేదవ్యాసుడితో మహాభారతం రాయించింది. వాల్మీకితో రామాయణాన్ని, ఆదిశంకరాచార్యులతో కనకధారాస్తవాన్ని పలికించింది. త్యాగయ్యను నాదబ్రహ్మను, అన్నమయ్యను పదకవితా పితామహుడిని చేసింది. ఆదికవి నన్నయతో మొదలుపెట్టి ఎందరో కవులు తమ రచనలను సరస్వతీ ప్రార్థనతోనే శ్రీకారం చుట్టారు. జ్ఞానజ్యోతిని వెలిగించే అక్షరాన్ని ఆరాధించడమే సరస్వతీ పూజ.

'శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికాహార...' అంటూ పోతన స్తుతించినట్లుగా మనం కూడా నిత్యం సరస్వతీ అమ్మను పూజిద్దాం. ఆమె కరుణా కటాక్ష వీక్షణాదులకు పాత్రులమవుదాం!

– శ్రీగిరి గోపాలకృష్ణ

అంతర్యామి

బహుముఖ సేవల సారథి



ఇంటర్నెట్ యుగానికి ముందు వ్యక్తులు, కుటుంబాలు, కంపెనీల మధ్య తపాలా కార్యాలయాలే అనుసంధానతను ఏర్పరచేవి. ఇప్పటికీ అనేక గ్రామాలకూ, బయటి ప్రపంచానికీ మధ్య పోస్టాఫీసులే వారధులుగా నిలుస్తున్నాయి. ఉత్తరాల బట్వాడాకే పరిమితం కాకుండా బ్యాంకింగ్, బీమా, పార్శిల్, ఈ-కామర్స్ వంటి ఎన్నో సేవలను అందిస్తున్నాయి. నేడు ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా...

మన దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వమే తపాలా కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. 1837 నాటి భారతీయ తపాలా కార్యాలయాల చట్టంతో దేశమంతటా పోస్టాఫీసులు వెలిశాయి. ఈ ఏడాది మార్చి నాటికి దేశంలో మొత్తం 1,64,972 తపాలా కార్యాలయాలు నెలకొన్నాయి. వాటిలో 90.60శాతం (1,49,478) గ్రామాల్లో ఉండగా... నగరాలు, పట్టణాల్లోనివి కేవలం 9.40శాతమే (15,494). భారత్‌లోనే కాకుండా, మరో 219 దేశాలకూ మన తపాలా సేవలు అందుతున్నాయి. కాలక్రమంలో పోస్టాఫీసులు పొదుపు ఖాతాలు, మనీయార్డర్లు, చిన్నచిన్న బీమా పాలసీలను అందించే ఆర్థిక సేవా కేంద్రాలుగానూ అవతరించాయి. బ్యాంకు శాఖలు పెద్దగా ఉండని గ్రామాల్లో తపాలా కార్యాలయాలే ఆ సేవలనూ అందిస్తున్నాయి. యుద్ధాలు, ప్రకృతి ఉత్పాతాల సమయంలో తపాలా కార్యాలయాలు ప్రజలను పరస్పరం అనుసంధానిస్తున్నాయి.

చిరు వ్యాపారులకు అండగా...

డిజిటల్ యుగంలో ప్రభుత్వం తపాలా కార్యాలయాలను కంప్యూటరీకరించింది. ఫలితంగా ఉత్తరాలు, పార్శిళ్ల బట్వాడా వేగవంతమైంది. ఆన్‌లైన్ ట్రాకింగ్‌తో ప్రజలు తాము పంపిన పార్శిళ్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోగలుగుతున్నారు.



ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు(ఐపీపీబీ) రంగప్రవేశంతో ఇంతవరకు బ్యాంకు ఖాతా లేనివారికీ ఆ సౌకర్యం అందివస్తోంది. ఐపీపీబీ వల్ల బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, సూక్ష్మ రుణ సేవలు ఇంటి దగ్గరే అందుబాటులోకి వస్తున్నాయి. ఆధార్ కార్డుల నమోదు, పాస్‌పోర్ట్ సేవలు, బిల్లుల చెల్లింపులు కూడా తపాలా కార్యాలయాల ద్వారా జరుగుతున్నాయి. కొంతకాలంగా ఈ-కామర్స్, అంతర్జాతీయ కొరియర్ సర్వీసులకు గిరాకీ పెరిగింది. చిన్నచిన్న వస్తువులను విదేశాలకు ఎగుమతి చేయడానికి, స్వదేశంలోకి దిగుమతి చేసుకోవడానికీ 2015-20 విదేశీ వాణిజ్య విధానం అనుమతిస్తోంది. తదనుగుణంగా కేంద్ర వాణిజ్య శాఖ విదేశీ తపాలా కార్యాలయాల (ఎఫ్‌పీఓ) ఏర్పాటుకు వెసులుబాటు కల్పించింది. వీటిని తొలుత ప్రధాన నగరాల్లో ఏర్పాటుచేసి, తరవాత ఇతర ప్రాంతాలకు విస్తరించదలిచారు. నేడు వీటి సంఖ్య 28కి చేరింది. కస్టమ్స్ విభాగ పరిధిలోని ఎఫ్‌పీఓలు విదేశాలకు చిన్నచిన్న వాణిజ్య సరకులను పంపడానికి ఉపకరిస్తున్నాయి. ఈ సౌకర్యాన్ని చిన్న పట్టణాలు, గ్రామాలకు విస్తరించేందుకని కొన్ని పోస్టాఫీసులకు డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాల(డీఎన్‌కే) హోదా కల్పించారు. నేడు దేశమంతటా 1,000 డీఎన్‌కేలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అవి- ఎగుమతి చేసిన సరకుల పోస్టల్ బిల్ ఈ-ఫైలింగ్ సౌకర్యం, స్వీయ బుకింగ్, ఎలెక్ట్రానిక్ కస్టమ్స్ క్లియరెన్స్, ప్యాకేజింగ్, ఉచిత సేకరణ (పికప్), పెద్ద ఆర్డర్లకు భారీ తగ్గింపు రుసుములు, చిన్న ఎగుమతిదారులకు సలహాలూ, సూచనలు, మార్గదర్శకత్వం అందిస్తున్నాయి. ఎఫ్‌పీఓలతో కలసి డీఎన్‌కేలు అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేస్తాయి.

ఎఫ్‌పీఓలు విదేశీ కొరియర్ సంస్థల కన్నా చాలా తక్కువ రుసుములకే బట్వాడా సేవలు అందిస్తాయి. హస్తకళాకారులు, నేతన్నలు, ఎంఎస్ఎంఈల ఉత్పత్తులను, గిల్టు నగలు, ఆయుష్, మూలికా మందులు, పండుగ వస్తువులు, ప్రాంతీయ తినుబండారాలను గ్రామాల నుంచి విదేశాలకు పంపడానికి ఎఫ్‌పీఓలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. నేడు భారత్‌లో వ్యవస్థాపక సామర్థ్యం పెద్ద నగరాలకే పరిమితం కాలేదు. చిన్న పట్టణాల్లోనూ అంకుర పరిశ్రమలు ఉద్భవిస్తున్నాయి. ఇలాంటి వారికి అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం అందించడానికి ఎఫ్‌పీఓలు అక్కరకొస్తున్నాయి.

చిన్న పట్టణాలు, పల్లెల్లోని డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాల(డీఎన్‌కే) మూలంగా చిన్న వ్యాపారులు, ఉత్పత్తిదారులు తమ వస్తు ఎగుమతులకు సంబంధించిన సేవల కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అగత్యం తప్పుతోంది. వారికి స్థానిక డీఎన్‌కేలు గిడ్డంగి, ప్యాకేజింగ్, అంతర్జాతీయ రవాణా సేవలను అందిస్తున్నాయి. దాంతో చిన్న వ్యాపారులు తమ వస్తువులను సకాలంలో, సరసమైన ధరలకు విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేస్తూ కొత్త మార్కెట్లను చేరుకోగలుగుతున్నారు. నేడు తెలంగాణలో 37 డీఎన్‌కేలు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 29 కేంద్రాలున్నాయి. అవి చిన్న ఉత్పత్తిదారులు, వ్యాపారులకు ఒకే చోట అన్ని ఈ-కామర్స్ సేవలను అందిస్తున్నాయి. 2030కల్లా భారతీయ ఈ-కామర్స్ ఎగుమతుల విలువ 20,000- 30,000 కోట్ల డాలర్ల వరకు ఉంటుందని 2023 మార్చిలో ప్రకటితమైన విదేశీ వాణిజ్య విధానం అంచనా వేసింది. ఆన్‌లైన్ వ్యాపార వృద్ధికి ప్రత్యేక ఈ-కామర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించారు.

అవగాహనతో మరిన్ని అవకాశాలు...

పోస్టల్ ఈ-కామర్స్ విధానంలో చీరలు, ఇతర దుస్తులు, కలంకారీ వస్త్రాలు, గిల్టు నగలు, తేయాకు, కాఫీ, దుప్పట్లు, దిండు గలీబులు, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, ఆయుర్వేద మందులు వగైరా ఎగుమతి చేస్తున్నారు. ఇవి ఎక్కువగా అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలకు వెళ్తున్నాయి. ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్ సర్వీస్ (ఐటీపీఎస్) కింద తపాలా శాఖ మొత్తం 39 దేశాలతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. మరింతమంది చిన్న ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులకు తపాలా కార్యాలయాల ద్వారా విదేశీ మార్కెట్లను చేరుకోవచ్చునే అవగాహన కల్పించాలి. నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, పల్లెల్లోనూ అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. నేతన్నలు, స్థానిక ఉత్పత్తిదారులు, వర్తకులకు సువిశాల అంతర్జాతీయ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.



డాక్టర్ వీబీఎస్ఎస్ కోటేశ్వరరావు
వాణిజ్య రంగ నిపుణులు

కోపం వస్తుందా!



"కోపం ఎందుకు రాదండీ? మడిసన్నాక కోపం వచ్చుద్ది" అంటుంది 'అత్తారింటికి దారేది' సినిమాలో ఓ పాత్ర. నిజమే! కోపం ఒక ఉద్వేగం. మనలో చాలామందికి పిలవకుండానే కోపం వచ్చేస్తూ ఉంటుంది. మనిషికి కోపంతో పని పడుతుందా... అంటే - పడుతుంది. ధర్మానికి హాని జరిగినప్పుడు, కళ్లకు ఎదురుగా అన్యాయం జరుగుతున్నప్పుడు కోపం తెచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. అలా వచ్చే కోపాన్ని 'ధర్మాగ్రహం' అంటారు. పిలవని పేరంటంలా వచ్చిపడే సందర్భాల్లో అయితే అది శత్రు కూటమిలో ఒకటైన కోపం అవుతుంది. మనలో చాలామందికి ఆ రెండో తరహా కోపంతోనే పరిచయం ఎక్కువ. తన కోపమే తన శత్రువు అన్న మాట నిజమయ్యే సందర్భాలవే.

"కారణంలేకుండా ఎవరికీ కోపం రాదు.. అయితే ఎప్పుడో గాని కోపానికి సరైన కారణం ఉండదు" అన్నారు బెంజమిన్ ఫ్రాంక్లిన్. 'సరైన కారణం' అనేదే కీలకం. కాబట్టి కోపం ముంచుకొచ్చినప్పుడల్లా ఒక్కక్షణం ఆగి మన కోపానికి తగిన కారణం ఉందో లేదో చూసుకుంటే చాలు. అది కేవలం ఉద్వేగానికి చెందిందో, ధర్మానికి చెందిందో మనకే తెలిసిపోతుంది. దాన్నిబట్టి ఆగ్రహించాలో - నిగ్రహించాలో తేల్చుకోవచ్చు.

కోపం, దుఃఖం, భయం.. వంటి ఆరింటిని ప్రాథమిక భావోద్వేగాలుగా చెబుతుంది మనస్తత్వ శాస్త్రం. వాటికి తక్షణమే స్పందించేది మెదడులోని 'లింబిక్ లోబ్'. అప్పుడు 'ఎడ్రినలిన్' అనే రసాయనం విడుదల అవుతుంది. అది మనిషిని అసంకల్పిత చర్యలకు ప్రేరేపిస్తుంది. ఆ మధ్య ఒక బాలిక తన తల్లిపైకి దూసుకొచ్చిన ఆటోను అమాంతం ఎత్తేసి అమ్మను రక్షించుకొన్న సంఘటనను సామాజిక మాధ్యమాల్లో చూశాం. అంటే భయమనే భావోద్వేగాన్ని అంతర్గత శక్తిగా ఆవిష్కరించిందామె. నేనెత్తగలనా అన్న ఆలోచనే లేకుండా అంత బరువునూ ఎత్తిపడేసింది. అలా మనిషిలో కోపాన్నీ ఆయుధంగా, శక్తిగా మార్చుకోవడం సాధ్యమే- అంటారు మనస్తత్వ నిపుణులు.

అలా కోపాన్ని నిగ్రహించుకోవడంగాని, ఒక ఆయుధంగా మార్చుకోవడం గాని ఎప్పుడు సాధ్యమవుతుందంటే- భావోద్వేగ సంయమనాన్ని(ఎమోషనల్ బ్యాలెన్సింగ్) సాధన చేసినప్పుడు. దానికి మనిషిలోని వివేకం ఆధారం. నిగ్రహానికి పునాది భావోద్వేగ వివేకం (ఎమోషనల్ ఇంటెలిజెన్స్). కోపాన్ని ఒక ఆయుధంగా ప్రయోగించడంకోసం పనిగట్టుకొని దాన్ని పిలవడమే ఫ్రాంక్లిన్ చెప్పిన 'సరైన కారణం'. భయంలో, దుఃఖంలో, కోపంలో మునిగిపోయినప్పుడు మనిషి దేహంలో వణుకు రావడానికి కారణమయ్యే ఎడ్రినలినే - ధర్మాగ్రహం విషయంలో శక్తిగా మారుతుందని అర్థం. కోపం తనంతట తానే వచ్చినప్పుడు అదే మనిషిని శాసిస్తుంది. ప్రతీకారానికి ప్రేరేపిస్తుంది. కానీ, కోపాన్ని మనం పిలిచినప్పుడు అదే ఎడ్రినలిన్ మన చేతిలో ఆయుధం అవుతుంది. కోపం రావడమా... తెచ్చుకోవడమా... ఏది మేలంటారు?

– వై.శ్రీలక్ష్మి

స్టార్టప్‌ల సాగు



దేశీయంగా సాగు, దాని అనుబంధ రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయ స్టార్టప్‌లు పెద్దసంఖ్యలో ఉద్భవిస్తున్నాయి. కేంద్రం వాటికి ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోంది. ఇలాంటి స్టార్టప్‌లు ఏయే రాష్ట్రాల్లో ఎన్ని ఉన్నాయంటే...

మహారాష్ట్ర	226
కర్ణాటక	211
తమిళనాడు	137
తెలంగాణ	98
కేరళ	97
ఉత్తర్‌ప్రదేశ్	86
హరియాణా	84
ఛత్తీస్‌గఢ్	79
మధ్యప్రదేశ్	68
రాజస్థాన్	66
ఆంధ్రప్రదేశ్	61

(ఆధారం: కేంద్రం నివేదిక)

ఆహార కల్తీని అడ్డుకోలేరా?

దేశంలో ఆహార కల్తీ ప్రజారోగ్యానికి పెను సవాలు విసురుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఆ జాడ్యం పెచ్చుమీరుతోంది. చట్టాల అమలులో ఉదాసీనత, అధికారుల అలక్ష్యం కల్తీరాయుళ్లకు వరంగా మారింది.

సురక్షితమైన పోషకాహార ప్రాధాన్యాన్ని వివరించేందుకు ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) సెప్టెంబరులో 'గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటర్స్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఆ సందర్భంగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా 'ఆహార భద్రతా సూచీ-2023-24'ను విడుదల చేశారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ర్యాంకులతో కూడిన ఈ జాబితాలో కేరళ, తమిళనాడు, జమ్మూకశ్మీర్‌లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. తెలంగాణ 23వ స్థానానికి పరిమితమైంది. జగన్ జమానా (2022-23)లో సేకరించిన వివరాల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ 28వ స్థానాన కూలబడింది.



ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, కల్తీ ఆహారం కారణంగా భారత్‌లో ఏటా సుమారు 10 కోట్ల మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ బాధితుల్లో 70వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నిత్యం ఆసుపత్రులకు వెళ్తున్న వారిలో 20శాతం కల్తీ ఆహార బాధితులే ఉంటున్నారని అంచనా.





అలవిమాలిన నిర్లక్ష్యం

ఆహార భద్రతా సూచీని నిర్ణయించడానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుంది. మానవ వనరులు-సంస్థాగత సమాచారానికి 9మార్కులు, మార్గదర్శకాల అమలుకు 28, తనిఖీ-నిఘాకు 36, సిబ్బంది శిక్షణ-సామర్థ్యాల పెంపునకు 8, వినియోగదారుల సాధికారతకు 9, గత ఏడాది కంటే సాధించిన మెరుగుదలకు 10 మార్కుల చొప్పున కేటాయించారు. అగ్రస్థానాన నిలిచిన కేరళ నూటికి 73.75మార్కులు సాధించింది. తమిళనాడు 67, జమ్మూకశ్మీర్ 64.25, గుజరాత్ 61.75మార్కులతో ఆ తరవాతి స్థానాలను ఆక్రమించాయి. తెలంగాణ 35.75, ఆంధ్రప్రదేశ్ 27 మార్కులే సాధించాయి. అధికారులకు అవసరమైన శిక్షణ, సామర్థ్యాల పెంపు విషయంలో తెలుగు రాష్ట్రాలు అట్టడుగున నిలిచాయి. నమూనాల సేకరణ, పరీక్షలకు అవసరమైన వసతుల కల్పనలో ఏపీకి 36 మార్కులకుగాను నాలుగే వచ్చాయి! వసతుల కల్పన, ఆహార కల్తీ కట్టడి విషయంలో ఉభయ రాష్ట్రాలూ మెరుగుపడలేకపోయాయి. ఈ విషయంలో కేరళ, తమిళనాడు, జమ్మూకశ్మీర్‌లు మిగతా రాష్ట్రాలకు ఆదర్శం. అక్కడ అత్యాధునిక వసతులు, ప్రమాణాలతో కూడిన ఆహార నమూనాల పరీక్ష కేంద్రాలున్నాయి. వాటికితోడు శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించడం; తరచూ తనిఖీలు చేస్తూ ఆహార కల్తీని అడ్డుకోవడం వంటి చర్యలు చేపట్టారు.

ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చూడటమే ఎఫ్ఎస్ఎస్ఏఐ లక్ష్యం. మార్కెట్లో విక్రయించే ప్రతి ఆహార ఉత్పత్తినీ ఈ సంస్థ తనిఖీచేసి, లైసెన్స్ ఇవ్వాలి. చాలా ఉత్పత్తులు ఆ సంస్థ అనుమతి లేకుండానే మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి. ఆహార కల్తీ నిరోధానికి భారత్‌లో వంట నూనెల నియంత్రణ చట్టం, ఆహార కల్తీ నిరోధక చట్టం, నిత్యావసర సరకుల నియంత్రణ చట్టం, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం, ఆహార భద్రతా ప్రమాణాల చట్టం వంటివి ఉన్నాయి. అవేవీ క్షేత్రస్థాయిలో సవ్యంగా అమలు కాకపోవడమే పెద్ద సమస్య! ఆహార కల్తీకి పాల్పడినవారికి ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష, పెద్దమొత్తంలో జరిమానా విధించవచ్చు. కానీ, సంబంధిత యంత్రాంగం ఉదాసీనతవల్ల కల్తీరాయుళ్లకు పెద్దగా శిక్షలు పడటంలేదు.

కఠిన శిక్షలే కీలకం

హైదరాబాద్‌లో ఆమధ్య నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. కుళ్లిన మాంసం, తినడానికి వీల్లేని ఆహార పదార్థాలు, వంట ప్రదేశాల్లో ఎలుకలు, బొద్దింకల సంచారంతో అధికారులే నివ్వెరపోయారు. తనిఖీల పేరిట అధికారులు ఒకటి, రెండు రోజులు హడావుడి చేయడం, తరవాత పట్టించుకోకపోవడం సర్వసాధారణమైంది. కొందరు అధికారులు తూతూమంత్రపు తనిఖీలతో కల్తీరాయుళ్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పైగా వారు హోటళ్లు, రెస్టారెంట్లలోనే తనిఖీలు చేపడుతున్నారు తప్పితే... కల్తీ నూనెలు, నాణ్యతలేని కారం, మసాలాలు, రసాయనాలు, కృత్రిమ రంగులను ఎక్కువగా వినియోగించే ఆహార బండ్లపై నిఘా పెట్టడంలేదనే విమర్శలున్నాయి. ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమించిన ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించడం అవసరం. ఆహార భద్రతా విభాగాల్లో అధికారులు, సిబ్బంది ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి. ప్రమాణాలతో కూడిన పరీక్ష కేంద్రాలను నెలకొల్పాలి. కల్తీ దందాసురులకు కఠిన శిక్షలు, భారీగా జరిమానాలు విధించాలి. అప్పుడే దేశంలో ఆహార కల్తీకి అడ్డుకట్ట పడుతుంది.

– మధుసూదన్‌రెడ్డి శానాల

హాయ్! బుజ్జీ!!

కోరల జింకను నేను!

హాయ్ ఫ్రెండ్స్ బాగున్నారా! ఏంటి అలా విచిత్రంగా చూస్తున్నారు. పొడవైన కోరలతో ఉన్న నన్ను చూసి ఏదో క్రూరమృగం అనుకుంటున్నారు కదూ! కాదు. నేనో సాధుజంతువును... జింకను. మరి నా సంగతులేంటో తెలుసుకుంటారా!

నా పేరు వాటర్ డీర్. చైనాకు చెందిన జీవిని. ఉత్తర, దక్షిణ కొరియాల్లోనూ కనిపిస్తుంటాను. రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్‌లోనూ కొద్ది సంఖ్యలో ఉన్నాం. సాధారణంగా మగ జింకలకు కొమ్ములుంటాయి. కానీ మాకు ఉండవు. ఇలా కొమ్ములు లేకుండా ఉన్న ఏకైక జింక జాతి మాదే. అలాగే కోరలతో ఉండే జింకలం కూడా మేమే. అన్నట్లు అసలు విషయం చెప్పడం మరిచిపోయాను. మాలో ఆడవాటికి ఇలా పొడవైన దంతాలు ఏమీ ఉండవు.




మా కోరలు దాదాపు 5 నుంచి 8 సెంటీమీటర్ల వరకు పొడవుంటాయి. వీటిని తోటి జింకలతో పోరాడే సమయాల్లో ఆయుధాల్లా ఉపయోగిస్తాం. మాలో మగవి 13 కిలోల వరకు బరువు పెరుగుతాయి. ఆడ జింకలేమో సుమారు 11 కిలోల వరకు బరువు తూగుతాయి. మా తోకలు చాలా చిన్నగా ఉంటాయి. మేం ఎక్కువగా నదీ పరివాహక ప్రాంతాల్లోనే జీవిస్తుంటాం. అక్కడ నీటిలో పెరిగే గడ్డిజాతులను తింటాం. మేం చక్కగా ఈత కూడా కొట్టగలం తెలుసా. పర్యావరణ మార్పులు, అక్రమ వేట కారణంగా రోజురోజుకూ మా సంఖ్య వేగంగా పడిపోతోంది. ప్రస్తుతం మేం అంతరించిపోయే ప్రమాదం ఉన్న జాబితాలో ఉన్నాం. నేస్తాలూ.. మొత్తానికి ఇవీ నా విశేషాలు. ఇక ఉంటా మరి. బై.. బై..! ★

పదవలయం

కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను కనిపెట్టండి. అన్ని పదాలు 'క' అక్షరంతోనే ముగుస్తాయి.

1. కళ్లకు అలంకరణ
2. ఓ పక్షి పేరు
3. విత్తనం నుంచి వచ్చేది
4. వినాయకుడి వాహనం
5. - - - నేల
6. విషయ - - -
7. ఖాళీ సమయం
8. బహుమతిని ఇలా కూడా అనొచ్చు



జవాబులు: 1. కాటుక 2. చిలుక 3. మొలక 4. ఎలుక 5. ఇసుక 6. సూచిక 7. తీరిక 8. కానుక

(c) eenadu

చిన్న అపార్టుమెంట్లకు ట్రాన్స్‌ఫార్మర్ల సెగ!

- ఒక భవనంలో 20 కిలోవాట్లు దాటితే ఏర్పాటు తప్పనిసరి
- సొంత ఖర్చుతో పెట్టుకోవాలని యజమానులకు నోటీసులు
- జీహెచ్ఎంసీ పరిధిలోనే 10 వేలకు పైగా గుర్తింపు ● ఏర్పాటుకు రూ.300 కోట్ల ఖర్చు

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో 15 ఏళ్ల క్రితం 8 ఫ్లాట్లతో ఓ చిన్న అపార్టుమెంటును నిర్మించిన బిల్డర్ వాటిని అమ్మేసి వెళ్లిపోయారు. అప్పట్లో ఈ ఫ్లాట్లకు విడివిడిగాను.. లిఫ్ట్, ఇతర కామన్ అవసరాలకు కలిపి మొత్తం 9 కరెంటు కనెక్షన్లు ఇచ్చారు. ఇప్పుడు వీటి ద్వారా లోడు 20 కిలో వాట్లకు మించి పెరిగినట్లు చెబుతూ ఫ్లాట్ల యజమానులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ సిబ్బంది నోటీసు ఇచ్చారు. దీన్ని పెట్టుకోవాలంటే రూ.3 లక్షలకు పైగా ఖర్చవుతుంది. అంత భారం 8 ఫ్లాట్ల యజమానులపై పడుతుంది.

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కరెంటు సరఫరాలో సాంకేతిక సమస్యలతో అంతరాయాలు ఏర్పడకుండా విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నాయి. ప్రతి కరెంటు స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్‌ను జీపీఎస్‌తో అనుసంధానం చేసి వాటిపై ఎంతలోడు ఉందనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ తెలంగాణ డిస్కం పరిధిలో తొలుత గ్రేటర్ హైదరాబాద్‌లో ఏ ప్రాంతంలో ఎంత కరెంటు లోడు ఉందనే వివరాలను సిబ్బంది పక్కాగా నమోదు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ట్రిప్ అయి కరెంటు సరఫరా నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎన్ని కనెక్షన్లున్నాయి.. వాటి లోడు.. తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. ఇంతవరకు జీహెచ్ఎంసీ పరిధిలోనే దాదాపు 10 వేల అపార్టుమెంట్లు, భవనాల్లో కరెంటు లోడు 20 కిలోవాట్లకు మించి ఉన్నా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోలేదని తేలింది. వీటికి డిస్కం నోటీసులు జారీ చేస్తోంది. వీరంతా సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటే దాదాపు రూ.300 కోట్లకు పైగా ఖర్చవుతుంది. ఒక ఇంట్లో నాలుగైదు పోర్షన్లున్నా లేదా చిన్న అపార్టుమెంట్‌లోనైనా వాటి కుండే కనెక్షన్లపై 20 కిలోవాట్లకు మించి లోడు ఉంటే తప్పనిసరిగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసుకోవాలి. పలుచోట్ల ఇలా ఏర్పాటు చేయకపోవడంతో ఆ లోడు దాని సమీపంలోని ప్రజా ట్రాన్స్‌ఫార్మర్లపై పడటంతో తరచూ ట్రిప్ అవడం లేదా కాలిపోవడంతో సరఫరా నిలిచిపోతోంది. బిల్డర్లు సరైన అనుమతులు లేకుండా,



తక్కువ స్థలంలో ఐదు, ఆపై ఫ్లాట్లతో గ్రూప్ హౌస్ పేరుతో కట్టే చిన్న అపార్టుమెంట్లకు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయడం లేదు. సాధారణంగా ఒక చిన్న ఇంటికి 3 నుంచి 5 కిలోవాట్ల లోడు కరెంటు కనెక్షన్ ఇస్తారు. ఇంట్లో ఏసీలు, ఇతర ఉపకరణాల వాడకం పెరగడంతో లోడు అధికమవుతుంది. ఇలాంటి సందర్భాల్లో అదనంగా లోడు పెంచాలని విద్యుత్ కార్యాలయంలో ఇంటి యజమాని దరఖాస్తు చేయాలి. చాలామంది ఇలా చేయకుండానే కరెంటును విచ్చలవిడిగా వాడటం వల్ల లోడు పెరిగి తరచూ ఆ ప్రాంతంలో ట్రిప్పయి, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిలై సరఫరా నిలిచిపోతోంది. వీటితో కరెంటు కోతలు విధిస్తున్నారనే విమర్శలు వస్తున్నందున ప్రభుత్వం సీరియస్ అవుతోంది. ఈ నేపథ్యంలో డిస్కంలు 20 కిలోవాట్లకు మించి సామర్థ్యం ఉన్న భవనాలకు నోటీసులు జారీచేస్తున్నట్లు విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు.

సిబ్బంది అక్రమాలతో సామాన్యులకు ఇబ్బంది

నిబంధనల ప్రకారం.. 20 కిలోవాట్లు దాటితే తప్పనిసరిగా ఏ భవనం ఆవరణలోనైనా అది నిర్మాణంలో ఉన్నప్పుడే ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయాలి. అనంతరమే ఆ భవనానికి కరెంటు కనెక్షన్ ఇవ్వాలి. కానీ కొందరు బిల్డర్లు స్థానిక విద్యుత్ సిబ్బందికి లంచాలు చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్లకు వెచ్చించాల్సిన సొమ్మును మిగుల్చుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో అక్కడ ఫ్లాట్లు కొని నివసిస్తున్నవారిపై ఇప్పుడు ఆర్థికభారం పడుతోంది. అపార్టుమెంటు కట్టినపుడు ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా కనెక్షన్లు ఎలా ఇచ్చారని విద్యుత్ సిబ్బందిని వారు ప్రశ్నిస్తున్నారు. బిల్డర్లు, సిబ్బంది కుమ్మక్కై పాల్పడిన అక్రమాలకు తమపై ఆర్థికభారం ఎలా మోపుతారని ప్రశ్నిస్తున్నారు. డిస్కం ఖర్చుతోనే పాత భవనాలు, చిన్న అపార్టుమెంట్లలో ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల. చిత్రంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, చేనేతశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్

పంట ఉత్పత్తుల కొనుగోళ్లపై పరిమితిని కేంద్రం ఎత్తివేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్

ఈనాడు,హైదరాబాద్: రాష్ట్రంలో పండించే వరి మినహా ఇతర పంటలను పూర్తిగా మద్దతు ధరలతో కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని, ప్రస్తుతం ఉన్న 25 శాతం పరిమితిని ఎత్తివేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. 25 శాతం పరిమితి వల్ల కందులు, పెసర, పత్తి, జొన్న, ఇతర పంటలను పండించిన రైతులు నష్టపోతున్నారన్నారు. వంద శాతం పంట ఉత్పత్తుల కొనుగోలుకు అనుమతించాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుకు మంత్రి సూచించారు. మంగళవారం సచివాలయంలో తమ శాఖ పరిధిలోని కార్పొరేషన్ల పనితీరుపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న సంప్రదాయ చేనేత ఉత్పత్తులకు తగిన ప్రచారం కల్పించాలి. మార్కెట్ గిరాకీకి అనుగుణంగా నాణ్యమైన వస్త్రాలను ప్రత్యేక డిజైన్లతో ఉత్పత్తి చేసే చర్యలు చేపట్టాలి. ఇ-కామర్స్, చేనేత లక్ష్మి వంటి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. టెస్కో ద్వారా అమ్మకాలు పెంచాలి. అన్ని రకాల సదుపాయాలతో పోచంపల్లి టెక్స్‌టైల్ పార్కును అందుబాటులోకి తేవాలి. రాష్ట్రంలోని రైతులు పండించే ధాన్యం, ఇతర సరకుల నిల్వ కోసం గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలను అందుబాటులోకి తేవాలి.


జనవరికల్లా ఆయిల్‌పామ్ మొక్కలు నాటాలి

2024-25 సంవత్సరానికి కేటాయించిన ఆయిల్ పామ్ మొక్కలు నాటే లక్ష్యాన్ని వచ్చే జనవరికల్లా పూర్తి చేయాలి. ఆయిల్‌ఫెడ్‌కు కేటాయించిన అన్ని జిల్లాల్లో కర్మాగారాల స్థాపన, నర్సరీల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు సత్వరమే పూర్తి చేయాలి. సిద్దిపేటలోని ఆయిల్ కర్మాగారం నిర్మాణం పూర్తి చేసి.. వచ్చే ఏడాది ఆగస్టు నెలలో ప్రారంభించాలి. విత్తన ధ్రువీకరణ సంస్థను కొనసాగించాలో, వద్దో సమీక్షించి నిర్ణయం తీసుకోవాలి. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలకు పునరుజ్జీవం కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి" అని మంత్రి ఆదేశాలిచ్చారు.

దసరా కానుకగా డీఏ బకాయిలు ఇవ్వండి

తెలంగాణ ఉద్యోగుల ఐకాస వినతి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉద్యోగులకు దసరా కానుకగా ప్రభుత్వం బకాయి కరవు భత్యాలు(డీఏలు) విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని తెలంగాణ ఉద్యోగుల ఐకాస కోరింది. సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. "ఏళ్లుగా పెండింగ్ డీఏల కోసం ఉద్యోగులు, పింఛనుదారులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన రెండు డీఏలు ఇవ్వలేదు. పండగ సందర్భంగా వారి ఆశలను ప్రజాప్రభుత్వం తీర్చుతుందన్న నమ్మకం ఉంది" అని ఐకాస ప్రతినిధులు పేర్కొన్నారు.



పనికొచ్చే విషయాలపై దృష్టిపెట్టండి

మీకు ఏకాగ్రత లేదనుకుంటే పొరపాటే. వీడియో గేమ్‌లు, సామాజిక మాధ్యమాలపై మీరు రోజూ గంటలకొద్దీ దృష్టిసారిస్తున్నారు. అదే మీ ఏకాగ్రతకు నిదర్శనం. మీరు చేయాల్సిందల్లా.. పనికిరాని అంశాలపై కాకుండా, పనికొచ్చే ముఖ్యమైన విషయాలపై దృష్టి కేంద్రీకరించడమే. అలా చేస్తే- జీవితంలో సవాళ్లను ధైర్యంగా స్వీకరించగలుగుతారు. మిమ్మల్ని మీరు మెరుగ్గా తీర్చిదిద్దుకుంటారు.

– డాన్ కో, బ్రాండ్ అడ్వైజర్

ప్రతి ఇంటికీ సౌర పరికరాలు

- త్వరలో కొన్ని గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు చేపడతాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. చిత్రంలో ముజమ్మిల్ ఖాన్, విద్యుత్తు సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి

ఈటీవీ, ఖమ్మం: "రైతులకు పంటతోపాటు విద్యుత్తు ద్వారా కూడా ఆదాయం వచ్చేలా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తున్నాం. పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని గ్రామాల్లో అన్ని ఇళ్లకూ సౌర పరికరాలు అమర్చి విద్యుత్తును ఉత్పత్తి చేయనున్నాం. రాష్ట్రంలో 2029-30 నాటికి 20 వేల మెగావాట్ల హరిత విద్యుదుత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. విద్యుత్తు సంస్థ పనితీరుపై ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అధికారులతో ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో విద్యుత్తుశాఖ ప్రధాన పాత్ర పోషిస్తోంది. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందిస్తున్నాం. పదేళ్లుగా విద్యుత్తు శాఖలో పెండింగ్‌లో పడిన పదోన్నతులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిష్కరించాం. సర్కారు లక్ష్యాలకు అనుగుణంగా విద్యుత్తు అధికారులు పొలంబాట పట్టాలి. రైతుల సమస్యలను పరిష్కరించాలి. రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళన మాటున గత పాలకులు వారి బినామీల పేరిట భూములను బదలాయించారు. భారాస ప్రభుత్వంలో కేసీఆర్ ఒక్కరే నిర్ణయాలు తీసుకునేవారు. మంత్రివర్గంలో ఇతరులకు మాట్లాడే అవకాశమే ఉండేది కాదు. అందుకే మూసీ సుందరీకరణ అంశాన్ని మంత్రివర్గంలో చర్చించారా...? అంటూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రివర్గంలో అందరి అభిప్రాయాలు, సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నామన్న విషయాన్ని భారాస నేతలు గుర్తుంచుకోవాలి. మూసీ నదిలో స్వచ్ఛమైన నీటిని పారించి, పార్కులు నిర్మించి, నిరాశ్రయులకు అక్కడే ఇళ్లు నిర్మిస్తామంటే ప్రతిపక్ష పార్టీకి వచ్చిన ఇబ్బందేంటి? దేశంలో ఎక్కడా లేనివిధంగా, అన్ని రకాల వసతులతో రూ.5వేల కోట్లతో ఈ ఏడాది ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నాం. వీటికి రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం భూమిపూజ చేస్తాం" అని వెల్లడించారు. సమావేశంలో విద్యుత్తు సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా

- రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: అర్హులైన రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి తెలిపారు. రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్వోఆర్) చట్టంపై త్వరలోనే ప్రజాభిప్రాయాలను సేకరిస్తామన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల లోపు రుణాలు మాఫీ చేసిందని, సాంకేతిక ఇబ్బందులతో కొంతమందికి మాఫీ కాలేదన్నారు. రుణమాఫీ జరగకపోతే ఎవరిని సంప్రదించాలో జీవోలో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొందని తెలిపారు. భారాస, భాజపాలు రుణమాఫీ, మూసీ పునరుద్ధరణపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. 'రుణమాఫీకి సంబంధించి ఇప్పటికే 32 రకాల సమస్యలను వ్యవసాయశాఖ గుర్తించింది. ఆరు లక్షల దరఖాస్తులను పరిష్కరించాం. రైతు భరోసా హామీకి కూడా కాంగ్రెస్ కట్టుబడి ఉంది. అర్హులైన వారికి సాయం అందుతుంది. ధరణి సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం. ఇప్పటికే ఆర్వోఆర్‌పై మేధావులు, విశ్రాంత అధికారుల అభిప్రాయాలను సేకరించాం. ప్రజాభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనపై భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఏకసభ్య న్యాయ కమిషన్

- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కమిషన్ నియామకంలో అడ్వొకేట్ జనరల్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఉపసంఘం తీర్మానించింది. ఏకసభ్య కమిషన్ చట్టపరంగా పటిష్ఠంగా ఉండడంతో పాటు న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉండేలా నియామకం జరగాలని క్యాబినెట్ సబ్‌కమిటీ ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు తీర్పు మేరకు తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ మల్లు రవి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం నాలుగోసారి సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇప్పటికే అధికారుల బృందం తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఉపకులాల వర్గీకరణ ఉంటుంది. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారం, ఉద్యోగ నియామకాలు సహా నివేదికను రూపొందించాలి. ఎస్సీ వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు మంత్రివర్గ ఉప సంఘం జిల్లాలవారీగా పర్యటిస్తుంది' అని వెల్లడించారు. మంత్రులు సీతక్క, దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, లా సెక్రటరీ తిరుపతి, ప్రభుత్వ ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, ఐఏఎస్ అధికారులు బుర్రా వెంకటేశం, లోకేశ్‌కుమార్, దానకిశోర్, టి.కె.శ్రీదేవి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయండి

కీలకమైన ప్రాజెక్టుల కింద భూసేకరణ ప్రక్రియలో వేగం పెంచాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆ శాఖ సలహాదారు ఆదిత్యానాథ్‌దాస్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేంద్రరావు, హరీరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల కింద నిర్మాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్ హామీలను హరియాణా ప్రజలు తిరస్కరించారు

- భారాస నేతలు కేటీఆర్, హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: ఏడు గ్యారంటీలంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను హరియాణా ప్రజలు తిరస్కరించారని భారాస నేతలు కేటీఆర్, హరీశ్‌రావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు. "కర్ణాటకలో ఐదు, తెలంగాణలో ఆరు గ్యారంటీలు అంటూ అడ్డగోలు హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిలువునా మోసం చేసింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తోందని చెప్పడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కశ్మీర్‌లో భాజపాను, హరియాణాలో కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించలేదు. రెండు జాతీయ పార్టీల పట్ల ప్రజల్లో విముఖత ఉందనేది సుస్పష్టం. త్వరలో జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్, దిల్లీ ఫలితాలు కూడా రెండు జాతీయ పార్టీలకు ఏమాత్రం ఆశాజనకంగా ఉండవని అర్థమవుతోంది. బలమైన ప్రాంతీయ పార్టీలే రానున్న రోజుల్లో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించనున్నాయి. ఈ ఫలితాలు చూసిన తర్వాత అయినా.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతీకార, దృష్టి మళ్లింపు రాజకీయాలు మానుకొని ఆరు గ్యారంటీలను, 420 హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి" అని కేటీఆర్, హరీశ్‌రావు కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా.. సుమారు 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం అగమ్య గోచరంగా మార్చిందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి తమ సమస్యలు వివరించారు. కనీసం సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. "విద్యా వ్యవస్థ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి ఇంతకు మించిన ఉదాహరణ లేదు. టీసీ, ఇతర సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వడం లేదు. దీనివల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చింది. బకాయిలు చెల్లించేలా ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ఈ విషయంలో భారాస పార్టీ అండగా ఉంటుంది. 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా.. ప్రభుత్వం ఇప్పటికైనా బకాయిలను చెల్లించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

బుకాయింపులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు: జగదీశ్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ.. బుకాయింపులతో ప్రభుత్వాన్ని నడిపిస్తోందని, అసలు మూసీపై ప్రభుత్వం వద్ద ప్రణాళిక ఉందా? అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పడంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎం రేవంత్‌రెడ్డిని మించిపోతున్నారని, సంపాదనలోనూ సీఎంతో పోటీపడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జగదీశ్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "హైడ్రా, మూసీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురైంది. పార్టీ అధిష్ఠానానికి కప్పం కట్టేందుకు మూసీ సుందరీకరణ అంటున్నారు. ఇందుకోసం రూ.1.50 లక్షల కోట్ల వ్యయమవుతుందని ఎవరు చెప్పారని డిప్యూటీ సీఎం అంటున్నారు. మూసీ సుందరీకరణపై చర్చకు భట్టి సిద్ధమా? డబ్బుల కోసం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను నాశనం చేస్తున్నారు" అని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విష్ణువర్ధన్‌రెడ్డి, సైమన్ లీ

తైవాన్‌తో తెలంగాణ వాణిజ్య ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ-తైవాన్ మధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారాన్ని పెంపొందించేందుకు తైవాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీసీసీ), తెలంగాణ ప్రభుత్వ ఐటీఈసీ విభాగం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురావడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నట్లు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం తైపీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవగాహన ఒప్పందంపై తాను, తైవాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు సైమన్ లీ సంతకాలు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తైవాన్ నుంచి ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించడం ద్వారా రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తామన్నారు. తైవాన్ పెట్టుబడిదారులు, తెలంగాణ ప్రభుత్వం మధ్య సహకారాన్ని పెంపొందించడానికి హైదరాబాద్‌లో ఒక కార్యాలయాన్ని టీసీసీ ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

దాతల ఉదారత బాధితులకు బాసట

కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టిన సొమ్ము కళ్లెదుటే కొట్టుకుపోతుంటే తల్లడిల్లిపోయారు. ఉప్పెనలా విరుచుకుపడిన వరద మృత్యువై తరుముతుంటే భీతిల్లిపోయారు. మున్నేరు, బుడమేరు మిగిల్చిన విషాదం నుంచి బాధితులను బయట పడేసేందుకు దాతలు ముందుకొస్తున్నారు.



ఎం.వేదవతి
విశ్రాంత రిజిస్ట్రార్, జేఎన్టీయూ
హైదరాబాద్
విరాళం: రూ.2,01,116



ఎ.వి.జనార్దనరావు
(భార్య కమలాదేవి జ్ఞాపకార్థం)
హైదరాబాద్
విరాళం: రూ.1,00,116

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరపున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
శ్రీమతి మన్నారు సుమతమ్మ (కీ.శే. మన్నారు గోవిందునాయుడు గారి సతీమణి), చిత్తూరు	25,116
పురిమెట్ల శ్రీనివాసులు, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	20,000
వై.రమణయ్య, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	11,000
నాగశ్రీ, చెన్నై	10,000
నల్లా నాగాంజనేయులు అండ్ ఫ్యామిలీ, హైదరాబాద్	10,000
కిల్లి ప్రసూన, విశాఖపట్నం	10,000
బొమ్మారెడ్డి నాగిరెడ్డి, హైదరాబాద్	10,000
రంపా చంద్రశేఖరరావు, గోరంట్ల, గుంటూరు జిల్లా	10,000
బి.కోటేశ్వరరావు, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	7,000
డి.తిరుపతి, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	7,000
బి.గోపాల్, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	7,000
ఆర్.నరసింహులు, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	6,000
వి.యంకయ్య, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	6,000
ఆర్.నరసయ్య, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	6,000
పి.జయప్రకాశ్‌చౌదరి, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	6,000
పి.చొక్కారావు, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	5,000
కొంక నాగేంద్రప్ప, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	5,000
భట్ట ప్రసాద్, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	5,000
చాంద్‌బాషా, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	5,000
వెంకటేశ్, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	5,000
ఎన్.చెన్నయ్య, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	5,000
బి.సుబ్బారావు, కంప్లి, బళ్లారి జిల్లా, కర్ణాటక	5,000
బి.అంజలి, బెంగళూరు	5,000

ముంచింది వరద అందిద్దాం ఆసరా

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.

- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

ప్రియుడి కోసం భర్త, పిల్లలను వదిలి..

లండన్ నుంచి హైదరాబాద్ వచ్చిన మహిళ

శంషాబాద్, న్యూస్‌టుడే: భర్తకు రూ.లక్షల్లో వేతనం, ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్న ఆమె ఓ ట్యాక్సీ డ్రైవర్ మాయమాటలకు ఆకర్షితురాలైంది. భర్తను, పిల్లలను కాదని.. లండన్ నుంచి హైదరాబాద్ వచ్చింది. భర్త ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఆర్జీఐఏ పోలీసులు ఆమెను గోవాలో అదుపులోకి తీసుకుని మంగళవారం లండన్ విమాన సర్వీస్‌లో భర్త వద్దకు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన జంటకు 17 ఏళ్ల క్రితం వివాహం కాగా.. ప్రస్తుతం లండన్‌లో నివసిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తన తల్లి హైదరాబాద్‌లో మృతి చెందగా.. అస్తికల నిమజ్జనం కోసం ఆమె ఇక్కడికి వచ్చింది. ఓ ట్యాక్సీని అద్దెకు తీసుకుని తిరిగాక.. ఛార్జీని ఆన్‌లైన్‌లో చెల్లించింది. ట్యాక్సీ డ్రైవర్ శివ ఆమె సెల్‌ఫోన్ నంబరును సేవ్ చేసుకుని చాటింగ్ మొదలుపెట్టాడు. అతడి మాయమాటలకు వివాహిత ఆకర్షితురాలైంది. సెప్టెంబరు 16న ఆమె భర్త తల్లి మృతి చెందడంతో ఆయన ఒంటరిగా హైదరాబాద్ వచ్చాడు. పిల్లలను వదిలేసి.. ఆమె కూడా సెప్టెంబరు 30న ఎవరికీ చెప్పకుండా.. ప్రియుడి జన్మదిన వేడుక కోసమని హైదరాబాద్ వచ్చేసింది. అమ్మ ఇంటికి రావడం లేదని పిల్లలు చెప్పడంతో భర్త వెంటనే భార్యకు ఫోన్ చేసినా, స్పందన లేదు. దీంతో కంగారుపడి ఆయన లండన్ వెళ్లి ఆరా తీయగా, భార్య హైదరాబాద్ వెళ్లినట్లు తేలింది. మరోసారి సెల్‌ఫోన్‌లో సంప్రదించగా ఆమె నంబరు కలిసింది. ఈ నెల 5న లండన్ రావడానికి టికెట్ తీసుకున్నానని ఓసారి, ఎయిర్‌పోర్టుకు బయలుదేరానని మరోసారి, ఓ ట్యాక్సీ డ్రైవర్ కిడ్నాప్ చేసి శంషాబాద్‌లోని ప్రైవేటు హాస్టల్‌లో ఉంచాడని ఇంకోసారి నమ్మించింది. ఆందోళనకు గురైన ఆమె భర్త స్నేహితులకు, పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా ఆమె గోవాలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వెళ్లి, ఆమెను తీసుకొచ్చి.. లండన్‌కు పంపించారు. ట్యాక్సీ డ్రైవర్ శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గురుకులాల రద్దుకు కుట్ర: ప్రవీణ్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో విజయవంతంగా నడుస్తున్న ప్రభుత్వ గురుకులాలను రద్దు చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. "గత పదేళ్లలో కేసీఆర్ ఎంతో శ్రమించి గురుకుల వ్యవస్థను తీసుకొచ్చారు. డిప్యూటీ సీఎం భట్టికి గురుకుల విద్యా వ్యవస్థపై అవగాహన లేదు. సీఎం, డిప్యూటీ సీఎం ఎప్పుడైనా గురుకులాల వద్దకు వెళ్లారా? గురుకులాల్లో ప్రతి పాఠశాలకు ఒక జీవో ఉంటుంది. ఇప్పుడున్న గురుకులాల్లో అన్ని సామాజిక వర్గాల విద్యార్థులున్నారు. మీరు తీసుకురానున్న సామాజిక న్యాయం ఏంటో ప్రజలకు చెప్పాలి. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ స్థాపిస్తామంటున్నారు. అంటే ప్రస్తుతమున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలను బంద్ చేస్తారా? ఒకేచోట 2,560 మంది విద్యార్థులు ఎలా ఉంటారు? అంతమంది విద్యార్థులకు రూ.25 కోట్లతో భవనాలు ఎలా కడతారు?" అని ప్రవీణ్‌కుమార్ నిలదీశారు.

(c) eenadu

కాంగ్రెస్ కలహాల మధ్య భాజపా మ్యాజిక్



పదేళ్లపాటు అధికారంలో ఉన్న భాజపా చేసిన తప్పిదాలే తమకు వరంగా మారతాయని, ఈసారి అధికారం పక్కా అని కాంగ్రెస్ వేసుకున్న అంచనాలు, ఎగ్జిట్ పోల్స్‌ను తలకిందులు చేస్తూ హరియాణాలో భాజపా మూడోసారి తిరుగులేని విజయం సాధించింది. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న కాషాయ దళం తప్పటడుగులు ఆ పార్టీ ప్రజాదరణను భారీగా తగ్గించినా వ్యూహాత్మకంగా వ్యవహరించి గెలుపొందింది. పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు, ఆప్‌తో పొత్తు విఫలం వంటి అంశాలతో చేతిలోకి వచ్చిన అధికారాన్ని చేజేతులా కాంగ్రెస్ పోగొట్టుకుందనే చర్చ జరుగుతోంది. నిరుద్యోగం, రైతుల సమస్యలు, అగ్నిపథ్ పథకాలపై ఆ పార్టీ చేసిన ప్రచారం మెజారిటీ ప్రజలను మెప్పించలేకపోయింది. దీనికి తోడు పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ చేసిన ప్రచారమూ సరైన ఫలితాలను ఇవ్వలేదు.

- కాంగ్రెస్ ప్రచారం ఎంతసేపూ నిరుద్యోగం, కనీస మద్దతు ధరపై రైతుల డిమాండ్, అగ్నిపథ్, పెరిగిన ధరల చుట్టూనే తిరిగింది.
- అదే సమయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాసహా భాజపా నేతలంతా కాంగ్రెస్‌పై ఎదురుదాడి చేశారు. తమ ప్రభుత్వ హయాంలో పారదర్శక విధానాలను అమలు చేసిన తీరును ప్రచారం చేసుకుంది. రాష్ట్రంలో అగ్నివీర్‌లకు పెన్షన్ గ్యారంటీ అంశాన్ని ప్రస్తావించింది. హుడ్డా హయాంలో ఉద్యోగ నియామకాల్లో చోటుచేసుకున్న అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రచారం చేసింది.
- అవినీతికి తావులేకుండా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని భాజపా హామీ ఇచ్చింది.
- 24 పంటలకు కనీస మద్దతు ధరలను అందిస్తామని ప్రకటించింది. దేశంలోని ఇలా మద్దతు ధరలను ఇచ్చే తొలి రాష్ట్రంగా హరియాణాను నిలుపుతామని హామీ ఇచ్చింది.
- లాడో లక్ష్మి యోజన కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,100 ఇస్తామని, హక్ ఘర్ గృహిణి యోజన కింద రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని హామీ ఇచ్చింది.

ఓబీసీ ఛాంపియన్‌గా భాజపా..

ఈ ఏడాది మార్చిలో మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తప్పించి ఓబీసీ నేత నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసిన భాజపా ఆ సామాజిక వర్గం ఓట్లపై దృష్టి సారించింది. ఇది సత్ఫలితాలనే ఇచ్చింది. సైనీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన భాజపా.. జాటేతర ఓట్లను సాధించడంలో విజయం సాధించింది.

- దళితుల అంశాన్ని లేవనెత్తడం ద్వారా వారి మద్దతును సాధించడంలో భాజపా సక్సెస్ అయింది. 2005లో గోహానా, 2010లో మిర్చ్‌పుర్ ఘటనల్లో కాంగ్రెస్ అనుసరించిన దళిత వ్యతిరేక విధానాలను ప్రధాని మోదీ గుర్తుచేసి వారిలో సెంటిమెంటును రేపారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత కుమ్ములాటలను భాజపా ప్రస్తావించింది. దళిత నేత కుమారి సెల్జాను కాంగ్రెస్ అవమానించిందంటూ అమిత్ షా పలు సభల్లో ప్రస్తావించి నష్టం కలగజేశారు.
- పోల్ మేనేజ్‌మెంట్‌లో భాజపా దిట్ట. ఆ దిశగానే ఆ పార్టీ పోలింగ్ వెనుక తీవ్రంగా కష్టపడింది. గుంభనంగా పని చేసుకుపోయింది. ధర్మేంద్ర ప్రధాన్ వ్యూహం సత్ఫలితాలనిచ్చింది.
- పట్టణ ప్రాంతాల్లో తనకున్న పట్టును భాజపా మరోసారి నిలబెట్టుకుంది. గురుగ్రామ్, ఫరీదాబాద్‌లలో భారీ ఫలితాలను సాధించింది. గ్రామీణ ప్రాంతాల్లో అనుకున్నంతగా కాంగ్రెస్ ఫలితాలను సాధించలేకపోవడంతో పట్టణ ప్రాంతాల ఓట్లద్వారా భాజపా అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది.

- ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోలేని విపక్షం
- ఆప్‌తో పొత్తు విఫలంతో దెబ్బ
- సీఎం పదవిపై అంతర్గత కుమ్ములాటలతో నష్టం
- వ్యూహాల అమలులో కమల దళం సక్సెస్
- జాటేతర ఓట్ల సాధనలో విజయం


లాడ్వా నియోజకవర్గంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ

మోదీ, అమిత్ షా వ్యూహం

ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల వ్యూహం హరియాణాలో మరోసారి విజయం సాధించింది. భాజపా పట్టుదల, ఓపిక, పోరాట స్ఫూర్తికి ఇదో ఉదాహరణ. అదే సమయంలో అతి విశ్వాసంతో కాంగ్రెస్ దెబ్బతింది.

- మైక్రో మేనేజ్‌మెంట్‌లో భాజపా నైపుణ్యం ఫలితాన్నిచ్చింది. ముందుగా ముఖ్యమంత్రిని మార్చడం, ఖట్టర్‌ను ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచడంద్వారా పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది.
- ఓటర్లను పోలింగ్ బూత్‌లకు చేర్చడంలో భాజపా విజయం సాధించగా.. కాంగ్రెస్ విఫలమైంది.

కాంగ్రెస్ వైఫల్యాలివే..

- పోలింగ్‌కు ముందే కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం అంతర్గత కుమ్ములాటలు చోటుచేసుకున్నాయి. గెలుస్తామని ముందే ఊహించుకుని సీనియర్లు అయిన భూపీందర్ హుడ్డా, కుమారి సెల్జా బహిరంగంగా ప్రకటనలు చేశారు. దీంతో నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సి వచ్చింది. అందరికంటే అధికంగా హుడ్డాకు టికెట్ల ఎంపికలో స్వేచ్ఛ ఇవ్వడంతో మిగిలిన నాయకులు సహకరించలేదు.
- ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రాంతీయ పార్టీలతోపాటు, స్వతంత్రులు కాంగ్రెస్ అవకాశాలను బాగా దెబ్బతీశారు. భాజపా, కాంగ్రెస్‌లకు దాదాపుగా సమానంగా ఓట్లు వచ్చినా స్వల్ప తేడాతో కమల దళం విజయాన్ని ఎగరేసుకుపోయింది. పలు సీట్లలో మెజారిటీ చాలా స్వల్పంగా ఉంది. అంటే ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రులకు వచ్చిన ఓట్ల కంటే చాలా తక్కువ మెజారిటీలే వచ్చాయి.
- ఆప్‌నకు దాదాపుగా 1.8శాతం ఓట్లు వచ్చాయి. మిగిలిన ప్రాంతీయ పార్టీలు, బీఎస్పీ కలిసి 7శాతందాకా ఓట్లను సాధించాయి. ఇవి మెజారిటీల్లో ఎంతో కీలకం. ఆప్‌తో పొత్తుదాకా వచ్చి చివర్లో విఫలం కావడం కాంగ్రెస్‌కు గట్టిగానే తగిలింది.
- కాంగ్రెస్ పార్టీ జాట్ ఓట్లపైనే దృష్టి సారించగా.. భాజపా జాటేతర ఓట్లను సాధించడంలో విజయం సాధించింది. కాంగ్రెస్ అధికారంలోని వస్తే మళ్లీ జాట్‌ల పెత్తనం పెరిగిపోతుందనే ఆందోళన మిగిలిన వర్గాల్లో తలెత్తింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

హరియాణాలో గెలిచిన, ఓడిన ప్రముఖులు

చండీగఢ్: హరియాణా శాసనసభ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు గెలుపుబాట పట్టగా మరి కొందరు అనూహ్యంగా ఓటమి పాలయ్యారు.

గెలుపొందిన ప్రముఖులు

1. నాయబ్ సింగ్ సైనీ (ముఖ్యమంత్రి)(భాజపా)
2. అనిల్ విజ్ (భాజపా)
3. దీపేందర్ సింగ్ హుడ్డా (కాంగ్రెస్)
4. ఆదిత్య సూర్జేవాలా (కాంగ్రెస్)
5. వినేశ్ ఫొగాట్ (కాంగ్రెస్)
6. సావిత్రి జిందాల్ (స్వతంత్ర అభ్యర్థి)

ఓడిన ప్రముఖులు

1. దుశ్యంత్ చౌటాలా (జేజేపీ)
2. దిగ్విజయ్ సింగ్ చౌటాలా (జేజేపీ)
3. అభయ్ సింగ్ చౌటాలా (ఐఎన్‌ఎల్‌డీ)
4. ఉదయ్ భాన్ (కాంగ్రెస్)
5. జైన్ చాంద్ గుప్తా (భాజపా)


రెజ్లర్ వినేశ్ ఫొగాట్

రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కాంగ్రెస్ తరఫు తొలిసారి ఎన్నికల బరిలో దిగి జులానా నియోజకవర్గం నుంచి భాజపా అభ్యర్థి యోగేశ్ కుమార్‌పై 6,015 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

- శాసనసభ స్పీకర్ జైన్ చాంద్ గుప్తా ఓటమి పాలయ్యారు. పంచకుల సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రమోహన్ చేతిలో 1,997 ఓట్ల స్వల్ప తేడాతో పరాజితులయ్యారు.
- భాజపా సీనియర్ నేత అనిల్ విజ్ అంబాలా కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి ఏడోసారి గెలుపొందారు. తన సమీప ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థి చిత్రా సర్వారాపై 7,277 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- హిసార్ శాసనసభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ కాంగ్రెస్ అభ్యర్థి రామ్ నివాస్ రాణాపై 18,941 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- కాంగ్రెస్ సీనియర్ నేత భూపీందర్ సింగ్ హుడ్డా (77) గర్హి సంప్లా-కిలోయ్ స్థానాన్ని 71,465 ఓట్ల భారీ మెజారిటీతో నిలబెట్టుకున్నారు. భాజపా అభ్యర్థి మంజు హుడ్డా ఓటమి పాలయ్యారు.

నయా నినాదం నచ్చని కశ్మీరీ!

- ఆర్టికల్ 370, రాష్ట్ర హోదాకే ప్రాధాన్యం
- భాజపా కలలను నెరవేర్చని కశ్మీరం
- ఇండియా కూటమిదే ఆధిపత్యం
- నేషనల్ కాన్ఫరెన్స్‌కు ప్రజల పట్టం



నయా కశ్మీరం.. శాంతియుత కశ్మీరం.. సౌభాగ్య కశ్మీరం.. ఇవేవీ కశ్మీరీలకు నచ్చలేదు. ఆర్టికల్ 370, రాష్ట్ర హోదానే వారికి ప్రాధాన్యాంశాలుగా నిలిచాయి. అందుకే భాజపా కశ్మీరీ కలలను వారు కల్లలు చేశారు. తనకు బలమున్న జమ్మూలో ఆ పార్టీ సత్ఫలితాలే సాధించినా కశ్మీర్ లోయలో ఏ మాత్రం అనుకూల ఫలితాలు రాలేదు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), కాంగ్రెస్‌ల ఇండియా కూటమి ఘన విజయం సాధించింది. 47 సీట్లున్న లోయలో భాజపా ప్రభావం స్వల్పంగానే కనిపించింది. అదే సమయంలో జమ్మూలోని 43 సీట్లలో మెరుగైన ఫలితాలను సాధించినా అధికారం అందని ద్రాక్షే అయింది.

ఫలించని భాజపా వ్యూహం

నయా కశ్మీర్‌ను సృష్టిస్తున్నామని, శాంతి భద్రతలు, అభివృద్ధిపై దృష్టి పెట్టామని, సంపద పెంచామని చెప్పిన భాజపా వాటిని ఓట్లుగా మలుచుకోలేకపోయింది. సయ్యద్ అల్తాఫ్ బుఖారీకి చెందిన అప్నీ పార్టీ, సజ్జాద్ లోన్‌కు చెందిన పీపుల్స్ కాన్ఫరెన్స్ పార్టీలతో పొత్తు పెట్టుకున్నా కమలం పార్టీకి ప్రయోజనం చేకూరలేదు.

ఆర్టికల్ 370..

ఆర్టికల్ 370ని రద్దు చేసిన మోదీ ప్రభుత్వం.. దానివల్ల నష్టం లేదని అక్కడి ప్రజలను ఒప్పించలేకపోయింది. అది తమ గౌరవానికి భంగకరమనే ప్రజలు భావించారు. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా అంశం ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపింది. 2019 ఆగస్టులో కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా కేంద్రం విభజించింది. ఆ సమయంలో విధించిన నిర్బంధం కారణంగా చాలా మంది బంధువులను, మిత్రులను కలుసుకోలేకపోయారు. కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజనపై జమ్మూలో సంబరాలు జరిగినా లోయలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో ఇండియా కూటమి రాష్ట్ర హోదా అంశాన్ని ఎజెండాగా మార్చుకుంది. చివరకు భాజపా కూడా రాష్ట్ర హోదాను ఎన్నికల అంశంగా చేపట్టాల్సి వచ్చింది.


దాల్ సరస్సులో ఇటీవల నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఒమర్ అబ్దుల్లా

- మరోవైపు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీలు (పీడీపీ).. కశ్మీరీల గౌరవం అంటూ ప్రచారం చేసి భాజపాను కశ్మీర్ వ్యతిరేకిగా ముద్ర వేయడంలో విజయం సాధించాయి.
- కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాక భారీ ఎత్తున పెట్టుబడులను పెడతామని, ఉద్యోగాలు వస్తాయని చెప్పిన భాజపా వాటిలో కొంతే విజయం సాధించింది. ఇవన్నీ భాజపా పరాజయంలో కీలక పాత్ర పోషించాయి.

అబ్దుల్లాల కంచుకోట

కశ్మీర్ లోయ మరోసారి అబ్దుల్లాల కంచుకోటగా నిలిచింది. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న ఆ కుటుంబమే మళ్లీ ఆధిపత్యం సాధించింది. మరో బలమైన కశ్మీరీ పార్టీ పీడీపీ ఈసారి పోటీ ఇవ్వలేకపోయింది.

- జమ్మూలో పెద్దగా అభ్యర్థులను పోటీకి నిలపకపోయినా లోయలో పోటీ చేసిన అత్యధిక స్థానాల్లో ఎన్‌సీ విజయం సాధించింది. జమ్మూలో కాంగ్రెస్‌కు అధిక స్థానాలను కేటాయించగా ఆ పార్టీ చతికిలపడింది.
- ప్రధానంగా ఆర్టికల్ 370, కశ్మీరీల ఆత్మ గౌరవ నినాదంతో ఎన్నికలకు వెళ్లిన ఎన్‌సీ మరోసారి సత్తా చాటింది. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా అనే డిమాండునూ ఆ పార్టీ గట్టిగా వినిపించింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఎగ్జిట్ పోల్స్... మళ్లీ ఎగిరిపాయె

దిల్లీ: ఓటర్ల నాడిని పసిగట్టేవిగా ప్రచారం చేసుకునే ఎగ్జిట్ పోల్స్ మరోమారు దెబ్బతిన్నాయి. ఇటీవలి ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికల్లో చతికిలపడ్డట్లే.. తాజాగా హరియాణా, జమ్మూకశ్మీర్ విషయంలోనూ అదే బాట పట్టాయి. 90 సీట్లున్న హరియాణాలో కాంగ్రెస్ 50కు పైగా సీట్లు గెల్చుకొని అధికారంలోకి వస్తుందని దాదాపు అన్ని ఎగ్జిట్‌పోల్స్ జోస్యం చెప్పాయి. భాజపా 30 సీట్లు దాటితే గొప్ప అన్నాయి. ఇండియా టుడే-సీ ఓటర్ సర్వే.. కాంగ్రెస్‌కు 50-58 సీట్లు, భాజపాకు 20-28 సీట్లు ఇచ్చింది. రిపబ్లిక్ భారత్-మ్యాట్రిజ్ సర్వే.. కాంగ్రెస్‌కు 55-62, భాజపాకు 18-24 సీట్లు వస్తాయని అంచనా వేసింది. తీరా ఫలితాలు చూస్తే.. భాజపా 50 మార్కుకు చేరువై వరుసగా మూడోసారి అధికారంలోకి రాబోతోంది. కాంగ్రెస్ 37 సీట్ల వద్దే ఆగిపోయింది. ఇంతకు ముందు ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ నెగ్గుతుందని చెప్పాయి. చివరకు భాజపా గెలిచింది. పార్లమెంటు ఎన్నికల్లో భాజపా 350కు పైగా సీట్లతో ఆధిక్యం సాధిస్తుందని అంచనా వేయగా.. 240 స్థానాలకు పరిమితమైన కమలం పార్టీ మెజారిటీకి అవసరమైన సీట్లను (272) కూడా సొంతంగా సాధించలేకపోయింది.

ఇజ్రాయెల్‌పై విరుచుకుపడిన హెజ్‌బొల్లా

- వరుస రాకెట్ల ప్రయోగం

బీరుట్: ఇజ్రాయెల్‌పైకి మంగళవారం రాకెట్ దాడులతో హెజ్‌బొల్లా విరుచుకుపడింది. వరుస దాడులు చేయడంద్వారా లెబనాన్ సరిహద్దు ప్రాంతాల్లోని ఇజ్రాయెల్ పౌరులను ఖాళీ చేయించాలనేది ఆ సంస్థ లక్ష్యం. అందుకనుగుణంగా వరుసగా రాకెట్లను హెజ్‌బొల్లా ప్రయోగించింది. మరోవైపు దక్షిణ లెబనాన్‌కు మరిన్ని బలగాలను పంపినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. తాము జరిపిన దాడుల్లో హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ హతమైనట్లు తెలిపింది. ఇజ్రాయెల్‌లోని హైఫా దక్షిణ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని హెజ్‌బొల్లా డజన్లకొద్దీ రాకెట్లను ప్రయోగించింది. హెజ్‌బొల్లా 170 రాకెట్లను ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. సోమవారం జరిపిన దాడుల్లో హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయ కమాండర్ సుహైల్ హుస్సేనీ హతమైనట్లు ఇజ్రాయెల్ మంగళవారం ప్రకటించింది. 'హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయం అధిపతిని ఐడీఎఫ్ హతమార్చింది.


ఉత్తర ఇజ్రాయెల్‌లో ధ్వంసమైన ఇల్లు

సజీవంగా సిన్వర్..

గత ఏడాది అక్టోబరు 7 నాటి దాడుల రూపకర్త, హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ సజీవంగా ఉన్నాడని, ఖతార్‌తో రహస్య సంబంధాలను ఏర్పర్చుకుంటున్నాడని తెలుస్తోంది.


ప్రధాని మోదీని సన్మానిస్తున్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, నడ్డా, అమిత్ షా

భాజపా అడుగుపెడితే కాంగ్రెస్‌కు 'నో ఎంట్రీ'

హరియాణా విజయంపై ప్రధాని మోదీ

దిల్లీ: దేశంలో ఏ రాష్ట్రంలోనైనా భాజపా ఒకసారి అధికారంలోకి వస్తే ప్రజలు సుదీర్ఘకాలం ఆదరిస్తారని, కాంగ్రెస్ పార్టీకి 'నో ఎంట్రీ' బోర్డులు పెడతారని ప్రధానమంత్రి నరేంద్ర తెలిపారు. మంగళవారం సాయంత్రం భాజపా ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. హరియాణాలో వరుసగా మూడోసారి భాజపాకు విజయం కట్టబెట్టిన ప్రజలు అసత్యాలు మాట్లాడేవారిని దూరం పెట్టారన్నారు. జమ్మూకశ్మీర్‌లో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించడం భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం సాధించిన విజయాలుగా పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీని ఒక్కసారి తిరస్కరించిన ప్రజలు మళ్లీ ఆదరించడం చాలా అరుదు. 13 ఏళ్ల కిందట అస్సాంలో మాత్రమే ఆ పార్టీ తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది. 60 ఏళ్లుగా కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాని రాష్ట్రాలు కూడా ఉన్నాయి. కానీ, ఆ పార్టీ మాత్రం అధికారం తన జన్మహక్కుగా భావిస్తుంది'' అని ప్రధాని ధ్వజమెత్తారు. భగవద్గీత పుట్టిన హరియాణాలో దళితులు, గిరిజనులు, రైతులు, యువతను రెచ్చగొట్టాలని కాంగ్రెస్ పలు విధాలుగా ప్రయత్నించిందని, ప్రజలు మాత్రం వారి కుయుక్తులు గ్రహించి తిరస్కరించారన్నారు. భారత్‌పై దుష్ప్రచారం చేసే అంతర్జాతీయ కుట్రలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీని పరాన్నజీవిగా మోదీ అభివర్ణించారు. ఒక్కోసారి తన భాగస్వాములను మింగేందుకు కూడా ఆ పార్టీ వెనుకాడదని విమర్శించారు.

హరియాణా ఫలితాల్ని అంగీకరించం: కాంగ్రెస్

- మా విజయాన్ని లాక్కొన్నారు

దిల్లీ: హరియాణా ఎన్నికల్లో విజయంపై గట్టి ధీమాతో ఉన్న కాంగ్రెస్ పార్టీ మంగళవారం నాటి ఫలితాలను చూసి కంగుతింది. ఈ ఫలితాలను అంగీకరించబోమని, తమ విజయాన్ని బలవంతంగా లాక్కొన్నారని ఆరోపించింది. ఈసీ పనితీరుతోపాటు ఈవీఎంలపైనా అనుమానాలు వ్యక్తం చేసింది. "ప్రజాతీర్పును మార్చేశారు. తిమ్మిని బమ్మిని చేసి గెలిచారు. అంతేకాదు.. పారదర్శక ప్రజాస్వామ్య ప్రక్రియను ఓడించారు" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. అధికారులపై డబుల్ ఇంజిన్ ఒత్తిడి తెచ్చారని.. చాలాచోట్ల మంచి మెజారిటీతో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులు 50.. 100.. 250 ఓట్ల తేడాతో ఓడిపోయారన్నారు. వాటన్నింటినీ ఈసీ దృష్టికి తీసుకువెళతామన్నారు. అంతకుముందు.. ఈసీ వెబ్‌సైట్‌లో ఎన్నికల ఫలితాల సమాచారాన్ని మందకొడిగా అప్‌డేట్ చేయడంపైనా ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ లేఖ రాసింది. హరియాణా ఫలితాలపై త్వరలోనే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేస్తారని పార్టీ హరియాణా ఇన్‌ఛార్జి మనోజ్ చౌహాన్ తెలిపారు. ఏదో జరిగిందని తమ అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు చౌహాన్ వివరించారు.



అన్నీ తప్పుడు ఆరోపణలు: ఈసీ

హరియాణా ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం తిప్పికొట్టింది. "నిబంధనలకు అనుగుణంగా... అన్ని కేంద్రాల్లో ఓట్లలెక్కింపు జరిగింది. బాధ్యతారహితంగా.. తప్పుడు ఉద్దేశాలతో ఈ నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో 25 రౌండ్ల ఫలితాలను ప్రతి 5 నిమిషాలకు ఒకసారి ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశాం" అని స్పష్టం చేసింది. ఈసీ స్పందననూ కాంగ్రెస్ తీవ్రంగా ఆక్షేపించింది.

నాయకుడు ఎలా ఉండాలంటే..!



నాయకత్వం అనేది హోదాకు సంబంధించినది కాదు. అది మీ సంకల్పం, చర్యలతో ముడిపడిన విషయం. నాయకుడు ఇతరుల మాటలను ఆలకించాలి. వారి అభివృద్ధి కోసం కృషి చేయాలి. స్వార్థంతో ఆలోచించకుండా బృంద ప్రయోజనాలకు పెద్దపీట వేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా- నాయకుడు మంచి వ్యక్తిగా ఉండాలి.

– వాలా అఫ్సర్, కాలమిస్టు

కశ్మీర్‌లో దిగ్గజనేతల పరాజయం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు సహా అనేకమంది దిగ్గజనేతలు పరాజయం పాలయ్యారు.

గెలిచిన ప్రముఖులు

1. ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ)
2. తారిఖ్ అహ్మద్ కర్రా (కాంగ్రెస్)
3. మహ్మద్ యూసుఫ్ తరిగామి (సీపీఎం)
4. శగున్ పరిహార్ (భాజపా)

ఓడిన ప్రముఖులు

■ మాజీ ఉపముఖ్యమంత్రి ముజఫర్ హుస్సేన్ బేగ్ బారాముల్లా నియోజకవర్గంలో ధరావతు కోల్పోయి తన మేనల్లుడు జావిద్ హుస్సేన్ బేగ్ చేతిలో ఓటమి పాలయ్యారు. మరో మాజీ ఉపముఖ్యమంత్రి తారా చాంద్ (కాంగ్రెస్) చంబా నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి సతీశ్ శర్మ చేతిలో ఓడిపోయారు.


■ ఓటమి చెందిన మరికొందరు నేతల్లో జేకేపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి వకార్ రసూల్, జమ్మూకశ్మీర్ భాజపా అధ్యక్షుడు రవీందర్ రైనా, జేకేపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి రమణ్ భల్లా తదితరులున్నారు. పీడీపీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ, హురియత్ నేత కుమారుడు అగా సయద్ ముంతాజిర్ మెహదీ కూడా ఓటమి పాలయ్యారు.

ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో 50 మంది సీనియర్ వైద్యుల రాజీనామా

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ఆసుపత్రి జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు సీనియర్ వైద్యులు మద్దతు ప్రకటించారు. మంగళవారం ఉదయం 15 మంది సీనియర్ వైద్యులు జూనియర్ డాక్టర్ల (జూడాల) నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించగా.. అనంతరం ఆర్‌జీ కర్ ఆసుపత్రిలోని 50 మంది సీనియర్ వైద్యులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఉదయం జరిగిన హెచ్‌వోడీల సమావేశంలో తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీనియర్ వైద్యుడు ఒకరు తెలిపారు. జూడాల డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత జాప్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సీనియర్ వైద్యులకు పిలుపునివ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా జూడాల నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం నాలుగో రోజుకు చేరింది. వీరి ఆందోళనకు పశ్చిమబెంగాల్ వైద్యుల ఉమ్మడి వేదిక మద్దతు ప్రకటించింది.


ఆర్‌జీ కర్ వైద్య కళాశాల వద్ద వైద్యుల ఆందోళన

ఏఐ రూపశిల్పులకు నోబెల్



స్టాక్‌హోమ్: కృత్రిమ మేధ (ఏఐ)కు బాటలుపరిచిన దిగ్గజ శాస్త్రవేత్తలు జాన్ జె.హాప్‌ఫీల్డ్, జెఫ్రీ ఈ.హింటన్‌లను ఈ ఏడాది భౌతికశాస్త్ర నోబెల్ పురస్కారం వరించింది. మన జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తున్న మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్)కు వీరు పునాదులు వేశారని అవార్డు ఎంపిక కమిటీ 'రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' కొనియాడింది. ఈ రంగంలో అత్యంత కీలకమైన కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌ను వీరు అభివృద్ధి చేశారని తెలిపింది. హింటన్‌ను ఏఐ పితామహుడిగా అభివర్ణిస్తారు. ఆయనకు కెనడా, బ్రిటన్ పౌరసత్వం ఉంది. హాప్‌ఫీల్డ్ అమెరికా జాతీయుడు. ఆయన ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. వీరిద్దరు స్టాటిస్టికల్ ఫిజిక్స్‌కు సంబంధించిన మౌలిక సూత్రాలను ఉపయోగించుకొని కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్స్‌ను రూపొందించారని నోబెల్ కమిటీ సభ్యురాలు ఎలెన్ మూన్స్ పేర్కొన్నారు. ఇవి అసోసియేటివ్ మెమరీగా పనిచేస్తూ భారీ డేటాను విశ్లేషిస్తాయని చెప్పారు. వాటిలో నిర్దిష్ట పోకడలను గుర్తిస్తాయని తెలిపారు. తద్వారా సంబంధిత అంశంపై తర్ఫీదు పొందుతాయని చెప్పారు. భౌతికశాస్త్రంలో పరిశోధనలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి న్యూరల్ నెట్‌వర్క్‌లు ఉపయోగపడుతున్నాయని మూన్స్ చెప్పారు. "అవి మన జీవితంలో భాగమయ్యాయి. ఫేషియల్ రికగ్నిషన్, భాషానువాదం వంటివాటికి ఉపయోగపడుతున్నాయి" అని ఆమె తెలిపారు. ఏఐతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. దీని వ్యాప్తితో భవితపై ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ కొత్త సాంకేతికతను సురక్షితంగా, నైతికంగా ఆమోదయోగ్యమైన పద్ధతుల్లో వాడేందుకు మానవాళి మొత్తం బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలతో హింటన్ కూడా ఏకీభవించారు. ఏఐతో పొంచి ఉన్న ప్రమాదాల గురించి మరింత స్వేచ్ఛగా మాట్లాడటం కోసం గూగుల్ సంస్థకు ఆయన గతంలో రాజీనామా చేశారు. నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యానన్న వార్త విని విస్మయానికి లోనయ్యానని ఆయన మంగళవారం తెలిపారు. తనకు ఈ అవార్డు వస్తుందని కలలో కూడా అనుకోలేదన్నారు. మానవ నాగరికతపై ఏఐ పెను ప్రభావాన్ని చూపుతుందని చెప్పారు. ఉత్పాదకత, ఆరోగ్య పరిరక్షణలో విప్లవాత్మక మార్పులు తెస్తుందన్నారు. "అది భౌతికశక్తి విషయంలో కాకుండా మేధో సామర్థ్య పరంగా మానవులను మించిపోతుంది. అనేక అంశాల్లో అద్భుత ఫలితాలను ఇస్తుంది. అయితే దానివల్ల ఉత్పన్నమయ్యే విపరిణామాల గురించి కూడా ఆందోళన చెందాలి" అని ఆయన పేర్కొన్నారు. నోబెల్ పురస్కారం కింద 10 లక్షల డాలర్లు అందుతాయి. దీన్ని హింటన్, హాప్‌ఫీల్డ్‌లకు పంచుతారు.

హంసఫర్ పాలసీని ఆవిష్కరించిన నితిన్ గడ్కరీ

దిల్లీ: జాతీయ రహదారుల వెంట మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. హైవేలపై ప్రయాణించే వారికి పరిశుభ్రమైన మరుగుదొడ్లు, బేబీ కేర్ రూమ్స్ వంటి సౌకర్యాలు లభించనున్నాయి. దీనికోసం ఉద్దేశించిన హంసఫర్ పాలసీని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ పాలసీ ప్రకారం పెట్రోల్ పంపుల వద్ద టాయిలెట్లతో పాటు వీల్‌ఛైర్లు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు, పార్కింగ్, డార్మిటరీ, ఫుడ్ కోర్టు, ఏటీఎం, వాహనాల మరమ్మతుల దుకాణం, ఔషధాల దుకాణం వంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయంటూ జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

శక్తిరూపం

శారదా దేవి!



సరస్వతీ దేవి జన్మ నక్షత్రం మూల. నవరాత్రి ఉత్సవాల్లో మూలా నక్షత్రం వచ్చినరోజు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరిస్తారు. త్రిశక్తి రూపాల్లో మూడో రూపం సరస్వతీ దేవి. శ్వేతపద్మాన్ని ఆసనంగా అధిష్ఠించి... వీణ, పుస్తకం, అక్షమాల ధరించి, అభయముద్రతో ఆరాధించినవారి అజ్ఞానాన్ని దూరం చేస్తుంది. విద్య, వాక్కు, సంగీతం, నృత్యం వంటి కళలు అమ్మవారి అనుగ్రహంతోనే కలుగుతాయని చెబుతారు. హంస వాహనంగా... తెల్లని వస్త్రాలతో ప్రశాంతతకు చిహ్నంగా ఉండే ఈ శారదాదేవి విద్యా బుద్ధుల్నీ మానసికోల్లాసాన్నీ అందిస్తుంది. కానీ అలాంటి తల్లీ లోకరక్షణ కోసం రాక్షస సంహారం చేసిందని తెలుసా? పూర్వం శంభనిశంభులనే రాక్షసులుండేవారు. ఆడవాళ్లు అబలలు కాబట్టి, వాళ్లకి తమని చంపే శక్తి లేదని భావించి... వాళ్లు తప్ప మరెవరి చేతిలోనూ చావు ఉండొద్దని బ్రహ్మనుంచి ఆ రాక్షసులు వరం పొందారు. దేవలోకంపై దండెత్తి కల్పవృక్షం, కామధేనువు, ఐరావతం వంటివన్నీ తీసుకెళ్లారు. దేవతలకు హవిస్సు అందకుండా యాగాలనూ భగ్నం చేస్తోంటే వారంతా మాయాదేవిని ఆశ్రయిస్తారు. ఆమె సరస్వతీ దేవిని పంపుతుంది. అమ్మవారి అందం గురించి విన్న శంభనిశంభులు తమలో ఒకరిని వివాహమాడాలనే కబురుతో తమ సైన్యాధ్యక్షులను పంపుతారు. అందుకు నిరాకరించిన సరస్వతీదేవిని బలవంతంగా తీసుకురాబోతే అప్పటివరకూ ప్రశాంతంగా తెల్లనివస్త్రాల్లో ఉన్న అమ్మవారు ఎర్రని దుస్తుల్లో రుద్రరూపం దాలుస్తుంది. హంస సింహంలా మారి వారిని తినేస్తుంది. విషయం తెలిసి వచ్చిన శంభనిశంభులతోనూ అమ్మవారు యుద్ధం చేసి, సంహరిస్తుంది. ఆపై దేవతల విన్నపం కొద్దీ తిరిగి తన సాత్విక రూపంలోకి వస్తుంది. బలవంతుడిని సృజించిన స్త్రీని బలహీనురాలిగా భావించడమే ఇక్కడ శంభనిశంభుల విషయంలో 'అవిద్య'గా చెబుతారు. తామే బలవంతులం అని గర్వించేవారిని శారద అనుగ్రహించదు. వినయం, ఓపిక, నేర్చుకోవాలన్న జిజ్ఞాస, ఒదిగుండే తత్త్వం ఉండేవారిని అనుగ్రహించి జ్ఞానాన్ని ప్రసాదించడమే అమ్మ తత్త్వం.

సెలవుల్లోనూ పుస్తకాలతో దోస్తీ చేసే ఆమెను.. పుస్తకాల పురుగు అనేవారు చిన్నప్పుడు. లక్షణంగా చదువుకున్న లక్ష్మి.. పెద్దయ్యాక చదువుల దేవత సరస్వతికి ప్రతిరూపంగా మారారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)కి ప్రస్తుతం వైస్‌ఛాన్స్‌లర్‌గా ఉన్నారు ప్రొఫెసర్ హరిబండి లక్ష్మి. నేటి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే ఆ ప్రయాణం ఆమె మాటల్లోనే...

ఈ లక్ష్మి... సరస్వతీ పుత్రిక!



మాది కృష్ణా జిల్లా నందిగామ దగ్గర్లోని శనగపాడు. రైతు కుటుంబం. 1950ల్లో నాన్న ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తిచేశారు. ఉద్యోగం చేస్తానంటే 'పెద్ద కొడుకుగా.. కుటుంబ బాధ్యత తీసుకోవాలి' అన్నారట తాతయ్య. బాబాయిల్లో ఒకరు డాక్టర్, మరొకరు ఇంజినీర్ అయ్యారు. ఉద్యోగం చేయలేదనే అసంతృప్తి నాన్నకు ఉండేది. పిల్లల్ని అయినా బాగా చదివించాలనుకున్నారు. ఆరో తరగతికి నందిగామలో చేరాను. కాలువగట్లు, పంటపొలాల మీదుగా ఊరి నుంచి నందిగామకు రానూపోనూ పది మైళ్లు. మధ్యలో ఒక కాలువ. వర్షాకాలంలో దాన్ని దాటేటప్పుడు కొన్నిసార్లు బట్టలు తడిచిపోయేవి. నాన్న మరో జత పట్టుకొని నాతోపాటు వచ్చేవారు. చెట్టుచాటున మార్చుకుని స్కూల్‌కి వెళ్లేదాన్ని. ఒక్కరోజైనా బడి మానేదాన్ని కాదు. సెలవుల్లోనూ చదువుతుంటే 'పుస్తకాల పురుగు' అనేవారు.

పెళ్లి తర్వాతా చదువు ఆపలేదు..

ఇంటర్ వరకూ నందిగామలోనే చదువుకున్నా. నన్ను డాక్టర్‌గా చూడాలని నాన్న కోరిక. మొదటి ప్రయత్నంలో మెడిసిన్‌లో సీటు రాకపోయేసరికి బీఎస్సీలో చేరాను. డిగ్రీ ఫస్టియర్‌లో పెళ్లి అయ్యింది. మావారు వి.వెంకయ్యది మాపక్క ఊరు చందాపురం. ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.కామ్. గోల్డ్ మెడలిస్ట్. ఉస్మానియాలో లెక్చరర్‌గా చేస్తూ పీహెచ్‌డీ చేసేవారు. చదువుకు ఆటంకం ఉండదని చెప్పి పెళ్లికి ఒప్పించారు. సెకండ్ ఇయర్‌కి హైదరాబాద్‌లోని రెడ్డీ విమెన్స్ కాలేజీకి మారాను. ఊరి బడిలో మా హెచ్.ఎం.తోపాటు వాళ్ల భార్య కూడా వచ్చి ఇంగ్లిష్ నేర్పేవారు. అలా చిన్నప్పుడే ఇంగ్లిష్‌లో మంచి పునాది పడింది. తర్వాతా ఇష్టంగా చదివేదాన్ని. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎం.ఏ. ఇంగ్లిష్ చేశాను. 1984లో హైదరాబాద్‌లోని ఇఫ్లూ(అప్పుడు సీఫెల్) నుంచి పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ ఇంగ్లిష్, ఎం.లిట్, ఆపై ట్రాన్స్‌లేషన్ స్టడీస్‌లో పీహెచ్‌డీ చేశా. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ వచ్చింది కూడా. అనువాద ప్రక్రియలో సమస్యల్ని తెలుసుకోవడానికి విపుల మాస పత్రిక కోసం కొన్ని కథల్ని ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదించాను. పీహెచ్‌డీ తర్వాత లింగ్విస్టిక్స్‌లో పీజీ చేశా. పెళ్లయ్యాకా 15ఏళ్లు విద్యార్థిగానే ఉన్నా. గ్రామీణ నేపథ్యమే పట్టుదలతో కష్టపడి చదివేలా చేసింది. 1995లో ఇఫ్లూలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాను. ఓవైపు పాఠాలు చెబుతూనే.. మరోవైపు అనేక కథల్ని తెలుగు నుంచి ఇంగ్లిష్‌లోకి ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదించా. తెలుగులో కొన్ని కథలూ రాశా. ఈనాడు 'చదువు' పేజీలో అయిదేళ్ల కాలమ్ నిర్వహించా. క్యాంపస్‌కి వచ్చి, తిరిగి వెళ్లేంతవరకూ నా దృష్టి పనిమీదే ఉంటుంది. మా డిపార్ట్‌మెంట్‌కు అత్యధిక కాలం హెచ్‌ఓడీగా ఉన్నా. 2020లో సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందా. తర్వాత వీసీగా అరుదైన గౌరవం దక్కింది. సెప్టెంబరులో బాధ్యతలు తీసుకున్నా. మేలో రిటైర్మెంట్. ఇఫ్లూలో ప్రతి ఒక్కరూ, ప్రతి అంగుళం తెలుసు. యూనివర్సిటీ ఉన్నతికి సమష్టిగా కృషిచేస్తున్నాం.

తాతయ్య మార్గనిర్దేశం..

నా వ్యక్తిత్వ నిర్మాణంలో, జీవన యానంలో తాతయ్య వీరభద్రయ్య, నాన్న శేషగిరిరావు, అమ్మ వెంకట్రావమ్మ పాత్ర ఉంది. తాతయ్య గ్రామ పెద్ద. కష్టమైన పంచాయితీలూ తీర్చేవారు. మాకూ ఎన్నో మంచి మాటలు చెప్పేవారు. వాటిని పాటించడంవల్లనే మేం(అన్నయ్య, తమ్ముడు- ప్రభుత్వ ఉద్యోగులే) ఈ స్థాయికి చేరుకోగలిగాం. నాన్న అకాల మరణంతో అమ్మ నాతోపాటే ఉండేది. నా కెరియర్‌కి ఆటంకం లేకుండా పిల్లల బాగోగులు చూసుకునేది. మావారు కృష్ణా యూనివర్సిటీకి వీసీగా చేశారు. నా ఎదుగుదలలో ఆయన ప్రోత్సాహమూ ఉంది. అమ్మాయి శశిప్రియ, అబ్బాయి సందీప్‌తేజ్ అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇఫ్లూకి దేశవిదేశాలకు చెందిన విద్యార్థులు వస్తారు. వాళ్లకు పాఠాలు చెప్పడమే కాదు, వాళ్ల నుంచీ ఎన్నో నేర్చుకుంటాం. వారితో ఉండటంతో మేమూ ఇప్పటికీ యవ్వనంలో ఉన్నట్టే అనిపిస్తుంది!

పూల జాతర



బంతిపూల బతుకమ్మ!

'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయప్పునే గౌరమ్మ' అంటూ తెలంగాణ ఆడబిడ్డలు ఆడి, పాడే వేడుక బతుకమ్మ. ఇలా తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ పండగలో వాడే ఒక్కో పువ్వుకి ఒక్కో ప్రత్యేకత. వీటిల్లో బంతి పూలది అగ్రస్థానం. సుగంధాలు వెదజల్లుతూ, కంటికింపైన పసుపు, నారింజ రంగుల్లో ముచ్చటగా విరబూసే వీటి అందం గురించి ఎంత చెప్పినా తరగనిదే! అందుకేనేమో, అలంకరణల్లో వీటిదే పైచేయి. ఆయుర్వేద వైద్యం కూడా... బంతి పూలలో బోలెడన్ని ఔషధ గుణాలు ఉన్నాయంటోంది. ముఖ్యంగా ఈ పూలతో చేసిన టీ తాగితే శరీరంలో వేడి తగ్గుతుందట. కిడ్నీలో రాళ్లను కరిగించే లక్షణాలూ బంతికి ఉన్నాయట. అంతే కాదు, ఈ పూలతో చేసిన తైలాన్ని అధిక రక్తస్రావాన్ని తగ్గించడానికీ, జుట్టు పెరగడానికీ వాడతారు. బంతి రేకల నుంచి సారం తీసి, ఫేస్‌క్రీములు, సీరమ్‌లు... వంటి సౌందర్య ఉత్పత్తుల్లోనూ వినియోగిస్తున్నారు.

బంగారం వెండి



8న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	77790	78000	75,560	75,750
ఆర్నమెంట్	71,800	71,800	71,000	71,000
వెండి (కిలో)	92,443	94,097	93,100	95,000
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	78,000	78,050	78,000	78,140
ఆర్నమెంట్	72,230	72,270	71,670	71,850
వెండి (కిలో)	92,100	92,700	92,000	93,200
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	77,180	77,180	------	------
ఆర్నమెంట్	71,000	71,000	7,100	7,100 గ్రా
వెండి (కిలో)	94,000	94,000	102.00	103.00గ్రా

అలా ఎప్పుడూ లేదు!

డియర్... వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

నేను ఓ కార్పొరేట్ సంస్థలో పనిచేస్తున్నాను. ప్రస్తుతం కంపెనీలో మా పనితీరుపై సమీక్ష జరుగుతోంది. నా పనికి తగ్గ ఫీడ్‌బ్యాక్ మా సూపర్‌వైజర్ నుంచి రాలేదు. నా పదమూడేళ్ల కెరియర్‌లో ఎప్పుడూ ఇలా జరగలేదు. నా సహోద్యోగులు చెప్పిన మాటల ఆధారంగా ఆయన ఫీడ్‌బ్యాక్ ఇలా ఇచ్చానని చెప్పారు. దీని గురించి ఆయన్ను అడుగుదామనుకుంటున్నా. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. - ఓ సోదరి

మీ పనితీరు బాగుంది అని చెబుతూనే, ఇప్పుడేమో తక్కువ రేటింగ్ ఇవ్వడం బాధాకరం. దీని గురించి పైవాళ్లతో మాట్లాడాల్సిన అవసరం ఉంది. ముందు మీరు చర్చించాలనుకున్న విషయాలను నోట్ చేసి పెట్టుకోండి. ఒక్కోదాని గురించి నెమ్మదిగా, వివరంగా చర్చించండి. మీ బలాలేంటో, బాగా పనిచేసిన అంశాలేంటో చెప్పండి. వీలుంటే వాటికి సంబంధించిన జాబితాను సిద్ధం చేయండి. వర్క్ చేసినప్పుడు ఏమైనా మార్పులు చెప్పారా? లేదా బాగుందని అన్నారా? లాంటివన్నీ తయారుచేయండి. దీనివల్ల మీ ఆలోచనలు ఏంటో వారికీ అర్థమవుతాయి. దాని తరవాత మీ సహోద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఫీడ్‌బ్యాక్ ఇచ్చిన అంశాన్నీ అడగండి. వాళ్ల గురించి మిమ్మల్ని అడగనప్పుడు, మీ గురించి వాళ్లను అడగాల్సిన అవసరాన్నీ ప్రశ్నించండి. మీరు అడగాల్సిన ప్రశ్నలు సూటిగా అడిగి, 'నా పనితీరు అంచనాలకు తగ్గట్టు లేదని చెప్పడానికి ఎక్కడా కారణాలు కనిపించలేదు. అయినప్పటికీ, ఒకవేళ నేను మెరుగు పరుచుకోవాల్సిన అంశాలు ఏమైనా ఉంటే చెప్ప'మని అడగండి. చివరగా చర్చ ఎలా జరిగినా సరే కృతజ్ఞతలు చెప్పండి. పనిచేయడానికి మీరు ఎప్పుడూ సిద్ధమని తెలియజేయండి. ఒకవేళ మీకు అనుకూలంగా చర్చ సాగకున్నా, సానుకూలంగా స్పందించండి. తద్వారా మీ హుందాతనం నిలబడుతుంది.

ఎండ లేదా అయినా పెంచేద్దాం!

అపార్ట్‌మెంట్లలో జీవనం, ఎండ తగలని బాల్కనీలు... దీంతో మొక్కల్ని పెంచుదామన్న ఆసక్తే పోతోంది అంటారు చాలామంది. కానీ, ఇంటిలోపల కృత్రిమ వెలుగుల్లోనూ హాయిగా బతికేసే కొన్ని మొక్కలున్నాయి. వాటిల్లో ఇవి కొన్ని...



క్యాస్ట్ ఐరన్ ప్లాంట్ : పరోక్ష కాంతిని ఇష్టపడే ఈ మొక్క తక్కువ లైటింగ్ ఉన్న గదుల్లోనూ సులువుగా పెరుగుతుంది. అయితే, మట్టి ఎండిపోకుండా నీరు మాత్రం పోయాలి. పచ్చని ఆకులతో పాటు తెలుపు, క్రీమ్ రంగుల్లో వేరిగేటెడ్ రకాలెన్నో ఉన్నాయి. వీటిని మీ ఇంటి అలంకరణకు తగ్గట్లు ఎంచుకోవచ్చు. కాండమే ఆకులా పెరుగుతుందా అనిపించేలా ఉంటుందిది.



ఫిలడెండ్రాన్: ప్రపంచవ్యాప్తంగా అన్నిచోట్లా ఇది ఇంటి మొక్కే. కాంతి తక్కువగా ఉండే మూలల్లో పెంచినా కూడా చక్కగా, వేగంగా పెరుగుతుంది. దీన్ని వేలాడే తొట్టెల్లోనూ పెంచుకోవచ్చు. లేదా గోడకూ, గ్రిల్స్‌కూ పాకించవచ్చు. అయితే కాస్త మట్టి మరీ పొడిబారిందనుకున్నప్పుడు తడిపితే సరిపోతుంది. ఇవి ఎన్నో రంగుల్లోనూ కనువిందు చేస్తాయి.



జెడ్‌జెడ్‌ప్లాంట్: ఎండపొడ తగలని ఇంటి మూలలు కాంతివిహీనంగా ఉన్నప్పుడు చక్కని ఎంపిక జెడ్‌జెడ్‌ప్లాంట్. ఆఫ్రికాలో పుట్టిన ఈ మొక్క ఫ్లోరెసెంట్ దీపాల కాంతిని గ్రహిస్తుంది. అలానే ఇది పొడివాతావరణాన్ని తగ్గిస్తుంది. నీటిని అందించాల్సిన అవసరం తక్కువ. కాబట్టి, తరచూ ప్రయాణాల్లో ఉండేవారికి ఇది అనుకూలం. ఈ మొక్క మెరుపుతో, ముదురు ఆకుపచ్చ ఆకులతో చూడచక్కగా ఉంటుంది.



ఆంథూరియం: హృదయాకారంలో విచ్చుకునే పూల మొక్క ఆంథూరియం. ఎరుపు, గులాబీ, తెలుపు రంగుల్లో విరిసే పూలు గదుల అందాన్ని రెట్టింపు చేస్తాయి. విరిసిన పూలూ, ఆకులూ ఆరునెలల పాటు తాజాగా ఉండటమే ఈ మొక్క ప్రత్యేకత. దీనికి గాలిని శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. ముఖ్యంగా వాతావరణంలోని ఫార్మాల్డిహైడ్, అమోనియా, జిలీన్ వంటి టాక్సిన్లను సమర్థంగా తొలగించే శక్తి ఆంథూరియంకి ఉంది. ఈ మొక్క చక్కగా ఎదగాలంటే ప్రకాశవంతమైన పరోక్ష కాంతి ఉన్నా చాలు. అయితే, గాల్లో అధికతేమ ఉండేలా చూసుకోవాలి.



ఓడి... గెలిచింది!

'...ఓడిపోయాను... ఇక పోరాడే బలం నాకు లేదు'... జీవితంలో గెలుపోటములు ఎంత సహజం? కానీ వినేశ్ ఫొగాట్ ఈ మాట అన్నప్పుడు చాలామంది బాధపడినవారే. కంటనీరు పెట్టినవారికీ కొదవలేదు. ఒక్క ఓటమికే ఆ మాట అనేయలేదామె. ఓటములూ తనకు కొత్తేమీ కాదు. ప్రపంచ ఛాంపియన్‌షిప్స్, ఆసియా, కామన్‌వెల్త్ క్రీడల్లో ఎన్నో పతకాలు సాధించింది వినేశ్. ఒలింపిక్ కల నెరవేర్చుకోవడానికే చాలా కష్టపడింది.

2016 రియో ఒలింపిక్స్ క్వార్టర్స్‌లో మోకాలి గాయం... కళ్ల నిండా నీటితో వెనుదిరిగింది. ఆపై టోక్యోలోనూ ఇదే పరిస్థితి. ఈసారి గెలిచి తీరాలని కసిగా ప్రయత్నించింది. హరియాణాలోని బలాలి అనే చిన్న పల్లెటూరి అమ్మాయి వినేశ్. ఆమె విమానంలో ఎగిరెళుతోంటే కింద బస్సు నడుపుతూ గర్వపడాలనుకున్నాడామె డ్రైవర్ నాన్న. ఆయన చెబుతోంటే వినేశ్ నవ్వి ఊరుకుంటే... తన మాటను కూతురు సరదాగా తీసుకుంది అనుకున్నాడా తండ్రి. కానీ ఆ చిన్ని మనసులో నాన్న కల నెరవేర్చాలన్న బలమైన లక్ష్యం ఏర్పడింది. తనా ప్రయత్నంలో ఉంటే అది చూడకుండానే కన్ను మూశాడు. నాన్నే లేనప్పుడు ఇక కలేది? అందుకే పక్కన పెట్టింది. తగ్గట్టే వాళ్లమ్మకి క్యాన్సర్. ఆమె దాంతో పోరాడుతూ... బతకాలంటే పోరాడాలన్న పాఠాన్ని కూతురికి నేర్పింది.



అమ్మ నేర్పిన పాఠంతో పోటీల్లో పతకం కోసం పోరాడింది. అక్కడ పతకాలొచ్చాయి. కానీ భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడి వేధింపులకు వ్యతిరేకంగా చేసిన పోరాటం మాత్రం విఫలమైంది. గెలిచిన వారి మాటే నెగ్గుతుంది అనుకుందేమో! ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో 53 నుంచి 50 కేజీలకు తగ్గిమరీ పోటీపడింది. ప్రతి దశలోనూ గెలిచింది. తుది పోరు... గెలిస్తే స్వర్ణం ఓడితే రజతం. ఏదైనా చరిత్రే! కానీ బరువు పెరిగింది. తగ్గడానికి రాత్రంతా కసరత్తులు... ఆవిరి స్నానాలు... జుట్టు కత్తిరించుకోవడం... ఎన్నెన్ని చేసింది. చావు అంచులవరకూ వెళ్లింది. అయినా కేవలం 100గ్రా. అధిక బరువుతో పోటీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఎంత గొప్ప పోరాటం... అయినా ఓటమి తప్పలేదని తట్టుకోలేక 'ఓడిపోయా'నంది. కానీ ఆ పోరాటాన్ని యావత్ భారతం కొనియాడింది.

పడిన ప్రతిసారీ కెరటంలా పైకి లేచింది వినేశ్. ఇంకొక్కసారి అని ప్రయత్నించింది. అయితే ఈసారి రింగ్... ఎన్నికల బరి. సమాజానికి మేలు చేయాలి. ఎవరూ దోపిడీకీ శ్రమ దుర్వినియోగానికీ గురి కాకుండా చూడాలనుకుంది. వేధింపులకు గురయ్యే ఎంతోమంది క్రీడాకారిణులకు గొంతుక అవ్వాలనుకుని హరియాణాలోని జులానా నియోజకవర్గం నుంచి పోటీ చేసింది. ఆమె గురించి తెలిసిన ప్రజలు ఒలింపిక్స్‌లో నిష్క్రమించి వచ్చినప్పుడు వెన్నుతట్టినట్టే ఇక్కడా గెలిపించారు. జీవితంలో 'ఇక నా వల్ల కాదు' అనిపించే సందర్భాలు ఎన్నో! 'చేయలేవు... వదిలెయ్' అన్న సలహాలూ చాలానే! కానీ ఒక్కసారి వినేశ్ పోరాటం చూస్తే మాత్రం 'ఇంకొక్కసారి ప్రయత్నిస్తే..' అన్న ఆలోచన కలగడం ఖాయమే కదూ!

సూట్‌కేస్‌లోనూ స్టవ్!

కొన్ని వస్తువులు చిన్నగా ఉన్నప్పటికీ అవి అందించే ప్రయోజనాలు మాత్రం బోలెడు ఉంటాయి. అలాంటి కొన్ని వంట పరికరాలు ఇవే...

స్మార్ట్ కిచెన్

అనువుగా ఉండి...





కొంతమంది రెండు, మూడు బర్నర్‌లు ఉన్న స్టవ్‌లు వాడుతుంటారు. అయితే, మరికొందరికి అలాంటివి అవసరం లేకపోవచ్చు. అటువంటప్పుడు ఈ 'పోర్టబుల్ గ్యాస్ స్టవ్' ఉపయోగపడుతుంది. దీనికి మన వద్ద ఉండే సిలిండర్‌ను తగిలించి వాడుకోవచ్చు లేదా దానికే ఓ చిన్న సిలిండర్ ఇన్‌బిల్ట్‌గా వస్తుంది. పోర్టబుల్ కాబట్టి, విహారయాత్రలు, క్యాంపింగ్ లాంటి వాటికి వెళ్లినప్పుడు దీన్ని మనతో తీసుకెళ్లొచ్చు. బయటి ఆహారం అవసరం లేకుండా మనమే వండుకోవచ్చు. పోర్సెలీన్ కోటింగ్ వేసింది కనుక, దీన్ని శుభ్రపరచుకోవడమూ తేలికే. ఈ సెట్ అంతా ఓ సూట్‌కేస్ లాంటి దాన్లో వస్తుంది. ఈజీగా పట్టుకుని తీసుకెళ్లొచ్చు కూడా.

కూరగాయలకీ ఓ క్లీనర్...




పండ్లు, కూరగాయలు, ధాన్యాలు... వీటిని కడగడానికీ ఓ వస్తువు వచ్చేసింది. అదే 'వాషింగ్ క్లీనర్. ఇది అయాన్ ప్యూరిఫికేషన్ టెక్నాలజీతో పనిచేస్తుంది. నీటిని ఎలక్ట్రోలైటిక్ మెటీరియల్‌తో విడగొడుతుంది. దానివల్ల రసాయన పదార్థాలు ఏమైనా ఉంటే అవి తొలగిపోతాయి. ఓ గిన్నెలో నీళ్లు ఉంచి అందులో కూరగాయలు లేదా పండ్లను వేసి ఈ క్లీనర్‌కు ఉన్న బటన్ ఆన్ చేస్తే చాలు. రెండు నిమిషాల్లోనే... అందులో పోషకాలు పోకుండా శుభ్రపరుస్తుంది. పరికరం నుంచి వచ్చే నీలిరంగు ఆగిపోయాక బయటకు తీసేయొచ్చు. జేబులో కూడా సరిపోయేంత పరిమాణంలో ఉంటుంది ఇది. కాబట్టి దీన్ని మనతో పాటు పిక్నిక్ లాంటి వాటికీ తీసుకెళ్లొచ్చు.



ఒకేసారి ఉడికించుకునేలా...



బంగాళదుంపలు, బఠాణీలు, పాస్తా, నూడుల్స్ లాంటివి ఒకేసారి ఉడికించుకోవాలంటే కుదరదు. ఒక్కోదాన్ని విడివిడిగా ఉడికించుకోవాల్సి వస్తుంది. అలాకాకుండా ఒకేసారి రెండు, మూడు రకాల కూరగాయలు, గింజలను ఉడికించుకోవాలంటే... ఈ 'వెజిటబుల్ పాట్ సెట్'ను తీసుకురండి. దీన్లో చిల్లులు ఉన్న రెండు మూడు చిన్న చిన్న సిలికాన్ బాస్కెట్‌లు వస్తాయి. వాటిలో కూరగాయల్లాంటివి పెట్టి, వీటన్నింటినీ ఓ స్టీల్ గిన్నెలో ఉంచి ఉడికించుకుంటే సరి.



ప్రపంచంలో
అత్యంత రుచికరమైన
మల్టి-విటమిన్
క్యాప్సూల్



గ్రుడ్లు.
బహుశ
ఈ భూ భాగంపై
ప్రపంచ ఆరోగ్య
సంస్థచే
100 పాయింట్ రేటింగ్
పొందిన
ఏకైక ఆహారం

NECC
నేషనల్
ఎగ్ కో-ఆర్డినేషన్
కమిటీ
(Non-Govt. Public Charitable Trust)

ఈ రోజు గ్రుడ్లును తిన్నారా?

(c) eenadu

ఛాంపియన్

మహిళల టీ20 ప్రపంచకప్

మహిళల టీ20 ప్రపంచకప్ ఆరంభ పోరులో న్యూజిలాండ్ ఇచ్చిన షాక్ తర్వాత.. భారత జట్టు బాగానే కోలుకుని పాకిస్థాన్‌ను ఓడించింది. అయితే టోర్నీలో ఖాతా తెరవడం సంతోషమే అయినా.. తొలి మ్యాచ్‌లో బాగా దెబ్బ తిన్న నెట్ రన్‌రేట్‌ను పెద్దగా మెరుగు పరుచుకోలేకపోయింది హర్మన్‌ప్రీత్ సేన. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీలంకతో పోరులో కేవలం గెలిస్తే సరిపోదు. చివరి మ్యాచ్‌లో తలపడాల్సింది ఆస్ట్రేలియాతో కాబట్టి.. ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో విజయం సాధించి నెట్ రన్‌రేట్‌ను మెరుగుపరుచుకోకుంటే సెమీస్ చేరడం కష్టమవుతుంది.

గెలవాలి ఘనంగా..

నేడు శ్రీలంకతో భారత్ పోరు

రాత్రి 7.30 నుంచి

దుబాయ్

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. బుధవారం శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. సెమీస్ చేరాలంటే భారత్ ఈ మ్యాచ్‌తో పాటు తన చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై గెలవాలి. డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌ను ఓడించినా సెమీస్ అవకాశాలు రన్‌రేట్‌పై ఆధారపడే అవకాశముంది. ఈ నేపథ్యంలో శ్రీలంకను భారీ తేడాతో ఓడించి రన్‌రేట్‌ను మెరుగుపరుచుకోవడం భారత్‌కు అత్యావశ్యకం. ఘనంగా గెలిస్తే కంగారూలతో పోరు ముంగిట జట్టు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన శ్రీలంకను ఓడించడం ఆల్‌రౌండ్ బలం ఉన్న భారత్‌కు కష్టమేమీ కాకపోవచ్చు. కానీ స్పిన్‌కు అనుకూలించే దుబాయ్ పిచ్ మీద బలమైన స్పిన్ దళం ఉన్న శ్రీలంకను మరీ తక్కువ అంచనా వేస్తే కష్టమే.

తుది జట్లు (అంచనా)

భారత్: స్మృతి, షెఫాలి, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), జెమీమా, దీప్తి, రిచా, సజన/పూజ, శ్రేయాంక, ఆశ, అరుంధతి, రేణుక.

శ్రీలంక: చమరి (కెప్టెన్), విష్మి, నీలాక్షిక, హర్షిత, హాసిని, కవీషా, అనుష్క, సుగంధిక, ఉదేశిక, ఇనోషి, సచిని.

4 టీ20 ప్రపంచకప్‌లో భారత్, శ్రీలంక తలపడ్డ మ్యాచ్‌లు. మూడుసార్లు భారత్ గెలవగా.. ఒక మ్యాచ్ లంక సొంతమైంది.

25 భారత్, శ్రీలంక ఆడిన టీ20లు. 19 మ్యాచ్‌ల్లో భారత్ గెలవగా.. లంక అయిదు విజయాలే సాధించింది. ఒక మ్యాచ్ రద్దయింది.



హర్మన్‌ప్రీత్



కెప్టెనే బలం

శ్రీలంక జట్టుకు కెప్టెన్ చమరి ఆటపట్టునే అతి పెద్ద బలం. ఓపెనర్ అయిన చమరి పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడగలదు. అలాగే తన స్పిన్‌తో ప్రతి మ్యాచ్‌లోనూ పూర్తి ఓవర్ల కోటా వేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లకు సవాలు విసురుతుంటుంది. జట్టులో మరికొందరు నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. కవీషా దిల్హరి, సుగంధిక కుమారి, ఇనోషి ప్రియదర్శిని, కవీషా.. దుబాయ్ పిచ్‌ను బాగా ఉపయోగించుకోగలవారే. బ్యాటింగ్‌లో చమరితో పాటు విష్మి, నీలాక్షిక, హర్షిత, హాసిని కీలకం.

బ్యాటింగ్ మారాలి

టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న దుబాయ్, షార్జాల్లో ఎక్కువగా బౌలర్ల ఆధిపత్యమే సాగుతోంది. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడం కష్టమవుతోంది. పిచ్‌లు మందకొడిగా ఉండడంతో బంతి బ్యాట్ మీదికి రావట్లేదు. కానీ కొన్ని జట్లు ఈ కఠిన పిచ్‌ల మీదా బాగానే పరుగులు చేస్తున్నాయి. తొలి మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్లు భారత బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నారు. కానీ మన బ్యాటర్లు రెండు మ్యాచ్‌ల్లోనూ నిరాశ పరిచారు. తొలి మ్యాచ్‌లో భారత్ 102 పరుగులే చేసింది. రెండో మ్యాచ్‌లో 106 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి 19వ ఓవర్ వరకు ఆడింది భారత్. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన రెండు మ్యాచ్‌ల్లోనూ విఫలమైంది. షెఫాలి, హర్మన్ గత మ్యాచ్‌లో రాణించారు. జెమీమా పర్వాలేదనిపించింది. రిచా నిరాశపరిచింది. ఈ పిచ్‌లపై క్రీజులో నిలదొక్కుకుంటే పరుగులు చేయొచ్చు. భారీ స్కోర్లు చేయకపోయినా ఓ మోస్తరు స్కోర్లతోనే ప్రత్యర్థి జట్లకు చెక్ పెట్టొచ్చు. కాబట్టి కీలక పోరులో భారత బ్యాటర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తారేమో చూడాలి. పాక్‌తో మ్యాచ్ చివర్లో గాయపడ్డ హర్మన్ కోలుకుందని, ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉందని సమాచారం. బౌలింగ్‌లో పేసర్లు అరుంధతి, రేణుక సత్తా చాటుతున్నారు. స్పిన్నర్లు శ్రేయాంక, ఆశ కూడా పర్వాలేదు. సీనియర్ బౌలర్ దీప్తి శర్మ ఇంకా మెరుగ్గా రాణించాల్సి ఉంది.



"హర్మన్‌ప్రీత్ బాగానే ఉంది. బుధవారం మ్యాచ్‌కు ఆమె అందుబాటులో ఉంటుంది. పూజ వస్త్రాకర్ ఆడేది లేనిది వైద్య సిబ్బంది నివేదికను బట్టి ఉంటుంది. ఇప్పుడే ఏం చెప్పలేం. టోర్నీలో పరిస్థితులు మా అంచనాలకు భిన్నంగా ఉన్నాయి. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో రన్‌రేట్ మెరుగు పరుచుకోవాలనే అనుకున్నాం. కానీ అంతకంటే ముందు మ్యాచ్ గెలవడం ముఖ్యం. జట్టు కోసం ఏం చేయాలో అది చేశాం. ఆ మ్యాచ్‌లో నా ఆరంభం బాగా లేదు. ఎక్కువ డాట్ బాల్స్ ఆడేసరికి అసహనానికి గురై వికెట్ ఇచ్చేశాను. ఇక్కడి వికెట్లపై బ్యాటర్లు తెలివిగా ఆడాలి"

– స్మృతి మంధాన, భారత వైస్‌కెప్టెన్

రాత్రి 7 గంటల నుంచి



జోరుమీదున్న టీమ్‌ఇండియా మరో సమరానికి సిద్ధమైంది. బంగ్లాదేశ్‌తో రెండో టీ20 నేడే. కుర్రాళ్లతో రెట్టించిన ఉత్సాహంతో ఉన్న భారత్‌ను అడ్డుకోవడం బంగ్లాదేశ్‌కు కష్టమైన పనే. ఆతిథ్య జట్టు తిరుగులేని ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

ఎదురుందా?

- జోరుమీదున్న టీమ్‌ఇండియా
- బంగ్లాదేశ్‌తో రెండో టీ20 నేడు

దిల్లీ

సిరీస్‌పై కన్నేసిన టీమ్‌ఇండియా బుధవారం జరిగే రెండో టీ20లో బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. తొలి మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన సూర్యకుమార్ యాదవ్ బృందం 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. కుర్రాళ్లతో కూడిన టీమ్‌ఇండియా అదే జోరు కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. అనుభవజ్ఞులతో నిండినప్పటికీ గ్వాలియర్‌లో కుర్రాళ్లకు దాసోహమన్న బంగ్లా.. అసాధారణంగా పుంజుకుంటే తప్ప సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోలేదు.

హుషారుగా..: పలువురు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చినప్పటికీ గ్వాలియర్‌లో ఆతిథ్య జట్టు ఏమాత్రం తగ్గలేదు. కుర్రాళ్లతోనే అయినా తొలి టీ20లో 128 పరుగుల లక్ష్యాన్ని 12 ఓవర్లలోపే ఛేదించింది. అదే ఉత్సాహంతో ఇప్పుడు ఈ పోరులోనూ బంగ్లాదేశ్‌ను చిత్తు చేయాలని ఉవ్విళ్లూరుతోంది. గ్వాలియర్‌లో భారత బ్యాటర్లంతా దూకుడుగా బ్యాటింగ్ చేశారు. నితీశ్ తప్ప అందరూ 150పై స్ట్రైక్‌రేట్‌తో పరుగులు రాబట్టారు. సంజు శాంసన్, అభిషేక్, సూర్యకుమార్, హార్దిక్ పాండ్య బ్యాట్లు ఝుళిపించారు. మంచి ఊపు మీదున్న దశలో రనౌటైన ఓపెనర్ అభిషేక్ ఈసారి పెద్ద ఇన్నింగ్స్ ఆడాలనుకుంటాడనడంలో సందేహం లేదు. ఓపెనర్‌గా వచ్చి స్ట్రోక్‌ప్లేతో ఆకట్టుకున్న సంజు కూడా పెద్ద ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. తొలి ప్రాధాన్య ఓపెనర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌ల గైర్హాజరీలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ఈ ఆటగాళ్లకు ముఖ్యం. భారత బ్యాటింగ్ లైనప్‌లో ఓ మార్పు జరిగే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి స్థానంలో తిలక్ వర్మ జట్టులోకి రావొచ్చు. ఇక బౌలింగ్‌లో టీమ్‌ఇండియాకు ఎలాంటి సమస్యలూ లేవు. బుమ్రా వంటి మేటి బౌలర్ లేకపోయినా గ్వాలియర్‌లో బౌలర్లు సమష్టిగా బంగ్లాకు కళ్లెం వేశారు. పేస్ సంచలనం మయాంక్ యాదవ్ అరంగేట్రంలో అదరగొట్టాడు. అర్ష్‌దీప్ సింగ్, పునరాగమన హీరో వరుణ్ చక్రవర్తి అద్భుతంగా బౌలింగ్ చేశారు. భారత్.. మయాంక్‌కు విశ్రాంతినిచ్చి హర్షిత్ రాణాను తుది జట్టులోకి తీసుకునే అవకాశముంది.

బంగ్లాకు సవాల్: జట్టులో అనుభవజ్ఞులున్నా తొలి టీ20లో బోల్తా కొట్టిన బంగ్లాదేశ్... సిరీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే తన శక్తులన్నింటినీ కూడదీసుకోవాలి. ముఖ్యంగా బ్యాటింగ్‌లో ఆ జట్టు మెరుగుపడాల్సివుంది. లిటన్ దాస్, మహ్మదుల్లా వంటి సీనియర్ ఆటగాళ్లు సత్తామేర రాణించాలని ఆ జట్టు ఆశిస్తోంది. బంగ్లా బౌలర్లకు కూడా భారత యువ బ్యాటర్లను నిలువరించడం పెద్ద సవాలే.

1 బంగ్లాదేశ్‌తో ఆడిన 15 టీ20 మ్యాచ్‌ల్లో టీమ్ ఇండియా ఒకే ఒక్కసారి ఓడిపోయింది.



పిచ్ ఎలా ఉందంటే..


మ్యాచ్ వేదిక అరుణ్ జైట్లీ స్టేడియంలో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. పరుగుల వరద పారే అవకాశముంది. ఇక్కడ 2024 ఐపీఎల్‌లో పది మ్యాచ్‌లు జరగగా.. అందులో ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో 200పై స్కోర్లు నమోదయ్యాయి. ఆటకు వర్షం ముప్పు లేదు. కాస్త మంచు ప్రభావం ఉండొచ్చు.

తుది జట్లు (అంచనా)...

భారత్: సంజు శాంసన్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, రియాన్ పరాగ్, రింకు సింగ్, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి.

బంగ్లాదేశ్: తంజిద్ హసన్, లిటన్ దాస్, నజ్ముల్ శాంటో, హృదోయ్, మహ్మదుల్లా, జేకర్ అలీ, మెహిదీ హసన్ మిరాజ్, రిషాద్, తస్కిన్, షోరిఫుల్, ముస్తాఫిజుర్.

సల్మాన్ సెంచరీ.. పాక్ 556



సల్మాన్ ఆఘా

ముల్తాన్: ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో పాకిస్థాన్ సత్తాచాటుతోంది. సల్మాన్ ఆఘా (104 నాటౌట్; 119 బంతుల్లో 10×4, 3×6) అజేయ సెంచరీతో అదరగొట్టడంతో పాక్ భారీ స్కోరు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 328/4తో మంగళవారం ఉదయం ఆట కొనసాగించిన ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగులకు ఆలౌటైంది. సాద్ షకీల్ (82; 177 బంతుల్లో 8×4), సల్మాన్ సత్తాచాటి పాక్ భారీ స్కోరుకు బాటలు వేశారు. చివర్లో షహీన్ షా అఫ్రిది (26; 49 బంతుల్లో 2×4, 1×6)తో కలిసి సల్మాన్ తొమ్మిదో వికెట్‌కు 85 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జాక్ లీచ్ (3/160), గస్ అట్కిన్సన్ (2/99), బ్రైడన్ కార్స్ (2/74) రాణించారు. అనంతరం ఇంగ్లాండ్ దీటుగా స్పందించింది. రెండోరోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టానికి 96 పరుగులు సాధించింది. రెండో ఓవర్లోనే కెప్టెన్ ఓలీ పోప్ (0) వికెట్ కోల్పోయినా.. జాక్ క్రాలీ (64 బ్యాటింగ్; 64 బంతుల్లో 11×4), జో రూట్ (32 బ్యాటింగ్; 54 బంతుల్లో 2×4) సత్తాచాటారు. రెండో వికెట్‌కు అజేయంగా 92 పరుగులు జత చేశారు. పాక్ స్కోరును అందుకోవాలంటే ఇంగ్లాండ్ మరో 460 పరుగులు సాధించాలి.

హర్‌వంశ్ శతకం



హర్‌వంశ్

చెన్నై: హర్‌వంశ్ పంగాలియా (117; 143 బంతుల్లో 7×4, 6×6) సెంచరీతో కదంతొక్కడంతో ఆస్ట్రేలియా అండర్ 19 జట్టుతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో యువ భారత్ భారీ స్కోరు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 316/5తో మంగళవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత అండర్-19 జట్టు 133.3 ఓవర్లలో 492 పరుగులకు ఆలౌటైంది. మహ్మద్ ఎనాన్ (26), సమర్థ్ నాగరాజు (20) సహకారంతో హర్‌వంశ్ జట్టు స్కోరును 400 దాటించాడు. అనంతరం అన్మోల్‌జీత్ సింగ్ (11 నాటౌట్)తో కలిసి పదో వికెట్‌కు 90 పరుగులు జోడించాడు. ఆసీస్ బౌలర్లలో ఓలీ పాటర్సన్ (2/74), హ్యారీ హోక్‌స్ట్రా (2/41), క్రిస్టియన్ హోవ్ (2/43), లాచ్లాన్ రొనాల్డ్ (2/140) రెండేసి వికెట్లు తీశారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లలో 3 వికెట్లకు 142 పరుగులు సాధించింది.

సింధు పరాజయం



సింధు

వాంటా (ఫిన్లాండ్): భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ మహిళల సింగిల్స్ నుంచి నిష్క్రమించింది. టోర్నీలో ఆమె తొలి రౌండ్‌నే దాటలేకపోయింది. పునరాగమనంలో ఆడిన తొలి మ్యాచ్‌లో ఆమె 16-21, 10-21మిచెలీ (కెనడా) చేతిలో పరాజయంపాలైంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత సింధు ఆడిన తొలి టోర్నీ ఇదే. మరోవైపు యువ షట్లర్ మాళవిక బన్సోద్ సంచలనం సృష్టించింది. ఆమె 21-19, 24-22తో ప్రపంచ నంబర్ 23 సంగ్ షూ యున్‌కు షాకిచ్చి ప్రిక్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. ఆకర్షి కశ్యప్ కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్లో ఆమె 21-19, 21-14తో వానె లి (జర్మనీ)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫికేషన్స్‌లో టాప్‌సీడ్, భారత ఆటగాడు కిరణ్ జార్జ్ 21-16, 13-21, 21-19తో లూకాస్ కార్‌బౌట్ (ఫ్రాన్స్)ను ఓడించి ప్రధాన డ్రాకు అర్హత సాధించాడు. లక్ష్యసేన్ కూడా ఈ టోర్నీ బరిలో ఉన్నాడు.



అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ ఆవిష్కరణ సందర్భంగా మోర్గాన్, బ్రయాన్ లారా, సచిన్, జాంటీ రోడ్స్, రమేశ్ కలువితరణ, వాట్సన్

మాస్టర్స్ లీగ్ నవంబరు 17 నుంచి

ముంబయి: అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ తొలి సీజన్ నవంబరు 17 నుంచి డిసెంబరు 8 వరకు జరగనుంది. సచిన్ తెందుల్కర్, బ్రయాన్ లారా లాంటి దిగ్గజాలు పాల్గొంటున్న ఈ లీగ్‌ను ముంబయి, లఖ్‌నవూ, రాయ్‌పుర్ నగరాల్లో నిర్వహిస్తారు. టోర్నీని మంగళవారం ఆవిష్కరించారు. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్ జట్లకు చెందిన మాజీ ఆటగాళ్లు ఈ టోర్నీలో పాల్గొంటారు. ఇండియా మాస్టర్స్ పేరుతో బరిలోకి దిగనున్న భారత జట్టుకు సచినే కెప్టెన్. దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ లీగ్‌కు కమిషనర్‌గా వ్యవహరిస్తాడు. తొలి మ్యాచ్‌లో ఇండియా మాస్టర్స్.. కుమార సంగక్కర నేతృత్వంలోని శ్రీలంక మాస్టర్స్‌ను ఢీకొంటుంది. వెస్టిండీస్‌కు లారా, దక్షిణాఫ్రికాకు కలిస్, ఇంగ్లాండ్‌కు మోర్గాన్, ఆస్ట్రేలియాకు వాట్సన్ సారథ్యం వహిస్తారు.

పాయింట్ల పట్టిక గ్రూప్-ఎ

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
ఆస్ట్రేలియా	2	2	0	0	4	2.524
పాకిస్థాన్	2	1	1	0	2	0.555
న్యూజిలాండ్	2	1	1	0	2	-0.050
భారత్	2	1	1	0	2	-1.217
శ్రీలంక	2	0	2	0	0	-1.667

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి



షట్ 3/3

మహిళల టీ20 ప్రపంచకప్

ఆసీస్ చేతిలో కివీస్ చిత్తు

- మెరిసిన షట్, అనాబెల్, మోలనూ
- అమేలియా ఆల్‌రౌండ్ మెరుపులు వృథా

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్‌పై ఘనవిజయం సాధించిన న్యూజిలాండ్.. తన తర్వాతి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో చిత్తయింది. మంగళవారం ఆ జట్టు 60 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. మొదట ఆస్ట్రేలియా 8 వికెట్లకు 148 పరుగులు చేసింది. ఓపెనర్లు బెత్ మూనీ (40; 32 బంతుల్లో 2×4), అలీసా హీలీ (26; 20 బంతుల్లో 4×4)లతో పాటు మూడో నంబర్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ (30; 24 బంతుల్లో 3×4, 1×6) రాణించడంతో ఆసీస్ 13 ఓవర్లకు 100/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. కానీ అమేలియా కెర్ (4/26) విజృంభణతో వరుసగా వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 150 మార్కునూ అందుకోలేకపోయింది. కివీస్ బౌలర్లలో రోజ్‌మేరీ మైర్ (2/22), బ్రూక్ హాలిడే (2/16) కూడా రాణించారు. అనంతరం ఛేదనలో కివీస్ తేలిపోయింది. 19.2 ఓవర్లలో 88 పరుగులకే కుప్పకూలింది. 10 ఓవర్లకు 54/1తో పర్వాలేదనిపించిన ఆ జట్టు.. ఆ తర్వాత 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మెగాన్ షట్ (3/3), అనాబెల్ సదర్లాండ్ (3/21), సోఫీ మోలనూ (2/15)ల ధాటికి అనూహ్యంగా కుప్పకూలింది. అమేలియా (30) బ్యాటింగ్‌లోనూ రాణించింది. ఆమె కాకుండా సుజీ బేట్స్ (20), లియా తహుహు (11) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌కు టోర్నీలో ఇది వరుసగా రెండో విజయం. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు శ్రీలంకను ఓడించింది.

సంక్షిప్త స్కోర్లు.. ఆస్ట్రేలియా: 148/8 (బెత్ మూనీ 40, అలీసా హీలీ 26, ఎలీస్ పెర్రీ 30; అమేలియా కెర్ 4/26, రోజ్‌మేరీ మైర్ 2/22, బ్రూక్ హాలిడే 2/16); **న్యూజిలాండ్:** 88 (అమేలియా 30, సుజీ బేట్స్ 20; మెగాన్ షట్ 3/3, అనాబెల్ సదర్లాండ్ 3/21, సోఫీ మోలనూ 2/15)

ఐహిక సంచలనం



ఐహిక

అస్తానా: ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి ఐహిక ముఖర్జీ సంచలనం సృష్టించింది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ షిన్ యుబిన్ (దక్షిణ కొరియా)ను చిత్తుచేసి భారత మహిళల జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. మంగళవారం క్వార్టర్‌ఫైనల్లో భారత్ 3-2తో దక్షిణ కొరియాపై నెగ్గి పతకం ఖాయం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో 92వ ర్యాంకర్ ఐహిక 11-9, 7-11, 12-10, 7-11, 11-7తో యుబిన్‌పై గెలిచింది. మనిక బత్రా 12-14, 13-11, 11-5, 5-11, 12-10తో జియోన్ జీహీపై నెగ్గడంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మూడో మ్యాచ్‌లో తెలుగమ్మాయి ఆకుల శ్రీజ 6-11, 10-12, 8-11తో లీ యున్యె చేతిలో పరాజయం చవిచూసింది. అనంతరం మనిక 11-13, 4-11, 11-6, 11-7, 10-12తో యుబిన్ చేతిలో ఓడటంతో 2-2తో స్కోరు సమమైంది. నిర్ణయాత్మక చివరి మ్యాచ్‌లో ఐహిక 7-11, 11-6, 12-10, 12-10తో జీహీపై గెలిచి 3-2తో భారత్‌కు విజయాన్ని అందించింది.

శ్రీవల్లి శుభారంభం



శ్రీవల్లి

మైసూరు: ఐటీఎఫ్ మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో తెలుగమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. మంగళవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో శ్రీవల్లి 7-5, 6-1తో సోనల్ పాటిల్‌పై విజయం సాధించింది.

మెరిసిన లహరి, మాన్యారెడ్డి

దిల్లీ: ముస్సానా రేస్ వీక్ సెయిలింగ్‌లో తెలుగమ్మాయిలు కొమరవెల్లి లహరి, మాన్యారెడ్డి అదరగొట్టారు. ఒమన్‌లో జరిగిన అంతర్జాతీయ రెగెట్టా పోటీల్లో లహరి, మాన్యారెడ్డి రజత పతకాలతో సత్తాచాటారు. మొత్తంగా ఈ పోటీల్లో భారత సెయిలర్లు ఏడు పతకాలు సాధించారు. అండర్-15 బాలికల ఆప్టిమిస్ట్‌లో శ్రియ కృష్ణ స్వర్ణం, లహరి రజత పతకాలు గెలిచారు. అండర్-16 బాలుర ఐఎల్‌సీఏ-4లో శశాంక్ రజతం, అక్షత్‌కుమార్ కాంస్యం నెగ్గారు. అండర్-16 బాలికల ఐఎల్‌సీఏ-4లో సౌమ్యాసింగ్ పటేల్ రజతం, షగున్ ఝా కాంస్యం సాధించారు. అండర్-19 బాలికల ఐఎల్‌సీఏ-6లో మాన్యారెడ్డి రజతం కైవసం చేసుకుంది.

భారత్‌తో సిరీస్ తర్వాత మహ్మదుల్లా గుడ్‌బై

దిల్లీ: బంగ్లాదేశ్ సీనియర్ ఆల్‌రౌండర్ మహ్మదుల్లా టీ20ల నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించాడు. ప్రస్తుత భారత్ సిరీస్ అనంతరం అతను ఈ ఫార్మాట్ నుంచి తప్పుకోనున్నాడు. "అవును. నేను టీ20ల నుంచి రిటైరవుతున్నా. భారత్‌తో మూడో టీ20నే ఈ ఫార్మాట్లో నా చివరి మ్యాచ్. ముందే ఈ నిర్ణయం తీసుకున్నా. బోర్డుకు ఈ విషయాన్ని చెప్పేశా. ఇది నాతో పాటు జట్టుకూ మంచిది" అని 38 ఏళ్ల మహ్మదుల్లా తెలిపాడు. భారత్ ఘనవిజయం సాధించిన తొలి టీ20లో మహ్మదుల్లా 1 పరుగుకే ఔటయ్యాడు.

లాగ్రేవ్ చేతిలో కార్ల్‌సన్ ఓటమి

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ (జీసీఎల్)లో కార్ల్‌సన్ (అల్పైన్)కు లాగ్రేవ్ (ముంబా) షాకిచ్చాడు. పోటీల ఆరో రోజు, మంగళవారం ముంబా మాస్టర్స్ 14-5తో కార్ల్‌సన్ జట్టు అల్పైన్ ఎస్‌జీ కింగ్స్‌ను చిత్తు చేసింది. రిచర్డ్ ర్యాపోర్ట్‌పై పీటర్ స్విడ్లర్ (ముంబా), డేనియల్‌పై రౌనక్ (ముంబా) విజయం సాధించారు. హారికతో గేమ్‌ను కేతిరినా (అల్పైన్), యిఫాన్ గేమ్‌ను హంపి (ముంబా మాస్టర్స్) డ్రాగా ముగించారు. అల్పైన్ తరఫున ప్రజ్ఞానంద మాత్రమే గెలిచాడు. అతడు విదిత్‌ను ఓడించాడు. మరోవైపు అమెరికన్ గ్యాంబిట్స్ 14-5తో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్‌పై ఘనవిజయం సాధించింది. నకమురా, బిబిసార, ఎలిసబెత్ ఆ జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. మరో మ్యాచ్‌లో ఆనంద్ నేతృత్వంలోని గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్ 5-14తో అలాస్కన్ నైట్స్ చేతిలో ఓడిపోయింది. ఏడు మ్యాచ్‌ల్లో ఆరు నెగ్గిన అలాస్కన్ నైట్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

(c) eenadu

మెట్రో రెండోదశ అంచనా వ్యయం రూ.24,269 కోట్లు



● ఫోర్త్‌సిటీ మినహా ఐదు మార్గాలకు వేర్వేరుగా డీపీఆర్‌లు

ఈనాడు, హైదరాబాద్: రాజధాని మెట్రోరైలు రెండోదశలో ఐదు మార్గాల సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. 76.2 కి.మీ.కు రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని డీపీఆర్‌లో అధికారులు పేర్కొన్నారు. ఫోర్త్‌సిటీ మినహా మిగిలిన ఐదు కారిడార్లకు వేర్వేరుగా నివేదికలు ఇచ్చారు. దసరా నాటికి డీపీఆర్‌లు సమర్పించాలని ప్రభుత్వం తొలుత నిర్దేశించింది. ఈ నెల 7న (సోమవారం) దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో సీఎం భేటీ ఖరారు కావడంతో.. ఆ పర్యటనకు ముందుగానే డీపీఆర్‌లు కావాలని సీఎం కార్యాలయం కోరింది. దీంతో ఏడో తేదీ నాటికి డీపీఆర్‌లను ప్రభుత్వానికి సమర్పించామని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్‌ఏఎంఎల్) అధికారులు తెలిపారు. నివేదికలు గతంలోనే సిద్ధమైనా కీలకమైన ట్రాఫిక్ అధ్యయన నివేదిక 'కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)' కోసం ఆగారు. సీఎంపీ ముసాయిదా సిద్ధం కావడంతో ఆ నివేదికను డీపీఆర్‌కు జోడించి సర్కారుకు అందజేశారు. దీని ఆధారంగానే సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిని కలిసి ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టేలా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీపీఆర్‌లు పంపనున్నట్లు తెలిపారు. దీనిపై కేంద్రం సైతం సానుకూలంగా ఉన్నట్లు మెట్రో వర్గాలు తెలిపాయి.

18 శాతం కేంద్రం నిధులతో..

మెట్రోరైలు ప్రాజెక్టులను వేర్వేరు నగరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యాలతో నిర్మిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం భరించే వాటా సాధారణంగా 15 శాతం ఉంటుంది. హైదరాబాద్ మెట్రో రెండోదశలో 18 శాతం వరకు ప్రతిపాదిస్తున్నారు. రాష్ట్రం తన వాటాగా 30 శాతం భరించేందుకు సిద్ధపడుతుంది. 4 శాతం పీపీపీ పెట్టుబడులకు అవకాశం కల్పించాలనేది ఆలోచన. మిగిలిన 48 శాతానికి సంబంధించి జైకా వంటి సంస్థల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుంటారు. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్య ప్రాజెక్టుపై రుణాలకు కేంద్రం పూచీకత్తు ఇస్తుందని అధికారులు అంటున్నారు.

■ మెట్రో రెండోదశ డీపీఆర్‌ను తొలుత రాష్ట్ర మంత్రిమండలిలో చర్చించి ఆమోదించాలి. తదుపరి క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అనంతరం కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపిస్తారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిసి మెట్రో రెండోదశకు ఆమోదం తెలపాలని కోరే అవకాశం ఉంది.

సర్కారుకు చేరిన డీపీఆర్ మార్గాలివి..

కారిడార్-4:	నాగోల్- శంషాబాద్ విమానాశ్రయం	36.6 కి.మీ.
కారిడార్-5:	రాయదుర్గం- కోకాపేట నియోపొలిస్	11.6 కి.మీ.
కారిడార్-6:	ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట	7.5 కి.మీ.
కారిడార్-7:	మియాపూర్- పటాన్‌చెరు	13.4 కి.మీ.
కారిడార్-8:	ఎల్బీనగర్- హయత్‌నగర్	7.1 కి.మీ.

మాదిగలకు సీఎం నమ్మక ద్రోహం

● కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై నేడు నిరసనలు.. ధర్నాలు: మంద కృష్ణమాదిగ



బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: 'రాష్ట్రంలోని మాదిగలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నమ్మక ద్రోహం తలపెట్టారు. దేశంలోనే వర్గీకరణ అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలపడంతోపాటు అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఉద్యోగ నియామకాలు చేపడతామని నమ్మించి మోసం చేశారు. వర్గీకరణ లేకుండానే ఉపాధ్యాయ నియామకాలు, వైద్యవిద్యలో ప్రవేశాలు చేపట్టడమే ఇందుకు నిదర్శనం' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్‌మాదిగ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 15న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. వర్గీకరణ విషయమై కమిషన్ వేసిన ప్రభుత్వం కాలయాపన చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపడతామని ధైర్యంగా చెప్పలేకపోతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహను చూసి సిగ్గుపడుతున్నామన్నారు. మౌనంగా ఉండడం కంటే ప్రభుత్వం నుంచి బయటకు రావాలని రాజనర్సింహకు సూచించారు. వర్గీకరణ అమలు చేస్తే కాంగ్రెస్ పార్టీ తనను ముఖ్యమంత్రి పీఠం నుంచి దించేస్తుందనే భయంతోనే రేవంత్ కాలయాపన చేస్తున్నారని, ఇదే అంశాన్ని మాదిగ ప్రజాప్రతినిధులతో సహా ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారని ఆరోపించారు.

పీజీఈసెట్ చివరి విడత సీట్ల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: ఎంటెక్, ఎంఫార్మసీ తదితర సీట్ల భర్తీకి పీజీఈసెట్ చివరి విడత కౌన్సెలింగ్ సీట్లను మంగళవారం కేటాయించారు. మొత్తం 5,153 సీట్లకు గాను 4,221 సీట్లు భర్తీ అయ్యాయని ప్రవేశాల కన్వీనర్ ఆచార్య పి.రమేశ్‌బాబు తెలిపారు. సీట్లు పొందిన వారు ఈనెల 14 నుంచి 17వ తేదీ మధ్యలో ఫీజు చెల్లించి, ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

15, 16 తేదీల్లో ఐసెట్ స్పాట్ కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ సీట్ల భర్తీకి ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఆయా కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ప్రవేశాల కన్వీనర్ ఎ.శ్రీదేవసేన తెలిపారు.

ఉపాధ్యాయ కొలువుల్లో... కొత్త అధ్యాయం

● నేడు ఎల్బీ స్టేడియంలో 10,006 మందికి నియామక పత్రాల అందజేత

ఈనాడు, హైదరాబాద్: ఏడేళ్ల నుంచి ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థుల కొలువుల కల బుధవారం నెరవేరబోతోంది. మొత్తం 10,006 మంది నియామక పత్రాలను అందుకోనున్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై కొందరికి స్వయంగా నియామక పత్రాలు అందజేస్తారు. ఈ సందర్భంగా సీఎం కొత్త టీచర్లను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 761 మంది, అత్యల్పంగా పెద్దపల్లి నుంచి 82 మంది నియామక పత్రాలు పొందనున్నారు. కోర్టు కేసులు, ఇతర సమస్యల వల్ల 1,056 స్పెషల్ ఎడ్యుకేటర్లు, పీఈటీల పోస్టులు భర్తీ కాలేదని అధికారులు తెలిపారు. సీఎస్ శాంతికుమారి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు మంగళవారం కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సభ నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

జిల్లాల వారీగా నియామక పత్రాలు అందుకునే వారి సంఖ్య

ఆదిలాబాద్- 296, కొత్తగూడెం- 421, హనుమకొండ- 173, హైదరాబాద్- 761, జగిత్యాల- 299, జనగామ- 211, భూపాలపల్లి- 213, గద్వాల- 149, కామారెడ్డి- 476, కరీంనగర్- 230, ఖమ్మం- 532, ఆసిఫాబాద్- 314, మహబూబాబాద్- 365, మహబూబ్‌నగర్- 214, మంచిర్యాల- 255, మెదక్- 291, మేడ్చల్- 102, ములుగు- 185, నాగర్‌కర్నూల్- 226, నల్గొండ- 546, నారాయణపేట- 252, నిర్మల్- 299, నిజామాబాద్- 526, పెద్దపల్లి- 82, సిరిసిల్ల- 134, రంగారెడ్డి- 357, సంగారెడ్డి-490, సిద్దిపేట- 270, సూర్యాపేట- 332, వికారాబాద్- 344, వనపర్తి- 126, వరంగల్- 272, భువనగిరి- 263

పోస్టు పేరు	మొత్తం పోస్టులు	భర్తీ
స్కూల్ అసిస్టెంట్	2,629	2,515
భాషా పండితులు	727	685
పీఈటీ	182	145
ఎస్జీటీ	6,508	6,277
ఎస్ఏ (స్పెషల్)	220	103
ఎస్జీటీ (స్పెషల్)	796	281
మొత్తం	11,062	10,006

విధుల్లో నిర్లక్ష్యం.. కొల్లాపూర్ ఆర్డీవో సస్పెన్షన్

ఈనాడు, హైదరాబాద్: ధరణి పోర్టల్‌లోని పట్టా పాసుపుస్తకాలకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేసినందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీవో) పి.నాగరాజును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు, భూ వ్యవహారాలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులు అమల్లో ఉన్నంతవరకు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నాగర్‌కర్నూల్ హెడ్‌క్వార్టర్ వీడి ఎక్కడికీ వెళ్లడానికి వీలులేదని పేర్కొన్నారు.



మీ సామర్థ్యాలను అంచనా వేసుకోండి

మీ సామర్థ్యాలను మీరు ఎప్పటికప్పుడు సరిగ్గా అంచనా వేసుకోండి. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో అవసరమైన అత్యంత ముఖ్యమైన నైపుణ్యాల్లో అదొకటి. ఎందుకంటే- మీ సామర్థ్యాలేంటో మీకు తెలియనప్పుడు మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకోవడం అసాధ్యం. మీ గురించి మీరు అతిగా ఊహించుకుంటూ భ్రమల్లో బతకడం లేదా మిమ్మల్ని మీరు తక్కువగా అంచనా వేసుకోవడం.. రెండూ మీ వృద్ధికి విఘాతం కలిగించేవే.

– ర్యాన్ హాలిడే, రచయిత

ఎంబీబీఎస్ బీ కేటగిరిలో.. 258 సీట్లు

● నేటి మధ్యాహ్నం వరకు వెబ్‌ఆప్షన్లు



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని 26 ప్రైవేటు వైద్య కళాశాలల్లో మేనేజ్‌మెంట్ (బీ కేటగిరి) లోకల్ కోటాలో 143 ఎంబీబీఎస్ సీట్లు, అన్‌రిజర్వ్‌డ్ కోటాలో 115 సీట్లు ఖాళీగా ఉన్నట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం వెల్లడించింది. రెండో విడత మేనేజ్‌మెంట్ కోటా సీట్ల వెబ్‌ఆప్షన్లకు బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం ఉంది.

■ బీహెచ్ఎంఎస్ (హోమియోపతి మెడిసిన్) ఆలిండియా కోటాలో సీట్ల కోసం బుధవారం ఉదయం 10 గంటల నుంచి 16వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వర్సిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆలిండియా కోటాలో 67 బీహెచ్ఎంఎస్ సీట్లు ఉన్నట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఐదు హోమియో కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం వెబ్‌ఆప్షన్లను బుధవారం ఉదయం 8 గంటల నుంచి 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నమోదు చేసుకోవాలని తెలిపింది. మేనేజ్‌మెంట్ కోటాలో 150 బీహెచ్ఎంఎస్ సీట్లు ఉన్నట్లు పేర్కొంది.

గురుకులాల నుంచి 32 మందికి ఎంబీబీఎస్ సీట్లు

తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని 35 జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివిన 32 మంది విద్యార్థులు నీట్‌లో ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్ సీట్లు పొందారని ఆ సంస్థ కార్యదర్శి సీహెచ్.రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా హసన్‌పర్తి గురుకులం నుంచి 10 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు.

యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి నర్సిరెడ్డి



ఈనాడు, హైదరాబాద్: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం టీఎస్‌యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డి బరిలో నిలవనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న ఆయనను 2025 మార్చిలో జరగనున్న ఎన్నికల్లో నిలపాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం వర్చువల్‌గా జరిగింది. ఈ సందర్భంగా గత అయిదున్నరేళ్లుగా నర్సిరెడ్డి చేసిన సేవలకు గుర్తింపుగా మరోసారి అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, 33 జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

రూ. కోటి బ్రాస్‌లెట్!



ఈయన పేరు రవి. దసరా సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు చిత్తూరు జిల్లా నుంచి విజయవాడలోని ఇంద్రకీలాద్రికి వచ్చారు. 1.300 కిలోల బంగారంతో చేసిన బ్రాస్‌లెట్ చేతికి అలంకరించుకున్నారు. దీని విలువ సుమారు రూ.కోటి పైమాటేనని ఆయన చెబుతున్నారు. ఈ బ్రాస్‌లెట్‌ను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

– ఈనాడు, అమరావతి

బెర్లిన్ మారథాన్‌లో ఐజీపీ రమేశ్



ఐజీపీ రమేశ్‌ను అభినందిస్తున్న డీజీపీ డా.జితేందర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పోలీస్ ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం ఐజీపీ రమేశ్.. 50వ బీఎండబ్ల్యూ బెర్లిన్ మారథాన్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. డీజీపీ డా. జితేందర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి.. పోటీలో పాల్గొన్నందుకు పొందిన పతకాన్ని చూపించారు. అలాంటి గొప్ప మారథాన్‌లో పాల్గొనడం ద్వారా తెలంగాణ పోలీస్‌శాఖకు రమేశ్ గర్వకారణంగా నిలిచారని డీజీపీ ఈ సందర్భంగా అభినందించారు.

సంప్రదాయ యోగాలో డీఎస్పీకి పతకం

ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన 73వ ఆల్‌ఇండియా పోలీస్ వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్ 2024-25 పోటీల్లో తెలంగాణ పోలీసులు ప్రతిభ చూపారు. వెయిట్‌లిఫ్టింగ్, యోగా, పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అంబర్‌పేట పీటీసీ డీఎస్పీ టి.లక్ష్మి సంప్రదాయ యోగా సీనియర్ సీ(44-55 ఏళ్లు) విభాగంలో కాంస్య పతకం సాధించారు. తెలంగాణ స్పోర్ట్స్ ఆఫీసర్ ఆర్.వి.రామారావుతో కలిసి లక్ష్మి మంగళవారం డీజీపీ డా.జితేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమెను డీజీపీ అభినందించారు.

కృష్ణా బోర్డుకు విజయవాడే ఉత్తమం



సుదర్శన్‌పాల్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కృష్ణానది యాజమాన్య బోర్డును విజయవాడలోనే ఏర్పాటుచేయాలని ఆంధ్రప్రదేశ్ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు డిమాండ్ చేశారు. బెంగళూరు గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన దక్షిణ భారత సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా పరీవాహక ప్రాంతమైన విజయవాడలోనే బోర్డు ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం హైదరాబాద్‌లో గోదావరి బోర్డు, విజయవాడలో కృష్ణాబోర్డు ఏర్పాటుచేయాలని నిర్దేశించగా.. గత ప్రభుత్వం దాన్ని విశాఖలో ఏర్పాటు చేసేందుకు తీర్మానించిందని గుర్తుచేశారు. విజయవాడలోనే దాన్ని ఏర్పాటుచేయాలంటూ మోర్చా జాతీయ నాయకులు డాక్టర్ సుదర్శన్‌పాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల భాగస్వామ్యంతో నీటిసంఘాల ప్రతినిధులు నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా చెరువుల్లో పూడికతీత, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, కాలువల ఆధునికీకరణ, పంటకుంటల నిర్మాణానికి చేయూత ఇస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన రైతుసంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జమ్మూ ప్రాంతంలో భాజపా గెలుపు చరిత్రాత్మకం: కిషన్‌రెడ్డి


హైదరాబాద్: జమ్మూ ప్రాంతంలో భాజపా గెలుపు చరిత్రాత్మకమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభివర్ణించారు. ఆ ప్రాంతంలోని 43 సీట్లకుగాను 29 స్థానాలను భాజపా గెలుచుకోగా, కాంగ్రెస్ ఒకేఒక్క చోట గెలవగలిగిందని. . ఆ ప్రాంతానికి అక్కడి ప్రజలు కాంగ్రెస్ నుంచి విముక్తి కల్పించారని ఆయన పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ ఎన్నికల్లో భాజపా ఇన్‌ఛార్జిగా కిషన్‌రెడ్డి వ్యవహరించారు. మంగళవారం ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ఆయన స్పందిస్తూ.. జమ్మూ కశ్మీర్ ఎన్నికల చరిత్రలోనే భాజపా అత్యధిక స్థానాలు గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆత్మవిశ్వాసాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు దెబ్బతీశారని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. ఆయనకు ప్రజలే సమాధానం చెప్పారన్నారు. మోదీ నాయకత్వంపై ప్రజల నమ్మకానికి హరియాణా, జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించాయని పేర్కొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న డీజీపీ డా.జితేందర్, ఉన్నతాధికారులు

డీజీపీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

ఈనాడు, హైదరాబాద్: డీజీపీ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీజీపీ డా.జితేందర్, ఇంటెలిజెన్స్, సీఐడీ, ఆర్గనైజేషన్స్ డీజీపీలు బి.శివధర్‌రెడ్డి, శిఖాగోయల్, స్వాతి లక్రా, ఐజీలు రమేశ్, సత్యనారాయణ, రమేశ్‌నాయుడు, డీఐజీలు గజరావు భూపాల్, రెమా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు ఉద్యోగికి రూ.49 లక్షల టోకరా

పెనమలూరు, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగికి ఆన్‌లైన్ మోసగాళ్లు రూ.49 లక్షలకు టోకరా వేశారు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపడంతో ఆయన మోసపోయారు. కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. పోరంకికి చెందిన టి.వెంకటేశ్వరరావు ఎస్బీఐలో ఉద్యోగి. ఇతని వాట్సప్‌కు ఆన్‌లైన్ షేర్ల ట్రేడింగ్ గురించి సమాచారం వచ్చింది. ఓ వ్యక్తి ఆయనతో మాట్లాడుతూ తాము పంపిన లింక్‌లో ఖాతా తెరచి ట్రేడింగ్ చేసుకొంటే అధిక లాభాలొస్తాయంటూ ఆశ చూపాడు. దీంతో వెంకటేశ్వరరావు ఖాతా తెరచి వారు తెలిపిన వివిధ ఖాతాలకు రూ.49 లక్షలు పంపారు. కొద్దిరోజుల కిందట రూ.2.82 కోట్లు వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపుతుండడంతో నగదును డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా వీలు పడలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనకాపల్లిలో న్యాయవాది నుంచి రూ. 29 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. అనకాపల్లిలో న్యాయవాదిని బెదిరించి రూ. 29 లక్షలు దోచేశారు. అనకాపల్లి పట్టణ సీఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. అనకాపల్లి గాంధీనగరంలో నివాసం ఉంటున్న న్యాయవాది భవానీ ప్రసాద్‌కు ఈనెల 3న ఫోన్ చేసి.. తాము ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆదాయానికి మించిన ఆస్తులతో పాటు పన్నులు కట్టకుండా నల్లధనం ఎక్కువగా ఉండడంతో మనీ లాండరింగ్ కేసు నమోదైందనంటూ ఆ న్యాయవాదిని బెదిరించారు. దీంతో పాటు బాలికతో మసాజ్ చేయించుకున్న కేసు కూడా ఉందని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అరెస్ట్ చేయడానికి తాము అనకాపల్లి వస్తున్నట్లు నమ్మించారు. న్యాయవాదితో పాటు ఆయన భార్యతోనూ సైబర్ నేరగాళ్లు అరెస్ట్ విషయంపై మాట్లాడడంతో భార్యాభర్తలు భయపడిపోయారు. అరెస్ట్ చేయకుండా ఉండడానికి నగదు ఇవ్వాలని నేరగాళ్లు డిమాండ్ చేశారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో దఫదఫాలుగా న్యాయవాది రూ.29 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు చెప్పిన బ్యాంకు అకౌంట్‌కు పంపారు. మూడు రోజుల పాటు తీవ్రంగా బెదిరించడంతో పాటుగా బయటకు వస్తే తమ వాళ్లు తుపాకీతో కాల్చడానికి సిద్ధంగా ఉన్నారని బెదిరించారు. దీంతో ఆయన కోర్టుకు సైతం వెళ్లలేదు. మంగళవారం తిరిగి అదనంగా మరో రూ. 10 లక్షలు పంపాలని ఆ నేరగాళ్లు బెదిరించడంతో తన వద్ద అంత నగదు లేదని న్యాయవాది చెప్పారు. తమకు ఎలాగైనా నగదు కావాలని లేకుంటే అరెస్ట్ చేస్తామని చెప్పడంతో ఆయన తన స్నేహితుడికి ఫోన్ చేసి రూ.10 లక్షలు అప్పు అడిగారు. ఎన్నడూ అప్పు అడగని వ్యక్తి ఇలా ఎందుకు అడిగారని సందేహించి ఆయన. . స్నేహితుడి ఇంటికి వెళ్లారు. దీంతో జరిగిన విషయం తెలుసుకుని ఇదంతా సైబర్ నేరగాళ్ల పని అంటూ వెంటనే 1930కి ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. వెంటనే బ్యాంకు అకౌంట్ నుంచి రూ. 1.65 లక్షల నగదును సీజ్ చేశారు. అనంతరం సైబర్ నేరగాళ్ల మోసానికి గురైన న్యాయవాది అనకాపల్లి పట్టణ పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయంపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

మృత్తికాశాస్త్రంలో ఉత్తమ పరిశోధనలకు పురస్కారాలు

ఈనాడు, హైదరాబాద్: మృత్తికాశాస్త్రంలో ఉత్తమ పరిశోధనలు చేసిన పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు జాతీయస్థాయిలో పురస్కారాలు అందించనున్నట్లు తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ మృత్తికాశాస్త్ర విభాగ అధిపతి, జాతీయ మృత్తికాశాస్త్ర సంఘం అధ్యక్షురాలు జయశ్రీ మంగళవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు దిల్లీలో త్వరలో జరిగే జాతీయ మృత్తికాశాస్త్ర సంఘం వార్షిక సదస్సులో పురస్కారాలను అందిస్తారని పేర్కొన్నారు.

డిజిటల్ సర్వేలో విస్తరణాధికారులు పాల్గొనాలి

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో నిర్వహించే పంటల డిజిటల్ సర్వేలో వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొనాలని ఆ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సూచించారు. ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డితో కలిసి ఏఈవోల ఐకాస నేతలు రామకృష్ణ, శ్రావణ్, సురేశ్‌రెడ్డి తదితరులు శనివారం రఘునందన్‌రావును కలిసి డిజిటల్ సర్వేలో తమ ఇబ్బందులను వివరించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. ఏఈవోల సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తానని, యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకొని సర్వే ప్రారంభించాలని సూచించారు. దీనికి ఏఈవోల సంఘం నేతలు సానుకూలంగా స్పందిస్తూ. . సర్వేలో పాల్గొంటామని తెలిపారు.

ధర్మవరం సీఐ తల్లి దారుణహత్య

● ఆభరణాల కోసమే ఘాతుకం ● ఆమె సొంతూరి యువకుడే నిందితుడు



స్వర్ణకుమారి

ఈనాడు- కడప, న్యూస్‌టుడే- మదనపల్లె నేర వార్తలు: కాశీ నుంచి స్వామీజీ వచ్చారు.. మీ అనారోగ్య సమస్యలన్నీ తీర్చేస్తారని ఒంటరిగా ఉంటున్న ఓ మహిళను నమ్మించి తీసుకెళ్లిన వ్యక్తి ఆమెను దారుణంగా హతమార్చి, బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. హతురాలు ధర్మవరం ఒకటో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి (62) కావడం గమనార్హం. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం మేడికుర్తికి చెందిన స్వర్ణకుమారి.. మదనపల్లెలో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. మేడికుర్తికి చెందిన వెంకటేశ్ కుటుంబం కూడా స్వర్ణకుమారి ఇంటికి సమీపంలోనే నివసిస్తూ ఆమెకు చేదోడువాదోడుగా ఉండేది. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వెంకటేశ్.. స్వర్ణకుమారి బంగారు ఆభరణాలపై కన్నేశాడు. కాశీ నుంచి స్వామీజీ వచ్చారు.. ఆయన మంత్రంతో మీ అనారోగ్య సమస్యలన్నీ పరిష్కారమవుతాయని స్వర్ణకుమారిని నమ్మించాడు. గత నెల 28న ఆమెను పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో ఉన్న అనిల్ ఇంటికి తీసుకెళ్లాడు. తీర్థంలో నిద్రమాత్రలు కలిపి తాగించాడు. ఆమె స్పృహ కోల్పోగానే తలపై సుత్తితో మోది, చంపేశాడు. ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలు తీసుకుని ఓ ప్రైవేటు బ్యాంకులో రూ.4.30 లక్షలకు తాకట్టు పెట్టాడు. తర్వాత అనిల్ సాయంతో మృతదేహాన్ని అయోధ్యనగర్ శ్మశానవాటికకు తీసుకెళ్లి పూడ్చిపెట్టారు. గత నెల 30న బెంగళూరుకు పారిపోయాడు. తల్లి కనిపించడం లేదనే సమాచారంతో సీఐ నాగేంద్రప్రసాద్ మదనపల్లెకు వచ్చి, గ్రామీణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. వెంకటేశ్‌పై అనుమానంతో ఆరా తీసి, బెంగళూరులో అదుపులోకి తీసుకుని మదనపల్లెకు తీసుకువచ్చారు. అతను మృతదేహాన్ని పాతిపెట్టిన ప్రాంతాన్ని చూపించడంతో పోలీసులు వెలికితీసి, శవపరీక్షలు నిర్వహించారు. మరో నిందితుడు అనిల్ పరారీలో ఉన్నాడు. అతని తల్లి రమాదేవి హస్తం ఉందన్న అనుమానంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

స్త్రీ నిధి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: తీన్మార్ మల్లన్న

ఈనాడు, హైదరాబాద్: స్త్రీ నిధి సమాఖ్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆ సమాఖ్య ఎండీ విద్యాసాగర్‌రెడ్డిని కోరారు. వెంటనే ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేయాలని, అక్రమంగా తొలగించినవారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం కార్యాలయంలో ఎండీని ఆయన కలిశారు. సమాఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని.. విశ్రాంత ఉద్యోగులకు, ఒకే వర్గానికి పెద్దపీట వేస్తున్నారని, దీనిపై మంత్రి సీతక్కకు ఫిర్యాదు చేస్తామన్నారు.

(c) eenadu

రూ.10.61 కోట్ల సైబర్ మోసం కేసులో ఇద్దరి అరెస్టు

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలింపు

ఈనాడు, హైదరాబాద్: నగరానికి చెందిన వృద్ధ దంపతులను డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి ఆన్‌లైన్‌లో రూ.10.61 కోట్లు కాజేసిన కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు మంగళవారం ఇద్దరిని అరెస్టు చేశారు. తాము మోసపోయినట్లు బాధితులు సెప్టెంబరు 10న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు... బెంగళూరుకు చెందిన వినయ్‌కుమార్ ఎస్.ఖడ్కే(23), మారుతి జీహెచ్(28)లను అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. కమీషన్ ఇస్తామని ఆశపెట్టిన గుర్తు తెలియని వ్యక్తుల ఆదేశాలతో టింకస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట వీరిద్దరూ జాయింట్ బ్యాంక్ ఖాతా తెరిచినట్లు వెల్లడైంది. వృద్ధుల బ్యాంకు ఖాతాల నుంచి కాజేసిన సొమ్ములో రూ.4.62 కోట్లను వీరి జాయింట్ ఖాతాలోకి మళ్లించినట్లు గుర్తించారు. నిందితులిద్దరితో జాయింట్ ఖాతా తెరిపించిన గుర్తుతెలియని వ్యక్తుల కోసం ఆరా తీస్తున్నట్లు టీజీసీఎస్‌బీ ప్రకటించింది.

వైద్యుడి నుంచి రూ.2 కోట్లు స్వాహా

ఫేక్ కాల్స్‌తో బెదిరించిన సైబర్ కేటుగాళ్లు

రాయచోటి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రాయచోటిలోని ఓ ప్రైవేటు వైద్యుడికి ఫేక్ కాల్స్ చేసి ఐదు నెలల పాటు వేధించి ఆయన ఖాతా నుంచి రూ.2 కోట్ల నగదు స్వాహా చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అమీన్ ఆసుపత్రి వైద్యుడు ఇంతియాజ్‌కు పోలీసు అధికారి ఫొటో కలిగిన నంబరు నుంచి ఐదు నెలల క్రితం ఫోన్ వచ్చింది. మీ పేరుపై లండన్ నుంచి డ్రగ్స్ పార్సిల్ వస్తోందని దానిపై కేసు నమోదు చేశామని.. త్వరలోనే అరెస్టు చేస్తామని బెదిరించారు. డ్రగ్స్ మాఫియా వారు నిన్ను హతమార్చాలని ప్లాన్ చేశారని తమ విచారణలో తేలిందని చెప్పి వైద్యుడిని నమ్మించారు. దాంతో ఆందోళన చెందిన ఇంతియాజ్ కేసు నుంచి బయట పడాలంటే ఏమి చేయాలని అడిగారు. కొంత డబ్బులు కట్టాల్సి వస్తుందని వారు నమ్మబలికారు. వరుసగా రోజూ ఫోన్లు రావడం, వీడియో కాల్స్ చేసి నకిలీ పోలీసుస్టేషన్‌ను చూపించడంతో వాస్తవమని నమ్మిన వైద్యుడు వారి ఖాతాలకు 25 లావాదేవీల ద్వారా రూ.2 కోట్లు పంపారని పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో అస్సాంలో సైబర్ నేరగాడు అక్కడి పోలీసులకు పట్టుబడడంతో నేరగాడి బ్యాంకు ఖాతాలను పరిశీలించగా అందులో డాక్టరు ఇంతియాజ్ వేసిన భారీ మొత్తాలను గుర్తించారు. ఆ విషయాన్ని అక్కడి పోలీసులు నేరుగా ఇంతియాజ్‌కు ఫోన్ చేసి చెప్పి వివరాలు ఆరా తీశారు. వెంటనే వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు సూచించడంతో.. బాధితుడు ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడిని మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు.



సృజనాత్మకతకు పెద్దపీట వేయండి

నిరంతరం కొత్తగా ఆలోచించేందుకు ప్రయత్నించండి. సృజనాత్మకతకు పెద్దపీట వేయండి. అప్పుడే అవకాశాల ప్రపంచానికి తలుపులు తెరుచుకుంటాయి. మీ అసలైన ప్రతిభను, మీలో ఇప్పటిదాకా మీరు కూడా గుర్తించని సామర్థ్యాలను సృజనాత్మకత తట్టిలేపుతుంది. సృజనాత్మక ఆలోచనా ధోరణితో- సమస్యల పరిష్కారం తేలికవుతుంది. భావోద్వేగాల నియంత్రణ మెరుగవుతుంది. నవకల్పనలు పుంజుకుంటాయి.

– *టేలిన్ జాన్ సిమండ్స్, డిజిటల్ విద్యావేత్త*

సాయం ఆపితే పోరు కష్టమే!

- మావోయిస్టులపై ఇప్పుడే ఎక్కువ నిఘా అవసరం
- కేంద్రానికి విన్నవించిన తెలంగాణ పోలీసులు



ఈనాడు, హైదరాబాద్: వామపక్ష తీవ్రవాదంపై పోరులో మరింత సహకారం అందించాలని రాష్ట్ర పోలీసు అధికారులు కేంద్రాన్ని కోరుతున్నారు. ముఖ్యంగా బలగాల మోహరింపు, నిధుల కేటాయింపుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని, పరిస్థితి అదుపులో ఉన్న ఈ తరుణంలో అజాగ్రత్తగా ఉంటే ఆ తర్వాత ఇబ్బంది పడే ప్రమాదం ఉందని తమ అభిప్రాయాన్ని వెల్లడించినట్లు తెలుస్తోంది. వామపక్ష తీవ్రవాద/మావోయిస్టుల ప్రభావిత జిల్లాలకు కేంద్రం ఎన్నో ఏళ్లుగా ప్రత్యేక సాయం చేస్తోంది. కేంద్ర బలగాలను మోహరించడంతోపాటు ఠాణాలు, రోడ్లు, పాఠశాలల భవనాలు, సెల్ టవర్ల నిర్మాణాలకు నిధులు ఇస్తోంది. తాము అందించాల్సిన సహకారం, క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేయడానికి వామపక్ష తీవ్రవాద బాధిత రాష్ట్రాలతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సోమవారం దిల్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. మన రాష్ట్రం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అనేక అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

దండకారణ్యానికి సరిహద్దు కావడంతో..

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతం వామపక్ష తీవ్రవాదంతో తీవ్రంగా సతమతమైంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక పరిస్థితి మరింత దిగజారుతుందని భయపడ్డారు. కానీ, పోలీసులు సమర్థంగానే అదుపు చేయగలిగారు. వామపక్ష తీవ్రవాదం పూర్తిగా కనుమరుగైందని మాత్రం చెప్పలేకపోతున్నారు. మావోయిస్టులకు పెట్టనికోటలా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం తెలంగాణకు సరిహద్దు. ఇక్కడి పోలీసులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా సరిహద్దు దాటి మావోయిస్టులు చొచ్చుకొచ్చే ప్రమాదం ఉండటంతో నిరంతర నిఘా కొనసాగుతోంది. అయితే, తెలంగాణలో పరిస్థితి అదుపులోకి వచ్చిందన్న ఉద్దేశంతో రాష్ట్రానికి ఇస్తున్న సాయాన్ని కేంద్రం క్రమంగా తగ్గిస్తోంది. పైగా ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలను మావోయిస్టు ప్రభావిత జిల్లాల జాబితా నుంచి తొలగించింది. మావోయిస్టులపై పోరాడేందుకు గతంలో కేంద్రం నాలుగు బెటాలియన్ల సీఆర్‌పీఎఫ్ బలగాలను రాష్ట్రానికి కేటాయించింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో వీటిని మోహరించారు. ఇప్పుడు వాటిని వేరే రాష్ట్రాలకు తరలించాలని కేంద్రం భావిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు మావోయిస్టులపై విరుచుకుపడుతుండటంతో వారు తెలంగాణలోకి వచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో పహారాకు కేంద్ర బలగాల అవసరం ఉందని, రాష్ట్రానికున్న పరిమిత వనరులతో ఇది సాధ్యంకాదని అమిత్‌షాతో జరిగిన సమావేశంలో అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని 2026 మార్చికల్లా కనిపించకుండా చేస్తామని చెబుతున్న కేంద్రం.. బలగాలు, నిధుల్లో కోత విధించడంపైనా చర్చించినట్లు సమాచారం.

★ మావోయిస్టుల అణచివేతలో అనుసరించాల్సిన వ్యూహాలపై తెలంగాణ పోలీసులు సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. నిఘా, సమాచార సేకరణ, క్షేత్రస్థాయిలో కార్యాచరణ, స్థానికులు, పోలీసుల సహకారం వంటి అంశాల్లో పాటించాల్సిన విధివిధానాలు, గోప్యత వంటివాటిని ఇందులో వివరించినట్లు సమాచారం. వామపక్ష తీవ్రవాదంపై విజయం సాధించాలంటే తెలంగాణకు ఉదారంగా సాయం చేయాలని అధికారులు కోరినట్లు తెలుస్తోంది.

మంచు విష్ణుకు దిల్లీ హైకోర్టులో ఊరట

ఈనాడు, అమరావతి: సినీ నటుడు, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు దిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. ఆయన ప్రతిష్ఠను దిగజార్చేలా యూట్యూబ్‌లో ఉంచిన వీడియోలను తొలగించాలని పలు యూట్యూబ్ ఛానళ్ల నిర్వాహకులను న్యాయస్థానం ఆదేశించింది. విష్ణు మంచు పేరు, స్వరం, చిత్రాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా దుర్వినియోగం చేయొద్దని స్పష్టంచేసింది. మంచు విష్ణుపై పోస్టుచేసిన పది యూఆర్ఎల్ లింక్‌లను తొలగించాలని కేంద్ర సమాచారశాఖ, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను ఆదేశించింది. సంబంధిత లింక్‌లను తొలగించాలని ఆయా యూట్యూబ్ ఛానళ్లకు స్పష్టం చేసింది. ఛానళ్లు 48 గంటల్లో తొలగించకపోతే వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని యూట్యూబ్ సంస్థను ఆదేశించింది. దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మిని పుష్కర్ణ ఈ నెల 1న ఇచ్చిన ఉత్తర్వులు తాజాగా వెలుగులోకి వచ్చాయి.

★ తన ప్రతిష్ఠను దిగజార్చేలా పలు యూట్యూబ్ ఛానళ్లు వీడియోలు ప్రసారం చేయడాన్ని సవాలు చేస్తూ సినీ నటుడు మంచు విష్ణువర్ధన్ బాబు దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ప్రతివాదులను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోతే పూడ్చుకోలేని నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. మంచు విష్ణు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వీడియోలను వ్యాప్తిచేయడం, ప్రసారం చేయడాన్ని నిలువరిస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఇక మహిళా 'ప్రగతి రథ చక్రాలు'

- స్వయం సహాయక సంఘాల ద్వారా బస్సుల కొనుగోలు
- ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో ప్రయోగాత్మక అమలు



సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, సీతక్క

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో 100 నుంచి 150 సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి, వాటిద్వారా బస్సులను కొనుగోలు చేయిస్తారు. ఇందుకోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళాశక్తి పథకంలో ఇప్పటివరకు 16 అంశాలుండగా... కొత్తగా బస్సుల కొనుగోళ్లను చేర్చారు. మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుల సంఖ్యను పెంచాలన్న డిమాండ్ వస్తుండటంతో ఆర్టీసీ... అద్దె బస్సులను సమీకరిస్తోంది. మహిళలకు వీటిద్వారా లబ్ధి చేకూర్చాలని మంత్రి పొన్నం ప్రతిపాదించగా సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. దీంతో మంగళవారం సచివాలయంలో మంత్రులు పొన్నం, సీతక్క ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేశ్, సెర్ప్ సీఈవో దివ్య, రవాణా కమిషనర్ ఇలంబర్తి పాల్గొని చర్చించారు.

★ ఒక్కో బస్సు ధర మార్కెట్‌లో రూ.40 లక్షలు ఉంది. ఈ మేరకు బ్యాంకుల ద్వారా రుణాన్ని స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేయిస్తారు. కొంత మేర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేందుకు యోచిస్తోంది. వారితో బస్సులు కొనుగోలు చేయించిన అనంతరం ఆర్టీసీ అద్దెకు తీసుకుంటుంది. తద్వారా వచ్చే ఆదాయాన్ని వడ్డీ చెల్లించడంతోపాటు సంఘాల నిర్వహణకు వినియోగిస్తారు. స్వయం సహాయక సంఘాల బస్సుల నిర్వహణ బాధ్యత కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

★ ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా రెండు ఉమ్మడి జిల్లాల్లో అమలు చేయాలని నిర్ణయించారు. సీఎం రేవంత్, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల సొంత జిల్లాలైన మహబూబ్‌నగర్, కరీంనగర్‌లను ఎంపికచేశారు. ఆయా జిల్లాల్లో ఐదేసి బస్సులను కొనుగోలు చేయించి, వాటిని స్థానికంగా ఉన్న ఆర్టీసీ డిపోలకు అద్దెకు ఇవ్వనున్నారు.

ఈ నెలలోనే నైపుణ్య శిక్షణకు శ్రీకారం

- తొలి విడతలో నాలుగు కోర్సులతో స్కిల్ వర్సిటీ ప్రారంభం
- దసరా సెలవుల తర్వాత తొలి నోటిఫికేషన్
- విశ్వవిద్యాలయం ఉప కులపతి సుబ్బారావు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే వినూత్నంగా ఏర్పాటు చేసిన 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' ఈ నెల నుంచే నైపుణ్య శిక్షణ కోర్సులకు శ్రీకారం చుట్టనుంది. యువతకు ఉద్యోగ హామీని ఇచ్చేలా కోర్సులను నిర్వహించనుంది. ఆయా రంగాల్లో పేరొందిన కంపెనీలు, సంస్థల భాగస్వామ్యంతో కోర్సులకు అవసరమైన సిలబస్‌ను రూపొందిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ ఏడాది గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలో తాత్కాలికంగా యూనివర్సిటీ తరగతులను ప్రారంభించాలని ఇటీవల బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా సమక్షంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలలో(అక్టోబరులో)నే నాలుగు కోర్సులను ప్రారంభించనున్నట్లు యూనివర్సిటీ ఉప కులపతి వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. "లాజిస్టిక్స్, మెడికల్ అండ్ హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యధిక ఉద్యోగాల డిమాండు ఉన్న నాలుగు కోర్సులను మొదటి విడతలో ప్రారంభించనున్నాం. దసరా సెలవుల తర్వాత వీటికి సంబంధించిన అడ్మిషన్లు, అర్హతల పూర్తి వివరాలతో నోటిఫికేషన్ వెలువడుతుంది. వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో రూ.7 కోట్లతో లాజిస్టిక్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రముఖ గ్లోబల్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ కంపెనీ 'రెడింగ్టన్' ముందుకొచ్చింది. లాజిస్టిక్స్ రంగానికి సంబంధించి రెండు స్వల్పకాల(షార్ట్ టర్మ్) కోర్సులను యూనివర్సిటీ ప్రారంభించనుంది. వేర్ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్, కీ కన్‌సైనర్ ఎగ్జిక్యూటివ్ పేర్లతో వీటిని నిర్వహిస్తుంది. వీటి నిర్వహణకు 'లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్' సహకారం అందిస్తోంది. నర్సులకు ఉన్నతమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఫైన్(ఫినిషింగ్ స్కిల్స్ ఇన్ నర్సింగ్ ఎక్స్‌లెన్స్) కోర్సును 'అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్'తో కలిసి ఈ ఏడాది నుంచే నిర్వహించనున్నాం. డాక్టర్ రెడ్డీస్ ఫార్మా అసోసియేట్ పేరుతో అప్రెంటిస్‌షిప్ ఇండక్షన్ కోర్సును సైతం ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తాం. దీనికి డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ సహకారం అందిస్తోంది. ఈ కోర్సు కాలవ్యవధి ఆరు నెలలు. యూనివర్సిటీ ప్రారంభించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ గ్యారంటీగా వస్తుంది. నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థులు నెలకు కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉండే ఉద్యోగాల్లో చేరే అవకాశాలు ఉంటాయి" అని వీసీ విశ్వాసం వ్యక్తం చేశారు.



EENADU Vol: 51, Iss: 60 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Door No. 5-13/2, Alugunoor Village, Thimmapur Mandal, Karimnagar District - 505 527, Telangana State. Editor: D N Prasad. Mobiles: 9959021802, 9959021803, RNI No. 52793/1992. Regd. No. L/RN/KAR/48/2024-2026 Eenadu, Karimnagar. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu



దాండియా జోష్

కరీంనగర్ మహాలక్ష్మి ఆలయంలో మంగళవారం రాత్రి యువతులు, మహిళలు దాండియా ఆడారు. అమ్మవారి చెంత భక్తితో నృత్యాలు చేశారు. నగరం నుంచి అధిక మంది హాజరయ్యారు.

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

ఉపాధ్యాయ కొలువులకు 219 మంది ఎంపిక

తుది జాబితాను ప్రకటించిన విద్యాశాఖ

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యావిభాగం

ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న జిల్లాలోని అభ్యర్థుల కల నెరవేరింది. డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను మంగళవారం విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థుల్లో, వారి కుటుంబాల్లో సంతోషం నెలకొంది. గత నెల 30న డీఎస్సీ ఫలితాలను విద్యాశాఖ ప్రకటించి 1:3 పద్ధతిలో మొత్తం 620 మంది అభ్యర్థులను ధ్రువీకరణపత్రాల పరిశీలనకు పిలిచారు. ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఎంపికైన వారి జాబితాను ప్రకటించారు. దసరా కానుకగా ప్రభుత్వ కొలువును అందుకోబోతున్నామనే సంతోషం వారిలో వ్యక్తమవుతోంది.

మిగిలిపోయిన 26 పోస్టులు..

జిల్లాలో మొత్తం వివిధ విభాగాల్లో 245 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించారు. మంగళవారం విద్యాశాఖ ప్రకటించిన తుది జాబితాలో 219 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ల ప్రకారం పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. అందుకు అనుగుణంగా మెరిట్ జాబితాలో అభ్యర్థులు లేని కారణంగా 26 పోస్టుల్లో ఎవరిని నియమించలేదు. స్కూల్ అసిస్టెంట్లలో 2, భాష పండితుల్లో 2, పీఈటీల్లో 2, ఎస్జీటీల్లో 14, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎస్జీటీలో 6 పోస్టులు ఉన్నాయి. వైకల్యం, మాజీ సైనికుల కోటాల్లో అభ్యర్థులు లేని కారణంగా వాటికి కేటాయించిన పోస్టులు భర్తీ కాలేదు.

నేడు హైదరాబాద్‌లో నియామక పత్రాలు

డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకోనున్నారు. అభ్యర్థులను హైదరాబాద్ తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా ఆరు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బస్సుకు ఇన్‌ఛార్జిగా ప్రధానోపాధ్యాయుడు, ఒక వ్యాయామ ఉపాధ్యాయుడు, ఎస్కార్ట్‌గా ఒక పోలీసును ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఉదయం 7.30కు కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఇండోర్ స్టేడియం వద్ద నుంచి ఈ బస్సులు వెళ్లనున్నాయి. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ సిబ్బంది ఈ విషయాన్ని చరవాణుల ద్వారా సమాచారమందిస్తూ ఉదయం హాజరుకావాలని సూచిస్తున్నారు. ఎంపికైన అభ్యర్థుల నియామక పత్రాలు తయారు చేసేందుకు మంగళవారం సాయంత్రం నుంచి వారికి సంబంధించిన పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, డీఎస్సీ హాల్‌టికెట్లను సేకరించేందుకు డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నియామక పత్రాలను పొందిన అనంతరం అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ కరీంనగర్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వాటి తేదీలను అధికారులు ప్రకటించాల్సి ఉంది.



ఎంపికైన అభ్యర్థుల నుంచి హాల్‌టికెట్ ప్రతులను తీసుకుంటున్న జిల్లా విద్యాశాఖ సిబ్బంది

భర్తీ అయ్యే ఉపాధ్యాయుల వివరాలు

విభాగం	పోస్టులు
స్కూల్ అసిస్టెంట్	84
భాషా పండితులు	16
పీఈటీలు	5
ఎస్జీటీలు	100
స్పెషల్ ఎడ్యుకేటర్ ఎస్ఏ	5
" " ఎస్జీటీ	9



రామ రామ రామ ఉయ్యాలో..

కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కరీంనగర్ గ్రామీణ మండలం బొమ్మకల్‌లో మంగళవారం సద్దుల బతుకమ్మను నిర్వహించారు. గ్రామంలోని కూడళ్ల వద్ద బతుకమ్మ ఆడారు. వేడుకను చూడటానికి సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పురుమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు హాజరయ్యారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.



కరీంనగర్‌లో బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ పమేలా సత్పతి





బొమ్మకల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఫోన్లు ఎత్తని బల్దియా అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న పలు విభాగాల అధికారులు ఫోన్లు ఎత్తడంలేదనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఇటీవల పలువురు ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై రాగా వీరందరికి గతంలో పని చేసిన సిమ్ నంబర్లను కేటాయించారు. మిగతా వారంతా ఇక్కడే విధుల్లో ఉండగా కనీసం ఫోన్లు మాట్లాడటం లేదంటున్నారు. ప్రధానంగా ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగంలో ఈ సమస్య అధికంగా ఉందని చెబుతున్నారు. ఏ సమయంలోనైన సరే సమావేశాలు అంటూ సంక్షిప్త సమాచారాలు ఇచ్చి మర్చిపోతున్నారు. వీటికి సంబంధించిన బిల్లులు బల్దియానే చెల్లిస్తుండగా ప్రజలు అత్యవసర సమయాల్లో ఫోన్లు చేస్తే కనీసం సమాధానం ఇవ్వడంలేదనే విమర్శలున్నాయి. ఈ విషయంలో కమిషనర్ స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ బిజినెస్ ఆఫీస్, రాజీవ్ చౌక్, కరీంనగర్

స్వచ్ఛందంగా విధుల నుండి వైదొలగుట

1) శ్రీమతి సాహిత్య అనంతుల, D/o. అనంతుల శంకరయ్య, H.No. 2-10-1388, జ్యోతినగర్, కరీంనగర్
అమ్మా!
మీరు SBI భగత్‌నగర్ శాఖ (కోడ్ నం. 22051) కరీంనగర్‌లో అసోసియేట్‌గా పనిచేయుచూ యాజమాన్యం పలు పర్యాయములు నోటీసులు ఇచ్చినప్పటికీ కూడా తేది: 2-2-2023 నుండి అనధికారికంగా విధులకు హాజరు కావడం లేదు. మీరు ఈ పేపరు నోటిఫికేషన్ తేదీ నుండి 30 రోజులలోగా అనగా తేది: 9-11-2024 గా విధులకు హాజరు కావల్సిందిగా ఆదేశించడమయినది. లేనిచో మీకు గత కొంత కాలముగా పంపబడుతున్న నోటీసుల ప్రకారం మరియు 8వ బైపార్టయిట్ సెటిల్‌మెంట్ తేది: 02 జూన్ 2005, 33వ క్లాజు ప్రకారం తేది: 9-11-2024 నాడు మీరు విధుల నుండి స్వచ్ఛందంగా వైదొలగినట్లుగా యాజమాన్యం భావించడం జరుగుతుంది.

2) శ్రీ మంగ సూర్య వంశీకృష్ణ, S/o. గంగాధర్, H.No. 4-69/33/Q, Opp: అన్విత గార్డెన్స్, తీగలగుట్టపల్లి, కరీంనగర్
అయ్యా!
మీరు SBI కలెక్టరేట్ కాంప్లెక్స్ శాఖ, (కోడ్ నం. 20606) కరీంనగర్‌లో అసోసియేట్‌గా పనిచేయుచూ యాజమాన్యం పలు పర్యాయములు నోటీసులు ఇచ్చినప్పటికీ కూడా తేది: 01-10-22 నుండి అనధికారికంగా విధులకు హాజరు కావడం లేదు. మీరు ఈ పేపరు నోటిఫికేషన్ తేదీ నుండి 30 రోజులలోగా అనగా తేది: 9-11-24 గా విధులకు హాజరు కావల్సిందిగా ఆదేశించడమయినది. లేనిచో మీకు గత కొంత కాలముగా పంపబడుతున్న నోటీసుల ప్రకారం మరియు 8వ బైపార్టయిట్ సెటిల్‌మెంట్ తేది: 02 జూన్ 2005, 33వ క్లాజు ప్రకారం తేది: 9-11-2024 నాడు మీరు విధుల నుండి స్వచ్ఛందంగా వైదొలగినట్లుగా యాజమాన్యం భావించడం జరుగుతుంది.

సం/-, **రీజనల్ మేనేజర్ మరియు అపాయింటింగ్ అథారిటీ**, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సైబర్ మోసం.. కొత్త రూపం

అధికారులమని బెదిరిస్తూ డబ్బు స్వాహా

న్యూస్‌టుడే, గోదావరిఖని

లింకు క్లిక్ చేస్తే డబ్బులు మాయం.. కొత్త యాప్‌లు తెరిస్తే ఖాతా నుంచి డబ్బు బదిలీ.. 'వ్యాపారంలో పెట్టుబడి పెట్టండి.. రెండింతల ఆదాయం పొందండి' అంటూ ప్రచారంతో మోసం.. 'మీ చరవాణి నంబర్ లక్కీ డ్రాకు ఎంపికైంది కొంత డబ్బు చెల్లిస్తే బంగారు ఆభరణం మీ చేతికి వస్తుంది' అంటూ దగా..

ఇలా సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలతో అమాయకులను గతంలో బురిడీ కొట్టించారు.. పాత నేరాలపై అవగాహన పెరిగి జనం జాగ్రత్త పడుతుండటంతో కొత్త రూపాలెత్తుతున్నారు.. తాజాగా పోలీసుల అవతారమెత్తి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో రూ.15.82 కోట్లను సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి కొల్లగొట్టారు. కొత్త కొత్త రూపాల్లో వస్తున్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటేనే సొమ్ము భద్రంగా ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా డబ్బు క్షణాల్లో వారి చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంది.

డబ్బు పోయిందా.. తిరిగి రాదు

గుర్తు తెలియని వ్యక్తి బెదిరించగానే చెప్పిన ఖాతాకు డబ్బులు పంపిస్తున్నారు. ఒక్కసారి డబ్బు వారి ఖాతాలోకి చేరిందంటే తిరిగి రావడమంటూ ఉండదు. ఒకవేళ మోసపోయినా గంటలోపు గుర్తించి 1930కు సమాచారం అందిస్తే 90 శాతం సొమ్మును బదిలీ కాకుండా సైబర్ క్రైం పోలీసులు ఆపగలుగుతారు. ఆలస్యమైన కొద్దీ నిలువరించే శాతం తగ్గుతుంది.


ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు..

నమోదైన కేసులు : 1,788

సైబర్ నేరగాళ్లకు బదిలీ అయిన డబ్బు : రూ. 19,29,51,036

సకాలంలో స్పందించడంతో బదిలీ కాకుండా ఆపగలిగింది : రూ. 3,46,81,599

మోసం ద్వారా జనం నష్టపోయిన మొత్తం : రూ. 15,82,69,437



ఉమ్మడి జిల్లాలో తాజా మోసాలిలా

- నీ మీద మనీ లాండరింగ్ కేసు నమోదైంది. మేము ముంబయి పోలీసులం. కేసు లేకుండా ఉండాలంటే మేము చెప్పిన బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేయాలి.
- మేము సీబీఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం. మీపై కేసు నమోదైంది. అరెస్టు చేయకుండా ఉండాలంటే చెప్పిన బ్యాంకు ఖాతాలో డబ్బు వేయాలి. లేదంటే విచారణ కోసం సీబీఐ కార్యాలయానికి తీసుకెళ్తాం.
- దిల్లీ పోలీసులం మాట్లాడుతున్నాం. గంజాయి రవాణా చేస్తుండగా మీ అబ్బాయి పట్టుబడ్డాడు. వెంటనే డబ్బు పంపిస్తే వదిలేస్తాం.
- అక్రమ లావాదేవీలపై విచారణ చేస్తున్నాం. అందులో మీ ప్రమేయమున్నట్లు అనుమానం ఉంది. విచారణ కోసం సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి. అందులో మీ ప్రమేయం లేదని తేలితే డబ్బు తిరిగిచ్చేస్తాం.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- చరవాణిలకు వచ్చే తెలియని లింకులను తెరవకూడదు.
- గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించినా స్పందించకూడదు. పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- రుణాలు మంజూరయ్యాయంటే నమ్మకూడదు. అలాంటి యాప్‌ల జోలికి వెళ్లకూడదు.
- పోలీసులమని ఫోన్ చేసే వ్యక్తుల మాటలను నమ్మకండి. వారు సరైనవారా కాదా అని నిర్ధారించుకోండి. అవసరమైతే మీ పరిధిలో ఉన్న పోలీసులకు తెలియజేయండి.
- ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు యాప్‌లను పంపిస్తుంటారు. పెట్టుబడి పెడితే రెండింతలవుతుందని నమ్మిస్తారు. వీటిపై కూడా జాగ్రత్తగా ఉండాలి.

ప్రజల సహకారం అవసరం

సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయినా ప్రజలు మోసగాళ్ల వలలో పడుతున్నారు. కొత్త కొత్త రూపాల్లో సైబర్ నేరగాళ్లు వస్తున్నారు. అప్రమత్తతతో గుర్తించాలి.

- వెంకటరమణ, రామగుండం సైబర్‌క్రైం ఏసీపీ

గ్రామాల్లో జాతీయ స్థాయి బృందం పర్యటన

శంకరపట్నం(సైదాపూర్), న్యూస్‌టుడే: సైదాపూర్ మండలం రాములపల్లి, సర్వాయిపేట గ్రామాల్లో మంగళవారం జాతీయస్థాయి మానిటరింగ్ బృందం(ఎన్ఎల్ఎం) సభ్యులు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్వహణ తీరు, నిధుల వినియోగం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి పలు వివరాలు నమోదు చేసుకున్నారు. చెరువుల పూడికతీత, పంట కాలువ పనులు, నర్సరీలను సందర్శించారు. ఎంపీడీవో యాదగిరి, ఏపీడీ కృష్ణ, అధికారులు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో ఖాజా బషీరొద్దీన్, ఏపీవో రాణి, డీపీఎం రవీందర్, ఎస్‌బీఎం ప్రతినిధి రమేశ్ పాల్గొన్నారు.



డివిజన్లలో ప్రత్యేక దీపాలు వెలిగేనా?

న్యూస్‌టుడే, కార్పొరేషన్

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో మొదటి నుంచి బతుకమ్మ టెండర్ల విషయంలో గుత్తేదారులు వెనకడుగు వేయగా.. ఆ ఇబ్బందులు చివరి వరకు అధికార యంత్రాంగానికి ముచ్చెమటలు పట్టించేలా మారాయి. టెండర్లు నిర్వహించినా కాంట్రాక్టర్లు మొదట్లో ముందుకు రాకపోవడంతో వారితో చర్చలు జరిపి చివరకు అంచనాల రేట్లు పెంచడంతో పనులు చేసేందుకు ముందుకొచ్చిన విషయం తెలిసిందే. బతుకమ్మలు నిమజ్జనం చేసే చెరువులు, డ్యాం కట్ట ప్రాంతంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా సద్దుల బతుకమ్మ రోజు డివిజన్లలో బతుకమ్మలు ఆడుకునే పాయింట్లలో వెలుతురు ఉండేందుకు ప్రత్యేకంగా లైట్లు పెట్టించాల్సి ఉంటుంది. దీనికోసం రెండుసార్లు టెండర్లు పిలవగా ఆసక్తి ఉన్న గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. 30 డివిజన్లకు ఒక టెండర్ పిలవడంతో లైట్లు బిగించే సమయంలో ఎక్కువ, తక్కువ లైట్లు అంటూ కార్పొరేటర్ల నుంచి ఒత్తిళ్లు వస్తాయనే భావనతో ఎందుకొచ్చిన గొడవ అంటూ గుత్తేదారులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. గురువారం పండగ ఉండగా బుధవారం సాయంత్రం లైట్లు వెలిగించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు లైట్ల విషయం ఖరారు కాకపోవడం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో నగర మేయర్ వై.సునీల్‌రావు అధికారులతో చర్చించారు. చివరకు ఒక గుత్తేదారుతో లైట్లు బిగించేందుకు చర్యలు తీసుకోగా ఒక రోజు గడువుతో టెండర్ వేసేలా ఏర్పాట్లు చేసినట్లు ఇంజినీరింగ్ అధికారి ఒకరు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం వరకు గుత్తేదారును ఎంపిక చేస్తే అన్ని డివిజన్లలో బిగించే వరకు ఎంత సమయం పడుతుందో అధికారులకే తెలియాలి. అవి వెలగకపోతే మళ్లీ సరి చేయాల్సిన బాధ్యత ఎవరిదో అర్థం కాకుండా తయారైంది. మొత్తానికి ఈసారి బతుకమ్మ ఏర్పాట్ల టెండర్ల విషయంలో అధికారులు అనుసరిస్తున్న తీరు విమర్శలకు తావిచ్చేలా తయారైందని పలువురు పాలకవర్గ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

శ్రద్ధాంజలి



శ్రీ వేములు లక్ష్మీపతి గారు
SE Retd.
DOB: 03-04-1943 DOD: 08-10-2024

శ్రీ వేముల లక్ష్మీపతి గారు
SE Retd.
తేది: 08-10-2024 రోజున అనారోగ్యంతో కోరుట్లలో ఉ॥ 8.00 గం॥లకు మరణించినారు. వారి మరణం మాకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించినది. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ...

MEMBERS
THE RETIRED ELECTRICITY ENGINEERS ASSOCIATION
Karimnagar Dist.

Amma Ads-9849262882

సందిగ్ధంలో విద్యుత్తు ఉద్యోగుల బదిలీలు

న్యూస్‌టుడే, భగత్‌నగర్



విద్యుత్తు సంస్థలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ సందిగ్ధంలో ఉండిపోయింది. సోమవారం ఇవ్వాల్సిన బదిలీ ఉత్తర్వులు చివరి నిమిషంలో నిలిచిపోయాయి. మంగళవారం సైతం దీనిపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియపై ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. సాధారణంగా మూడేళ్ల సర్వీసు నిండిన వారికే బదిలీ చేపట్టేవారు. కానీ ప్రస్తుతం రెండేళ్లకు కుదించడంతో ఎక్కువ మంది బదిలీ కావాల్సి వస్తోంది. ఓ ఉద్యోగి కొత్త ప్రాంతానికి వచ్చి కుదురుకోవడానికే ఆరు నెలల సమయం పడుతుంది. అలాంటిది రెండేళ్లకు అనేది వారికి అసౌకర్యంగా మారింది. ముఖ్యంగా ఇంజినీర్లను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన సమయంలో ఆ భౌగోళిక పరిస్థితులు అవగతం కావడానికి సమయం పడుతుంది. దీనికి తోడు ఆయా సెక్షన్ల పరిధిలో చేసిన అభివృద్ధి పనుల భారం అధికంగా ఉంటుంది. ఒక్కో ఇంజినీరుకు 50 నుంచి 120 వరకు వర్క్ ఆర్డర్లు ఉంటాయి. బదిలీపై వెళ్లాక వాటిని పూర్తి చేయడానికి ఆరు నెలల సమయం పడుతుంది. ఆ ప్రాంతానికి వచ్చిన ఇంజినీరుకు ఆ ప్రాంతం అవగతం అవడానికి ఆరు నెలలు పడుతుంది. ఇలా ఇంజినీర్లకు ఇబ్బందే. ఇదే మూడేళ్ల సమయం ఉంటే వారు చివరి ఆరు నెలల్లో పనులను పూర్తి చేసుకునే అవకాశముంది.

విద్యాసంవత్సరం మధ్యలో..

మొదట ట్రాన్స్‌కోలో బదిలీ మార్గదర్శకాలు విడుదలైన తరువాత డిస్కంలలో విడుదల జేసేవారు. ప్రస్తుతం ట్రాన్స్‌కోలో బదిలీ మార్గదర్శకాలు జారీకాకుండానే డిస్కంలలో జారీ చేశారు. సాధారణంగా జూన్, జులైలలో బదిలీ నోటిఫికేషన్ జారీ చేసేవారు. ప్రస్తుతం సెప్టెంబరులో బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉద్యోగుల పిల్లలకు విద్యాపరంగా ఇబ్బందులు వచ్చే అవకాశముంది.

పైరవీలకు అడ్డుకట్ట..

ప్రస్తుత బదిలీల్లో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి కొత్త విధానాన్ని తీసుకొస్తూ పైరవీలకు అడ్డుకట్ట వేశారు. గతంలో ఉద్యోగులు తాము బదిలీ కావాలని కోరుకున్న ప్రాంతాలను (ఐచ్ఛికాలను) ఆయా సంఘాల నాయకులకు ఇవ్వాల్సి వచ్చేది. ఆ విధానాన్ని సీఎండీ తొలగిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఏ ప్రాంతాలు కావాలో మూడింటిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఇలా ఆన్‌లైన్‌లో తాము కోరుకున్న ప్రాంతాలు ఉద్యోగులు చూసుకునే వెసులుబాటు కల్పించారు. గతంలో ఉద్యోగి కోరుకున్నది ఒక ప్రాంతమైతే సంఘాల నాయకులు మరో చోటకు బదిలీ చేయించేవారు. ఆ ఇబ్బందిని ప్రస్తుతం తొలగించారు.



(c) eenadu

విశ్వవ్యాప్తం.. బతుకమ్మ సంబరం

తీరొక్క పూలతో సంస్కృతీ సంప్రదాయాలను పూయిస్తున్న బతుకమ్మ.. కొన్నేళ్లుగా విశ్వవ్యాప్తంగా సందడి చేస్తోంది. మన పండగ అనే భావనతో వివిధ దేశాల్లో స్థిరపడిన వారంతా పోటీపడి వేడుకలు నిర్వహిస్తున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఆసక్తికరమైన పోటీలు నిర్వహిస్తూ ఈ పండగకు నిర్వాహకులు వన్నె తెస్తున్నారు. రాష్ట్రం నుంచి రాజకీయ నాయకులు, సినీతారలు, బుల్లితెర నటులు, ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల అధికారులు, వివిధ దేశాల ప్రజాప్రతినిధులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారు.
న్యూస్‌టుడే, మేడిపల్లి



ఎడారి దేశాల్లో పూల సందడి

గల్ఫ్ దేశాల్లో బతుకమ్మ వేడుకలకు విశేష స్పందన వస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఆయా దేశాలకు వెళ్లిన వారికి ఈ వేడుకలు ఆనందాన్నిస్తున్నాయి. దుబాయిలో గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 6న.. ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో అక్టోబరు 5న సంబరాలు జరిపారు. గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్‌లో చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన జువ్వాడి శ్రీనివాస్‌రావు, మంథనికి చెందిన శ్రీనివాస్ శర్మ, జగిత్యాలకు చెందిన మెట్ట రమేశ్‌చంద్ర, సలావుద్దీన్, మేడిపల్లికి చెందిన దామెర సామ్యూల్ పండగ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీచర కిరణ్‌కుమార్ బోయినిపల్లి మండలం వర్దవెల్లికి చెందిన వారు కాగా ప్రస్తుత అధ్యక్షుడు రాధారపు సత్యం సిరిసిల్ల వాస్తవ్యులు. ఇండియన్ పీపుల్స్ ఫోరంలో మేడిపల్లి మండలం తొంబర్రావుపేటకు చెందిన గంగారాం సభ్యుడిగా ఉన్నారు. దుబాయి సహా బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతర్ తదితర గల్ఫ్ దేశాల్లోనూ పూల పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.


దుబాయిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అంబరాన్నంటేలా..

అమెరికాలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 5న వైభవంగా పండగ జరిపారు. పెద్దపల్లికి చెందిన విశ్వేశ్వర్‌రెడ్డి కల్వల ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. న్యూవింగ్టన్‌లో ఈ నెల 6న తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరగగా.. డల్లాస్, చికాగోలోనూ కార్యక్రమాలు నిర్వహించారు. న్యూజెర్సీలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో 20వ సారి.. ఫ్లోరిడాలోని టాంపా నగరంలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న వేడుకలు జరిగాయి. అమెరికాతోపాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్, మలేషియా, యూకే తదితర దేశాల్లో కొన్ని ప్రాంతాల్లో వేడుకలు పూర్తి కాగా మరి కొన్ని ప్రాంతాల్లో జరగనున్నాయి.


అమెరికాలో వేడుకలకు హాజరైన అతివలు

వేడుకలకు అతిథులు

దుబాయిలో జరిగిన వేడుకలకు మంత్రి జూపల్లి క్రిష్ణారావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. సినీనటి అనన్య, జానపద గాయని వరం, బుల్లితెర హాస్యనటుడు సదన్న, భారత రాయబార కార్యాలయం నుంచి బిజేందర్ సింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమెరికాలో వేడుకలకు మంత్రి జూపల్లి క్రిష్ణారావు హాజరయ్యారు. అమెరికా సహా వివిధ దేశాలకు తెలంగాణకు చెందిన పలువురు సినీనటులు, బుల్లితెర నటులు, వ్యాఖ్యాతలు, గాయనీ గాయకులు, సినీ ప్రముఖులు హాజరవుతూ బతుకమ్మ వేడుకలకు వన్నె తెస్తున్నారు.

ఊరిలో ఉన్నట్టుగానే ఉంది



ఈటీసీఏ ఆధ్వర్యంలో ఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నాం. మహిళా విభాగం ఈ వేడుకల నిర్వహణలో చురుకుగా పాల్గొంటోంది. ఈసారి వేడుకలకు 5 వేల మంది వరకు హాజరయ్యారు. ఇక్కడి వాతావరణం చూస్తుంటే మా గ్రామంలో ఉన్నట్లే అనిపిస్తోంది. ఆటపాటలతో మహిళలు, చిన్నారుల సందడి పండగకు వన్నె తెచ్చింది. ఏటా ఇలాగే కార్యక్రమాలు నిర్వహించాలని ఈటీసీఏ భావిస్తోంది. **- రాణి కోట్ల, దుబాయి**

ఆకట్టుకున్న పండగ



దుబాయిలో బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో వేడుకల్లో పాల్గొన్నారు. దసరా ముందర ఈ పండగ అందరిలో హుషారు నింపింది. ఎడారి దీవుల పక్కన పూలతో చేసుకునే పండగ ఇక్కడి వారు కూడా ఆస్వాదించారు. రాష్ట్రం నుంచి వచ్చిన పలువురు వారి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. **- మౌనిక గుండవేని, దుబాయి**

ఐరావతంపై నారసింహుడి ఊరేగింపు

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐరావతం (ఏనుగు)పై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం నుంచి సేవను పుర వీధుల్లో స్వామివారి శోభాయాత్ర ఘనంగా ఊరేగించారు. ఈవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సొంతానికి ఎక్కువ.. ఆర్థికాభ్యున్నతికి తక్కువ

మహిళా రుణాల వినియోగం తీరిది ● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

న్యూస్‌టుడే, కరీంనగర్ సంక్షేమ విభాగం

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బ్యాంకు లింకేజీతో రుణాలు అందజేస్తున్నారు. గతేడాది విధించిన లక్ష్యం చేరుకోవడంతో.. రాష్ట్రస్థాయిలో అవార్డు సైతం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం 2024-25 లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. రుణాలు తీసుకున్న వారిలో అతికొద్ది మాత్రమే వ్యాపారానికి ఉపయోగించుకొని ఆర్థికాభ్యున్నతి పొందుతున్నారు. ఎక్కువ శాతం మంది సొంత అవసరాలకే వినియోగిస్తున్నారు. వారిలో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు ఏటా మంజూరు చేసిన రుణాన్ని.. సొంతానికి వినియోగించుకున్న అప్పులు చెల్లించడం, ఇతరాత్ర వాటికే మహిళలు ఉపయోగించుకుంటున్నారు. సొంతంగా ఏదైనా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ఆలోచన చేయడంలేదు. అతి కొద్దిమంది మాత్రమే చిన్నపాటి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మహిళలు పురోగతి సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంజూరు చేసిన రుణమొత్తానికి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాల వారీగా ఈ ఆర్థిక సంవత్సరం వివరాలు

జిల్లా	సంఘాలు	రుణ లక్ష్యం (రూ.లక్షల్లో)
కరీంనగర్	11,083	77,125.34
రాజన్న సిరిసిల్ల	8,007	53,319.00
పెద్దపల్లి	9,101	47,796.95
జగిత్యాల	12,636	76,563.63



అవగాహన అవసరం

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని వ్యాపారాలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. వారందరూ రుణాలు తీసుకునేలా ఏటా లక్ష్యాన్ని విధిస్తోంది. అధికారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా సభ్యురాళ్లకు రుణాలు మంజూరు చేస్తే.. అందులో కనీసం వందల్లో కూడా ఆర్థికంగా రాణిస్తున్న వారు లేకపోవడం విశేషం. ప్రస్తుతం పలు సంఘాలు ఏటా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం తీసుకుంటున్నాయి.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించడానికి ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి ద్వారా సొంతంగా వ్యాపారాలు నిర్వహించేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వ్యాపారాలు ప్రారంభించి లాభాన్ని అర్జించేలా అధికారులు సూచనలు చేస్తూ పర్యవేక్షించేలా చూస్తాం.
- శ్రీధర్, కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ఆధ్యాత్మిక పర్యాటకం.. అభివృద్ధికి అవకాశం

ఉమ్మడి జిల్లాలో సర్క్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు

న్యూస్‌టుడే, ధర్మపురి

పర్యాటక, దేవాదాయశాఖల ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు సర్క్యూట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల్లో ఆధ్యాత్మికతను వెదజల్లుతూనే.. పర్యాటకంగా భక్తులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో ఈ కేంద్రాలు మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.


ధర్మపురి దేవస్థానం

● చరిత్రాత్మక ఆలయాలు..

☛ జగిత్యాల జిల్లాలోని చారిత్రక ప్రాధాన్యత కలిగి శాతవాహనుల రాజధానిగా వెలుగొందిన కోటిలింగాలలోని కోటి లింగేశ్వరస్వామి ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని తొమ్మిది నృసింహ క్షేత్రాల్లో ఒకటిగా పూజలందుకున్న ధర్మపురి క్షేత్రం.. భక్తుల కొంగు బంగారమైంది.

☛ జిల్లా సరిహద్దున గల రాయపట్నం వద్ద పురాతన, నూతన వారధుల ప్రదేశం, ఎల్లంపల్లి నిలువ నీటి ప్రదేశాలు భక్తులను ఆకర్శిస్తున్నాయి. ఇప్పటికే వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల వద్ద ఏర్పాటుచేసిన బోటింగు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

☛ ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం దక్షిణ కాశీగా చారిత్రాత్మక ప్రాధాన్యతను పొంది, భక్తులకు పెన్నిధిగా మారింది. లక్షలాది మంది హనుమాన్ భక్తులతో నిండిన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం విశేష ప్రాచుర్యాన్ని పొందింది.

● ప్రణాళికల రూపకల్పన..

గత నెలలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యార్, కమిషనర్ హన్మంతరావులతోపాటు, దేవస్థానాలకు చెందిన అధికారులు సమావేశమయ్యారు. ఆలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాన్లు, భక్తులకు వీఐపీ దర్శన సౌకర్యాల కల్పనలపై సుదీర్ఘంగా చర్చించారు. దేవస్థానాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై, భక్తులకు వసతులతోపాటు, ఆయా కేంద్రాల్లో పర్యాటకపరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఓ వైపు పర్యాటకపరంగా ఏఏ పనులు ఇంతకుముందు ప్రతిపాదించారు? ఇంకా ఏ పనులు చేపట్టాల్సి ఉంది? నిధులు ఎన్ని అవసరమవుతాయనే విషయంపై చర్చించనున్నారు.

☛ ఇంతటి ప్రాధాన్యతలు, విశేషాలు ఉన్న ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలను కలిపి మొదటి సర్క్యూట్‌గా ఏర్పాటుచేసి, పర్యాటక, దేవాలయాల పరంగా అభివృద్ధి పరచే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఎస్సారెస్పీకి 34 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం వరకు 34,086 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా 4 స్పిల్‌వే గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులు, మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. కాకతీయ కాలువ, విద్యుత్తు ఉత్పత్తికి 6,800, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది.

బడితండా వాసికి బంగారు పతకం


పతకంతో అనిల్

రుద్రంగి, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా యూత్ గేమ్స్ 800 మీటర్ల పరుగు పోటీలో రుద్రంగి మండలం బడితండాకు చెందిన మాలోత్ అనిల్ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఇటీవల జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు కూడా అనిల్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం అనిల్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. వివిధ క్రీడల్లో రాణిస్తున్న యువకుడిని మండలానికి చెందిన పలువురు అభినందించారు.

కాజీపేట నుంచి దాదర్‌కు రెండు ప్రత్యేక రైళ్లు



పెద్దపల్లి, న్యూస్‌టుడే: కాజీపేట, దాదర్ మధ్య నవంబరు నుంచి రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మొదటి రైలు కాజీపేట నుంచి నవంబరు 27 నుంచి జనవరి 29 వరకు ప్రతి బుధవారం నడుస్తుంది. తిరిగి ఇదే రైలు దాదర్ నుంచి నవంబర్ 28 నుంచి జనవరి 30 వరకు ప్రతి గురువారం బయల్దేరుతుంది. రెండో ప్రత్యేక రైలు నవంబర్ 30 నుంచి జనవరి 25 వరకు ప్రతి శనివారం కాజీపేట నుంచి దాదర్‌కు, డిసెంబర్ 1 నుంచి జనవరి 26 వరకు ప్రతి ఆదివారం దాదర్ నుంచి నడుస్తుంది. రెండు రైళ్లు ఉమ్మడి జిల్లాలోని జమ్మికుంట, పెద్దపల్లి, కరీంనగర్, లింగంపల్లి(జగిత్యాల), కోరుట్ల, మెట్‌పల్లి స్టేషన్లలో ఆగుతాయి. ఇక్కడి నుంచి బాసర వెళ్లే భక్తులకు ఈ రైళ్లు అనుకూలంగా ఉంటాయి.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు ప్రకటించామని ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం తెలిపారు. పండగల అనంతరం సోమవారం మార్కెట్ నిర్వహణ ఉంటుందని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించాలని ఆయన కోరారు.

తగ్గిన విక్రయాలు

మంగళవారం మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు తగ్గాయి. యార్డుకు 45 ట్రాలీల విడి పత్తి రాగా.. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,650 ధర పలికింది. 65 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.5,900-6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. పాత పత్తి విక్రయానికి రాలేదని మార్కెట్ అధికారులు తెలిపారు. సోమవారం కంటే తాజాగా పత్తి ధర రూ.150 తగ్గింది. తేమ అధికంగా ఉండటం, నాణ్యత లేకపోవటంతో ధర తగ్గిందని వ్యాపారులు అంటున్నారు.

హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు

జగిత్యాల, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో ఒకరికి జగిత్యాల న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బుగ్గారం మండలం గోపులాపూర్‌లో రొండి మాణిక్యం అలియాస్ సంతోశ్.. తన అన్న రొండి రవీందర్ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. రవీందర్ భార్య సుజాత మంత్రాలు చేయడం వల్లే తన భార్యాపిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని భావించి మాణిక్యం కోపం పెంచుకున్నాడు. 2018 ఫిబ్రవరి 21న కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో రవీందర్ ఇంట్లోకి చొరబడిన మాణిక్యం.. తన వదిన సుజాతపై దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. బుగ్గారం పోలీసులు కేసు నమోదు చేసి మాణిక్యంను రిమాండ్‌కు పంపించగా ఎస్సైలు మధూకర్, రవీందర్‌లు కేసు దర్యాప్తు చేశారు. కోర్టు విధుల అధికారులు రాజునాయక్, శ్రీధర్, కిరణ్‌లు సాక్ష్యాధారాలు అందించగా ప్రాసిక్యూషన్ తరపున అదనపు పీపీ సాయిల్ల మురళి వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రసాద్.. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. శిక్ష పడటానికి చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

క్రైం కార్నర్

మేయర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ వై.సునీల్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత ఫిర్యాదు ఆధారంగా కోర్టు ఆదేశాలతో పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. తన డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కేటాయించాలని గతంలో మేయర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించానని.. ఆ సమయంలో కులం పేరుతో దూషించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డివిజన్‌కు దురుద్దేశపూర్వకంగానే నిధులు ఇవ్వడంలేదని రెండు సార్లు పోలీసు స్టేషన్‌లో కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారని కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో వాస్తవాలని ధ్రువీకరించేందుకు పోలీసులు త్వరలో విచారణ చేపట్టనున్నారు.

గొలుసు చోరీ నిందితుల అరెస్టు

తెలంగాణచౌక్ (కరీంనగర్): గొలుసు దొంగతనాలకు (చైన్‌స్నాచింగ్) పాల్పడుతున్న నిందితులను పట్టుకున్నామని రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఏసీపీ తెలిపిన ప్రకారం.. ఎడవెల్లి దీపక్, చందు అనే యువకులు జల్సాలకు అలవాటుపడ్డారు. కరీంనగర్‌లోని పలు శివారు ప్రాంతాల్లో ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకొని ద్విచక్రవాహనంపై వచ్చి బంగారు గొలుసులు చోరీ చేసేవారు. మంగళవారం తీగలగుట్టపల్లిలో పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. నిందితుల నుంచి బంగారాన్ని కొన్న షాప్ యజమాని సింహరాజు నరేష్‌నూ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 105.85 గ్రాముల బంగారం రికవరీ చేశారు. స్కూటీతోపాటు బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై ఎ.లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



మద్దతు ధరపైనే ఆశలు



పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు

ఉమ్మడి జిల్లాలో సీజన్‌కు ముందు నుంచే కొత్తపత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. పాత పత్తి విక్రయాలు తగ్గిపోగా.. క్రమేణా కొత్తపత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. గత నెల 13 నుంచి జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌కు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. వరంగల్, కేసముద్రం, ఖమ్మం మార్కెట్లలోనూ కొత్తపత్తి విక్రయాలు ప్రారంభమయ్యాయి. **- న్యూస్‌టుడే, జమ్మికుంట**


జమ్మికుంట మార్కెట్ యార్డులో ఆరబెట్టిన కొత్తపత్తి

■ కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ఇది ఈ నెల 1 నుంచి అమలులోకి రానుంది.

■ పింజ పొడవును బట్టి మధ్యస్త పత్తికి రూ.7,121గా నిర్ణయించింది.

■ వరంగల్ రీజియన్ మార్కెటింగ్ పరిధిలో నాలుగు వ్యవసాయ మార్కెట్లకు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు.

■ జమ్మికుంటలో కొనుగోళ్ల మొదటి రోజు రూ.7,119ల ధర పలికింది.

■ మార్కెట్‌లో సుమారు 17 రోజుల్లో సుమారు 800 క్వింటాళ్ల కొత్త పత్తి కొనుగోళ్లు జరిగాయి.

■ కొత్తపత్తి విక్రయాలు దసరా అనంతరం జోరు అందుకోనున్నాయి.

క్వింటాకు రూ.7,521

■ రానున్న రోజుల్లో ఎక్కువ మొత్తంలో పత్తి విక్రయానికి వచ్చే అవకాశం ఉన్నందున మద్దతు ధర కోల్పోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

■ ప్రస్తుతం కొత్తపత్తితోపాటు నామమాత్రంగా వస్తున్న పాతపత్తిని ద్వితీయ శ్రేణి వ్యాపారులే ఖరీదు చేస్తున్నారు. అధిక తేమ శాతం, నాణ్యత లేని పత్తిని ఖరీదు చేసి యార్డులో, గిడ్డంగులు, షాపుల వద్ద ఆరబెడుతున్నారు.

■ మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు వీలుగా తేమశాతం ఎక్కువ ఉన్న పత్తిని ఆరబెట్టడంపై ద్వితీయశ్రేణి వ్యాపారులు దృష్టి సారించారు.

■ ప్రస్తుతం జిన్నింగ్ మిల్లుల్లో యంత్రాల మరమ్మతు పనులు చేపట్టామని.. దసరా తర్వాతే మిల్లుల్లో కొత్తసీజన్‌లో కొనుగోళ్లు చేపడతామని మిల్లుల వ్యాపారులు చెబుతున్నారు.

తేమ లేకుండా చూడాలి



జమ్మికుంట మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు క్రమేణా పెరిగాయి. పత్తి ఏరగానే నేరుగా విక్రయానికి తీసుకొస్తున్నారు. దీంతో తేమ శాతం ఎక్కువ ఉంటోంది. ఈ కారణంగా ధర తగ్గుతుంది. రైతులు పత్తిని ఆరబెట్టి పెట్టి విక్రయానికి తీసుకురావాలి. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిబంధనలు ఇంకా అధికారుల నుంచి రాలేదు.
- ఆర్.మల్లేశం, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, జమ్మికుంట

EENADU eClassifieds

PERSONAL CLASSIFIEDS

LOST

చెక్‌బుక్ పోయినది: గణేష్ ఎగ్ సెంటర్ పేరు మీద ఉన్న అకౌంట్ నెంబర్ 62476776626 SBI, అరెపల్లి బ్రాంచ్‌కు సంబంధించిన ప్రొప్రైటర్‌గా నేను సంతకములు చేసిన చెక్‌బుక్ పోయినది. దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు. తగిన పారితోషికము ఇవ్వబడును. నేదునూరి సంతోష్, H.No. 3-95, ఐరుకుల్ల గ్రామం, కరీంనగర్ మండలం. Cell: 94409 91516.

PEOPLE CARE

OLD AGE HOME

ఒమేగా హోంకేర్ వంట/ఇంటిపని, వృద్ధులకు, పేషంట్లని, చిన్నపిల్లలను 24గం|| చూసుకొనుటకు మీ ఇంటి వద్దకే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. ✆ 89776 39664, 89776 39665.

REAL ESTATE

FLAT FOR SALE

Flat for Sale: జగిత్యాల టౌన్ గణేష్ టెంపుల్ దగ్గర, LG గార్డెన్ వెనుకలో అపార్ట్‌మెంట్‌లో 2 BHK ఫ్లాట్ Ready to Occupy గల ఫ్లాట్ అమ్మబడును. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సంప్ర: Cell: 99637 38468.

LAND FOR SALE

16 Guntas Land Highway Road RK Colony, Karimnagar with House and Borewell. Contact: Cell: 9848043704, 7780646886.

జగిత్యాలకు 5KM దూరంలో గల అంతర్గామ్ గ్రామంలో 2 ఎకరాల నీటి సదుపాయం గల వ్యవసాయ భూమి అమ్మబడును. సెల్: 79817 59226. నో బ్రోకర్స్.

PLOT FOR SALE

గంగాధర, మెయిన్ రోడ్ నుండి బోయిన్‌పల్లి మెయిన్ రోడ్‌కు డాంబర్ రోడ్ టీట్ 25 గుంటల భూమి అమ్మబడును. Cont: 97051 09556.

JOBS

Wanted Exp Site Supervisors & Helpers at a Quarry in Odyaram. Sly: 15-22K. Whatsapp Resume/ Details: 8121862040

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు|| ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ॥ 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 8317512135.

హెల్త్ సెంటర్‌లో మహిళ సిబ్బంది కావలెను. విద్యార్హత: 10th/ ఇంటర్/ ఏదైనా డిగ్రీ, వయస్సు: 20 - 35 సం॥లు. సంప్ర॥ ✆: 9845523056, జగిత్యాల.

హాస్టల్లో ఉండి వంట చేయుటకై వంట మనుషులు & పని మనుషులు కావలెను. (ఆడవాళ్లు మాత్రమే). కరీంనగర్. సెల్: 99669 39333, 99757 19937.

లక్ష్మీ శ్రీ ఆటో ఫైనాన్స్ నందు పని చేయుటకు బ్రాంచి క్యాషియర్, టెలికాలర్స్ స్త్రీ & పురుషులు కావలెను. అర్హత ఏదీ డిగ్రీ. కరీంనగర్. సంప్ర॥ Cell: 97035 21443.

YRG CARE - TI ప్రాజెక్ట్ జగిత్యాల జిల్లాలో పని చేయుటకు ORW (ఔట్‌రీచ్ వర్కర్స్-2) కావలెను. Qly: 10th, HIV నివారణలో పని చేసిన 3 సం||ల అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. అప్లికేషన్ చివరి తేది. 10-10-2024. Cell: 93461 08183. Email: jagityalti@yrgcare.org.

ఫైనాన్స్ ఆఫీస్‌లో పనిచేయుటకు Collection Executives Urgent గా కావలెను. T/W Must, Age: 35 below. Ph: 8008168241, 8309023090.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99590 97631
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14779

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs.490/- Only
Colour Rs. 575/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Karimnagar:
99590 97631
80087 09949

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
కరీంనగర్ - 8008573500
గంగాధర - 8008573508
మానకొండూర్ - 8008573527
హుజూరాబాద్ -8008573513
చొప్పదండి- 80085 60055

చొప్పదండి : పురపాలక సంఘం పరిధిలోని బీర్‌నగర్‌లో మురుగు కాలువలు శుభ్రం చేయడంలేదు? **- స్థానికులు**

సమాధానం: పురపాలక సిబ్బందిని పంపి శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. **- ఎన్నం అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

కార్పొరేషన్: రాంచంద్రపూర్ కాలనీ రోడ్డు నంబర్ 15లో ఓ మార్ట్ ఎదురుగా భారీ లారీ వెళ్లడంతో టైల్స్ పగిలి నడకదారిపై రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది? **- సరిత**

సమాధానం : పరిశీలిస్తాం. **- ఇంజినీరింగ్ అధికారి, నగరపాలిక**

సుభాష్‌నగర్: అలకాపురికాలనీ రోడ్డు నంబర్ 6లో కోతుల బెడద ఎక్కువైంది? **- ఆర్.రాజు**

సమాధానం: టెండర్ పిలిచిన తర్వాత పట్టుకునేలా చర్యలు తీసుకుంటాం. **- పశువైద్యాధికారి, నగరపాలిక**

కార్పొరేషన్: హౌసింగ్‌బోర్డుకాలనీ చౌరస్తాలో బి/6/1 విద్యుత్తు స్తంభానికి వీధిలైటు వెలగడం లేదు? **- సమ్మయ్య**

సమాధానం: వరుస క్రమంలో మరమ్మతులు చేయిస్తాం.
- వీధిదీపాల విభాగం అధికారి, నగరపాలిక

వీధిదీపాలకు మరమ్మతులు

సుభాష్‌నగర్: సిరిసిల్ల రోడ్డులోని పొన్నం కాంప్లెక్స్ ఎదురుగా సెంట్రల్ లైట్లకు సంబంధించిన సమస్యను పరిష్కరించారు. ఈనెల 7న 'మేమున్నాం మీకుతోడుగా..'లో వచ్చిన సమస్యకు వీధి దీపాల విభాగం పర్యవేక్షకుడు స్పందించారు. మీటర్ కాలిపోవడంతో కొత్త మీటర్ బిగించారు.

కార్పొరేషన్: వావిలాలపల్లి తులసీనగర్‌లో రెండు విద్యుత్తు స్తంభాలకు ఉన్న వీధిలైట్లను మరమ్మతులు చేశారు. గత నెల 30న 'మేమున్నాం మీకుతోడుగా..'లో వచ్చిన సమస్యకు వీధిదీపాల విభాగం సిబ్బంది పరిశీలించి బాగు చేయించారు.

మౌలిక వసతుల్లేక అవస్థలు

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని విద్యారణ్యపురి రోడ్డు నంబర్ 2, 6 వైపు సీసీ రోడ్లు, మురుగుకాలువలు లేక ఆ ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో గుంతలు పడి దారుణంగా మారుతుందని తెలిపారు. కచ్చా కాలువలతో దోమలు, దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా రూపొందించండి

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్ నుంచి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లి: ఆసిఫ్‌నగర్‌లో బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్యే గంగుల


కరీంనగర్ ముకరంపుర వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో..


మానకొండూర్ శ్రీనివాస్‌నగర్‌లో..

ఘనంగా బతుకమ్మ వేడుకలు

న్యూస్‌టుడే, యంత్రాంగం : జిల్లాలోని పలు చోట్ల మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు మధ్యాహ్నం పూలతో బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం ఆయా కూడళ్లలో బతుకమ్మ ఆడారు. కరీంనగర్ కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో, విద్యుత్తు సర్కిల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో అధికారులు సంబరాల్లో పాల్గొన్నారు.


కరీంనగర్ విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో..


శంకరపట్నం ఎంపీడీవో కార్యాలయంలో..


మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో..


హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో..


సంతోష్‌నగర్‌లో దుర్గామాత మండపం


మంకమ్మతోటలో..


నగునూరులో ఇంద్రాణి అలంకారంలో..

విశేషాలంకరణలు.. ప్రత్యేక పూజలు

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరో రోజు మంగళవారం ఆలయాల్లో, ఉత్సవ మండపాల్లో అమ్మవారు మహాలక్ష్మీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. శ్రీమహాశక్తి ఆలయంలో మహా దుర్గా అమ్మవారు మహాలక్ష్మిగా, మహాసరస్వతీ అమ్మవారికి నాణేలు, తామర పువ్వులతో అలంకరించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌లు దర్శించుకున్నారు. అశోక్‌నగర్, శ్రీపురంకాలనీ, భగత్‌నగర్, మెహర్‌నగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతోష్‌నగర్ దుర్గామాత మండపంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పూజలు చేశారు. ఎమ్మెల్యేతోపాటు మేయర్ సునీల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


మహాశక్తి ఆలయంలో మహాదుర్గాదేవి నాణేల లక్ష్మీదేవి అవతారం


మహాశక్తి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్‌లు


చొప్పదండిలో శ్రీవేంకటేశ్వర-మణికంఠ ఆలయం నుంచి బోనాలతో శోభాయాత్ర..


చిగురుమామిడి: లంబాడిపల్లిలో కుంకుమ పూజలు


జ్యోతినగర్‌లో..

సద్దుల బతుకమ్మకు భారీగా ఏర్పాట్లు

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరవ్యాప్తంగా సద్దుల బతుకమ్మకు భారీగా ఏర్పాట్లు చేశామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి డ్యాం పరిసరాల్లోని పలు కాలనీల్లో బతుకమ్మ పండగ ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఇబ్బందులు రాకుండా రూ.2.20 కోట్లతో నిమజ్జన పాయింట్లు, ఆడుకునే స్థలాల్లో పనులు చేస్తున్నట్లు చెప్పారు. నగర మేయర్ వై.సునీల్‌రావు మాట్లాడుతూ.. ప్రతి నిమజ్జనం కేంద్రం దగ్గర గజ ఈతగాళ్లు ఉంటారని, పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, దిండిగాల మహేశ్, ఎస్ఈ రాజ్‌కుమార్, డీఈఈ ఓంప్రకాశ్, ఏఈ గట్టుస్వామి ఉన్నారు.


ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

కరీంనగర్ కొత్తపల్లి : ఆచరణకు సాధ్యం కాని, అబద్ధపు హామీలతో ప్రజలను వంచించి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామంలో రూ.2 కోట్ల నిధులతో నాగులమల్యాల నుంచి నర్సింగాపూర్ వెళ్లే కట్టదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నిధులతో మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తానన్నారు. గ్రామస్థులు వారి సమస్యలను ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత-మహేష్, కరీంనగర్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రెడ్డవేణి మధు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చొప్పదండి, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. మంగళవారం హనుమాన్ ఆలయం వద్ద బోరుబావి, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. స్థానిక దుర్గాదేవి మంటపంలో పూజలు చేశారు. కుడిచెరువులో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పురపాలిక అధ్యక్షురాలు గుర్రం నీరజ, ఏఎంసీ ఛైర్మన్ కొత్తూరి మహేశ్ పాల్గొన్నారు.

గంగాధర : గంగాధర, మధురానగర్ గ్రామాల్లో బతుకమ్మ ఘాట్లను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. మధురానగర్‌లో త్వరలోనే బతుకమ్మ ఘాట్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జాగిరపు రజిత, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తోట కరుణాకర్, సింగిల్విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


గంగాధరలో బతుకమ్మ ఘాట్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు : బతుకమ్మ, దసరా పండగల్లో లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. మంగళవారం రామడుగులో బతుకమ్మ ఘాట్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ బొమ్మరవేని తిరుమల, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక మరియు బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లు అగు శ్రీ కక్కిరాల రమేశ్, తండ్రి: పుల్లయ్య మరియు శ్రీమతి కక్కిరాల సుజన, భర్త: రమేశ్, నివాసం: కరీంనగర్ గారలు ఈ క్రింది షెడ్యూల్ స్థిరాస్థిని **"అక్షర టౌన్‌షిప్స్ ప్రై. లి.,"** హన్మకొండ అను దాని ఛైర్మన్ శ్రీ శ్రీనివాసరావు పేరాల, తండ్రి: భీంరావు గార్లకి విక్రయించి వారి పేరున రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెం. 1109/2018, తేది: 20-02-2018 వ్రాయించి ఇచ్చినారు.

పై కొనుగోలుదార్లు కొంత విక్రయ ధనమును చెల్లించి మిగతా విక్రయ ధనమునకు పోస్టు డేటెడ్ చెక్కులు ఇచ్చినారు. కాని అట్టి చెక్కులకు చెల్లింపులు చేయనందున, నా క్లయింట్లు గౌరవ సీనియర్ సివిల్ జడ్జి, కరీంనగర్ గారి కోర్టులో దావా నెం. ఓ.యస్. 24/2020 గల దానిని **అక్షర టౌన్‌షిప్ ప్రై. లి.** యొక్క ఛైర్మన్ మరియు డైరక్టర్లు 1) శ్రీ పేరాల శ్రీనివాస్‌రావు, తండ్రి: భీంరావు, ఇ.నెం.1-7-1385, గ్రౌండ్‌ఫ్లోర్, అడ్వకేట్ కాలనీ, హన్మకొండ, వరంగల్ జిల్లా, 2) శ్రీ రాజేందర్ పుప్పాల, తండ్రి: చంద్రయ్య, నివాసం: ఇ.నెం. 25-7-26, విష్ణుపురి, కాజీపేట జంక్షన్, హన్మకొండ, వరంగల్ జిల్లా, 3) శ్రీ కొండల్‌రావు సూరినేని, తండ్రి: రాజేశ్వర్‌రావు, నివాసం: ఇ.నెం. 1-99, మొగుల్లపల్లి గ్రామం, పర్కాల్ మండలం, వరంగల్ జిల్లా., 4) శ్రీమతి శ్రీవిద్య పేరాల, భర్త: శ్రీనివాస్‌రావు, నివాసం: ఇ.నెం. 2-10-765, ఎస్.బి.హెచ్. కాలనీ, వడ్డెపల్లి ఎక్స్‌రోడ్, సుబేదారి, వడ్డెపల్లి రూరల్, హన్మకొండ లోకాలిటి, వరంగల్ జిల్లా గార్లపై దాఖలు చేయగా గౌరవ కోర్టు వారు ఈ క్రింది స్థిరాస్థికి అటాచ్‌మెంట్ ఉత్తర్వులను జారీ చేసినారు.

కావున పై కొనుగోలుదారు అయిన **అక్షర టౌన్‌షిప్స్ ప్రై. లి.** మరియు దాని డైరక్టర్లతో ఈ క్రింది స్థిరాస్థిపై ఎలాంటి క్రయ-విక్రయ మరియు తనఖా వంటి ఎలాంటి లావాదేవీలు జరుపరాదని సమస్త ప్రజలను సంస్థలను మరియు వాణిజ్య బ్యాంకులను హెచ్చరించనైనది. ఎలాంటి లావాదేవీలైనా పై దావా కోర్టు యొక్క తీర్పుననుసరించి మాత్రమే హక్కులు సంక్రమించునని తెలియజేయుచున్నాను.

స్థిరాస్తి షెడ్యూలు: కరీంనగర్ జిల్లా, రామడుగు మండలం, వెలిచాల గ్రామ శివారులోని భూములు రక్బా ఎ.3-29 గుంటలు, సర్వే నెం. 132 మరియు 133/ఎ లలో భూమికి హద్దులు: తూర్పు: సర్వే నెం. 133 పార్ట్‌లోని భూమి **అక్షర టౌన్‌షిప్ ప్రై. లి.,** పడమర: సర్వే నెం. 132 పార్ట్ లోని భూమి, ఉత్తరం: సర్వే నెం. 132 పార్ట్ లోని భూమి, దక్షిణం: సర్వే నెం. 131 పార్ట్ లోని భూమి & సర్వే నెం. 134 పార్ట్ లోని భూమి.

తేది: 08-10-2024 సం/-, **ఏగిన శ్రీనివాస్,** అడ్వకేట్, కరీంనగర్ - 505001
సప్తగిరి, ఇ.నెం. 3-7-272/2, వావిలాలపల్లి, కరీంనగర్. సెల్: 98490 72875

సంక్షిప్తం

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

భగత్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, యజ్ఞ వరహస్వామి దేవాలయం రహదారి, మారుతి నగర్ ప్రాంతాలకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ ఎస్.నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జమ్మికుంట : జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల పరిధిలో బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల దాకా కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు శాఖ జమ్మికుంట ఏఈ సురేశ్వరాచారి తెలిపారు. జమ్మికుంట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సరఫరా ఆపివేస్తున్నట్లు చెప్పారు.

బంగారు గౌరమ్మ పాటల ప్రదర్శన

కరీంనగర్ సాంస్కృతికం : బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కఫిసో బంగారు గౌరమ్మ పాటల ప్రదర్శన జరిగింది. కఫిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ.. జిల్లా కళాకారులు చాలా మంది బతుకమ్మ పాటలు నిర్మించడం శుభసూచకమన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సమన్వయ కర్త మునిపల్లి ఫణిత, కార్యదర్శి లక్ష్మీగౌతమ్ పాల్గొన్నారు.

బీసీ లిటరరీ అవార్డు ప్రదానం

కరీంనగర్ సాంస్కృతికం : హనుమకొండలోని ఓ వేడుక మందిరంలో మంగళవారం కరీంనగర్‌కు చెందిన కవి అన్నవరం దేవేందర్‌కు రాష్ట్ర స్థాయి బీసీ లిటరరీ అవార్డును ప్రదానం చేశారు. హనుమకొండలో శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ అవార్డు అందించారు. బహుభాషావేత్త నలిమెల భాస్కర్, బూర్ల వెంకటేశ్వర్లు, నాంపల్లి సుజాత, సీవీ.కుమార్ పాల్గొన్నారు.

రుద్రమ సాహితీ సంస్థ అధ్యక్షురాలుగా చిందం సునీత

కరీంనగర్ సాంస్కృతికం : రుద్రమ సాహితీ స్రవంతి మహిళా చైతన్య వేదిక, జాతీయ సాహిత్య సాంస్కృతిక సంస్థ సభ్యులు మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డా.అడువాల సుజాత, న్యాయ సలహాదారులు ఎర్రం రాజిరెడ్డి, అధ్యక్షురాలుగా డా.చిందం అంకారపు సునీత, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల శోభారాణి, ఉపాధ్యక్షులుగా పుప్పాల చైతన్య, పబ్బ జ్యోతిలక్ష్మీ, కోశాధికారి ఝాన్సీరెడ్డిలు ఎన్నికయ్యారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చైతన్యపురి : ఈనెల 9 నుంచి రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ మహిళా జట్టు క్రీడాకారులకు హమ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త కార్యదర్శి గోగూరి శ్రీధర్‌రెడ్డి ఆర్థిక సహాయంతో క్రీడా దుస్తులు పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలని సీఎంకు లేఖ

జమ్మికుంట : దళితబంధు రెండో విడత నిధులను విడుదల చేయాలని కోరుతూ సీఎం రేవంతర్‌రెడ్డి జమ్మికుంట మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీరామ్ శ్యామ్ మంగళవారం లేఖ పంపించారు. మొదటి విడతలో రూ.5 లక్షల రాగా. . రెండో విడత రూ.5 లక్షలు విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నారు.

ఇంటింటా సర్వే నిర్వహించాలి

హుజూరాబాద్ గ్రామీణం : ఒకే కుటుంబానికి చెందిన వారి పేర్లు ఒకే బూత్ లోని ఓటర్ జాబితాలో ఉండేలా ఇంటింటా సర్వే నిర్వహించాలని బీఎల్‌వోలకు ఆర్డీవో రమేష్‌బాబు సూచించారు. మంగళవారం హుజూరాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు.

పాటల సీడీ ఆవిష్కరణ

హుజూరాబాద్ గ్రామీణం : సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై 'భరతమాత ముద్దుబిడ్డల్లారా దేశాన్ని కాపాడే పౌరుల్లారా' అనే పాటను రూపొందించగా.. సంబంధిత సీడీని మంగళవారం ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆవిష్కరించారు. ఈ పాటను గాయకుడు మేకల నవీన్‌కుమార్ రచించి ఆలపించినట్లు ఫౌండేషన్ సభ్యులు మహ్మద్ రఫీ, నవీన్‌లు తెలిపారు.

ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్‌గా రామకృష్ణ



కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్యులు కలువకుంట రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్వ ప్రిన్సిపల్ వై.సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా ఖాళీ ఏర్పడటంతో రామకృష్ణను నియమిస్తూ కళాశాలల కమిషనర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్లు నితిన్, టి.రాజయ్య, అధ్యాపకులు డా.వి.శ్రీనివాస్, డా.కరుణాకర్, ఏవో ఉమారాణి, డా.సురేందర్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్, జి.శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

శంకరపట్నం, న్యూస్‌టుడే: ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అన్నారు. కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులతోపాటు మందుల నిల్వలు, శస్త్రచికిత్స గదిని పరిశీలించారు. ఆస్పత్రిలోని సేవలను వైద్యాధికారి శ్రావణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం అధికారి స్వామి, మాతాశిశు సంరక్షణ అధికారి సనా జువేరియా, హెచ్ఈ ప్రతాప్, పర్యవేక్షకుడు అనిల్ పాల్గొన్నారు.


టీహబ్ రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, న్యూస్‌టుడే: కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ఘటన శంకరపట్నం మండలం తాడికల్ గ్రామశివారులో జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన టేకుమట్ల సంధ్యారాణి-అశోక్ దంపతులు అదే జిల్లా ఎల్కతుర్తి మండలం జగన్నాథపూర్‌కు చెందిన ముష్కె సమ్మయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్ వెళ్తున్నారు. తాడికల్ పెద్దమ్మ గుడి వద్ద రహదారిపై వీరి ద్విచక్రవాహనానికి కుక్క అడ్డురావటంతో కింద పడిపోయారు. వాహనం నడుపుతున్న అశోక్‌తోపాటు సంధ్యారాణి, సమ్మయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై ఉన్న చిన్నారికి ఎలాంటి గాయాలు కాలేదు. గాయపడ్డ వారిని 108లో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

షాపింగ్ మాల్స్‌పై కేసులు

తెలంగాణచౌక్(కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని పలు షాపింగ్ మాల్స్‌పై తూనికల కొలతల శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. మంగళవారం సీఎంఆర్, చెన్నై సిల్క్స్, సౌత్‌ఇండియా, మాంగళ్య షాపింగ్ మాల్స్‌లో తనిఖీలు చేసినట్లు ఆ శాఖ కరీంనగర్ జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ విజయసారథి తెలిపారు. ఎమ్మార్పీ, తయారీ తేది, చిరునామా తదితర వివరాలు లేకపోవడం, నాసిరకం వస్త్రాల విషయంలో ఆయా షాపులపై పది కేసులను నమోదు చేసినట్లు చెప్పారు. జిల్లా ఇన్‌స్పెక్టర్ భూలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో 'ఈనాడు' లక్ష్య అథ్లెట్ల ప్రతిభ

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: హనుమకొండలో ఈనెల 7, 8న జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024లో 'ఈనాడు' లక్ష్య కరీంనగర్ అథ్లెట్స్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. ట్రైథ్లాన్ పోటీల్లో నక్షత్ర బంగారు, సమీర కాంస్య పతకం, ఆస్మిన్ కాంస్య పతకం సాధించారు. చరణ్ 5 కిలోమీటర్ల నడకలో, స్వామి జావెలిన్ త్రోలో బంగారు పతకాలు, స్వామి డిస్కస్ త్రోలో రజతం, సంతోష్ స్టేపుల్స్ చేస్ 3000 మీటర్స్‌లో కాంస్య పతకం సాధించినట్లు 'ఈనాడు' లక్ష్య కోచ్ తిరుపతి తెలిపారు. వీరిని డీవైస్‌వో శ్రీనివాస్‌గౌడ్, అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు అభినందించారు.


కోచ్‌తో పతకాలు సాధించిన అథ్లెట్లు

పటల్స్ పర్వతం అధిరోహణ

కరీంనగర్ కొత్తపల్లి, తిమ్మాపూర్, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లోని పటల్స్ పర్వతాన్ని కరీంనగర్‌కు చెందిన 40 మంది విద్యార్థులు అధిరోహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్, పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సే నో టూ డ్రగ్స్" నినాదంతో యువత, విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అబ్కారీ శాఖ కానిస్టేబుల్, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకట మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీచైతన్య డిఫెన్స్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన 40 మంది విద్యార్థులు 4200 మీటర్ల ఎత్తులోని పర్వతాన్ని అధిరోహించారు. పిల్లలు పర్వతాన్ని 14 గంటల్లో అధిరోహించినట్లు మహిపాల్‌రెడ్డి తెలిపారు.


పటల్స్ పర్వతంపై కరీంనగర్ విద్యార్థులు


హైదరాబాద్‌ను కాపాడేందుకే హైడ్రా

తెలంగాణచౌక్ (కరీంనగర్), న్యూస్‌టుడే: హైదరాబాద్‌ను కాపాడటానికే ప్రభుత్వం హైడ్రాను తెచ్చిందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడారు.

పారిశుద్ధ్య కార్మికులకు కంటి పరీక్షలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట పురపాలక పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి పరీక్షలు నిర్వహించారు. అయిదుగురికి శస్త్రచికిత్స చేయాలని నిర్ధారించారు. శిబిరంలో పుర ఛైర్మన్ కంటి పరీక్ష చేయించుకున్నారు.





రోజురోజుకీ కృత్రిమ మేధ (ఏఐ) శరవేగంగా విస్తరిస్తోంది. మనిషి మెదడులా ఆలోచిస్తూ, మనిషి మెదడునే మించుతూ ఎన్నో రంగాలకు చేదోడుగా నిలుస్తోంది. వైద్యం దగ్గరి నుంచి సైన్స్ వరకూ పరిశోధనల పురోగతికి తోడ్పడుతోంది. మానవాళి ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు, సవాళ్లకు పరిష్కారాలు చూపుతోంది. రోజువారీ జీవితాన్ని సులభతరం చేస్తోంది. ఇంత ప్రాచుర్యం పొందుతున్న కృత్రిమ మేధలో అత్యంత కీలకమైంది ఆధునిక మెషిన్ లెర్నింగ్. దీనికి తోడ్పడుతోంది ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్. వీటికి వీలు కల్పించే మూల ఆవిష్కరణల సృష్టికర్తలైన జాన్ జె. హాప్‌ఫీల్డ్, జెఫ్రీ ఇ. హింటన్‌కు ఈసారి ఫిజిక్స్‌లో నోబెల్ బహుమతి లభించింది. ఇంతకీ న్యూరల్ నెట్‌వర్క్ అంటే? ఇది మెషిన్ లెర్నింగ్‌కు ఎలా తోడ్పడుతుంది? ఏవిధంగా ఉపయోగ పడుతుంది?

మెదడును మించిన మేధస్సు!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో న్యూరల్ నెట్‌వర్క్ ఒక విధానం. ఇదొక రకమైన మెషిన్ లెర్నింగ్ ప్రక్రియ. దీన్ని డీప్ లెర్నింగ్ అనీ పిలుచుకుంటారు. కంప్యూటర్లకు డేటాను ప్రాసెస్ చేయటాన్ని నేర్పించే దీన్ని మన మెదడు స్ఫూర్తితోనే రూపొందించారు. మనిషి మెదడును పోలిన పొరల పొరల నిర్మాణంలో అంతర్గతంగా అనుసంధానమైన నోడ్స్ లేదా న్యూరాన్స్ సాయంతో పనిచేస్తుంది. కంప్యూటర్లు తాము చేసిన తప్పుల నుంచి నేర్చుకోవటానికి, మరింత మెరుగు పడటానికి తోడ్పడే అనుసార వ్యవస్థను ఇది సృష్టిస్తుంది. దీని మూలంగానే కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌లు సంక్లిష్ట సమస్యలను పరిష్కరించటం సాధ్యమవుతోంది. డాక్యుమెంట్ల సారాంశాన్ని సృష్టించటం, ముఖాలను గుర్తించటం వంటి పనులు తేలికవుతున్నాయి.

ఏంటీ వీటి ప్రాముఖ్యం?

మానవ వనరులు అంతంతగా ఉన్నా కంప్యూటర్లు తెలివైన నిర్ణయాలు తీసుకోవటానికి న్యూరల్ నెట్‌వర్క్‌లు తోడ్పడతాయి. ఎందుకంటే ఇవి సంక్లిష్ట, క్రమ రహితమైన ఇన్‌పుట్, అవుట్‌పుట్ డేటాల మధ్య సంబంధాన్నీ గ్రహించగలవు. దానికి అనుగుణంగా తమను తాము తీర్చుదిద్దుకోగలవు. దీని సాయంతో అసమంజస డేటాను అర్థం చేసుకొని, ఒక సాధారణ అభిప్రాయానికి రాగలవు. ఒకే అర్థం గల రెండు వేర్వేరు ఇన్‌పుట్ వాక్యాలనూ గుర్తించగలవు. ఉదాహరణకు- అతడికి ఎలా చెల్లించాలో చెప్పగలవా? నేను డబ్బును ఎలా పంపించాలి? అని రెండు ప్రశ్నలను వేశామనుకోండి. ఈ రెండూ ఒకే అంశానికి చెందిన వాక్యాలని న్యూరల్ నెట్‌వర్క్ తెలుసుకుంటుంది.

ఎలా పనిచేస్తాయి?

ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్ అనేవి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లు లేదా ఆల్గోరిథమ్‌లు. ఇవి ప్రధానంగా కంప్యూటింగ్ వ్యవస్థల సాయంతో గణిత లెక్కలను పరిష్కరిస్తాయి. మన మెదడు మాదిరిగానే 'ఆలోచిస్తూ', పని చేస్తాయి. మన మెదడులోని నాడీ కణాలు ఒకదాంతో మరోటి అనుసంధానమై సంక్లిష్ట, అత్యంత గాఢ బంధాలను ఏర్పరచుకుంటాయి. ఇవి ఒకదానికి మరోటి విద్యుత్ సంకేతాలను పంపించుకుంటాయి. దీని మూలంగానే మనం సమాచారాన్ని విడమరచుకుంటున్నాం. ఆయా విషయాలను గ్రహిస్తున్నాం, నేర్చుకుంటున్నాం. తప్పొప్పులను గ్రహించి మెరుగుపరచుకుంటున్నాం. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లూ అచ్చం ఇలాగే ప్రవర్తిస్తాయి. వీటిల్లోని కృత్రిమ నాడీ కణాలు.. అంటే సాఫ్ట్‌వేర్ మాడ్యూల్స్ ఒకదాంతో మరోటి అనుసంధానమై సమస్యలను పరిష్కరిస్తాయి. ఈ మాడ్యూల్స్‌ను నోడ్స్ అనీ అంటారు. వీటి సాయంతో మామూలు న్యూరల్ నెట్‌వర్క్ ఎలా పనిచేస్తుందో చూద్దాం.

- ముందుగా బయటి ప్రపంచం నుంచి ఇన్‌పుట్ లేయర్ ద్వారా సమాచారం లోపలికి వస్తుంది. ఇన్‌పుట్ నోడ్స్ ఈ డేటాను వర్గీకరించి, విశ్లేషించి తర్వాత లేయర్‌కు చేరవేస్తాయి.
- ఇన్‌పుట్ లేయర్ నుంచి వచ్చిన డేటాను బోలెడన్ని అదృశ్య (హిడెన్) లేయర్లు ఒకదాని తర్వాత మరోటి సునిశితంగా విశ్లేషించుకుంటూ వస్తాయి. అలా అలా తర్వాతి లేయర్లకు పంపిస్తాయి.
- న్యూరల్ నెట్‌వర్క్ ప్రాసెస్ చేసిన మొత్తం డేటా తుది ఫలితాన్ని అవుట్‌పుట్ లేయర్ అందిస్తుంది. ఇందులో ఒకటి లేదా ఎక్కువ సంఖ్యలో నోడ్స్ ఉండొచ్చు.

ఎలా ఉపయోగపడతాయి?

వివిధ రంగాల్లో, పరిశ్రమల్లో న్యూరల్ నెట్‌వర్క్స్ ఇప్పటికే ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటి పనితీరును చూస్తే ఎవరైనా అబ్బురపడాల్సిందే. ఉదాహరణకు..

- ఎక్స్‌రే, స్కాన్ వంటి ఇమేజ్‌లను చూసి జబ్బులను నిర్ధరిస్తున్నాయి. అదీ చాలా కచ్చితంగా.
- సామాజిక ధోరణులను వర్గీకరించటం, వడపోయటం.. ప్రవర్తన డేటాను విశ్లేషించటం ద్వారా ఎవరికి ఏయే వస్తువులు, సరకులు అవసరమో సూచిస్తున్నాయి.
- పెట్టుబడులు, పొదుపుల వంటి సాధనాల చరిత్రను విశ్లేషించి ఆర్థికపరమైన అంచనాలు వేస్తున్నాయి.
- వస్తువుల నాణ్యతను పసిగడుతున్నాయి, పర్యవేక్షిస్తున్నాయి.
- రసాయన మిశ్రమాలను గుర్తిస్తున్నాయి.

వివిధ విధాలుగా..

న్యూరల్ నెట్‌వర్క్స్ రకరకాల రూపాల్లో ఉపయోగపడతాయి. కొన్ని ఇవీ..

కంప్యూటర్ విజన్: ఇది ఇమేజ్‌లు, వీడియోల నుంచి కంప్యూటర్లు ఆయా విషయాలను, సమాచారాన్ని సంగ్రహించటానికి తోడ్పడుతుంది. ఇవి న్యూరల్ నెట్‌వర్క్స్ సాయంతో మనుషుల మాదిరి ఇమేజ్‌లను పోల్చుకోగలవు, తేడాను గుర్తించగలవు. స్వయంచాలిత వాహనాలు మార్గ సూచికలను, ఇతర వాహనాలను గుర్తించటంలో కంప్యూటర్ విజనే కీలకం. ఇమేజ్ లేదా వీడియోల నుంచి అనుచిత, అసురక్షిత కంటెంట్‌ను తమకు తామే తొలగించగలవు. గూగుల్ ఫొటోస్‌లో సేఫ్ సెర్చ్ చేస్తున్నప్పుడు భయానక, అశ్లీల దృశ్యాల వడపోతను గమనించే ఉంటారు. నేరగాళ్లను పట్టుకోవటానికి ముఖాలను గుర్తించే పరిజ్ఞానానికీ ఇదే ఆధారం.

స్పీచ్ రికగ్నిషన్: ధ్వని, స్థాయి, భాష, యాసలో తేడాలున్నా కూడా న్యూరల్ నెట్‌వర్క్స్ మనుషుల మాటలను విశ్లేషించగలవు. అమెజాన్ అలెక్సా వంటి వర్చువల్ అసిస్టెంట్లు, ఆటోమేటిక్ ట్రాన్స్‌క్రిప్షన్ సాఫ్ట్‌వేర్స్ దీన్నే ఉపయోగించుకుంటాయి. ఉదాహరణకు- కాల్స్‌ను తమకు తామే వర్గీకరించి కాల్‌సెంటర్ ఏజెంట్లకు తోడ్పడతాయి. డాక్టర్లు చెప్పే విషయాలను అప్పటికప్పుడు డాక్యుమెంట్ రూపంలోకి మారుస్తాయి. వీడియోలు, రికార్డు చేసిన మీటింగుల సబ్‌టైటిల్స్‌ను కచ్చితంగా చూపిస్తాయి.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్: కంప్యూటర్ వంటి పరికరాలు నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ) సాయంతో టెక్స్ట్‌ను విడమరచుకోవటంలోనూ న్యూరల్ నెట్‌వర్క్స్ పాత్రే కీలకం. టెక్స్ట్ డేటా, డాక్యుమెంట్ల నుంచి కంప్యూటర్లు సమాచారాన్ని గ్రహించుకోవటం, అర్థం చేసుకోవటంలో ఇవి సాయం చేస్తాయి. ఆటోమేటెడ్ వర్చువల్ ఏజెంట్లు, ఛాట్‌బాట్స్ ఉపయోగించుకునేది నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ప్రక్రియనే. ఇది ఈమెయిళ్ల వంటి సుదీర్ఘ సంప్రదింపులను విశ్లేషించి వ్యాపార, వాణిజ్య సంస్థలకు తోడ్పడుతుంది కూడా. సెంటిమెంట్‌ను సూచించే కీలక పదబంధాల జాబితా రూపొందించగలదు. సామాజిక మాధ్యమాల్లో సానుకూల, ప్రతికూల కామెంట్లను గుర్తించటం దీనికి ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఛాట్‌జీపీటీ వంటి వాటిల్లో ఏదైనా ఒక అశం మీద కథనం రాయమని చెబితే క్షణాల్లో ముందుంచుతుంది కదా. ఇదీ ఎన్ఎల్‌పీ చలవే. పెద్ద డాక్యుమెంట్ల సారాంశాన్ని గుది గుచ్చటానికీ ఇదే ఆధారంగా నిలుస్తోంది.

రికమండేషన్ల సాధనాలు: యూట్యూబ్‌లో ఏదైనా వీడియోను చూస్తే తర్వాత అలాంటి వీడియోల సూచనలు కనిపించటం గమనించే ఉంటారు. దీనికి మూలం న్యూరల్ నెట్‌వర్క్‌లే. ఇవి యూజర్ల యాక్టివిటీని గమనిస్తూ, ఎవరికి ఏయే అంశాలు నచ్చుతాయో వాటిని సిఫారసు చేస్తాయి. యూజర్లందరి ప్రవర్తననూ విశ్లేషించి, ఆయా వ్యక్తులకు నచ్చిన ఉత్పత్తులు లేదా సేవలను గుర్తించగలవు కూడా. ఉదాహరణకు- ఫిలడెల్ఫియాకు చెందిన క్యురలేట్ అనే అంకుర సంస్థ సామాజిక మాధ్యమాల పోస్టులను అమ్మకాలుగా మలచుకోవటానికి కంపెనీలకు తోడ్పడుతోంది.

డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లో..

డీప్ న్యూరల్ నెట్‌వర్క్ లేదా డీప్ లెర్నింగ్ నెట్‌వర్క్‌లోనైతే కోట్లాది నోడ్స్‌తో కూడిన అదృశ్య లేయర్లు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఒక నోడ్‌కు, మరోదానికి గల అనుసంధానాలను నంబర్ (వెయిట్)తో సూచిస్తారు. ఒక నోడ్ మరోదాన్ని ప్రేరేపిస్తే పాజిటివ్ నంబర్‌గా, అణచివేస్తే నెగెటివ్ నంబర్‌గా పరిగణిస్తారు. ఎక్కువ వెయిట్ గల నెట్‌వర్క్‌లు ఇతర నోడ్స్ మీద మరింత ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. సాధారణంగా డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లు ఎలాంటి ఇన్‌పుట్ రకాన్నయినా అవుట్‌పుట్‌గా మార్చగలవు. అయితే ఇతర మెషిన్ లెర్నింగ్ మోడళ్లతో పోలిస్తే వీటికి మరింత ఎక్కువ శిక్షణ అవసరం. మామూలు నెట్‌వర్క్ శిక్షణకు వేలాది డేటా నమూనాలు అవసరమైతే డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లకు లక్షలాది నమూనాలు కావాల్సి ఉంటుంది.

ఫోన్ సెటింగ్స్ నుంచే లొకేషన్ షేర్



గూగుల్ మ్యాప్స్‌తో లైవ్ లొకేషన్ షేర్ చేయటం మామూలే. ముందుగా మ్యాప్స్ యాప్‌లోకి వెళ్లాలి. నావిగేట్ మెనూ ద్వారా కాంటాక్టును ఎంచుకొని లొకేషన్ షేర్ చేసుకోవాలి. ఇలాంటి తతంగమేదీ లేకుండా నేరుగా ఫోన్ సెటింగ్స్ నుంచే లైవ్ లొకేషన్ షేర్ చేస్తే? ఆండ్రాయిడ్ యూజర్ల కోసం గూగుల్ ఇలాంటి సదుపాయాన్నే కల్పిస్తోంది. మెయిన్ సెటింగ్స్‌లోని లొకేషన్ సర్వీసెస్‌లోనే ఈ షేరింగ్ ఫీచర్ ఉంటుంది. దీని పక్కనుండే బటన్‌ను ఆన్ చేసి కాంటాక్టు జాబితాల్లోంచి నంబరును ఎంచుకొని లొకేషన్ షేర్ చేయొచ్చు. వేర్వేరు యాప్‌ల్లోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా తేలికగా తామున్న చోటును ఇతరులకు చేరవేయొచ్చు. ప్రస్తుతానికి ఈ లొకేషన్ షేరింగ్ ఫీచర్ ప్రాథమిక దశలో ఉంది. కొద్ది వారాల్లో విస్తృతంగా అందుబాటులోకి రావొచ్చని భావిస్తున్నారు.

జెమినీ లైవ్ అందరికీ



రెండు వైపులా సంభాషణకు వీలు కల్పించే జెమినీ లైవ్ ఫీచర్‌ను ఇకపై ఆండ్రాయిడ్ పరికరాల్లో ఉచితంగా వాడుకోవచ్చు. ఇప్పటివరకూ జెమినీ అడ్వాన్స్‌డ్ చందాదారులకే పరిమితమైన ఇది విస్తృతంగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. జెమినీ యూజర్లంతా నేరుగా దీంతో ఆంగ్లంలో మాట్లాడుకోవచ్చు. అదీ సహజ శైలిలో. ఇది అన్ని ముచ్చట్ల హిస్టరీని సేవ్ చేస్తుంది కూడా. అందువల్ల అవసరమైతే ముచ్చటను సమీక్షించుకోవచ్చు. కొత్తగానూ మొదలెట్టొచ్చు.

వాడుకోవటమెలా?

- ముందుగా ఫోన్‌లో జెమినీ యాప్‌ను తెరవాలి.
- కింద కుడిమూలన మెరుపులతో కూడిన గుండ్రటి తరంగం గుర్తు మీద తాకాలి.
- అప్పుడు హోల్డ్, ఎండ్ మీటలతో కూడిన విండో తెరచుకుంటుంది. మాట్లాడటం ముగిశాక నోటిఫికేషన్ మీద తాకాలి. లేదా తేలికగా స్టాప్ అని అయినా అనొచ్చు.
- మాట్లాడటం ముగిశాక జెమినీ ఏఐ మన మాటలకు సంబంధించిన టెక్స్ట్ ట్రాన్స్‌క్రిప్షన్‌ను సృష్టిస్తుంది.

ఎరువులు చల్లే డ్రోన్

ఐఐటీ మద్రాస్‌కు చెందిన యూఏవీ అంకుర సంస్థ అంబర్ వింగ్స్ కొత్త వ్యవసాయ డ్రోన్‌ను ఆవిష్కరించింది. దీని పేరు విహా. త్వరగా, మరింత సమర్థంగా పంటలను సాగు చేయటానికి తోడ్పడే ఇది దేశవ్యాప్తంగా వ్యవసాయంలో కొంగొత్త మార్పులు తీసుకురాగలదని భావిస్తున్నారు. ఇటీవలే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ధ్రువీకరణ పత్రం దక్కించుకున్న విహా సంప్రదాయ పద్ధతుల కన్నా ఏడు రెట్లు ఎక్కువ వేగంతో పంటలకు ఎరువులు, పురుగు మందుల వంటి వాటిని చల్లగలదు. దీంతో రైతులకు, వ్యవసాయ వాణిజ్య సంస్థలకు ఎంతో సమయం ఆదా అవుతుంది. "దేశంలో వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచే ప్రయత్నంలో విహా ఆవిష్కరణ కీలకమైన అడుగు. రైతులను సమృద్ధం, పరిశ్రమ అభివృద్ధిని వేగవంతం చేయగల వినూత్న పరిష్కారాలను అందించటమే తమ నిరంతర లక్ష్యం" అని ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ సత్య చక్రవర్తి చెబుతున్నారు. ఇదొక సాధనం మాత్రమే కాదు.. ఆధునిక వ్యవసాయంలో ఒక తోడుగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. విహాతో పాటు ఇతర డ్రోన్ పరిష్కారాలనూ అంబర్ వింగ్స్ రూపొందిస్తోంది. రవాణా, ఈ కామర్స్ రంగాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తయారుచేస్తున్న అత్వ శ్రేణి డ్రోన్లు సరకులను మోసుకెళ్లగలవు. 50 కిలోల బరువును మోసుకెళ్లగల డ్రోన్‌నూ ప్రయోగాత్మకంగా రూపొందిస్తోంది.






మంచును వృద్ధి చేసి ఆర్కిటిక్‌ను తిరిగి గడ్డ కట్టించి..

ఆర్కిటిక్ మహా సముద్రం మంచు వేగంగా కరిగిపోతోంది. వాతావరణ మార్పు ఇలాగే కొనసాగితే మరో ఆరేళ్లలోనే అది వేసవిలో మంచు రహితం కావొచ్చని భావిస్తున్నారు. ఇది విపరీత అనర్థాలకు దారితీస్తుంది. గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాలను బాగా తగ్గించటం వంటి పద్ధతులను పాటించినా ఆర్కిటిక్ మంచు రహితం కావటం ఆగకపోవచ్చనీ కొన్ని కథనాలు చెబుతున్నాయి. ప్రతి పదేళ్లకు ఆర్కిటిక్ మహా సముద్రం సుమారు 13 శాతం మేరకు మంచును కోల్పోతుంది. దీన్ని అరికట్టటానికి శాస్త్రవేత్తలు మంచును 'వృద్ధి' చేసే వినూత్న పద్ధతిని రూపొందిస్తున్నారు. సముద్రపు నీటిని పంప్ చేసి గడ్డకట్టిన ఆర్కిటిక్ మీద పోయటం దీనిలోని కీలకాంశం. దీనికి సంబంధించిన ప్రాథమిక పరీక్షలు ఆశావహంగానూ కనిపిస్తున్నాయి. కెనడా సమీపంలోని ఆర్కిటిక్ మహా సముద్రంలో నిర్వహించిన ప్రయోగ పరీక్షల్లో మంచు మందం పెరగటం గమనార్హం. సముద్రపు నీటిని తోడి మంచు మీద పోస్తే చలికాలంలో గడ్డ కట్టి, మంచు పొర మందంగా అవుతుంది. దీంతో వేసవిలో మంచు ఎక్కువ కాలం నిలిచి ఉంటుంది. ఇందుకోసం శాస్త్రవేత్తలు మంచు పొర పలుచగా ఉన్నచోట దానికి కింది నుంచి రంధ్రం చేస్తారు. పంపుల ద్వారా నీటిని తోడి మంచు పొర మీద పోస్తారు. దీంతో మంచు సహజంగా గడ్డకట్టే ప్రక్రియ వేగం పుంజుకుంటుంది. ఈ ప్రక్రియను ఇంతకుముందూ పరీక్షించారు గానీ తొలిసారిగా ఇది విజయవంతమైంది.




స్నాప్‌ఛాట్‌లో 'ఫుట్‌స్టెప్స్'



స్నాప్‌ఛాట్ కొత్తగా లొకేషన్ హిస్టరీని పసిగట్టే ఫుట్‌స్టెప్స్ అనే ఫీచర్‌ను ప్రవేశపెట్టనుంది. ఇది మీరు ప్రయాణించిన లేదా సందర్శించిన ప్రాంతాలను స్నాప్ మ్యాప్ మీద చూపిస్తుంది. ఇప్పటివరకు స్నాప్‌ఛాట్+ చందాదారులకే పరిమితమైన ఈ ఫీచర్ త్వరలో ఐఫోన్ యూజర్లందరికీ అందుబాటులోకి రానుంది. ఫుట్‌స్టెప్స్‌ను తొలిసారి ఉపయోగించినప్పుడు అది మెమరీస్‌లో స్టోర్ అయిన స్నాప్స్ ఆధారంగా అడుగులను పసిగడుతుంది. అంటే గతంలో చేసిన ప్రయాణాలనూ లెక్కలోకి తీసుకుంటుందన్నమాట. అయితే స్నాప్‌ఛాట్ ఆ తర్వాత మెమరీస్‌ను వాడుకోదు. లొకేషన్ డేటాను మాత్రమే రీస్టోర్ చేస్తుంది. మీరు ప్రయాణించిన దేశాలనే కాదు.. అక్కడ ఎంత దూరం తిరిగారో కూడా ఫుట్‌స్టెప్స్ చూపిస్తుంది. ఎక్కడెక్కడ స్నాప్స్ తీశారనే దాన్ని బట్టి దూరం శాతాలను లెక్కిస్తుంది. అంటే ఎంత ఎక్కువగా స్నాప్స్ తీస్తే అంత కచ్చితంగా వివరాలు నమోదు అవుతాయన్నమాట. ఈ ఫుట్‌స్టెప్స్ కేవలం యూజర్లకే కనిపిస్తాయి. వద్దనుకుంటే ఈ ఫీచర్‌ను ఆఫ్ చేసుకోవచ్చు. యాప్ సెటింగ్స్‌లో అకౌంట్ యాక్షన్స్ విభాగంలో మ్యాప్ కింద కనిపించే 'సేవ్ యాజ్ మై లొకేషన్ అప్‌డేట్స్ ఆన్ ద మ్యాప్' బటన్‌ను ఆఫ్ చేసుకుంటే చాలు. ఫుట్‌స్టెప్స్ ఫీచర్ ద్వారా స్నేహితులకు స్టిక్కర్లనూ పంపొచ్చు. ఘోస్ట్ మోడ్‌ను ఆన్ చేసుకుంటే ఈ ఫీచర్ పనిచేయదని గుర్తించాలి. ఆండ్రాయిడ్ యూజర్లకు ఇది ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందో స్నాప్‌ఛాట్ ఇంకా తెలపలేదు.

ఫోన్ పాస్‌వర్డ్ మరిస్తే?

ఫోన్ భద్రంగా ఉండటానికి పాస్‌వర్డ్, ప్యాటర్న్‌తో స్క్రీన్‌ను లాక్ చేసుకోవటం తెలిసిందే. అయితే వీటిని మరచిపోతే ఫోన్‌ను అన్‌లాక్ చేయటం సాధ్యం కాదు. ఫ్యాక్టరీ రీసెట్‌తో అన్‌లాక్ చేయొచ్చు గానీ డేటా అంతా పోతుంది. మరి వ్యక్తిగత డేటాను కోల్పోకుండా ఆండ్రాయిడ్ ఫోన్‌ను అన్‌లాక్ చేయటమెలా? ఇందుకు కొన్ని పద్ధతులు లేక పోలేదు.



ఆండ్రాయిడ్ ఫోన్ అన్‌లాకర్

ఫోన్‌ను అన్‌లాక్ చేయటానికి అందుబాటులో ఉన్న పద్ధతుల్లో ఇది అత్యంత సమర్థమైంది. దీంతో నిమిషాల్లోనే స్క్రీన్ పాస్‌వర్డ్‌లు, ప్యాటర్న్‌లు, ఫింగర్‌ప్రింట్స్ తొలగించుకోవచ్చు.

- ముందుగా కంప్యూటర్‌లో ఆండ్రాయిడ్ ఫోన్ అన్‌లాకర్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయాలి.
- స్క్రీన్ అన్‌లాకర్ మీద క్లిక్ చేయాలి.
- ఆండ్రాయడ్ ఫోన్‌ను యూఎస్‌బీ కేబుల్‌తో కంప్యూటర్‌కు అనుసంధానం చేసి ఉంచటం తప్పనిసరి.
- కంప్యూటర్‌కు ఫోన్ అనుసంధానమయ్యాక ఈ సాఫ్ట్‌వేర్ ప్రత్యేకంగా కన్ఫిగరేషన్ ఫైల్‌ను సృష్టిస్తుంది. రిమూవ్ నౌ బటన్ మీద క్లిక్ చేసి ముందుకు సాగాలి.
- పరికరం బ్రాండ్‌ను సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. ఆండ్రాయిడ్ పాస్‌వర్డ్‌ను తొలగించుకోవటానికి తెర మీద కొన్ని సూచనలను చేస్తుంది. వీటిని అనుసరించాలి.
- అనంతరం ఫోన్‌ను వెంటనే అన్‌లాక్ చేస్తుంది.

ఆండ్రాయిడ్ డివైస్ మేనేజర్

ఫోన్‌లో ముందుగానే ఫైండ్ మై డివైస్ ఆప్షన్‌ను ఎనేబుల్ చేసుకున్నట్టయితే దీన్ని ప్రయత్నించొచ్చు.

- పీసీ మీద గూగుల్ ఖాతాతో ఆండ్రాయిడ్ డివైస్ మేనేజర్‌ను ఓపెన్ చేయాలి.
- అన్‌లాక్ చేయాలనుకుంటున్న పరికరాన్ని ఎంచుకోవాలి. లాక్ బటన్‌ను క్లిక్ చేశాక తాత్కాలిక పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేయాలి. మళ్లీ లాక్ బటన్‌ను క్లిక్ చేయాలి.
- ఈ ప్రక్రియ పూర్తయ్యాక కన్ఫర్మేషన్ విండో కనిపిస్తుంది. ఇందులో రింగ్, లాక్, ఎరేజ్ బటన్లుంటాయి.
- ఫోన్ మీద ఆండ్రాయిడ్ పాస్‌వర్డ్ ఫీల్డ్ కనిపించినప్పుడు ఇంతకుముందు సెట్ చేసుకున్న తాత్కాలిక పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేయాలి. ఆండ్రాయిడ్ పరికరంలో స్క్రీన్ సెటింగ్స్‌లోకి వెళ్లి, కొత్త పాస్‌వర్డ్‌ను సెట్ చేసుకోవాలి. తాత్కాలిక పాస్‌వర్డ్‌ను డిసేబుల్ చేయాలి.

గూగుల్ ఖాతా

ఆండ్రాయిడ్ ఫోన్ పాస్‌వర్డ్‌ను అన్‌లాక్ చేసేందుకు ఇది తేలికైన, సురక్షిత విధానం.

- పదే పదే తప్పుడు పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేస్తే ఫర్‌గాట్ ప్యాటర్న్ లేదా ఫర్‌గాట్ పాస్‌వర్డ్ అనే మెసేజ్ కనిపిస్తుంది. అప్పుడు ఫర్‌గాట్ ప్యాటర్న్/పాస్‌వర్డ్‌ను క్లిక్ చేయాలి.
- గూగుల్ ఖాతా వివరాలతో సైన్ ఇన్ అవ్వాలి. దీంతో ఫోన్ పూర్తిగా స్వాధీనంలోకి వస్తుంది.

బ్యాకప్ పిన్

ప్యాటర్న్‌తో స్క్రీన్ లాక్ చేసుకున్నవారికిది ఉపయుక్తంగా ఉంటుంది. సాధారణంగా ప్యాటర్న్ లాక్‌ను ఎనేబుల్ చేసుకుంటున్నప్పుడే ఆండ్రాయిడ్ ఫోన్ సెక్యూరిటీ పిన్ (బ్యాకప్ పిన్) కోసమూ అడుగుతుంది. దీన్ని గుర్తు పెట్టుకోవాలి. ప్యాటర్న్‌ను ఆరుసార్లు తప్పుగా ఎంటర్ చేస్తే ఈ బ్యాకప్ పిన్‌తో అన్‌లాక్ చేసుకోవచ్చు.

- ఆండ్రాయిడ్ ఫోన్ తెర మీద లాక్ ప్యాటర్న్‌ను గీయటం మొదలెట్టాలి.
- నాలుగైదు సార్లు గీయగానే 30 సెకండ్ల తర్వాత ప్రయత్నించమనే మెసేజ్ కనిపిస్తుంది.
- ఒకే మీద తట్టినప్పుడు అడుగున బ్యాకప్ పిన్ ఆప్షన్ ప్రత్యక్షమవుతుంది.
- దాని మీద ట్యాప్ చేస్తే టైప్ పిన్ కోడ్ సదుపాయం కనిపిస్తుంది. దాన్ని తాకి పిన్‌ను ఎంటర్ చేయాలి.
- అనంతరం కొత్త ప్యాటర్న్, పాస్‌వర్డ్, పిన్‌ను సెట్ చేసుకోవాలి.

ఆండ్రాయిడ్ డీబగ్ బ్రిడ్జ్ (ఏడీబీ)

ఇది డేటాను కోల్పోకుండా ఆండ్రాయిడ్ లాక్ స్క్రీన్‌ను బైపాస్ చేయటానికి తోడ్పడుతుంది. అయితే ఫోన్ లాక్ కావటానికి ముందు యూఎస్‌బీ డీబగ్గింగ్‌ను సెట్ చేసుకుంటేనే పనిచేస్తుందని గుర్తుంచుకోవాలి. ఇది కాస్త సంక్లిష్టమైంది. సమయమూ ఎక్కువే పడుతుంది. ఎన్‌క్రిప్షన్‌తో కూడిన పరికరాల్లో పనిచేయకపోవచ్చు కూడా.

- కంప్యూటర్‌లో ఏడీబీని డౌన్‌లోడ్ చేసుకొని, రన్ చేయాలి.
- ఫోన్‌ను యూఎస్‌బీ కేబుల్‌తో అనుసంధానం చేశాక కమాండ్ విండోను ఓపెన్ చేయాలి.
- adb shell rm/data/system/gesture.key అనే కమాండ్‌ను ఎంటర్ చేసి ఎంటర్ మీటను నొక్కాలి. ఆండ్రాయిడ్ పరికరం రీస్టార్ట్ అవుతుంది. ప్యాటర్న్ లేదా పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరమేదీ ఉండదు.

ఇక 3 నిమిషాల షార్ట్స్



యూట్యూబ్ షార్ట్స్ మాయలో పడితే అంతే. ఒకదాని తర్వాత మరోటి చూస్తూనే ఉంటాం. అయితే అవి ఒక నిమిషంలోపే ముగియటం కాస్త నిరాశ కలిగిస్తుంది. వీడియో క్రియేటర్లు కూడా నిడివిని పొడిగించాలని చాలాకాలంగా కోరుతున్నారు. త్వరలోనే ఇది ఫలించనుంది. షార్ట్స్ నిడివి గరిష్ఠంగా మూడు నిమిషాలకు పెరగనుంది. తమ గురించి తాము మరింత బాగా వ్యక్తీకరించుకోవాలని అనుకునేవారికిది బాగా ఉపయోగపడనుంది. పెద్ద కథనాలు, లోతైన అంశాలను చెప్పాలనుకునేవారికి.. వేర్వేరు ఫార్మాట్లతో ప్రయోగాలు చేయాలనుకునేవారికి కూడా దీంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ పెద్ద షార్ట్స్‌ను అప్‌లోడ్ చేసే అవకాశం అక్టోబర్ 15 నుంచి అందుబాటులోకి రానుంది. ఈ మార్పు చదరం, నిలువు వీడియోలు రెండింటికీ ఇది వర్తిస్తుంది.

వినూత్న మూవీ జెన్




మెటా సంస్థ ఇటీవల మూవీ జెన్ అనే వినూత్న ఏఐ మోడల్‌ను రూపొందించింది. యూజర్ ప్రాంప్ట్‌ల ఆధారంగా వాస్తవిక వీడియో, ఆడియో క్లిప్స్‌ను సృష్టించటం దీని ప్రత్యేకత. ఈ మోడల్‌కు సంబంధించి జంతువులు ఈదుతున్న, సర్ఫింగ్ చేస్తున్న కొన్ని నమూనా వీడియోలను మెటా ప్రదర్శించింది. వీడియోకు తగిన సౌండ్ ఎఫెక్ట్‌లు, నేపథ్య సంగీతాన్ని కూడా ఇది సృష్టించగలదు. సృజనాత్మక టెక్స్ట్ ప్రాంప్ట్‌ను టైప్ చేస్తే చాలు. దానికి అనుగుణంగా ఏఐ కొత్త వీడియోను ముందుంచుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడియోలనూ పదాల ప్రాంప్ట్‌లతో ఎడిట్ చేసుకోవచ్చు. ఆయా థీమ్‌ల ఆధారంగా ఇది సంగీతాన్నీ సూచిస్తుంది. ప్రస్తుతానికి మూవీ జెన్ పరిశోధన దశలో ఉంది. యూజర్లకు ఇంకా అందుబాటులోకి రాలేదు. దీన్ని మరింత తీర్చిదిద్ది, త్వరలోనే విస్తృతంగా విడుదల చేయాలని మెటా భావిస్తోంది.

(c) eenadu

ఫలితాలపై నేతలది తలోమాట

ప్రజాతీర్పునకు తూట్లు పొడిచే కుతంత్రాలు వద్దు



నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)ను నామరూపాల్లేకుండా చేయాలని గత అయిదేళ్లలో ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఇదే లక్ష్యంగా ఎన్నో పార్టీలు పుట్టుకొచ్చాయి. దేవుడి దయ మాపైనే ఉంది. మమ్మల్ని తుడిచిపెట్టాలని చూసినవారు ఆ ప్రయత్నంలో వాళ్లే కనుమరుగయ్యారు. ఎగ్జిట్ పోల్స్ వృథాప్రయాస అని గతంలోనే చెప్పాను. ఈ విజయం మా బాధ్యతలను పెంచింది. ప్రజాతీర్పునకు తూట్లు పొడిచేలా కేంద్రం, రాజ్‌భవన్ ఎటువంటి కుతంత్రాలకు పాల్పడకూడదు. అసెంబ్లీకి ఎమ్మెల్యేలను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)కు లేదు. ఆ పని ఎన్నికైన ప్రభుత్వమే చేయాలి. ఫలితాలు పూర్తిగా వచ్చాక చూద్దాం (పీడీపీని కూటమిలో చేర్చుకోవడంపై).

– ఒమర్ అబ్దుల్లా, ఎన్సీ ఉపాధ్యక్షుడు

కేంద్రం గుణపాఠం నేర్చుకోవాలి



జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన నిర్ణయాత్మక తీర్పు నుంచి కేంద్ర ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలి. ఎన్సీ - కాంగ్రెస్ కూటమి ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదు. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వాన్ని అభినందిస్తున్నా. ఒమర్ అబ్దుల్లాను సీఎం అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయం. హంగ్ వైపు వెళ్లకుండా, స్థిరమైన సర్కారును ఎన్నుకొన్న జమ్మూకశ్మీర్ ప్రజలు కూడా అభినందనీయులే. ప్రతిపక్షంగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం. అయిదుగురు ఎమ్మెల్యేలను ఎల్జీ నామినేట్ చేయడం అనైతికం, రాజ్యాంగ విరుద్ధం.

– మెహబూబా ముఫ్తీ, పీడీపీ అధ్యక్షురాలు


అతివిశ్వాసం పనికిరాదని 'హరియాణా' గుణపాఠం



ఎన్నికల్లో అతివిశ్వాసం పనికిరాదన్నది హరియాణా ఎన్నికలు నేర్పిన అతిపెద్ద గుణపాఠం. ప్రతి ఎన్నిక, ప్రతి స్థానం కఠినమైనదే. దేన్నీ తేలికగా తీసుకోకూడదు. జమ్మూకశ్మీర్‌లోని డోడాలో భాజపాపై గెలిచిన ఆప్ అభ్యర్థికి అభినందనలు. ఈ ఎన్నికతో అయిదో రాష్ట్రంలో మేము ఖాతా తెరిచాం.

– అరవింద్ కేజ్రీవాల్, ఆప్ అధినేత

జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన మాట మేరకు.. ఒకప్పుడు భీతావహ వాతావరణం ప్రబలిన జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం. తీవ్రవాద ఘటనలు చెలరేగిన 1980ల నాటి నుంచీ అక్కడి ప్రజలు ప్రశాంతమైన, పారదర్శక ఎన్నికల్లో భారీసంఖ్యలో ఓటింగులో పాల్గొనడం ఇదే మొదటిసారి. ఎన్నికల సంఘాన్ని, జమ్మూకశ్మీర్ పాలకవర్గాన్ని, భద్రతా దళాలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. కాంగ్రెస్ పార్టీ ప్రతికూల, విభజన రాజకీయాలను హరియాణా ప్రజలు తిరస్కరించారు.

– అమిత్ షా, కేంద్ర హోం మంత్రి

'హరియాణా'పై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాబోయే మహారాష్ట్ర, ఝార్ఖండ్ శాసనసభల ఎన్నికల్లోనైనా 'ఇండియా' కూటమిలోని అందరు భాగస్వాములతో కలిసి నడవాలి. కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను జమ్మూకశ్మీర్ ప్రజలు తిరస్కరించారు.

– డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

ఇది మోదీ నాయకత్వ ఘనత

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భాజపా ప్రభుత్వ విధానాలకు హరియాణా ప్రజలు ఆమోదముద్ర వేశారు. ఇది పూర్తిగా మోదీజీ ఘనతే. ఆయన ఆశీస్సులు, మార్గదర్శకత్వంలో ముందడుగు వేశాం.

– నాయబ్‌సింగ్ సైనీ, హరియాణా ముఖ్యమంత్రి

మోదీని మెచ్చి.. వరుసగా మూడోసారి

మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ పనితీరు, విధానాలు, సాధించిన విజయాలను చూసి హరియాణా ప్రజలు వరుసగా మూడోసారి భాజపాను ఎన్నుకొన్నారు. మోదీ పాలన తమపై చూపిన ప్రభావాన్ని ప్రకటిస్తూ ఇది ప్రజలిచ్చిన సందేశం.

– మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర మంత్రి (హరియాణా మాజీ సీఎం)

నన్ను సీఎంను చేస్తే..

హరియాణాలో మనోహర్‌లాల్ ఖట్టర్‌ను దించి, నాయబ్‌సింగ్ సైనీని ముఖ్యమంత్రి చేసినపుడు.. అనిల్ విజ్‌ను ఎందుకు చేయకూడదన్న ప్రశ్న ప్రజల నుంచే వచ్చింది. పార్టీ నన్ను సీఎంను చేస్తే రాష్ట్రం అదృష్టాన్ని, ముఖచిత్రాన్నే మార్చేస్తా. అయినా నేను భాజపాలో అంకితభావం గల కార్యకర్తను. పార్టీని ఏదీ అడగను. "మై జిందగీకా సాథ్ నిభాతా చలాగయా.." (నేను జీవితం ఎలా తీసుకువెళితే అలా సాగిపోతా..).

– అనిల్ విజ్, భాజపా సీనియర్ నేత

కాంగ్రెస్ ఓటమికి బాధ్యులను గుర్తించాలి

హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అసంతృప్తికరమైన ఫలితం రావడంపై అధిష్ఠానం సమీక్ష జరిపి, ఓటమికి బాధ్యులను గుర్తించాలి. ఇది సాధారణ వ్యవహారం కాదు.. ఆత్మపరిశీలన చేసుకోవాలి. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఎంతో శ్రమించిన కార్యకర్తలు అసంతృప్తికి గురవడం చూసి చింతిస్తున్నా.

– కుమారి శెల్జా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు

సవాళ్లే విజయ సోపానాలు!

● హరియాణాలో నాయబ్‌సింగ్ సైనీ మ్యాజిక్

ఛండీగఢ్: మాస్ లీడర్ కాదంటూ రాజకీయ విశ్లేషకులు తక్కువ అంచనా వేశారు! డమ్మీ సీఎం అంటూ విపక్ష నేతలు ఎద్దేవా చేశారు! ఓటమి అంచున ఉన్న భాజపాని గెలిపించడం అసాధ్యమంటూ సొంత పార్టీలోనే కొందరు పెదవి విరిచారు!! రైతులు, నిరుద్యోగులు, అగ్నివీరులు తదితర వర్గాల ఆగ్రహంతో పాటు అధిక ధరలు వంటి సమస్యలు చుట్టుముట్టిన వేళ పదేళ్లుగా అధికారంలో ఉన్న పార్టీకి గెలుపు అవకాశాల్లేవనీ ఇంకొందరు కొట్టిపారేశారు. అటువంటి తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లోనూ కేవలం 200 రోజుల్లోనే పార్టీని విజయ పథంలో నడిపించి మ్యాజిక్ చేశారు... హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ.

ఒక్కో మెట్టు ఎక్కుతూ...

నాయబ్ సింగ్ సైనీ.... అంబాలా జిల్లా మిర్జాపూర్ మజ్రా గ్రామంలో 1970 జనవరి 25న జన్మించారు. బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. ఆర్ఎస్ఎస్‌తో సుదీర్ఘ అనుబంధం. భాజపాలో కార్యకర్త స్థాయి నుంచి ఎదుగుతూ వచ్చారు. 1996లో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా జీవితాన్ని మొదలుపెట్టారు. మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్‌తో సాన్నిహిత్యం రాజకీయ జీవితంలో వేగంగా ఎదగటానికి బాటలు వేసింది. సైనీ... అంబాలా జిల్లా భాజపా అధ్యక్షుడిగా, భాజపా కిసాన్ మోర్చా హరియాణా శాఖ ప్రధాన కార్యదర్శిగా వివిధ స్థాయిల్లో సేవలందించారు. మనోహర్ లాల్ ఖట్టర్ క్యాబినెట్‌లో హోంమంత్రిగా చేశారు. 2014లో అసెంబ్లీకి నారాయణ్ గఢ్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2019లో కురుక్షేత్ర స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2023 అక్టోబరులో హరియాణా భాజపా అధ్యక్షుడిగా నియమితులయ్యారు.



ఖట్టర్ స్థానంలో సీఎంగా..


ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పాలనపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని గ్రహించిన భాజపా అగ్రనాయకత్వం ఈ ఏడాది మార్చిలో సైనీకి సీఎం బాధ్యతలు అప్పగించింది. ఆ తర్వాత రెండున్నర నెలలకే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలకూ సుమారు 200 రోజుల సమయం మాత్రమే ఉంది. పరిస్థితిని గమనించిన సైనీ వేగంగా ప్రజాకర్షక పథకాలను ప్రకటించారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశారు. గ్రామ పంచాయతీల వ్యయ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.21 లక్షలకు పెంచారు. దీంతో క్షేత్ర స్థాయిలో అభివృద్ధి పనులకు వీలు కలిగింది. విద్యుత్తు వినియోగదారులపై భారంగా మారిన కనీస ఛార్జీలను రద్దు చేశారు. వినియోగించిన కరెంటుకు మాత్రమే బిల్లులు చెల్లించేలా మార్చారు. అగ్నివీర్ పథకంపై అసంతృప్తిని చల్లార్చేందుకు రాష్ట్రానికి ప్రత్యేకంగా అగ్నివీర్ పాలసీ-2024ను తీసుకొచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ చర్యలు ఆకట్టుకొన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పరిమితంగానే పాల్గొన్నప్పటికీ మిగిలిన బాధ్యతలను సైనీ తన భుజానికెత్తుకున్నారు.

అసెంబ్లీకి రానురానంటూనే..!

● ఒమర్ అబ్దుల్లా విజయ బావుటా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌తో అబ్దుల్లా కుటుంబానిది విడదీయలేని అనుబంధం. మూడు తరాలుగా రాజకీయ ప్రాబల్యం వీరిదే. తాత... షేక్ అబ్దుల్లా, తండ్రి... ఫరూక్ అబ్దులా... వారిద్దరి బాటలోనే ఒమర్ అబ్దుల్లా. వీరు ముగ్గురూ జమ్మూకశ్మీర్‌కు ముఖ్యమంత్రులుగా చేసిన వారే. కుటుంబ రాజకీయ వారసత్వాన్ని అందుకున్న 54 ఏళ్ల ఒమర్ అబ్దుల్లా మరోసారి సీఎం పదవిని అధిరోహించటానికి రంగం సిద్ధం చేసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2019లో రాజ్యాంగ అధికరణం 370 రద్దు చేయడంతో అప్పటి వరకూ ఉన్న ప్రత్యేక ప్రతిపత్తి హోదాను జమ్మూకశ్మీర్ కోల్పోయింది. దీంతో పాటు ఆ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిపోయింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలన్నది ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్. ఆ పార్టీ అగ్రనేత ఒమర్ అబ్దుల్లా కూడా గత అయిదేళ్లుగా అందు కోసమే పట్టు పట్టారు. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నంత వరకూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో అడుగుపెట్టబోనని, ఎన్నికల్లో పోటీ చేయనని ఒమర్ ఒట్టు పెట్టుకున్నారు. కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీలో అడుగుపెట్టి తనను తాను అవమానించుకోలేనని చెప్పిన ఒమర్...ఎలక్షన్ కమిషన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఒట్టు తీసి గట్టు మీద పెట్టారు. ఏకంగా రెండు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి విజయం సాధించారు.



ఓటమి వెంటే గెలుపు...

దేశ స్వాతంత్ర్యానంతరం జమ్మూకశ్మీర్ రాజకీయాలను సుదీర్ఘ కాలం శాసించిన అబ్దుల్లా కుటుంబం ఆ తర్వాత క్రమంగా ప్రాభవాన్ని కోల్పోయింది. అయితే, 2019లో అధికరణం 370 రద్దయిన తర్వాత వీరి నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి ప్రజల మద్దతు పెరిగింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ఒమర్ అబ్దుల్లా... అసెంబ్లీ ఎన్నికలకు గట్టి వ్యూహం సిద్ధం చేసుకున్నారు. తన కుటుంబానికి పట్టున్న గండేర్బల్ నియోజకవర్గంతో పాటు బుద్గాం స్థానం నుంచీ పోటీ చేశారు. కాంగ్రెస్‌తో ఎన్నికలకు ముందే పొత్తు ఖరారు చేసుకున్నారు. 2002లో గండేర్బల్ శాసనసభ స్థానంలో ఓడిపోయిన తర్వాత అదే ప్రాంతం నుంచి 2004లో ఒమర్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. అంతకు ముందు 1998, 1999 పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించారు. 2009 చివరిలో 38 ఏళ్ల వయసులో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి అయిన ఒమర్ అబ్దుల్లా... 2015 అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ ఓటమితో ఆ పదవిని కోల్పోయారు.

ఇంగ్లండ్‌లో జన్మించి...

ఒమర్ అబ్దుల్లా 1970 మార్చి 10న ఇంగ్లండ్‌లోని రోచ్‌ఫోర్డ్‌లో జన్మించారు. పాఠశాల విద్య జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్, హిమాచల్‌ప్రదేశ్‌లోని సనావర్‌లో కొనసాగింది. ముంబయిలో కామర్స్‌లో డిగ్రీ, స్కాట్‌లాండ్‌లో ఎంబీఏ చేశారు. కశ్మీర్‌లోని లాల్‌చౌక్ నియోజకవర్గం నుంచి 1998 లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగి రాజకీయాల్లోకి ప్రవేశించారు.

సార్వత్రిక ఎన్నికల షాక్ నుంచి కోలుకున్న కమలం!

ఇంటర్నెట్ డెస్క్: లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో భాజపాకు ఊరట లభించింది. పోలింగ్ జరిగిన రెండు రాష్ట్రాల్లో కాషాయ దళం అంచనాలకు మించి రాణించింది. దీంతో ఓ రకంగా ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో తగిలిన షాక్ నుంచి కోలుకున్నట్లైంది. ముఖ్యంగా హిందీ హార్ట్‌ల్యాండ్‌కు తాళంగా భావించే హరియాణాలో పట్టు నిలుపుకోవడం కమలం పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చింది. ఇప్పటికే హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ పాలనలో ఉండటంతో.. తాజాగా హరియాణాను కోల్పోతే ఆ ప్రభావం మిగిలిన వాటిపై పడుతుందని ప్రతిపక్షాలు ఆశలు పెట్టుకున్నాయి. కానీ ఈ విజయంతో భాజపా పట్టు నిలబెట్టుకుంది.

అధికారం దక్కకపోయినా..

జమ్మూ కశ్మీర్‌లోనూ భాజపా బలమైన శక్తిగానే ఆవిర్భవించింది. గతంలో 25 సీట్లకే పరిమితమైన భాజపా ఈసారి 29 స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. నేషనల్ కాన్ఫరెన్స్ తర్వాత అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఓట్ల పరంగా చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ కంటే భాజపాకే అధిక శాతం పోలయ్యాయి. భవిష్యత్తులో పొత్తులు కుదిరితే అధికారం అందుకోవడం తమకు ఏమాత్రం కష్టం కాదని ఇది సంకేతాలిస్తోంది. ఈ ఎన్నికల్లో పొత్తులు లేకపోయినా.. భవిష్యత్తులో జమ్మూ ప్రాంతంలో విస్తరించాలని భావించే పార్టీలు కచ్చితంగా భాజపాతో జట్టుకట్టే అవకాశం ఉంటుంది.

రెట్టించిన ఉత్సాహంతో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌కు..

మరికొన్ని రోజుల్లో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో ఎన్నికల నగారా మోగనుంది. ఇక్కడ భాజపాకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఇప్పటికే సర్వేలు చెబుతున్నా. . ఈ ఫలితాలు ఆ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ మిత్రపక్షాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయవచ్చు. మహారాష్ట్రలో భాజపా ఇప్పటికే సర్వశక్తులు ఒడ్డి పోరాడేందుకు సిద్ధమవుతుంది. మరోవైపు ఝార్ఖండ్‌పై ఇప్పటికే భాజపా గురిపెట్టింది. ప్రధానే స్వయంగా ఇప్పటికే పలుమార్లు ఆ రాష్ట్రాన్ని సందర్శించారు.

కాంగ్రెస్ × భాజపా.. మధ్యలో ఓ జిలేబీ..

ఇంటర్నెట్ డెస్క్: ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారు చేస్తూ.. హరియాణా ఎన్నికల్లో భాజపా విజయం సాధించగా కాంగ్రెస్ భంగపడింది. అయితే ఈ ఎన్నికల్లో ఎక్కువగా వినిపించిన పదాలు జాట్స్, జిలేబీ. ఆ రెండూ తమను రక్షిస్తాయని ఆశపడిన కాంగ్రెస్ భంగపడింది. ఇప్పుడు హస్తం పార్టీకి కౌంటర్‌గా భాజపా జిలేబీలను పంచుకుంటోంది! ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'జిలేబీ' ప్రస్తావన తెచ్చారు. గొహానా ప్రాంతంలో మాట్లాడుతూ.. మాథురామ్ హల్వాయి నుంచి తెచ్చిన స్వీట్ల బాక్స్‌ను పట్టుకొని వీటిని దేశవ్యాప్తంగా విక్రయించాలని, ఎగుమతి చేయాలని ప్రసంగించారు. దానివల్ల ఉపాధి పెరుగుతుందని చెప్పారు. 20,000 నుంచి 50,000 మందికి ఉపాధి దొరకొచ్చన్నారు. మాథురామ్ వంటి వ్యాపారవేత్తలు.. కేంద్రం తీసుకువచ్చిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల ఇబ్బందిపడ్డారని వ్యాఖ్యానించారు. దానిపై అప్పట్లో భాజపా నేత రవిశంకర్ ప్రసాద్ కౌంటర్ ఇస్తూ.. "నాకు గొహానా జిలేబీ అంటే ఇష్టం. వాటి ఫ్యాక్టరీ అమెరికాలో పెట్టాలని రాహుల్ అంటున్నారు. అసలు వాటిని ఎలా తయారు చేస్తారు? ఎలా అమ్ముతారు? అనేవి ఆయన అర్థం చేసుకోవాలి. ఆయన ప్రసంగాలు రాసేవారు ఆయనకు ఆ విషయాన్ని చెప్పాలి" అని విమర్శించారు. ఇక సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా ప్రధాని మోదీ వీటి గురించి మాట్లాడారు. ఇండియా కూటమిలోని పార్టీలను విమర్శిస్తూ.. "ఆ కూటమి అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులు వస్తారు. ప్రధాని పదవి ఏమైనా మాథురామ్ జిలేబీనా పంచుకోవడానికి..?" అని ప్రశ్నించారు. ఇక మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలిగంటల్లో కాంగ్రెస్ ఆధిక్యంలో కనిపించింది. దాంతో పూర్తి ఫలితాలు వచ్చేవరకు ఆగకుండా కాంగ్రెస్ శ్రేణులు జిలేబీలు పంచుకున్నాయి. కానీ తర్వాత భాజపా పుంజుకుంది. అధికారాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన మెజార్టీ మార్క్‌ను దాటింది. ఇప్పుడు వారు కూడా కాంగ్రెస్‌కు కౌంటర్‌గా జిలేబీలు ఆర్డర్ చేశారట.



కాంగ్రెస్ కార్యాలయంలో పూరీ, పకోడీ తినేవారేరీ!


దిల్లీ: మంగళవారం ఉదయం.. 9 గంటలు! ముందు నుంచే హరియాణాలో విజయం ఖాయం అనుకున్న కాంగ్రెస్ శ్రేణులు 24 అక్బర్ రోడ్డులోని పార్టీ కేంద్ర కార్యాలయానికి భారీగా చేరుకున్నాయి. తొలివరస ఫలితాల్లో.. కాంగ్రెస్‌కే ఆధిక్యమని రావటంతో పార్టీ కార్యకర్తలు, నాయకుల ఆనందానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. టపాసులు కాల్చడం మొదలైంది. జిలేబీలు, లడ్డూలు పంచుకొంటూ ఎటుచూసినా ఆనంద కోలాహలం!

10 గంటల కల్లా.. భాజపా పుంజుకొంటున్నట్లు వార్తలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ఆధిక్యం తగ్గటం. .. హరియాణా ఫలితాల అంకెలు తారుమారవటం ఆరంభమైంది. కాంగ్రెస్ కార్యాలయంలో బాణసంచా మాయమైంది. డప్పుల చప్పుడు ఆగిపోయింది. జిలేబీ, లడ్డూలూ ఎటుపోయాయో తెలియదు. 'ఒంటి గంటకల్లా మళ్లీ పుంజుకొంటాం..' అంటూ నాయకులు మెల్లగా జారుకోవటం మొదలెట్టారు. పొద్దున్నే భారీగా వచ్చిన పార్టీ శ్రేణులను చూసి.. క్యాంటీన్‌లో పూరీలు, పకోడీలు తయారు చేశారు. ఫలితాలు తారుమారవటంతో వాటిని తినేవారు లేకుండాపోయారు.

హరియాణా ఫలితం అనూహ్యం.. సమీక్షిస్తాం

● కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

దిల్లీ, చండీగఢ్: హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితం అనూహ్యమని, పార్టీ దీనిని సమీక్షిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. క్షేత్ర స్థాయి కార్యకర్తలతో చర్చించి, వాస్తవ సమాచారం అందాక దీనిపై మాట్లాడతానన్నారు. మంగళవారం 'ఎక్స్' వేదికగా ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ.. జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ - ఎన్సీ కూటమి విజయం భాజపా ప్రజావ్యతిరేక విధానాలను, అణచివేతలను, రాజ్యాంగ సంస్థల దుర్వినియోగాన్ని నిరసిస్తూ ఓటర్లు ఇచ్చిన తీర్పుగా అభివర్ణించారు. జమ్మూకశ్మీర్ ప్రజల రాజ్యాంగపరమైన హక్కులను కాపాడటానికి, ఆంకాక్షలను నెరవేర్చడానికి 'ఇండియా' కూటమి కట్టుబడి ఉంటుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన హరియాణా, జమ్మూకశ్మీర్ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన ఖర్గే.. హరియాణా కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, నియంతృత్వానికి వ్యతిరేకంగా తాము చేస్తున్నది సుదీర్ఘ పోరాటమన్నారు. జమ్మూకశ్మీర్‌లో అద్భుత విజయం సాధించిన నేషనల్ కాన్ఫరెన్సు అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లాలను ఖర్గే అభినందించారు.



వాతావరణానికి విరుద్ధంగా ఫలితాలు: హుడ్డా

హరియాణా రాష్ట్రంలో నెలకొన్న వాతావరణానికి పూర్తి విరుద్ధంగా, ఆశ్చర్యం కలిగించేలా ఎన్నికల ఫలితాలు వచ్చాయని కాంగ్రెస్ సీనియర్ నేత భూపీందర్‌సింగ్ హుడ్డా తెలిపారు. ఈ ఫలితాలు ఇటు తమను, అటు భాజపాను కూడా ఆశ్చర్యచకితులను చేశాయన్నారు. అతి తక్కువ తేడాలతో చాలా సీట్లు కోల్పోయామని, ఈవీఎంలపై ఆయా అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అసలేం జరిగిందో విచారించాల్సి ఉందన్నారు.

రేపు లావోస్ పర్యటనకు ప్రధాని మోదీ



దిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు లావోస్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధాన మంత్రి సోనెక్సే సిఫాండోన్ ఆహ్వానం మేరకు అక్టోబరు 10, 11 తేదీల్లో మోదీ లావోస్‌లో పర్యటించనున్నట్లు విదేశాంగశాఖ మంగళవారం ప్రకటించింది. పర్యటనలో భాగంగా లావోస్ అధ్యక్షత వహిస్తున్న 21వ ఆసియన్-ఇండియా శిఖరాగ్ర సమావేశం, 19వ తూర్పు ఆసియా సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారని వెల్లడించింది. దీంతోపాటు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై మోదీ చర్చలు జరపనున్నట్లు తెలిపింది.

తుపాకులకు చెక్ పెట్టి.. ప్రజాస్వామ్యానికి పట్టం కట్టి!

ఇంటర్నెట్ డెస్క్: ఉగ్రవాదం, వేర్పాటువాద ఉద్యమాలతో సతమతమయ్యే జమ్మూ కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తోంది. ఒకప్పుడు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన ప్రజలే.. తాజా ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరడం, ప్రభుత్వాన్ని ఎన్నుకున్న తీరు మార్పునకు సంకేతంగా కనిపిస్తోంది. కశ్మీరీ ఓటర్లు నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమికి పట్టం కట్టారు. తమకు తుపాకులు, రాళ్లపై విశ్వాసం లేదని భావించిన స్థానికులు ప్రజాస్వామ్యం వైపే మొగ్గుచూపినట్లు కనిపిస్తోంది. కుల్గామ్, సోపోర్, షోపియాన్, శ్రీనగర్ వంటి ఉగ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో భారీ సంఖ్యలో ఓటర్లు పాల్గొనడం ఇందుకు నిదర్శనమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

రెండు చోట్లా ఒమర్ విజయకేతనం

శ్రీనగర్: నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తాను పోటీ చేసిన గాందర్‌బల్, బడ్గాం నియోజకవర్గాల నుంచి విజయం సాధించారు. జమ్మూలోని ఎన్సీ కంచుకోట గాందర్‌బల్‌లో పీడీపీ అభ్యర్థి బషీర్ అహ్మద్ మీర్‌పై 10,574 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. బడ్గాంలో 18 వేల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 2008లో గాందర్‌బల్‌లో గెలిచిన ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యారు.

విజయ దురంధరుడు తరిగామి

వరసగా అయిదోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో కుల్గాం నియోజకవర్గం నుంచి సీపీఎం తరఫున వరుసగా అయిదోసారి ఎం.వై.తరిగామి విజయం సాధించారు. నిషేధిత జమాతే ఇస్లామీ మాజీ అధ్యక్షుడు సయర్ అహ్మద్ రెషిపై ఆయన 7,838 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 33,634 ఓట్లను తరిగామి కైవసం చేసుకోగా ప్రత్యర్థి అహ్మద్ 25,796 ఓట్లను పొందారు. 1996 నుంచి తరిగామి విజయం సాధిస్తుండగా, రెషి తొలిసారి ఎన్నికల్లో పోటీ పడ్డారు.

జమ్మూకశ్మీర్‌లో ఆప్ బోణీ

డోడాలో గెలిచిన పార్టీ అభ్యర్థి మాలిక్

జమ్మూ: ఆమ్ ఆద్మీ పార్టీ జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో తొలిసారి ఖాతా తెరిచింది. ఆ పార్టీ తరఫున డోడా నియోజకవర్గంలో బరిలో దిగిన మెహరాజ్ మాలిక్ తన సమీప ప్రత్యర్థి, భాజపా అభ్యర్థి గజయ్ సింగ్ రాణాను 4,538 ఓట్ల తేడాతో ఓడించారు. జిల్లా అభివృద్ధి మండలి సభ్యుడైన మాలిక్ మొత్తం 23,228 ఓట్లను పొందగా రాణా 18,690 ఓట్లను దక్కించుకున్నారు. మాజీ మంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఖలీద్ నజీబ్ 13,334, డీపీఏపీ అభ్యర్థి 10,027 ఓట్లను పొందారు. ఇక్కడ కాంగ్రెస్ తరఫున పోటీలో దిగిన షేక్ రియాజ్ అహ్మద్ 4,170 ఓట్లతో అయిదో స్థానానికి పరిమితమయ్యారు. 90 శాసనసభ స్థానాలకుగాను ఏడు స్థానాల్లో ఆప్ తన అభ్యర్థులను పోటీకి నిలిపింది. దిల్లీ, పంజాబ్‌లో అధికారంలో గల ఆప్‌నకు గుజరాత్, గోవాల్లో శాసనసభ్యులున్నారు. ఆ పార్టీకి గతేడాది సెప్టెంబరులో జాతీయ పార్టీ హోదా దక్కింది.

తాజ్‌మహల్‌ను సందర్శించిన మాల్దీవుల అధ్యక్షుడు

ఆగ్రా: ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు, ఆయన సతీమణి సాజిదా మహమ్మద్‌లు మంగళవారం తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఆ అద్భుత కట్టడం ముందు ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. మహమ్మద్ ముయిజ్జు దంపతులు ప్రత్యేక విమానంలో ఆగ్రా చేరుకోగానే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తరఫున ఆ రాష్ట్ర మంత్రి యోగేంద్ర ఉద్యాయ్ వారికి స్వాగతం పలికారు. "ఈ సమాధి మందిరం అందాన్ని వర్ణించడం చాలా కష్టం. పదాలు అందుకు న్యాయం చేయలేవు. మంత్రముగ్ధులను చేసే ఈ కట్టడం సంక్లిష్టత ప్రేమ, నిర్మాణ నైపుణ్యానికి నిదర్శనం" అని సందర్శకుల పుస్తకంలో ముయిజ్జు రాశారు. అనంతరం ముయిజ్జు దంపతులు శిల్పారామాన్ని సందర్శించారు.



తాజ్‌మహల్ వద్ద మహమ్మద్ ముయిజ్జు దంపతులు

భాజపా ఏకైక మహిళా అభ్యర్థిని వరించిన విజయం

● 521 ఓట్లతో గెలుపొందిన శగున్ పరిహార్

కిస్తవాడ్: ఉగ్రవాదుల దాడిలో అయిదు సంవత్సరాల క్రితం తండ్రిని, పినతండ్రిని కోల్పోయిన భాజపా మహిళా అభ్యర్థి శగున్ పరిహార్ కిస్తవాడ్ శాసనసభ స్థానం నుంచి అనూహ్య విజయం సాధించారు. నేషనల్ కాన్ఫరెన్స్ దిగ్గజనేత, మాజీ మంత్రి సాజద్ అహ్మద్ కిచ్లూను మట్టికరిపించారు. శగున్ కేవలం 521 ఓట్ల మెజారిటీనే సాధించినప్పటికీ మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకూ అధిక్యాన్ని చాటుకుంటూ రావడం గమనార్హం. భాజపా తరఫున గెలుపొందిన మొత్తం 29 మంది శాసనసభ్యుల్లో ఆమె ఒక్కరే మహిళా ఎమ్మెల్యే. ఆ పార్టీ తరఫున పోటీ చేసిన మహిళా అభ్యర్థి కూడా అమె ఒక్కరే. శగున్‌తో మరో ఇద్దరు మహిళలు తాజా ఎన్నికల్లో శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు.

భాజపా అభ్యర్థిదే అత్యధిక మెజారిటీ

- జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్.సి.)-కాంగ్రెస్ కూటమి తరఫున ఇద్దరు హిందువులు విజయం సాధించారు. 29 సీట్లతో రెండోస్థానంలో నిల్చిన భాజపా తరఫున 28 మంది హిందువులు, ఒక సిక్కు నెగ్గారు. భాజపా సీట్లిచ్చిన 25 మంది ముస్లిం అభ్యర్థులు ఓడిపోయారు.
- రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రవీందర్ రైనాపై ఎన్.సి. అభ్యర్థి సురీందర్ చౌధరి 7వేలకుపైగా ఓట్ల తేడాతో నెగ్గారు.
- నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)కి చెందిన ఇద్దరు అభ్యర్థులు అబ్దుల్ రహీం రాథర్, అలీ మహమ్మద్ సాగర్‌లు ఏడోసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు.
- భాజపా అభ్యర్థి దేవేందర్ రాణా నగ్రోటా స్థానం నుంచి 30,472 ఓట్ల తేడాతో విజయం సాధించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే అత్యధిక మెజారిటీ! ట్రాల్ స్థానంలో పీడీపీ అభ్యర్థి నాయక్ అత్యల్పంగా 460 ఓట్లతో గట్టెక్కారు.
- జమ్మూకశ్మీర్‌లో 1.48 శాతం మంది నోటాకు ఓటు వేశారు. హరియాణా ఎన్నికల్లో ఈ సంఖ్య 0.38 శాతం మాత్రమే!

కశ్మీర్‌లో స్వతంత్రుల జోరు

● విజయం సాధించిన ఏడుగురు ఇండిపెండెంట్లు

జమ్మూ: జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు సత్తా చాటారు. మొత్తం ఏడుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు జాతీయ, స్థానిక పార్టీల అభ్యర్థులపై ఘనవిజయం సాధించారు. ఈసారి మొత్తం 346 మంది స్వతంత్రులు పోటీ చేయగా... ఏడుగురు అసెంబ్లీలోకి అడుగుపెట్టే అదృష్టాన్ని దక్కించుకున్నారు.

వారి వివరాలు..

విజేత	నియోజకవర్గం	మెజారిటీ
1. ఖుర్షీద్ అహ్మద్ షేక్	లంగేట్	1,602
2. షాబిర్ అహ్మద్ కుల్లే	శోపియా	1,207
3. ప్యారేలాల్ శర్మ	ఇందర్‌వాల్	643
4. డాక్టర్ రామేశ్వర్‌సింగ్	బానీ	2,048
5. సతీశ్ శర్మ	చంబా	6,929
6. ముజఫర్ ఇక్బాల్ ఖాన్	థనామండి	6,179
7. చౌదరి మహ్మద్ అక్రం	సురన్‌కోట్	8,851

ఎన్నికల వ్యూహాలపై సమీక్షించండి

● కాంగ్రెస్‌కు ఇండియా కూటమి పక్షాల సూచన

దిల్లీ: హరియాణాలో ఊహించని పరాజయం ఎదురుకావడంతో త్వరలో జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పునరాలోచించాలని కాంగ్రెస్‌కు దాని మిత్రపక్షాలు సూచించాయి. హరియాణా ప్రజలు శాసనసభ ఎన్నికల్లో భాజపాను ఓడించాలని భావించినా కాంగ్రెస్ తన ఎన్నికల వ్యూహపర లోపాలతో విజయం సాధించలేకపోయిందని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా విశ్లేషించారు. త్వరలో జరగనున్న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలపై తాజా ఫలితాలు ఎటువంటి ప్రభావం చూపబోవని ఉద్ధవ్‌ఠాక్రే నేతృత్వంలోని శివసేన(యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది పేర్కొన్నారు. అయితే హరియాణాలో భాజపాతో నేరుగా పోరాడి అంచనాలను అందుకోలేకపోయిన కాంగ్రెస్ తన ఎన్నికల వ్యూహాలపై పునరాలోచన చేయాలని సూచించారు.

'ఈవీఎంల తారుమారు అవాస్తవం'

దిల్లీ: హరియాణాలోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈవీఎంలను తారుమారు చేశారని, వివిధ స్థాయిల్లో బ్యాటరీలను ఛార్జింగు చేసిన యంత్రాలు విభిన్న ఫలితాలు చూపించాయంటూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను ఈసీ వర్గాలు తోసిపుచ్చాయి. ఈవీఎంల బ్యాటరీలు 99 శాతం ఛార్జింగు చేసిన స్థానాల్లో భాజపా గెలిచిందని, 70 శాతం లోపు ఛార్జింగు జరిగినచోట కాంగ్రెస్ గెలిచిందని. . ఇది కుట్ర కాక మరేమిటంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపణలు చేశారు. ఈవీఎంల కంట్రోల్ యూనిట్లలో ఆల్కలైన్ బ్యాటరీలను వాడామని, అభ్యర్థుల ముందే కొత్త బ్యాటరీలు మార్చి.. సీలు వేసినట్లు ఈసీ తెలిపింది. మొదట్లో బ్యాటరీ 7.5 నుంచి 8 మేర ఓల్టేజీ ఇస్తుందని, ఈ కారణంగా ఓల్టేజీ 7.4 కంటే ఎక్కువగా ఉన్నపుడు బ్యాటరీ సామర్థ్యం 99 శాతంగా చూపుతుందన్నారు. ఈవీఎంలను వాడేకొద్దీ ఓల్టేజీ తగ్గినపుడు బ్యాటరీ సామర్థ్యం కొంత తగ్గినట్లు చూపిస్తుందని వివరణ ఇచ్చారు. 5.8 ఓల్టేజీ దాకా కంట్రోల్ యూనిట్ పనిచేస్తుందన్నారు. అంతకంటే తగ్గితే బ్యాటరీ మార్చాల్సిందిగా కంట్రోల్ యూనిట్లో హెచ్చరిక కనిపిస్తుందని తెలిపారు. వాహనం రిజర్వు ఇంధనంతో నడుస్తున్నపుడు కనిపించే సిగ్నల్ లాంటిదే ఇది కూడా అని వివరించారు.

(c) eenadu

ఈనాడు సినిమా

రామ్‌చరణ్ - ప్రశాంత్ నీల్ కలయికలో!



రామ్ చరణ్

రామ్‌చరణ్ సినిమాల విషయంలో వేగం పెంచుతున్నారు. ప్రస్తుతం ఆయన బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమాని పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. దీని తర్వాత సుకుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం చేసేందుకు పచ్చజెండా ఊపారు. ఇప్పుడీ జాబితాలో కొత్తగా మరో ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్', 'సలార్' విజయాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇప్పుడాయనతో చరణ్ ఓ సినిమా చేయనున్నారని సమాచారం. ఇప్పటికే దీనిపై చర్చలు పూర్తయినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌ను డీవీవీ దానయ్య నిర్మించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రశాంత్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో ఓ సినిమా చేసేందుకు సిద్ధమయ్యారు. దీని తర్వాత 'సలార్ 2', 'కేజీఎఫ్ 3' పూర్తి చేయాల్సి ఉంది. వాటి తర్వాతే రామ్‌చరణ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశముంది. ఈలోపు బుచ్చిబాబు, సుకుమార్‌ల సినిమాలు పూర్తి చేయనున్నారు చరణ్.

విడుదల కోసం రెండు తేదీలు

'గేమ్ ఛేంజర్'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సమాయత్తమవుతున్నారు రామ్‌చరణ్. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ పాన్ ఇండియా సినిమాని శంకర్ తెరకెక్కించారు. దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మించారు. కియారా అడ్వాణీ కథానాయిక. అంజలి, శ్రీకాంత్, ఎస్.జె.సూర్య తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా డిసెంబరులో రానున్నట్లు ఇప్పటికే ప్రకటించినా విడుదల తేదీపై స్పష్టత ఇవ్వలేదు. అయితే ఇప్పుడిందు కోసం రెండు తేదీలు పరిశీలిస్తోంది చిత్ర బృందం. నిర్మాణానంతర పనులు పూర్తయ్యే దాన్ని బట్టి డిసెంబరు 20న లేదంటే క్రిస్మస్ సందర్భంగా 25న విడుదల చేయాలన్న ఆలోచనలో ఉన్నారని సమాచారం. దీనిపై మంగళవారం ఈ చిత్ర సంగీత దర్శకుడు తమన్ పెట్టిన ట్వీట్‌తో స్పష్టత వచ్చింది. ప్రస్తుతం ఈ చిత్ర టీజర్ పనులు ఫైనల్ స్టేజ్‌లో ఉన్నాయని.. దసరాకి దాన్ని విడుదల చేయట్లేదని.. దీపావళి సందర్భంగా ఈనెల 30న ఓ పాట విడుదల చేస్తామని తమన్ వెల్లడించారు. అలాగే ఈ చిత్ర సీజీ, వీఎఫ్ఎక్స్ ఫైనల్ ఎడిటింగ్, డబ్బింగ్, బ్యాగ్రౌండ్ స్కోర్ పనులు చకచకా జరుగుతున్నట్లు చెప్పారు. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి తిరు ఛాయాగ్రహకుడిగా వ్యవహరించారు.

ఆ రోజు విడుదల పక్కా



అల్లు అర్జున్

బాక్సాఫీస్ తుపాన్‌ని వీక్షించడానికి సిద్ధంగా ఉండాలంటూ ప్రేక్షకులకు పిలుపునిచ్చింది 'పుష్ప 2' బృందం. చిత్రానికి సంబంధించిన కొత్త కబురుని పంచుకుంటూ భారతీయ సినీ చరిత్రలో ఓ సరికొత్త అధ్యాయాన్ని వెలిగిస్తాడంటూ పుష్పరాజ్‌పై మరిన్ని అంచనాల్ని పెంచింది. 'పుష్ప2' మొదటి సగ భాగం ఎడిటింగ్ పూర్తి చేసుకుని లోడ్ అయిపోయిందని, అంచనాల్ని మించి సినిమా ఉంటుందని చిత్రబృందం స్పష్టం చేసింది. చిత్రం డిసెంబరు 6న విడుదల పక్కా అని పునరుద్ఘాటిస్తూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాల్ని పేర్కొంది. 'పుష్ప' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రం 'పుష్ప2'. అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా, మరోవైపు నిర్మాణానంతర పనుల్ని పూర్తి చేసుకొంటోంది. ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పురస్కారం స్వీకరిస్తున్న మిథున్ చక్రవర్తి



రిషబ్‌శెట్టి



నిత్యామేనన్



మానసీ పరేఖ్

సమాజాన్ని మార్చడంలో సినిమాలదీ కీలక పాత్రే!

- జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును స్వీకరించిన మిథున్ చక్రవర్తి

"భాష ప్రాంతంతో సంబంధం లేకుండా సినిమాల్ని రూపొందిస్తోంది భారతీయ సినీరంగం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద చిత్రపరిశ్రమ మాత్రమే కాదు.. కళారంగంలోనే ఎంతో వైవిధ్యమైనది" అన్నారు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. మంగళవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో విజేతలకు పురస్కారాలు అందించారు ముర్ము. ఇందులో భాగంగా భారతీయ చలన చిత్రపరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డుతో నటుడు మిథున్ చక్రవర్తిని సత్కరించారు రాష్ట్రపతి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ రోజు దాదాపు 85మంది పురస్కారాల్ని అందుకున్నారు. అందులో మహిళలు కేవలం 15మంది మాత్రమే ఉన్నారు. చిత్రపరిశ్రమలో మహిళల్ని ప్రోత్సహించేలా భవిష్యత్తులో మరిన్ని చిత్రాలు తీయడానికి దర్శకనిర్మాతలు ప్రయత్నిస్తారని ఆశిస్తున్నాను. సమాజాన్ని మార్చడంలో సోషల్ మీడియాతో పాటు సినిమా కూడా కీలకమైన పాత్ర పోషిస్తుంది'' అని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్‌తో పాటు అవార్డుల జ్యూరీ బృందం పాల్గొంది.

ఈ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో 'కాంతార' చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన కన్నడ కథానాయకుడు రిషబ్ శెట్టి ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ నటిగా నిత్యామేనన్ (తిరుచిత్రాంబళం), మానసీ పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) అవార్డుల్ని సొంతం చేసుకున్నారు. ఉత్తమ చిత్రంగా 'ఆట్టమ్' (మలయాళం), ఉత్తమ దర్శకుడిగా సూరజ్ బర్జాత్యా (ఊంచాయీ) పురస్కారాల్ని గెలుచుకున్నారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచిన 'కార్తికేయ 2'కు గానూ దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్, మరోవైపు తమిళంలో 'పొన్నియిన్ సెల్వన్ 1'కు దర్శకుడు మణిరత్నం పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ సంగీతం (బ్రహ్మాస్త్ర)కు ప్రీతమ్, ఉత్తమ నేపథ్య సంగీతం (పొన్నియిన్ సెల్వన్ 1)గానూ ఏఆర్ రెహమాన్‌కు అవార్డుల్ని ప్రదానం చేశారు. ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా సతీశ్ కృష్ణన్(తిరుచిత్రాంబళం) పురస్కారాన్ని అందుకున్నారు.



అభిషేక్ అగర్వాల్



చందూ మొండేటి



ఏఆర్ రెహమాన్

డబ్బులేదని ఆశయాలు వదలొద్దు

దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని స్వీకరించాక మిథున్ చక్రవర్తి స్పందిస్తూ.. "ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును తీసుకున్నందుకు నాకు గర్వంగా ఉంది. నా జీవితంలో ఏదీ నాకు అంత సులువుగా రాలేదు. ఎంతో కష్టపడ్డాను. ఇప్పుడు ఈ అవార్డు పొందాకా ఆ మాటను మర్చిపోయాను. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం మీ ఆశీసులే అని నమ్ముతాను. మనదేశంలో ప్రతిభావంతులు చాలా మంది ఉన్నారు. నేను వారికి చెప్పాలనుకునేది ఒక్కటే.. మీ దగ్గర లేనిది డబ్బు మాత్రమే.. అందుకోసం మీ ఆశయాలను ఎప్పుడూ వదులుకోకండి. కలలు కనండి వాటిని నెరవేర్చుకోవడం కోసం శ్రమించండి'' అని అన్నారు.



ప్రీతమ్



సూరజ్ బర్జాత్యా



మణిరత్నం

ఆ విషయంలో తెలుగు ప్రేక్షకుల్ని మించినోళ్లు లేరు: అలియా భట్



రానా, సమంత, అలియా, వేదాంగ్ రైనా, వాసన్ బాలా, త్రివిక్రమ్

"కొన్ని సినిమాల ట్రైలర్లు, ప్రచార చిత్రాలు చూస్తుంటే అవి మనల్ని 'రా.. చూడు' అని పిలుస్తున్నట్లు ఉంటుంది. హిట్టు కళ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ 'జిగ్రా' ట్రైలర్ చూశాక నాకదే అనుభూతి కలిగింది. కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందనిపించింది'' అన్నారు దర్శకుడు త్రివిక్రమ్. అలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో వాసన్ బాలా తెరకెక్కించిన చిత్రమే 'జిగ్రా'. ధర్మ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్, ఎటర్నల్ షైన్ ప్రొడక్షన్స్ సంస్థలు నిర్మించాయి. రాహుల్ రవీంద్రన్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమాని ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా రానా దగ్గుబాటి ఈ నెల 11న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. దర్శకుడు త్రివిక్రమ్, నటి సమంత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ మాట్లాడుతూ.. "ఈ చిత్రం కోసం అలియా శారీరకంగా ఎంత శ్రమపడ్డారో ట్రైలర్ చూస్తే అర్థమైపోతుంది. ఆ కష్టం రేపు తెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు అర్థమవుతుంది. అలియా ఇప్పటికే 'ఆర్‌ఆర్‌ఆర్'తో సీతగా తెలుగు ఇళ్లలోకి వచ్చేసింది. ఈసారి విజయదశమికి మన ఇంటి ఆడపడుచుకు 'జిగ్రా'తో విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా'' అన్నారు. సమంత మాట్లాడుతూ.. 'కథానాయికలుగా మా అందరికీ ఓ బాధ్యత ఉంది. మా సినిమాలు చూసే అమ్మాయిలకు 'మీ కథలో మీరే హీరోయిన్స్' అని గుర్తు చేసే బాధ్యత. దాన్ని మరోసారి గుర్తు చేయడానికే అలియా ఈ 'జిగ్రా' చేసింది. ఇది పెద్ద బ్లాక్‌బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నా'' అన్నారు.

నటి అలియా భట్ మాట్లాడుతూ.. "ఆర్‌ఆర్‌ఆర్' ద్వారా నాకు తెలుగు భాషతో ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. మా పాప రాహా ఇంట్లో రోజూ 'నాటు నాటు' పాటకు డ్యాన్స్ చేస్తుంటుంది. తనకు ఆ పాటంటే చాలా ఇష్టం. మంచి సినిమాల్ని ఆదరించడంలో తెలుగు ప్రేక్షకుల్ని మించిన వారు లేరు. అందుకే నా గత చిత్రాలు 'గంగూబాయి..', 'బ్రహ్మాస్త్ర' తెలుగులోనూ విడుదల చేశా. ఇప్పుడు ఈ 'జిగ్రా'తో మీ ముందుకొస్తున్నా. యాక్షన్, ఎమోషన్, డ్రామా.. అన్నీ ఉన్న మంచి కుటుంబ కథా చిత్రమిది. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది'' అంది. "జిగ్రా'తో అలియా సేన తెలుగు చిత్రసీమలో మరింత పెరగాలని కోరుకుంటున్నా'' అన్నారు నటుడు, నిర్మాత రానా. "జిగ్రా' అంటే ధైర్యం. నటన అంటే అలియా'' అన్నారు దర్శకుడు వాసన్ బాలా. ఈ కార్యక్రమంలో వేదాంగ్, రాహుల్ రవీంద్రన్ తదితరులు పాల్గొన్నారు.




తమన్నా

ఆఖరి దశలో 'ఓదెల 2'

తమన్నా ప్రధాన పాత్రలో అశోక్ తేజ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వే స్టేషన్'కు కొనసాగింపుగా రూపొందుతున్న ఈ సినిమాని సంపత్ నంది టీమ్ వర్క్స్, మధు క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్.సింహ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర ఆఖరి షెడ్యూల్ ఓదెల గ్రామంలోని మల్లన్న క్షేత్రంలో మొదలైంది. ఇందులో తమన్నా, హెబ్బా, మురళీ శర్మతో పాటు ముఖ్య తారాగణమంతా పాల్గొంటుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు ఓ కొత్త లుక్‌ను విడుదల చేసింది. తమన్నా అందులో శివశక్తిగా ఆసక్తిరేకెత్తించేలా కనిపించింది. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. దీనికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతమందిస్తుండగా.. సౌందర్ రాజన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

'ఖోస్లా కా ఘోస్లా'కు సీక్వెల్



అనుపమ్ ఖేర్

'ది సిగ్నేచర్'తో ఇటీవలే ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ అగ్ర నటుడు అనుపమ్ ఖేర్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన కామెడీ డ్రామా చిత్రం 'ఖోస్లా కా ఘోస్లా'. దీనిని దిబాకర్ బెనర్జీ తెరకెక్కించారు. సవితా రాజ్, రోనీ స్క్రూవాలా సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా 2015లో ఉత్తమ జాతీయ చలన చిత్ర అవార్డును గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇందులో బొమన్ ఇరానీ, రణ్‌వీర్ శోరే, పర్విన్ దబాస్, తారా శర్మ కీలక పాత్రలు పోషించారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి స్థలాన్ని ఖురానా అనే డీలర్ స్వాధీనం చేసుకోగా ఆ భూమిని అతను తిరిగి సంపాదించుకోవాలనే నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. తాజాగా దీనికి సీక్వెల్‌ను రూపొందించనున్నట్లు ఇన్‌స్టా వేదికగా తెలిపింది చిత్రబృందం. ఈ నెల 18న రీరిలీజ్ కానుందీ చిత్రం.

మూలాల్లోకి వెళ్లి కథల్ని చెప్పడమే ఇష్టం



సందీప్ రెడ్డి

"కుటుంబ ప్రేక్షకులు సినిమాని చూడలేకపోతే ఓ దర్శకుడిగా నేను ఫెయిల్ అయినట్టే. అది మనసులో పెట్టుకునే ఈ కథని రాశా. మగవాళ్లకు ఎంతగా నచ్చుతుందో, మహిళలకూ అంతే బాగా నచ్చే చిత్రమిది'' అన్నారు సందీప్ రెడ్డి బండ్ల. ఆయన దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'జనక అయితే గనక'. సుహాస్, సంగీర్తన జంటగా నటించారు. హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం దసరా సందర్భంగా ఈ నెల 12న విడుదల కానున్న సందర్భంగా సందీప్ రెడ్డి బండ్ల మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. "ఇంటిల్లిపాదీ కలిసి ఓ వేడుకకు వెళ్లినప్పుడు ఎలాంటి అనుభూతి కలుగుతుందో, ఆ తరహా అనుభవాన్ని పంచే చిత్రమే ఇది. అన్ని వయసులవాళ్లూ మెచ్చేలా ఉంటుంది. రోజువారీగా ఎన్నో సమస్యలతో సతమతమవుతూ నెట్టుకొస్తున్న మనందరం సరదాగా నవ్వుకునేలా, మనసుల్ని తాకే భావోద్వేగాలతో ఆద్యంతం ఆస్వాదించేలా సినిమా ఉంటుంది. 'జనక అయితే గనక' అంటే అర్థం తండ్రి అయితే గనక అని అర్థం. నేటితరం జంటలు పెళ్లి తర్వాత పిల్లల్ని కనడానికి ఎందుకంతగా ఆలోచించాల్సి వస్తోందనే విషయాన్ని మధ్య తరగతి జీవితాల్ని నేపథ్యంగా తీసుకుని ఈ కథని చెప్పే ప్రయత్నం చేశాం. పిల్లలు కావాలా వద్దా అనే అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. రచయితగా అన్ని రకాల సినిమాలకూ పనిచేస్తా. కానీ ఓ కథకుడిగా మన మూలాల్లోకి వెళ్లి భావోద్వేగాల్ని చెప్పడానికే ఇష్టపడతాను. అందరికీ కనెక్ట్ అయ్యేది ఆ తరహా కథలే అని నమ్ముతాను.

జంధ్యాల నాకు నచ్చిన రచయిత. ఆయన నాకు దేవుడితో సమానం. ఆయన స్టైల్‌లోనే ఆరోగ్యకరమైన వినోదం నా సినిమాల్లో ఉండాలని కోరుకుంటాను. కండోమ్ కంపెనీపై కేసు అనే అంశం ఈ కథలో కీలకమైనా, ఎక్కడా అసభ్యతకి చోటు లేకుండా సినిమాని తెరకెక్కించా. కుదిరితే రెండు తరాలు కలిసి చూడాల్సిన చిత్రమిది. సుహాస్ కూడా ఈ కథకి అంతే బాగా కనెక్ట్ అయ్యారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే ఆయనకి బిడ్డ పుట్టారు. భార్యాభర్తల మధ్య సన్నివేశాల్ని చాలా బాగా కనెక్ట్ అయ్యి చేశార''న్నారు.

ఓ అందమైన ప్రయాణం... 'విశ్వం'



టీజీ విశ్వప్రసాద్, గోపీచంద్, శ్రీను వైట్ల, కావ్య థాపర్, వేణు దోనేపూడి

"నేను చాలా సినిమాలు చేశా. 'విశ్వం' ప్రయాణం ఎంతో సౌకర్యంగా అనిపించింది. అందుకు కారణం దర్శకుడు శ్రీను వైట్ల. ఆయన కథ చెబుతున్నప్పుడు, సెట్‌లో నటిస్తున్నప్పుడు బాగా నవ్వుకునేవాళ్లం. ఈ కథలో అంత అద్భుతంగా కామెడీ పండింది. యాక్షన్ కూడా అదే స్థాయిలో ఉంటుంద''ని చెప్పారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'విశ్వం'. కావ్య థాపర్ కథానాయిక. శ్రీనువైట్ల దర్శకుడు. వేణు దోనేపూడి, టి.జి.విశ్వప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ నెల 11న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. గోపీచంద్ మాట్లాడుతూ "దర్శకుడు శ్రీనువైట్లతో కలిసి పని చేయాలనే కోరిక ఎప్పట్నుంచో ఉండేది. రెండేళ్ల కిందట ఓ వేడుకలో కలిశాక మా ఇద్దరి ప్రయాణం మొదలైంది. 'విశ్వం' ఆయన మార్క్ సినిమా. ప్రేక్షకులు ఆయన సినిమా నుంచి ఏ స్థాయిలో వినోదాన్ని ఆశిస్తారో, అది ఇవ్వడానికి దాదాపు ఏడు నెలలు స్క్రిప్ట్ కోసం కష్టపడ్డారు. ఈ సినిమాతో శ్రీనువైట్ల తన పూర్వ వైభవాన్ని చాటుతార''న్నారు. శ్రీనువైట్ల మాట్లాడుతూ "ఈ సినిమా ఓ అందమైన ప్రయాణం. నేను, గోపీ కలిసి ఈ ప్రయాణం మొదలు పెట్టాం. తర్వాత వేణు, విశ్వప్రసాద్ వచ్చారు. నేను అనుకున్న కథని అనుకున్నట్టుగా రావడానికి గోపీ మోహన్, భాను, నందు, ప్రవీణ్ వర్మ చాలా కష్టపడి పనిచేశారు. నాపైన ఇష్టంతో, ప్రేమతో సాంకేతిక బృందం కష్టపడి పనిచేసింది. ఈ చిత్రం అందరికీ వినోదాన్ని పంచుతుందని వందశాతం నమ్మకంతో చెబుతున్నా. ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టదు. గోపీచంద్ ఎంతో సహకారం అందించారు. తనకి కచ్చితంగా ఈ చిత్రం పెద్ద విజయాన్ని అందిస్తుంది. ఈ సినిమాతో దసరాని మరింతగా ఆస్వాదిస్తాం'' అన్నారు. టి.జి.విశ్వప్రసాద్ మాట్లాడుతూ "శ్రీనువైట్ల సినిమాలు పని ఒత్తిడి నుంచి విముక్తి కల్పిస్తూ వినోదం పంచుతుంటాయి. ఆయనతో కలిసి ఈ సినిమా చేయడం చాలా ఆనందాన్నిచ్చింది'' అన్నారు. వేణు దోనేపూడి మాట్లాడుతూ "ప్రేక్షకుల్ని మళ్లీ నవ్వించాలి, విజయాన్ని అందుకోవాలనే పట్టుదలతో శ్రీనువైట్ల పనిచేశారు. ఇది మా హీరో సినిమా అని గోపీచంద్ అభిమానులు గర్వంగా చెప్పుకునేలా 'విశ్వం' ఉంటుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో కావ్య థాపర్, శ్రీరామ్ ఆదిత్య, మహేష్, బి.వి.ఎస్.రవి, అనీషా ఆంబ్రోస్, చేతన్ భరద్వాజ్, కె.వి.గుహన్ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

(c) eenadu



చిప్.. దేశీయ కంపెనీల హుషార్


టెక్నాలజీ అభివృద్ధి, తయారీకి సన్నాహాలు ● ఏఎస్ఐసీ విభాగంపై సైయెంట్, మాస్‌చిప్ దృష్టి



సెమీకండక్టర్ (చిప్‌సెట్) విపణి దేశీయ కంపెనీలకు ఆకర్షణీయంగా అవకాశంగా మారుతోంది. ఇందుకవసరమైన టెక్నాలజీని అభివృద్ధి చేయడంతో పాటు, చిప్ తయారు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజాలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంటున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న పలు సంస్థలు కూడా ఇందులో క్రియాశీలకంగా మారుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్ విభాగంలో 2019 వరకు పెద్దగా వృద్ధి లేదు. 2016-19 మధ్య జనరల్ సెమీకండక్టర్ల విభాగంలో 7.9%, ఏఎస్ఐసీ (అప్లికేషన్ స్పెసిఫిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్) విభాగంలో 3.9 శాతమే వృద్ధి కనిపించింది. కొవిడ్-19 పరిణామాల్లో చిప్‌సెట్లకు అనూహ్య గిరాకీ ఏర్పడటం, అందుకు తగ్గ సరఫరా చైనా-తైవాన్ నుంచి లేకపోవడంతో, భారత్ సహా అనేక దేశాలు వీటి తయారీపై దృష్టి సారించాయి.

ఇన్ని అవకాశాలు



సాంకేతికత అభివృద్ధిలో వేగం వల్లే

ఎంతో వేగంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించడం వల్ల వినియోగదార్ల సంఖ్య పెరుగుతోంది. వాహనాలు, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక ఆటోమేషన్ విభాగాల్లో సెమీకండక్టర్ల వినియోగం పెరుగుతోంది. దీనికి అనుగుణంగా అమెరికా, జపాన్, తైవాన్, కొరియాలోని సెమీకండక్టర్ల కంపెనీలు పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. అమెరికాలోని సెమీకండక్టర్ కంపెనీలు 200 బిలియన్ డాలర్ల (సుమారు రూ.16.60 లక్షల కోట్ల)కు పైగా పెట్టుబడులు పెట్టి తమ తయారీ సామర్థ్యాలను పెంచుకుంటున్నాయి. సాధారణ అవసరాలు తీర్చే సెమీకండక్టర్ చిప్‌లతో పోల్చితే, ఏఎస్ఐసీ చిప్‌లకు గిరాకీ అధికంగా ఉంటోంది. ప్రత్యేక అవసరాల కోసం ఏఎస్ఐసీ చిప్‌లను కంపెనీలు ఆవిష్కరిస్తున్నాయి. వీటికి అధిక సామర్థ్యం, మరికొన్ని ప్రత్యేకతలు ఉంటున్నాయి. గిరాకీకి అనుగుణంగా ఈ విభాగంలో వివిధ సంస్థలు పెద్దఎత్తున పరిశోధనలు నిర్వహిస్తున్నాయి. టీఎస్ఎంసీ (తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ), శామ్‌సంగ్, ఎస్ఎంఐసీ ఈ విషయంలో ముందున్నాయి. ఎస్ఎంఐసీ, మనదేశంలోని గుజరాత్‌లో టాటా గ్రూపుతో కలిసి సెమీకండక్టర్ ఫ్యాబ్ నెలకొల్పేందుకు సిద్ధపడుతోంది.

హైదరాబాదీ సంస్థలు ఇలా

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మాస్‌చిప్ టెక్నాలజీస్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీ-డాక్‌తో కలిసి హెచ్‌పీసీ (హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్) ప్రాసెసర్ ఎస్ఓసీ (సిస్టమ్ ఆన్ ఏ చిప్) ని అభివృద్ధి చేస్తోంది. టీఎస్ఎంసీ 5ఎన్ఎం టెక్నాలజీ నోడ్ ఆధారంగా దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేస్తే, హెచ్‌పీసీ విభాగంలో ప్రపంచ వ్యాప్తంగా మన దేశం సేవలు అందించే అవకాశం ఏర్పడుతుంది. ఇటువంటి మరికొన్ని ప్రాజెక్టులను మాస్‌చిప్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

☛ ఐటీ, ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్ లిమిటెడ్ ప్రత్యేకంగా సైయెంట్ సెమీకండక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే నూరుశాతం అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. ఈఏడీ/ ఐపీ సంస్థలు, సెమీకండక్టర్ కంపెనీలతోనూ దీనికి భాగస్వామ్యాలు ఉన్నాయి. దీంతో పాటు అనలాగ్, డిజిటల్ విభాగంలో మేధోసంపత్తి హక్కులు (ఐపీఆర్) ఈ సంస్థకు ఉన్నాయి. ఇప్పటి వరకు 40కి పైగా ఏఎస్ఐసీ టర్న్‌కీ ప్రాజెక్టులను ఈ సంస్థ నిర్వహించింది. సమీప భవిష్యత్తులో భారీ అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నది సైయెంట్ లిమిటెడ్ యోచన. మరికొన్ని కంపెనీలు కూడా సెమీకండక్టర్ ప్రాజెక్టులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయని.. అన్నీ అనుకూలిస్తే సమీప భవిష్యత్తులో హైదరాబాద్ నగరం సెమీకండక్టర్ల పరిశ్రమకు ప్రధాన కేంద్రాల్లో ఒకటిగా ఎదుగుతుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

- ఈనాడు, హైదరాబాద్

రుణదాతలకు ఎంఫిన్ మార్గదర్శకాలు కఠినతరం

ముంబయి: సూక్ష్మరుణ పరిశ్రమ నియంత్రణ సంస్థ మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీ నెట్‌వర్క్ (ఎంఫిన్) తమ సభ్యుల కోసం రుణాల అండర్‌రైటింగ్ నిబంధనలను కఠినతరం చేస్తున్నట్లు ప్రకటించింది. రుణగ్రహీతలపై రుణభారాలు అధికంగా ఉంటున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. రుణాలు ఇవ్వడంలో ప్రస్తుత సవాళ్లను సవరించిన మార్గదర్శకాలు పరిష్కరిస్తాయని ఎంఫిన్ తెలిపింది. దీని ప్రకారం.. మునుపటి రుణాలు లేదా రుణ కాలవ్యవధి ముగిసే చివరిలో చేసే బులెట్ చెల్లింపుల ఆధారంగా, ఒక కుటుంబ నెలవారీ ఖర్చుల గణాంకాలు రుణదాతలకు లభించవు. ప్రస్తుతం రుణగ్రహీత రుణచరిత్ర తెలుసుకునేందుకు సూక్ష్మ రుణదాతలు పలు పద్ధతులను అనుసరిస్తున్నారు. ఇకపై అందరికీ ఒకే విధానాన్ని పాటించమని ఎంఫిన్ స్పష్టం చేసింది. బులెట్ చెల్లింపులు/ఈఎంఐ చెల్లింపులు చేయని కేసుల్లో బలమైన అండర్‌రైటింగ్ విధానాన్ని కలిగి ఉండాల్సిందిగా సూచించింది. ఎటువంటి చర్యలు తీసుకోవాలో స్పష్టంగా వెల్లడించలేదు.

ఒక ఛార్జింగ్‌తో 530 కి.మీ.

బీవైడీ ఇమ్యాక్స్ 7 ఈవీ @ రూ.26.9-29.9 లక్షలు

దిల్లీ: బీవైడీ ఇండియా, బహుళ ప్రయోజన విద్యుత్తు ఎంపీవీ ఇమ్యాక్స్ 7ను విడుదల చేసింది. ధరల శ్రేణి రూ.26.9-29.9 లక్షలు (ఎక్స్-షోరూమ్). ప్రీమియం, సుపీరియర్ వేరియంట్లలో ఈ కారు 6, 7 సీట్ల ఎంపికతో లభిస్తుంది.



✦ ప్రీమియం వేరియంట్‌లో 55.4 కిలోవాట్ అవర్ బ్యాటరీని అమర్చారు. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 420 కిలోమీటర్ల దూరం వెళుతుంది.

✦ సుపీరియర్ వేరియంట్ 71.8 కిలోవాట్ అవర్ బ్యాటరీతో వస్తోంది. ఒకసారి ఛార్జింగ్‌తో 530 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది.

✦ రెండు మోడళ్ల గరిష్ఠ వేగం 180 కిలోమీటర్లు కాగా, 0-100 కిలోమీటర్ల వేగాన్ని 8.6 సెకన్లలో అందుకుంటాయి. ఈ కార్లకు 17 అంగుళాల అలాయ్ వీల్స్ , 12.8 అంగుళాల ఫ్లోటింగ్ టచ్ స్క్రీన్ ఉన్నాయి. పనోరమిక్ గ్లాస్ రూఫ్, 360 డిగ్రీ కెమెరా, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఎన్ఎఫ్‌సీ కార్డ్ కీ, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు ఇచ్చారు. బ్యాటరీపై 8 ఏళ్లు లేదా 1.6 లక్షల కిలోమీటర్ల వరకు; మోటార్‌పై 8 ఏళ్లు లేదా 5 లక్షల కిలోమీటర్ల వారెంటీ ఇస్తోంది. ఇప్పటికే బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి.

2025లో ఫిజిక్స్‌వాలా రూ.4,000 కోట్ల ఐపీఓ!

దిల్లీ: వచ్చే ఏడాది ఐపీఓకు వచ్చేందుకు ఎడ్‌టెక్ సంస్థ ఫిజిక్స్‌వాలా సిద్ధమవుతోంది. ఐపీఓ ద్వారా 400- 500 మి.డాలర్లు (దాదాపు రూ.3300- 4100 కోట్లు) సమీకరించాలని భావిస్తోంది. ఐపీఓకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు 4 ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లను ఫిజిక్స్‌వాలా ఖరారు చేసినట్లు సమాచారం. ఇందులో యాక్సిస్ క్యాపిటల్, కోటక్ మహీంద్రా క్యాపిటల్, గోల్డ్‌మన్ శాక్స్, జేపీ మోర్గాన్ ఉన్నాయి.

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ రూ.600 కోట్ల ఐపీఓ

Standard Glass
Customer Inspired Excellence

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ, రూ.600 కోట్ల సమీకరణ నిమిత్తం పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రానుంది. ఈ ప్రతిపాదనకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతి లభించింది. ఔషధ, రసాయన పరిశ్రమలకు ఈ సంస్థ కీలక ఇంజినీరింగ్ ఉపకరణాలు, సామగ్రి సరఫరా చేస్తోంది. పీటీఎఫ్ఈ (పాలీ టెట్రా ఫ్లూరో ఇథలిన్) లైన్డ్ పైప్‌లైన్స్ - ఫిట్టింగ్స్ విభాగంలో మనదేశంలోని 3 అగ్రశ్రేణి కంపెనీల్లో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ ఒకటి. ఐపీఓలో రూ.250 కోట్ల విలువకు కొత్తగా షేర్లు జారీ చేస్తారు. ఆఫర్ ఫర్ సేల్ కింద 1.84 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ఇతర వాటాదార్లు రూ.350 కోట్లకు విక్రయిస్తారు. ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ కింద రూ.50 కోట్ల విలువైన షేర్లు విక్రయించే ఆలోచన కూడా ఈ సంస్థకు ఉంది. ఐపీఓ నుంచి లభించే నిధుల్లో కొంత మొత్తాన్ని అప్పులు తీర్చడానికి, మిగిలిన సొమ్మును యంత్ర సామగ్రి సమకూర్చుకోవడానికి, ఇతర కార్పొరేట్ అవసరాలకు కేటాయిస్తారు. ఈ ఐపీఓకు ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు. ఇష్యూ తర్వాత షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదు చేస్తారు.

ఎన్ఎస్‌డీఎల్, జింకా లాజిస్టిక్స్ కంపెనీలూ..

NSDL
Technology, Trust & Reach

దిల్లీ: ఎన్ఎస్‌డీఎల్ (నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్), జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్ ఐపీఓలకు కూడా సెబీ అనుమతి లభించింది.

✦ ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓ మొత్తం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిలోనే జరగనుంది. ఈ సంస్థలో వాటాదార్లుగా ఉన్న ఎన్ఎస్ఈ (నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్), స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు.. తదితర సంస్థలు 5.72 కోట్ల షేర్లు విక్రయించడానికి ముందుకు వచ్చాయి.

ఎన్ఎస్‌డీఎల్‌లో ఆయా సంస్థల షేర్ల అమ్మకం ఇలా

ఐడీబీఐ బ్యాంక్	2.22 కోట్ల షేర్లు
ఎన్ఎస్ఈ	1.80 కోట్ల షేర్లు
యూనియన్ బ్యాంక్	56.25 లక్షల షేర్లు
ఎస్‌బీఐ	40 లక్షల షేర్లు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	40 లక్షల షేర్లు

✦ జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్ ఐపీఓలో కొత్త షేర్ల జారీ ద్వారా రూ.550 కోట్లు సమీకరించనుంది. 2.16 కోట్ల షేర్లను 'ఆఫర్ ఫర్ సేల్' కింద విక్రయిస్తారు.

హ్యుందాయ్ ధరల శ్రేణి రూ.1865-1960

దిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) వచ్చే వారంలో జరిగే అవకాశం ఉంది. ఐపీఓలో భాగంగా విక్రయించే షేర్లకు ధరల శ్రేణి రూ.1,865-1,960గా ఉండొచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. కంపెనీ విలువను సుమారు 19 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ.1,58,000 కోట్లు) లెక్కించి, ఈ ధరల శ్రేణిని అంచనా వేసినట్లు పేర్కొంది. ప్రతిపాదిత ఇష్యూ ద్వారా రూ.25,000 కోట్ల వరకు సమీకరించాలని హ్యుందాయ్ మోటార్ ఇండియా అనుకుంటోంది. చిన్న మదుపర్లతో పాటు ఇతరులకు ఈ ఇష్యూ 15న ప్రారంభమై 17న ముగుస్తుంది.



గ్రీన్‌కో గ్రూపులో వాటా విక్రయించనున్న జీఐసీ పీటీఈ?

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో గ్రూపులో ఉన్న తన 50% వాటాను విక్రయించడానికి సింగపూర్ ప్రభుత్వ వెల్త్ ఫండ్ అయిన జీఐసీ పీటీఈ సన్నద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఈ వాటా విలువ 5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.42,000 కోట్లు) ఉంటుందని అంచనా. పూర్తిగా కానీ, లేదా కొంత వాటా కానీ విక్రయించే ఆలోచన ఈ సంస్థకు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే వివిధ పెట్టుబడి సంస్థలతో సంప్రదింపులు చేపట్టింది. దీంతో పాటు గ్రీన్‌కో గ్రూపు కూడా తన భవిష్యత్తు వ్యాపార అవసరాలకు కొంత మేరకు నిధులు సమీకరించే అవకాశం కనిపిస్తోంది. గ్రీన్‌కో గ్రూపులో అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), జపాన్ సంస్థ అయిన ఓరిక్స్ కార్పొరేషన్ ఇతర వాటాదార్లుగా ఉన్నాయి.

బ్లడ్ కేన్సర్ చికిత్స ప్రయోగాల్లో సత్ఫలితాలు

కార్-టీ సెల్ రెండో దశ పరీక్షలకు అనుమతి: డాక్టర్ రెడ్డీస్

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ అనుబంధ సంస్థ అరిజీన్ ఆంకాలజీ లిమిటెడ్, కేన్సర్ బాధితులకు సిఫారసు చేసే కార్-టీ సెల్ చికిత్సకు సంబంధించిన మొదటి దశ (ఫేజ్-1) క్లినికల్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఈ పరీక్ష ఫలితాలను భారత ఔషధ నియంత్రణ మండలి (డీసీజీఐ) ఆమోదించి, రెండో దశ క్లినికల్ పరీక్షలకు అనుమతి ఇచ్చినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. రిబ్రెకాబ్లాజీన్ ఆటోలూసెల్ (డీఆర్ఎల్- 1801) అనే కార్-టీ సెల్ చికిత్సా విధానాన్ని మల్టిపుల్ మైలోమా (ఒక రకమైన బ్లడ్ కేన్సర్) బాధితులకు సిఫారసు చేస్తున్నారు. మొదటి దశ పరీక్షల్లో భాగంగా 8 మంది రోగులకు ఈ చికిత్స అందించగా, వారంతా బాగా స్పందించారని డాక్టర్ రెడ్డీస్ వివరించింది. ఫలితాలపై తాము సంతృప్తిగా ఉన్నామంది. మనదేశంలో మల్టిపుల్ మైలోమా వ్యాధితో బాధపడుతున్న వారికి ఈ రూపేణ కొత్త రకం చికిత్స అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అరిజీన్ ఆంకాలజీ సీఈఓ డాక్టర్ మురళి రామచంద్ర అన్నారు.

కోడి గుడ్లు

9న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	525
గోదావరి	525
విశాఖపట్నం	525
చిత్తూరు	523

ప్రపంచంలో సరిపడా చమురు ఉంది!

● పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఆందోళన అక్కర్లేదు

● కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి



దిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర చమురు మంత్రి హర్దీప్ సింగ్ పురి మంగళవారం వెల్లడించారు. ప్రపంచంలో సరిపడా చమురు నిల్వలు ఉన్నందున, చమురు విషయంలో ఎటువంటి షాక్‌లను అయినా మన దేశం ఎదుర్కోగలదని వివరించారు. వారం వ్యవధిలోనే అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 79-80 డాలర్లకు పెరిగిన నేపథ్యంలో, మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈనెల 1న తమ దేశంలో జరిగిన క్షిపణి దాడులకు ఇరాన్‌పై ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటుందేమోనని మార్కెట్ వేచి చూసింది. ఇప్పటివరకు ఈ ఉద్రిక్తతలు మరింత విస్తరించే పరిస్థితి లేదని మంత్రి తెలిపారు. 'ప్రపంచంలో చమురు విషయంలో అతి పెద్ద మూడో దిగుమతిదారు, వినియోగదారుగా మన దేశం ఉంది. మన చమురు అవసరాల్లో సుమారు 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడతాం. అయినా ప్రస్తుత పరిస్థితులు నిర్వహించగలిగే స్థాయిలోనే ఉన్నాయ'ని ఎఫ్‌టీ ఎనర్జీ ట్రాన్సిషన్ సమ్మిట్ ఇండియాలో పాల్గొన్న మంత్రి వెల్లడించారు.

✦ అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా 2023 జనవరి నుంచి పెట్రోలు, డీజిల్ రిటైల్ ధరలను మన దేశంలో తగ్గిస్తారని అంచనాలు వెలువడినా, ఈ ఏడాది మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించారు. అప్పుడు బ్యారెల్ ముడిచమురు 83-84 డాలర్ల స్థాయిలో ఉంది. గత నెలలో ముడి చమురు దిగుమతి ధర బ్యారెల్‌కు సగటున 73.69 డాలర్లుగా ఉంది. ప్రస్తుతం ముడి చమురు ధర మళ్లీ 80 డాలర్ల స్థాయికి చేరడంతో, రిటైల్ ధరల తగ్గింపు ఆశలు ఆవిరయ్యాయి.

భారత నియంత్రణ సంస్థల పనితీరు అద్భుతం

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



ముంబయి: భారత ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు 'ప్రపంచ స్థాయి ప్రమాణాల'తో పనిచేస్తున్నాయని, వ్యవస్థలోకి మరింత పారదర్శకత తీసుకొస్తున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొనియాడారు. అయితే నియంత్రణ సంస్థలను ప్రశ్నించడం లేదా విమర్శించడానికి తాను వ్యతిరేకం కాదన్నారు. ఈ సంస్థలు చేస్తున్న సేవల గురించి చాలా అవగాహనతో ఉండాలని అభిప్రాయపడ్డారు. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ బెస్ట్ బ్యాంక్ అవార్డ్స్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో తాజాగా వెలుగుచూస్తున్న నిజాలను ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు.

బ్యాంక్ గ్యారెంటీ మాఫీకి డాట్‌తో చర్చిస్తున్నాం: వొడాఫోన్ ఐడియా

దిల్లీ: బ్యాంక్ గ్యారెంటీ మాఫీ కోసం టెలికాం విభాగం (డాట్)తో చర్చలు జరుపుతున్నామని వొడాఫోన్ ఐడియా మంగళవారం తెలిపింది. 2022 ముందు కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్‌కు చెల్లించాల్సిన బకాయిల తేదీకి, ఏడాది ముందుగా కంపెనీ బ్యాంక్ గ్యారెంటీ సమర్పించాల్సి ఉంది. వచ్చే ఏడాది సెప్టెంబరులో రూ.24,747 కోట్ల స్పెక్ట్రమ్ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఇందుకోసం ఇప్పటికే బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాల్సిందిగా వొడాఫోన్ ఐడియాను డాట్ కోరింది. బ్యాంక్ గ్యారెంటీ నిబంధనలను తొలగించాల్సిందిగా వొడాఫోన్ ఐడియా కోరుతోంది. ఈ అంశంపై ఆర్థిక శాఖతో డాట్ చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.

తుక్కుకు అనువైన వాణిజ్య వాహనాలు.. 11 లక్షలు

ఇక్రా నివేదిక

ముంబయి: ఈ ఏడాది మార్చి 31 నాటికి 15 ఏళ్ల కంటే పాతవైన 11 లక్షల మధ్యస్థ, భారీ వాణిజ్య వాహనాలు ఉన్నాయని.. వీటిని తుక్కుగా మార్చేందుకు అవకాశాలున్నాయని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. వినియోగ స్వభావం ఆధారంగా, వాస్తవంగా వీటిలో తుక్కుగా మార్చే వాహనాలు తక్కువగా ఉండొచ్చని, అయితే వీటిల్లో కొంత భాగం తుక్కుగా మార్చినా.. కొత్త వాహన అమ్మకాలు పెరుగుతాయని వివరించింది.

✦ 2021 మార్చిలో ప్రకటించిన స్వచ్ఛంద వాహన ఆధునికీకరణ కార్యక్రమం లేదా తుక్కు విధానం 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. దీన్ని దశల వారీగా అమలు చేస్తున్నారు. మొదటి దశ కింద 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలను తప్పనిసరిగా తుక్కుగా మార్చాలని ప్రతిపాదించారు. ఈ ఏడాది జూన్ 1న ప్రారంభమైన రెండో దశలో వాహన వయసు కంటే, సామర్థ్యం-పటుత్వం ఆధారంగా వాహనాన్ని తుక్కుగా మార్చడాన్ని తప్పనిసరిగా చేశారు.

✦ 2027 మార్చి నాటికి 15 ఏళ్ల కాలం పూర్తి చేసుకునే వాహనాలు మరో 5.7 లక్షలు ఉండొచ్చని ఇక్రా అంచనా వేసింది. మొదటి దశ కింద 9 లక్షలకు పైగా ప్రభుత్వ వాహనాలను తప్పనిసరిగా తుక్కుగా మార్చాలని ప్రతిపాదించారు. ఇందువల్ల కొత్త వాహనాలకు గిరాకీ అధికం కానుంది.

వ్యక్తిగత వాహనాల్లో తక్కువే

ఇక్రా ప్రకారం, 15 ఏళ్లు దాటిన ద్విచక్ర వాహనాలు, ప్రయాణికుల వాహనాలు, తేలికపాటి వాణిజ్య వాహనాల (ఎల్‌సీవీల) పరిమిత వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఆయా విభాగాల్లో తుక్కుగా మారే వాటి సంఖ్య పరిమితంగా ఉంది. వాహనాలను తుక్కుగా మార్చేందుకు నెలకొల్పిన కేంద్రాలకు (ఆర్‌వీఎస్ఎఫ్‌లు) 2024 ఆగస్టు 31 వరకు 44,803 ప్రైవేటు వాహనాల దరఖాస్తులు, 41,432 ప్రభుత్వ వాహన దరఖాస్తులు (రక్షణ/ఇంపౌండ్ స్క్రాప్ అప్లికేషన్లతో పాటు) అందాయి. వాహన తుక్కు పాలసీ వల్ల దీర్ఘకాలంలో అనేక ప్రయోజనాలున్నాయని ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ కో-గ్రూప్ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజల్ షా తెలిపారు.



కాలుష్యం తగ్గుతుంది

పాత, కాలుష్యాన్ని అధికంగా వెదజల్లే వాహనాలను తుక్కుగా మార్చడం వల్ల వాయు కాలుష్యం తగ్గుతుంది. కొత్త వాహనాల విక్రయాలు పెరుగుతాయి. తుక్కు విధాన నిబంధనల కింద లోహాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా వాహన తయారీ కంపెనీలకు ముడి సరుకు వ్యయాలు గణనీయంగా తగ్గుతాయి.

సవాళ్లున్నాయ్

వాహన తుక్కు విధానాన్ని అమలు చేయడంలో అనేక సవాళ్లు ఉన్నాయని కింజల్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆర్‌వీఎస్ఎఫ్‌ల పరిమిత నెట్‌వర్క్‌తో ఈ విధానం నెమ్మదిగా సాగుతోందని పేర్కొన్నారు. ప్రోత్సాహకాలు సరిగా లేకపోవడం, ఈ విధానంపై వినియోగదార్లలో సరైన అవగాహన కల్పించలేకపోవడం, రిజిస్ట్రేషన్ తేదీ విషయంలో ఉన్న సమస్యలు వంటివి నిరోధకాలుగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

పప్పుదినుసుల టోకు ధరలు తగ్గాయ్.. ఆ ప్రయోజనం వినియోగదార్లకు ఇవ్వాలి

రిటైలర్లను కోరిన ప్రభుత్వం



దిల్లీ: పప్పు ధాన్యాల టోకు ధరలు తగ్గుతున్నందున, ఆ ప్రయోజనాన్ని వినియోగదార్లకు బదిలీ చేయాలని రిటైలర్లను ప్రభుత్వం కోరింది. దీనికి భిన్నంగా పండగ సీజన్‌లో ఎక్కువ ధరలతో, లాభాల కోసం వారు ప్రయత్నిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రధాన పప్పు ధాన్యాల స్థితి, ధరల ధోరణిపై ముఖ్యమైన సంస్థాగత రిటైల్ చైన్‌లతో పాటు రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ)తో వినియోగదారు వ్యవహారాల విభాగం కార్యదర్శి నిధి ఖర్గే మంగళవారం సమావేశమై చర్చించారు. ఇటీవల పప్పు ధాన్యాల టోకు ధరలు తగ్గుతున్నాయి. పంట దిగుబడులు వస్తున్నందున, వాటి లభ్యతా పెరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పప్పు ధాన్యాల పంట విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే 7 శాతం పెరిగిందని, పంటల దిగుబడి కూడా బాగా వచ్చేలా కనిపిస్తోందని తెలిపారు. ఇందువల్ల వీటి ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది.

✦ కంది పప్పు, మినప పప్పు ధరలు గత 3 నెలల్లో సుమారు 10% తగ్గాయని నిధి వెల్లడించారు. అయితే రిటైల్ ధరలు ఆ స్థాయిలో తగ్గలేదని వివరించారు. సమావేశంలో ఆర్ఏఐ ప్రతినిధులతో పాటు రిలయన్స్ రిటైల్, విశాల్ మార్ట్, డీమార్ట్, స్పెన్సర్, మోర్ రిటైల్ ప్రతినిధులు పాల్గొన్నారు. సంస్థాగత రిటైల్ చైన్‌లు ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ (భారత్ దాల్స్ ముఖ్యంగా భారత్ మసూల్ దాల్, భారత్ మూంగ్ దాల్‌ను పంపిణీ చేస్తోంది)తో సమన్వయం చేసుకోవాలని నిధి సూచించారు.

సూచీలకు ఎన్నికల లాభాలు

రూ.7.51 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

ఎఫ్ఐఐల అమ్మకాలు: రూ.5730 కోట్లు

డీఐఐల కొనుగోళ్లు: రూ.7,001 కోట్లు

సెన్సెక్స్ ▲ 585 — 81635

నిఫ్టీ ▲ 217 — 25013

సమీక్ష

సూచీల ఆరు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. కీలకమైన హరియాణాలో అధికార భాజపా హ్యాట్రిక్ విజయం సాధించడం మదుపర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, మహీంద్రా వంటి బ్లూచిప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 3 పైసలు పెరిగి 83.97 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.84% నష్టంతో 79.44 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ మంగళవారం ఒక్కరోజే రూ.7.51 లక్షల కోట్లు పెరిగి రూ.459.50 లక్షల కోట్ల (5.47 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 223 పాయింట్ల నష్టం (క్రితం ముగింపు 81,050)తో 80,826.56 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అనంతరం పుంజుకుని లాభాల్లోకి వచ్చిన సూచీ, ఒకదశలో 81,763.28 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 584.81 పాయింట్ల లాభంతో 81,634.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 217.40 పాయింట్లు పెరిగి 25,013.15 పాయింట్ల దగ్గర స్థిరపడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 4.76%, ఎం అండ్ ఎం 3.42%, రిలయన్స్ 2.01%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.95%, ఎల్ అండ్ టీ 1.83%, ఎస్‌బీఐ 1.59%, ఎన్‌టీపీసీ 1.42%, అల్ట్రాటెక్ 1.35% రాణించాయి. టాటా స్టీల్ 2.89%, టైటన్ 2.59%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.27%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.98%, బజాజ్ ఫైనాన్స్ 1.12%, టాటా మోటార్స్ 0.89% నష్టపోయాయి. బీఎస్ఈలో 3024 షేర్లు లాభపడగా, 923 స్క్రిప్‌లు నష్టపోయాయి.

✦ **ఓలా షేరుకు ఒడుదొడుకులు:** తప్పుదోవ పట్టించే విధంగా ప్రకటనలు, అనైతిక వ్యాపార పద్ధతులు పాటిస్తున్నారంటూ సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో ఓలా ఎలక్ట్రిక్ షేరు ఇంట్రాడేలో 6.17% కోల్పోయి రూ.85.21 వద్ద కనిష్ఠానికి చేరింది. కంపెనీ కార్యకలాపాలపై ఈ నోటీసు ప్రభావం ఉండదని కంపెనీ స్పష్టత ఇవ్వడంతో.. చివరకు 5.11% లాభంతో రూ.95.46 వద్ద ముగిసింది.

✦ ప్రపంచంలోనే తొలి హరిత రిఫైనరీ.. ఎస్సార్ గ్రూప్: బ్రిటన్‌లోని స్టాన్‌లో ఉన్న తమ రిఫైనరీని ప్రపంచంలోనే తొలి కర్బనరహిత హరిత రిఫైనరీగా మార్చాలని ఎస్సార్ గ్రూప్ భావిస్తోంది. ఈ యూనిట్‌లో హీటింగ్, విద్యుత్ అవసరాల కోసం బ్లూ హైడ్రోజన్ వినియోగించనున్నామని, దీంతో కర్బన ఉద్గారాలు 95% వరకు తగ్గుతాయని ఎస్సార్ క్యాపిటల్ డైరెక్టర్ ప్రశాంత్ రుయా తెలిపారు.



✦ ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన వజ్రాలతో ఆభరణాలను ఆవిష్కరించడంతో టాటా గ్రూప్‌నకు చెందిన **ట్రెంట్** షేరు రూ.8,076.10 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 8.03% పెరిగి రూ.8047.80 దగ్గర స్థిరపడింది.

✦ **గరుడా కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు మొదటి రోజున 1.91 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,99,04,862 షేర్లను విక్రయానికి ఉంచగా.. 3,80,15,666 షేర్లకు బిడ్‌లు వచ్చాయి.

✦ **పతంజలి ఆయుర్వేద్**‌కు చెందిన గృహ, వ్యక్తిగత సంరక్షణ వ్యాపారాన్ని పతంజలి ఫుడ్స్ కొనుగోలు చేసే ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది.

సొంత విధానాలు రూపొందించుకోండి

ఎక్స్ఛేంజీలు, ఎంఐఐలకు సెబీ సూచన

దిల్లీ: పరిశోధన, విశ్లేషణ నిమిత్తం వివరాలను (డేటా) పంచుకునే విషయంలో స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీస్, క్లియరింగ్ కార్పొరేషన్లు (ఎంఐఐలు) తమ సొంత విధానాలు రూపొందించుకోవాలని సెబీ పేర్కొంది. వివరాల లభ్యత, గోప్యత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. అయితే వాణిజ్య అవసరాల నిమిత్తం వివరాలను పంచుకుంటే.. అది ఈ విధానం కిందకు రాదని తన చర్చాపత్రంలో సెబీ తెలిపింది. ప్రతి ఒక్క మార్కెట్ విభాగానికి సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారాన్ని రెండు విభాగాలుగా ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీలు, క్లియరింగ్ కార్పొరేషన్లు విభజించాలని సెబీ సూచించింది.

✦ మొదటి విభాగంలో ప్రజలతో పంచుకునే వివరాలను ఉంచాలి. ఇవి విశ్లేషించదగిన వివరాలై ఉండాలి. నియంత్రణ సంస్థల ఆదేశాల మేరకు తప్పనిసరిగా వెల్లడించాల్సిన వివరాలు కూడా ఇందులో ఉండాలి. ఏదేని వ్యక్తిగత, సున్నిత అంశాలు, రహస్య సమాచారాన్ని మాత్రం వెల్లడించకూడదని స్పష్టం చేసింది.

✦ రెండో విభాగంలో ప్రజలతో పంచుకోకూడని విషయాలను ఉంచాలి. కేవైసీ వివరాలు, ట్రేడ్ సమాచారం, పెట్టుబడుల వివరాల లాంటివి దీని కిందకు వస్తాయి. ఒక సంస్థను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గుర్తించడానికి ఉపయోగించే రహస్య సమాచారం కూడా రెండో విభాగంలో ఉండాలి.

(c) eenadu

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో అరిథ్‌మెటికల్ రీజనింగ్ అనేది ముఖ్యమైన అంశం. ఇందులో ఇచ్చే ప్రశ్నలు చాలావరకు తార్కిక విధానంలో ఉంటాయి. ఈ విధమైన ప్రశ్నలు సాధించేందుకు అభ్యర్థులు రీజనింగ్‌కు సంబంధించిన పలు విభాగాలపై పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి. అభ్యర్థుల విశ్లేషణ, సమస్యా పరిష్కర సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది.



మీటర్ స్థలం వదిలేస్తే తోట పొడవు ఎంత?

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

అరిథ్‌మెటికల్ రీజనింగ్

సూచన (ప్ర. 1 – 9): కింది ప్రశ్నలకు సమాధానం ఇవ్వండి.

1. ఒక తరగతి గదిలో కొన్ని బెంచీలు ఉన్నాయి. ఒక్కో బెంచీపై నలుగురు విద్యార్థులు కూర్చుంటే 3 బెంచీలు ఖాళీగా ఉంటాయి. ఒక్కో బెంచీపై ముగ్గురు విద్యార్థులు కూర్చుంటే ముగ్గురు విద్యార్థులు నిల్చొని ఉంటారు. అయితే తరగతిలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?

1) 48 2) 56 3) 64 4) 36

సాధన: తరగతిలో విద్యార్థుల సంఖ్య x అనుకుందాం.

ఒక్కో బెంచీపై నలుగురు కూర్చున్నప్పుడు

బెంచీల సంఖ్య $= \left(\frac{x}{4} + 3\right)$

ఒక్కో బెంచీపై ముగ్గురు కూర్చున్నప్పుడు

బెంచీల సంఖ్య $= \frac{x - 3}{3}$

$\therefore \frac{x}{4} + 3 = \frac{x - 3}{3}$

$\Rightarrow \frac{x + 12}{4} = \frac{x - 3}{3}$

$\Rightarrow 3(x + 12) = 4(x - 3)$

$\Rightarrow 3x + 36 = 4x - 12$

$\Rightarrow x = 48$

సమాధానం: 1

2. ఒక ఊరి చివరనున్న జామ తోటలో 10 అడ్డ వరుసలు, 12 నిలువు వరుసల్లో జామ చెట్లు ఉన్నాయి. రెండు చెట్ల మధ్య 2 మీటర్ల దూరం ఉంది. తోట సరిహద్దు అన్ని వైపుల నుంచి ఒక మీటర్ స్థలం చెట్లు నాటకుండా వదిలేశారు. అయితే తోట పొడవు ఎంత?

1) 22 మీ. 2) 26 మీ. 3) 24 మీ. 4) 20 మీ.

సాధన: ప్రతి వరుసలో 12 మొక్కలు ఉన్నాయి.

రెండు మూలల్లో ఉన్న మొక్కలను వదిలేస్తే మధ్యలో 10 మొక్కలు ఉంటాయి.

$10 \times 2 = 20$ మీటర్లు.

ప్రతివైపు ఒక మీటర్ ఖాళీగా ఉంది.

పొడవు $20 + 2 = 22$ మీటర్లు

సమాధానం: 1

3. వివేక్ అనే వ్యక్తి ఒక హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి యజమాని ఇచ్చే జీతంతోపాటు కస్టమర్‌ల నుంచి టిప్ కూడా వస్తూ ఉంటుంది. ఒక వారంలో అతడి టిప్‌లు అతడి జీతంలో $\frac{5}{4}$గా ఉన్నాయి. అయితే అతడి ఆదాయంలో ఎంత భాగం టిప్‌ల ద్వారా వస్తుంది?

1) $\frac{4}{9}$ 2) $\frac{5}{8}$ 3) $\frac{5}{9}$ 4) $\frac{5}{4}$

సాధన: జీతం = రూ. x అనుకుందాం.

అప్పుడు టిప్‌లు = రూ.$\left(\frac{5}{4}x\right)$

మొత్తం ఆదాయం = రూ.$\left(x + \frac{5}{4}x\right)$

= రూ.$\left(\frac{4x + 5x}{4}\right)$

= రూ.$\left(\frac{9x}{4}\right)$

టిప్‌లు $= \frac{5x}{4} \times \frac{4}{9x} = \frac{5}{9}$

సమాధానం: 3

4. ఒక తరగతిలో కొంత మంది విద్యార్థులు ఉన్నారు. అందులో $\frac{3}{5}$ మంది విద్యార్థులు బాలికలు, మిగిలినవారు బాలురు. ఇందులో $\frac{2}{9}$ మంది బాలికలు, $\frac{1}{4}$ మంది బాలురు గైర్హాజరయ్యారు. అయితే మొత్తం విద్యార్థుల సంఖ్యలో ఎంత భాగం హాజరయ్యారు?

1) $\frac{23}{30}$ 2) $\frac{18}{49}$ 3) $\frac{23}{36}$ 4) $\frac{17}{25}$

సాధన: బాలికలు $= \frac{3}{5}$; బాలురు $= \left(1 - \frac{3}{5}\right) = \frac{2}{5}$

గైర్హాజరైన విద్యార్థుల భాగం $= \frac{2}{9} \times \frac{3}{5} + \frac{1}{4} \times \frac{2}{5}$

$= \frac{6}{45} + \frac{2}{20}$

$= \frac{21}{90} \Rightarrow \frac{7}{30}$

హాజరైన విద్యార్థుల భాగం $= \left(1 - \frac{7}{30}\right) = \frac{23}{30}$

సమాధానం: 1

5. ఒక నగరంలో 40% మంది పెద్దలు నిరక్షరాస్యులు కాగా, 85% మంది పిల్లలు అక్షరాస్యులుగా ఉన్నారు. పెద్దలు, పిల్లల నిష్పత్తి 2 : 3. అయితే జనాభాలో ఎంత శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు?

1) 75% 2) 50% 3) 20% 4) 25%

సాధన: పెద్దల సంఖ్య వరుసగా = 2x అనుకుందాం

పిల్లల సంఖ్య వరుసగా = 3x అనుకుందాం

$2x + 3x = 5x$

అక్షరాస్యుల జనాభా = (100 – 40)% of 2x + 85% of 3x

= 60% of 2x + 85% of 3x

$= \frac{60}{100} \times 2x + \frac{85}{100} \times 3x$

$= \frac{6x}{5} + \frac{51x}{20}$

$= \frac{75x}{20}$

$= \left(\frac{75x}{20} \times \frac{1}{5x} \times 100\right)\%$

= 75%

సమాధానం: 1

6. ఒక క్రికెట్ మ్యాచ్‌లో A, B, C, D, E అనే అయిదుగురు బ్యాట్స్‌మెన్‌లు సగటున 36 పరుగులు చేశారు. E కంటే D అయిదు పరుగులు ఎక్కువగా స్కోర్ చేశాడు. A కంటే E 8 పరుగులు తక్కువ స్కోర్ చేశాడు. B అనే వ్యక్తి D, E కలిసి చేసిన పరుగులకు సమానంగా స్కోర్ చేశాడు. B, C లు 107 పరుగులు చేశారు. అయితే E ఎన్ని పరుగులు చేశాడు?

1) 20 2) 45 3) 62 4) 28

సాధన: అయిదుగురు కలిసి చేసిన పరుగులు

$= 36 \times 5 = 180$

E చేసిన పరుగులు = x అనుకోండి

D చేసిన పరుగులు = x + 5

A చేసిన పరుగులు = x + 8

B చేసిన పరుగులు = x + x + 5 = 2x + 5

C చేసిన పరుగులు = (107 – B) = 107 – (2x + 5) = 102 – 2x

మొత్తం పరుగులు = x + 8 + 2x + 5 + 102 – 2x + x + 5 + x

= 3x + 120

$3x + 120 = 180 \Rightarrow 3x = 60 \Rightarrow x = 20$

E చేసిన పరుగులు = 20

సమాధానం: 1

7. రామన్ అనే వ్యక్తి తన పరీక్ష మే 15 తర్వాత, మే 18 కి ముందు ఉందని గుర్తుంచుకున్నాడు. దీపక్ అనే వ్యక్తి పరీక్ష మే 21 కంటే ముందు కానీ మే 16 తర్వాత అని గుర్తుంచుకున్నాడు. అయితే మేలో ఏ తేదీన పరీక్ష ఉంది?

1) 19 2) 20 3) 18 4) 17

సాధన: రామన్ ప్రకారం పరీక్ష తేదీ (మేలో) = 16 లేదా 17

దీపక్ ప్రకారం పరీక్ష తేదీ (మేలో) = 17, 18, 19, 20

ఇద్దరి ప్రకారం ఉమ్మడి పరీక్ష తేదీ = మే 17

సమాధానం: 4

8. భారతీయ మెట్రో నగరాల్లో వివాహితులపై ఇటీవల జరిపిన సర్వేలో 20% జంటలకు ఒకరే సంతానం. మిగిలిన జంటల్లో 45% మందికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, మిగిలిన జంటలకు ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నారని తేలింది. అయితే ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న జంటల శాతం ఎంత?

1) 35% 2) 44% 3) 42% 4) 56%

సాధన: మొత్తం వివాహితులు = 100

ఒక బిడ్డను కలిగి ఉన్న జంటలు = 20

మిగిలిన జంటలు = 100 – 20 = 80

ఇద్దరు పిల్లలు ఉన్న జంటలు = 80 × 45% = 36

ముగ్గురు పిల్లలు లేదా అంతకంటే ఎక్కువ పిల్లలు ఉన్న జంటలు = 80 – 36 = 44%

సమాధానం: 2

9. ప్రస్తుతం మానిక్ వయసు 12 సంవత్సరాలు. అతడి సోదరుడు రాహుల్ కంటే మానిక్ వయసు మూడు రెట్లు ఎక్కువ. అయితే రాహుల్ కంటే రెట్టింపు వయసు ఉన్నప్పుడు మానిక్ వయసు ఎంత? (సంవత్సరాల్లో)

1) 16 2) 20 3) 14 4) 18

సాధన: మానిక్ ప్రస్తుత వయసు = 12 సంవత్సరాలు

రాహుల్ ప్రస్తుత వయసు = 4 సంవత్సరాలు

మానిక్ ఇప్పటినుంచి x సంవత్సరాల తర్వాత రాహుల్ కంటే రెండింతలు వయసులో పెద్దవాడు అనుకుందాం.

$12 + x = 2(4 + x)$

$12 + x = 8 + 2x \Rightarrow x = 4$

కావాల్సిన మానిక్ వయసు

$= 12 + x = 12 + 4 = 16$

సమాధానం: 1



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

435 Word of the Day

Imminent

Telugu meaning: అనివార్యమైన, రాబోయే

English meaning: The word imminent is an adjective that describes something that is about to happen very soon.

Synonyms: Impending, Approaching

Antonyms: Distant, Unlikely

Usage: 1. The dark clouds signalled that a storm was imminent, and people rushed to seek shelter.

2. The announcement of his promotion seemed imminent, given his recent success at the company.

Latest Updates

PGT, TGT & PRT Posts

Army Welfare Education Society (AWES) invites applications for the recruitment of PGT, TGT & PRT posts to work in Army Public Schools (APS) in various Cantonments and Military Stations across India. The application fee is Rs.385. Eligible candidates can apply online before 25 October 2024.

Project Assistant Posts

Council of Scientific and Industrial Research (CSIR) - National Metallurgical Laboratory (NML) at Jamshedpur, Jharkhand is conducting interviews for the 49 Project Assistant posts on temporary basis. The interview dates are 15, 16 October 2024.

B.Sc. Nursing Courses

Kaloji Narayana Rao University of Health Sciences, Warangal invites application for admission into Competent Authority Quota Seats in Government and Private B.Sc. (Nursing) colleges for the academic year 2024-25. The application fee is Rs.2500. The last date for online application is 14 October 2024.

Did You Apply..?

Today (October 9) is the last date for the following Posts/ Scholarships

❖ 271 Technician posts in Heavy Vehicle Factory (HVF), Chennai. ***Qualification:*** Engineering Degree, PG (M.Tech/ LLB) pass along with work experience.

❖ 103 Technician posts in Human Space Flight Center (HSFC), Bangalore. ***Qualification:*** Diploma, B.Sc Degree, BE/ B.Tech, MBBS/ MD, ME/ M.Tech.

❖ Process Associate - Customer Service posts in Genpact. ***Qulification:*** Any Graduate.

For more information and other notifications - scan QR code




భారతదేశ నాగరికతల్లో మొట్టమొదటిది సింధు నాగరికత. దీన్నే 'హరప్పా నాగరికత', 'సింధు లోయ నాగరికత', 'మూల భారతీయ నాగరికత' అని కూడా అంటారు.

☛ ఈ వీడియోలో భారతదేశ చరిత్ర సిలబస్ విశ్లేషణ, సింధు నాగరికతపై పరిశోధనలు చేసిన వారు, దాని విస్తీర్ణం - సరిహద్దులు (పాతవి, కొత్తవి), ఏఎస్ఐ స్థాపన, సింధు నాగరికత నాటి సామాజిక - ఆర్థిక పరిస్థితులు మొదలైన అంశాలను వివరించారు.


క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మరిన్ని వీడియోల కోసం ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

కరెంట్ అఫైర్స్



జన్యుపదార్థంలోని చిన్నపాటి తునకలైన మైక్రో ఆర్ఎన్ఏను కనుక్కున్న అమెరికన్ శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌లు 2024 ఏడాదికి వైద్య రంగంలో నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. నోబెల్ ఎంపిక కమిటీ 2024, అక్టోబరు 7న స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో ఈ అవార్డును ప్రకటించింది.

● స్వీడన్‌కు చెందిన దిగ్గజ శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామా మేరకు నోబెల్ పురస్కారాలు ఏర్పాటయ్యాయి. ఆల్ఫ్రెడ్ నోబెల్ జయంతిని పురస్కరించుకొని ఏటా డిసెంబరు 10న ఈ పురస్కారాలు అందిస్తారు. వైద్యశాస్త్రంలో ఇప్పటివరకు 227 మంది నోబెల్ అందుకున్నారు. ఇందులో 13 మంది మహిళలు ఉన్నారు.



భారత పర్యటనకు వచ్చిన మాల్దీవుల దేశాధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుతో ప్రధాని నరేంద్ర మోదీ 2024, అక్టోబరు 7న దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భేటీ అయ్యారు. భారత్ సహకారంతో మాల్దీవుల్లోని హనిమధూ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్తగా నిర్మించిన రన్‌వేను ముయిజ్జు, మోదీ సంయుక్తంగా వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

● విదేశీ మారక నిల్వల కొరతను అధిగమించడంలో మాల్దీవులకు దోహదపడేలా భారత్ ఆ దేశంతో కరెన్సీ మార్పిడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో దీపక్ దలాల్, కమల్‌జీత్, రాజ్ చంద్రలతో కూడిన భారత బృందం స్వర్ణం నెగ్గింది. 2024, అక్టోబరు 7న పెరూలోని లిమాలో జరిగిన 50 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో భారత పురుషుల జట్టు 1616 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అజర్‌బైజాన్ రజతం, అర్మేనియా కాంస్య పతకాలు గెలిచాయి.

● వ్యక్తిగత విభాగంలో గుంటూరుకు చెందిన ముకేశ్ నేలవల్లి కాంస్యం సాధించాడు. ఈ టోర్నీలో అతడికి ఇది ఏడో పతకం.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Bank Exams
English

Cloze Test

India has long held a delicate ..... (1) ..... in West Asia, a region fraught with geopolitical tensions and conflicts. With deep historical ties, energy dependence, and a significant diaspora, India's interests in the region are ..... (2) ...... Over the past few decades, the region has witnessed numerous upheavals, including the Arab Spring, the rise of militant groups, and ongoing proxy wars, all of which complicate India's diplomatic efforts. The recent escalation of tensions between various regional players, including Iran, Saudi Arabia, and Israel, presents both challenges and opportunities for India's foreign policy. New Delhi must ..... (3) ..... balance its relations with these countries while safeguarding its strategic and economic interests. Energy security is a ..... (4) ..... concern for India, as the country relies heavily on oil imports from the region. West Asia accounts for nearly 60% of India's energy needs, making stability in the region crucial for India's economic ..... (5) ...... Any disruption in energy supplies due to conflict or sanctions can have a significant impact on the Indian economy, which is still emerging from the global pandemic. Additionally, India's large diaspora in the Gulf Cooperation Council (GCC) countries ..... (6) ..... a critical role, not only in contributing to India's foreign exchange reserves but also in strengthening bilateral ties. Remittances from this region form a key part of India's economic framework. In response to the growing tensions, India has adopted a ..... (7) ..... approach, emphasizing diplomacy and dialogue. New Delhi has consistently called for peaceful resolution of conflicts and has avoided taking sides in the complex and shifting alliances of the region. This policy of non-alignment and neutrality allows India to maintain strong relationships with countries that have conflicting interests, such as Iran and Saudi Arabia. Furthermore, India's growing strategic partnership with Israel is a testament to its ability to ..... (8) ..... between competing regional powers. At the same time, India's diplomatic outreach has extended to multilateral forums, such as the United Nations and the Non-Aligned Movement, where it has advocated for ..... (9) ..... solutions to West Asia's challenges. India's engagement in these international platforms highlights its global ambitions and its desire to contribute to world peace. India's efforts to remain a neutral player while pushing for stability and development in the region have positioned it as a credible ..... (10) ..... in the international arena. As tensions in West Asia continue to fluctuate, India's ability to balance diverse interests and maintain its diplomatic stature will be crucial in shaping the future of its foreign relations.

Directions (Qs. 1 - 10): *In the following passage, there are blanks each of which have been numbered from 1 to 10. Against each number, five words are suggested and only one word fits the blank appropriately. Find out the appropriate word in all the cases.*

1. A) retreat B) stance C) compromise D) agreement E) footing

2. A) temporary B) inevitable C) significant D) superficial E) replaceable

3. A) effectively B) cautiously C) unilaterally D) recklessly E) decisively

4. A) primary B) marginal C) secondary D) trivial E) superficial

5. A) decline B) transition C) downfall D) stability E) crisis

6. A) destroys B) plays C) disrupts D) obstructs E) contributes

7. A) reactive B) aggressive C) diplomatic D) passive E) silent

8. A) offend B) alienate C) mediate D) navigate E) disrupt

9. A) military B) economic C) unilateral D) aggressive E) peaceful

10. A) navigator B) spectator C) aggressor D) adversary E) rival

Scan the QR code for the Key

Writer:
P. Manoj Kumar, Subject Expert

(c) eenadu

ప్రిపరేషన్ టెక్నిక్

కొంతమంది బాగా చదువుతారు. అడిగిన వెంటనే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేస్తారు. కానీ పరీక్షల్లో మంచి మార్కులు రావు. ఎందుకంటే, అన్ని ప్రశ్నలకు నిర్ణీత సమయంలో జవాబులు రాయలేకపోతారు. అందుకే సమాధానాలు రాయడాన్ని లెక్కలు చేయడాన్ని రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయాలి.

డీఎస్సీ/టెట్ - 2024
హిందీ కంటెంట్

కరెంట్ అఫైర్స్



■ 2024, జులై 1 నుంచి 15 వరకు 'మైత్రి ఎక్సర్‌సైజ్-2024' పేరిట ఏ రెండు దేశాల మధ్య సంయుక్త సైనిక విన్యాసాలను నిర్వహించారు?

జ: భారత్-థాయ్‌లాండ్ (థాయ్‌లాండ్‌లోని తక్ ప్రావిన్స్‌లోని ఫోర్ట్ వచిర ప్రకాన్ వద్ద ఇండియన్ ఆర్మీ, రాయల్ థాయ్ ఆర్మీలు ఈ సైనిక విన్యాసాల్లో పాల్గొన్నాయి. 2006 నుంచి 'మైత్రి ఎక్సర్‌సైజ్' పేరిట భారత్-థాయ్‌లాండ్‌ల మధ్య సైనిక సహకారాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ సంయుక్త సైనిక విన్యాసాలను నిర్వహిస్తున్నారు. మైత్రి ఎక్సర్‌సైజ్‌ను చివరిసారిగా 2019లో మేఘాలయలో నిర్వహించారు.)

మాదిరి ప్రశ్నలు

■ అఫ్గానిస్థాన్‌కు సంబంధించి మూడో ఐక్యరాజ్యసమితి సదస్సును 2024 జూన్ 30, జులై 1న తేదీల్లో ఎక్కడ నిర్వహించారు?

జ: ఖతార్ రాజధాని దోహా. (అఫ్గానిస్థాన్‌పై తొలి రెండు ఐక్యరాజ్యసమితి సదస్సులను దోహాలో వరుసగా 2023 మే, 2024 ఫిబ్రవరిలో నిర్వహించారు. మూడో సదస్సుకు తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్, భారత్ నుంచి విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి జేపీ సింగ్, ఐరాస నుంచి రాజకీయ, శాంతి నిర్మాణ వ్యవహారాల అండర్ సెక్రటరీ జనరల్ రోజ్‌మేరీ డికార్లో హాజరయ్యారు. అఫ్గానిస్థాన్‌పై నియంత్రణ తీసుకున్న తర్వాత తాలిబన్ ప్రతినిధి తొలిసారిగా ఈ సదస్సుకు హాజరయ్యారు.

మరింత సమాచారం

జూనియర్ ఇంటర్ తెలుగు

ప్రశ్నలు జవాబులు

ఆయన రచనలో అక్షర రమ్యత!

విద్యాలక్ష్యం

2 మార్కులు



1) నన్నయభట్టు గురించి తెలపండి.

జ: నన్నయ 11వ శతాబ్దానికి చెందిన కవి. ఇతనికి ఆదికవి, శబ్దశాసనుడు అనే బిరుదులు ఉన్నాయి. రాజరాజ నరేంద్రుని కాలంలో నన్నయ అతని ఆస్థానకవిగా ఉండేవాడు. చంద్రవంశరాజుల కథను తెలుగులో వినాలనే కోరికతో నన్నయను వ్యాసభారతాన్ని తెలుగులోకి అనువాదం చేయమన్నాడు రాజరాజ నరేంద్రుడు. అతని కోరిక మేరకు నన్నయ వ్యాసభారతంలోని ఆది పర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలో కొంత భాగం వరకు అనువాదం చేశాడు. భారతానికి 'జయకావ్యం' అనే పేరు కూడా ఉంది. ఈ మహాభారత కథను వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడు. భారత రచనలో నారాయణభట్టు నన్నయకు సహాయం చేశాడు.

ఈయన ఆంధ్రమహాభారతంతో పాటు ఆంధ్రశబ్దచింతామణి, చాముండికా విలాసం, ఇంద్రవిజయం, లక్షణసారం అనే గ్రంథాలు రచించాడు. నన్నయ కథా నిర్వహణలలో, భాషలో, శైలిలో మూలంలో కన్నా స్వతంత్రంగా వ్యవహరించాడు. ఈయన రచనలో అక్షరరమ్యత, నానారుచిరార్థసూక్తి నిధిత్వము, ప్రసన్నకథాకవితార్థ యుక్తి లక్షణాలు కనిపిస్తాయి. మహాభారతాన్ని తనదైన శైలిలో చంపూ పద్ధతిలో అనువాదం చేసి మిగిలిన కవులకు మార్గదర్శకుడిగా నిలిచాడు.

2) ద్రుపదుడి చేతిలో ద్రోణుడు ఏ విధంగా భంగపడ్డాడు?

జ: ద్రోణుడు పేదరికంతో తన బాల్యస్నేహితుడైన ద్రుపదుని వద్దకు వెళ్లి ధన సహాయాన్ని కోరతాడు. అప్పుడు ద్రుపదుడు అహంకారంతో గొప్పవాడికి, పేదవాడికి ఎక్కడైనా స్నేహం కుదురుతుందా అని ప్రశ్నించి తాను రాజునని ద్రోణుడు నిరుపేద బ్రాహ్మణుడని సమానుల మధ్యనే స్నేహం ఉంటుందని నీకు నాకు స్నేహం కుదరదని తన సహాయం కోరి వచ్చిన బాల్య మిత్రుడైన ద్రోణున్ని ద్రుపదుడు అవమానించి పంపుతాడు.

ముఖ్యమైనవి మరికొన్ని..

1) ఎవరెవరి మధ్య 'సఖ్యత' కుదరదని ద్రుపదుడు చెప్పాడు?
2) 'కల్పితపక్షి'ని ఛేదించే సమయంలో కురు కుమారుల ప్రతిభ ఎట్టిది?


2 మార్కులు
జవాబుల కోసం

- నారెళ్ల కిరణ్‌ప్రసాద్

SUBSCRIBE CHANNEL

సహజశక్తికి తరగని నిల్వలు!

ప్రపంచవ్యాప్తంగా ఇంధన రంగంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోలియం స్థానంలో సహజ శక్తివనరుల వినియోగం వేగంగా పెరుగుతోంది. శిలాజ ఇంధనాల లభ్యతకు ఉన్న పరిమితులు, వాటి వాడకంతో తలెత్తే సమస్యలను గుర్తించిన ప్రపంచం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సౌరశక్తి, పవనశక్తి, హైడ్రోజన్ శక్తి ఉత్పత్తి వైపు కదులుతోంది. సహజ వనరులైన నీరు, సూర్యరశ్మి, పవనాలు, సముద్ర తరంగాలు, భూమి నుంచి వెలువడే ఉష్ణం, వ్యర్థాల ద్వారా విద్యుత్తు తయారీ విధానాల గురించి పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. దేశంలో, ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయేతర ఇంధనవనరుల వినియోగం తీరుతెన్నులు, రాష్ట్రాల వారీ ఉత్పత్తి సామర్థ్యాలతో పాటు భారత ప్రభుత్వ ప్రణాళికలు, పథకాలు, అంచనాలు, లక్ష్యాలను గణాంకాల సహితంగా తెలుసుకోవాలి.



సంప్రదాయేతర ఇంధన వనరులు

(శక్తివనరులు)

ఆధునిక జీవనవిధానంలో విద్యుచ్ఛక్తి వినియోగించకుండా క్షణం కూడా గడవదు. శక్తి ఉత్పాదకాలుగా గతంలో బొగ్గు, పెట్రోలు వంటి తరిగిపోయే వనరులనే వాడేవారు. పరిశోధనలతో సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, భూతాప శక్తి, బయో ఇంధనాలు తదితర సంప్రదాయేతర లేదా తరిగిపోని ఇంధన/శక్తి వనరులను గుర్తించారు. భారత ప్రభుత్వం సంప్రదాయేతర ఇంధన వనరుల అవసరాన్ని 1970లో గుర్తించింది. వీటి అభివృద్ధి, నిర్వహణ కోసం 1982లో ఒక శాఖను, 1992లో సంప్రదాయేతర ఇంధనవనరుల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ఈ ఇంధనవనరుల ప్రాముఖ్యతను వివరించేందుకు 2004 నుంచి ఏటా ఆగస్టు 20న రాజీవ్ అక్షయ్ ఉర్జాదివస్‌గా నిర్వహిస్తోంది. దేశంలో మొత్తం సంప్రదాయేతర ఇంధనవనరుల ఉత్పత్తి సామర్థ్యం 10.97 లక్షల మెగావాట్లు. 2020-21 లెక్కల ప్రకారం సౌరశక్తి 68.2%, పవన విద్యుత్తు 27.5%, తరంగశక్తి, జీవశక్తి మొదలైనవి 4.2% ఉత్పత్తి వాటాతో ఉన్నాయి. దేశంలో 2024, జూన్ 30 నాటికి పునరుత్పాదక శక్తివనరుల స్థాపిత సామర్థ్యం 1,95,013 మెగావాట్లు. ఇందులో జలవిద్యుచ్ఛక్తి 46,928 మె.వా, పవన విద్యుత్తు 46,656 మె.వా, సౌరవిద్యుత్తు 85,474 మె.వా, భూతాప, జీవశక్తి 10,355 మె.వా, వ్యర్థ్యాల నుంచి 593 మె.వా, చిన్న జలవిద్యుత్తు కేంద్రాల నుంచి 5,005 మెగా వాట్లు. మొత్తం దేశ విద్యుత్తు ఉత్పాదక స్థాపిత సామర్థ్యంలో పునరుత్పాదక విద్యుత్తు వనరుల వాటా 43.7 శాతానికి చేరింది. రాష్ట్రాల వారీగా చూస్తే (2023 లెక్కలు) పునరుత్పాదక ఇంధనవనరుల స్థాపక సామర్థ్యంలో 1) రాజస్థాన్ (24,531 మె.వా) 2) గుజరాత్ (23,967) 3) కర్ణాటక (21,886) 4) తమిళనాడు (21,135) 5) మహారాష్ట్ర (16,311) తొలి 5 స్థానాల్లో ఉన్నాయి.

సౌరశక్తి: విశాలమైన ప్రదేశాల్లో సౌరఫలకాలను ఏర్పాటు చేసుకొని విద్యుత్తును ఉత్పత్తి చేసే, నిల్వచేసే విధానాన్ని సౌరవిద్యుత్తుగా పేర్కొంటారు. దీని ఉత్పత్తి వ్యయం కూడా తక్కువే. ఒక చదరపు కిలోమీటరుకు 20 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు. ప్రస్తుతం దేశం సంవత్సరానికి సుమారు 5000 ట్రిలియన్ కిలోవాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. సౌరవిద్యుత్తు ఉత్పత్తి, సామర్థ్యం కలిగిన రాష్ట్రాల్లో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో గుజరాత్, కర్ణాటక, తమిళనాడు ఉన్నాయి. 2020 నాటికి ఆసియాలోనే అతిపెద్ద సౌరవిద్యుత్తు ప్లాంటు మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలోని గురుతెహ్‌సిల్ ప్లాంటు. 2024 గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే అతిపెద్ద సౌరవిద్యుత్తు పార్కు రాజస్థాన్‌లోని భద్‌లా సోలార్ పార్క్. దీన్ని 2,245 మెగావాట్ల స్థాపనా సామర్థ్యంతో థార్ ఎడారిలోని జోధ్‌పుర్ జిల్లాలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సౌరవిద్యుత్తు ఉత్పత్తిలో చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2018లో అటల్ జ్యోతి యోజన కింద దేశవ్యాప్తంగా సోలార్ వీధిదీపాలను ఏర్పాటు చేశారు. 2019లో 'కుసుమ్' పథకం కింద రైతులకు పాత డీజిల్ ఇంజిన్ల స్థానంలో సౌరశక్తితో నడిచే పంపుసెట్లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించారు. 'ఉజాలా' పథకం కింద దేశమంతా ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేశారు.

పవన విద్యుత్తు: ఎత్తైన కొండపైన వేగంగా వీచే గాలులకు అనుకూలంగా గాలిమర చక్రాలు అమర్చి విద్యుత్తు ఉత్పత్తి చేసే విధానం. టర్బైన్‌ల ద్వారా గాలి విద్యుచ్ఛక్తిగా మారుతుంది. పవన విద్యుత్తు ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ నాలుగో స్థానంలో (మార్చి 2024 నాటికి) ఉంది. మొదటి మూడు స్థానాల్లో చైనా, అమెరికా, జర్మనీ ఉన్నాయి. 2024 లెక్కల ప్రకారం భారత్ పవన విద్యుత్తు స్థాపన సామర్థ్యం 46.4 గిగావాట్లు. పవన విద్యుత్తులో ముందంజలో ఉన్న రాష్ట్రం తమిళనాడు. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సముద్ర తరంగాల ద్వారా విద్యుచ్ఛక్తి: సముద్ర అలల ద్వారా విద్యుత్తు ఉత్పత్తికి దేశంలో అనుకూల ప్రాంతం గల్ఫ్ ఆఫ్ కంబట్, గల్ఫ్ ఆఫ్ కచ్, సుందర్బన్ అడవులు. దేశంలో అలల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం గుజరాత్‌లోని కాండ్లా దగ్గర సింధు శాఖ వద్ద ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం దేశంలో 8,300 మెగావాట్ల తరంగ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉంది. కాంబట్ సింధు శాఖలో 700 మెగావాట్లు, కచ్ సింధుశాఖలో 1200 మెగావాట్లు, సుందర్బన్ డెల్టాలో 100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నట్లు అంచనా.

జల విద్యుచ్ఛక్తి: వర్షపునీటిని ఆనకట్టలు, రిజర్వాయర్లలో నిల్వ చేసి, అవసరమైనప్పుడు కిందికి వదిలి టర్బైన్‌ల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు. ఈ విధంగా జల విద్యుత్తు ఉత్పత్తికి అయ్యే ఖర్చు చాలా తక్కువ. 2024, జూన్ నాటి లెక్కల ప్రకారం దేశంలో జల విద్యుచ్ఛక్తి స్థాపిత సామర్థ్యం 1,33,40 మెగా వాట్లు. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశంలో థర్మల్, పునరుత్పాదక ఇంధన వనరులు (సౌరశక్తి, పవనశక్తి) తర్వాతి స్థానంలో జలవిద్యుచ్ఛక్తి ఉంది. దేశంలో మొదటి జల విద్యుత్తు కేంద్రాన్ని డార్జిలింగ్‌లో 1897లో నెలకొల్పారు. రెండోదాన్ని 1902లో శివసముద్రంలో (కర్ణాటక) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉన్న 23 హైడ్రోఎలక్ట్రిక్ విద్యుత్తు ప్రాజెక్టుల్లో ఇందిరాసాగర్ విద్యుత్తు కేంద్రం పెద్దది. దేశంలో అత్యధికంగా జలవిద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం పంజాబ్.

భూతాపశక్తి (జియోథర్మల్ ఎనర్జీ): భూ అంతర్భాగంలో ఉండే వేడిని విద్యుచ్ఛక్తిగా మారుస్తారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ప్రాథమిక పరిశోధన ప్రకారం దేశంలో సుమారు 350 వరకు వేడినీటి బుగ్గలున్నట్లు తెలుస్తోంది. వీటిలో విద్యుత్తు ఉత్పత్తికి పనికొచ్చేవి బారన్ ఐలాండ్, లద్దాఖ్‌లోని పూగా వ్యాలీ, చుమ్మత్తాంగ్, గుజరాత్‌లోని కాంబే, ఛత్తీస్‌గఢ్‌లోని టాటాపాని, తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహారాష్ట్రలోని రత్నగిరి, జల్‌గావ్, హిమాచల్ ప్రదేశ్‌లోని మణికరన్, ఝార్ఖండ్‌లోని సూరజ్‌ఖండ్‌లో ఉన్నాయి.

బయోమాస్: వ్యవసాయ, పశువుల వ్యర్థాలు, చెత్త ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేసే విధానం. ఇదేకాకుండా మొక్కల ద్వారా బయోడీజిల్, బయోఇథనాల్, బయోహైడ్రోజన్ మొదలైనవి తయారుచేస్తున్నారు. 2024 లెక్కల ప్రకారం దేశంలో బయో ఎనర్జీ ప్లాంట్ల స్థాపన సామర్థ్యం 10,959.42 మెగావాట్లు. బయో ఎనర్జీ ఉత్పత్తిలో ముందున్న రాష్ట్రాలు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, పంజాబ్. భారత ప్రభుత్వం 2030 నాటికి పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలపాలని, అలాగే 5% బయోడీజిల్‌ను వినియోగంలోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకుంది.


హైడ్రోజన్ శక్తి: హైడ్రోజన్ నుంచి శక్తి ఉత్పత్తికి 'ఫ్యూయల్ సెల్స్' ముఖ్యమైనవి. దేశంలో హైడ్రోజన్ శక్తి ఉత్పత్తి, వినియోగానికి నేషనల్ హైడ్రోజన్ ఎనర్జీ కార్యక్రమం అమలులోకి వచ్చింది. భారత్ నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను 2023 జనవరిలో ప్రారంభించారు. దీని ప్రకారం 2030 నాటికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదన సాధించాలన్నది లక్ష్యం. భారతదేశ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టు హిమాచల్‌ప్రదేశ్‌లోని ఝక్రీలో 1500 మెగావాట్ల సామర్థ్యంతో ప్రారంభమైంది. గ్రీన్‌హైడ్రోజన్ అనేది ఒక స్వచ్ఛ ఇంధన శక్తి. సూర్యరశ్మి, నీరు ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్ తయారుచేస్తారు.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

Convey a complete thought

Clauses are essential components of the English language as they form the building blocks of sentences. Each clause contains a subject and a predicate, which convey a complete thought or add additional detail to a sentence. Clauses enable the expression of complex ideas, connect thoughts, and provide structure to language. By combining independent and dependent clauses, we create varied sentence structures, enhancing both clarity and depth in communication.



DSC/TET 2024
English

Clauses

1. Choose the sentence with a noun clause.
1) The jury believed that the man was guilty
2) I am a student
3) I know who you are
4) Raju, who is a teacher, lives next to us

2. Choose the sentence with an adverbial clause from the following.
1) Come when you like
2) He confessed that he was guilty
3) He cried as if he were in deep pain
4) I know a boy whose father serves in the army

3. Choose the sentence with an adverbial clause.
1) He decided to go to his workplace because he got into debts
2) He stopped his business
3) I know the doctor who is famous in this town
4) Do you think that he is right?

4. Having read this book, I returned it to the library
The above sentence has......
1) Only one main clause
2) One non-finite clause and one finite clause
3) One Subordinate clause and one main clause
4) One non-finite clause and one phrase

5. Unless you work hard you won't pass the exam
(the underlined part is called....)
1) An Independent clause
2) A main clause
3) A non-definite clause
4) A conditional clause

6. Choose the sentence with a noun clause
1) What you say is not clear to me
2) One student said that he had an attack of a headache
3) Tell me how you found that out
4) Above all

7. As Bayaji neared Buddha Vihar the children came running to him (the underlined part is....)
1) An adverb clause
2) An adjective clause
3) A noun clause
4) A non-finite clause

8. Choose the word that can be used to write an adverbial clause of reason
1) As
2) Since
3) Because
4) Above all

9. Nick, who was born in Melbourne, Australia now lives in Los Angeles
(the underlined part is known as .....)
1) Non – Finite clause
2) non-defining relative clause
3) Defining Relative clause
4) A Dependent clause

10. Choose the incorrect statement about relative clause.
1) A relative clause is usually introduced by relative pronoun
2) Usually a relative clause modifies the noun or pronoun that goes before it
3) The relative clause which adds essential information about the noun (antecedent) is called defining relative clause
4) Above all

11. Choose the sentence with an adverb clause of concession.
1) Though he was negligent, the company suffered heavy losses
2) The woman whom I met at the airport is a famous English poet
3) I shall attend the party if you invite me
4) That the sun rises in the east is a universal truth

12. A sub-ordinate clause must be attached to a/an.
1) dependent clause
2) non-finite clause
3) independent clause
4) non-defining relative clause

13. An independent clause.....
1) Can stand alone as a sentence
2) Can express a complete meaning/thought
3) Is also known as principal clause
4) Above all

14. Gandhiji said that honesty is the best of all the policies of mankind.
What kind of clause is the underlined one?
1) Noun clause
2) Adjective clause
3) Adverb clause
4) Main clause

15. Do you know who I am? What kind of clause underlined one?
1) Noun clause
2) Adjective clause
3) Adverb clause
4) Main clause

16. They are known for honesty and if they do not have food to eat they would rather starve and stale. What kind of adverb clause is underlined one?
1) Adverb clause of condition
2) Adverb clause of result
3) Adverb clause of purpose
4) Adverb clause of reason

17. Select the option that best describes the use of clauses in the given sentence.
The doctor told Ramu to lose weight and exercise vigorously for forty- five minutes a day.
1) This sentence has two independent clauses
2) This sentence has no independent clause
3) This sentence has one independent clause
4) No independent clause

18. Select the option that best describes the use of clauses in the given sentence.
Raju has decided to hire a personal trainer because he is worried about his heart.
1) The section in underline is an independent clause
2) This sentence has two independent clauses.
3) Raju has decided to hire a personal trainer is the independent clause.
4) None of the above

19. Select the sentence that contains a main clause
1) Because it was raining as it is raining
2) Although she studied hard for the exam
3) He ate dinner after he had finished his homework
4) Walking along the beach, the seagulls soaring overhead

20. Select the sentence that contains a subordinating clause
1) I will go to the beach along with him
2) The dog barked loudly all night
3) After we finish dinner, we can go for a walk
4) She danced gracefully across the stage

21. First conditional is used to talk
1) About real or likely future situations.
2) About unreal past
3) About the things happened in the past
4) About discontinued habits

22. Choose the incorrect statement regarding subordinating clauses.
1) Subordinating clauses cannot stand alone as complete sentences
2) Subordinating clauses often begin with subordinating conjunctions
3) Subordinating clauses always express complete thoughts
4) Subordinating clauses rely on independent clauses to form complete sentences

23. An independent clause.....
1) can stand alone as a sentence
2) can express a complete meaning
3) is also known as principal clause
4) Above all

24. A subordinate clause begins with
1) A co-ordinate conjunction
2) Compound adjective
3) A prepositional phrase
4) A subordinate conjunction

25. The dependent clause that functions as a noun of a subject/object is called....
1) A noun clause
2) A noun phrase
3) A noun phrase in opposition
4) An adjective clause

26. A group of words which contains a subject and a finite verb that describes/adds to the meaning of a verb, an adjective or another adverb is known as......
1) an adjective clause
2) a noun clause
3) an adverb clause
4) a nonfinite clause

27. As I was going to take my first step, I heard my father's voice (this sentence has an adverb clause of....)
1) Reason
2) Time
3) Manner
4) Place

28. Where he lives is not known to anyone (the above sentence has...)
1) An adverb clause
2) A non-finite clause
3) A defining relative clause
4) A noun clause

29. An adverb clause of reason begins with....
1) Nevertheless
2) Hence
3) So---that
4) No sooner--- than



Writer: Putnam Ravi Kumar

Answers

1-1; 2-3; 3-2; 4-2; 5-4; 6-4; 7-1; 8-4; 9-2; 10-4; 11-1; 12-1; 13-4; 14-1; 15-2; 16-4; 17-3; 18-3; 19-3; 20-3; 21-1; 22-3; 23-4; 24-4; 25-1; 26-3; 27-1; 28-4; 29-4.

(c) eenadu



ఎల్లలు లేని రంగం..

కొల్లలుగా కొలువులు

జనసమ్మర్దం ఉన్న దారిలో ఆపసోపాలు పడుతూ ప్రయాణించడం కంటే ఎర్ర తివాచీ పరిచి స్వాగతిస్తున్న బాట పడితే భవిష్యత్తు బంగారుమయం అవుతుంది. అలాంటిదే ఫుడ్ ప్రాసెసింగ్ (ఆహార శుద్ధి) పరిశ్రమ. నైపుణ్యమున్న చురుకైన యువతకు ఈ రంగం ఆహ్వానం పలుకుతోంది.

ఆదాయం పుష్కలంగా ఉన్నచోట ఉద్యోగాలకు కొరత ఉండదు. కంపెనీల బ్యాలన్స్ షీట్లు లాభాలతో బరువెక్కుతున్న కొద్దీ నియామకాలకూ ఎర్ర తివాచీనే! దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ (ఆహార శుద్ధి పరిశ్రమ) పరిస్థితి ఇదే. ఎయిర్‌పోర్ట్స్ నుంచి మన వీధి చివరి కిరాణా షాపుల వరకూ వేలాడుతుండే హల్దీరామ్స్ ప్యాక్ స్నాక్స్ కంపెనీలో ప్రధాన వాటాను ఇటీవల ఒక వెంచర్ క్యాపిటల్ సంస్థ హస్తగతం చేసుకుంది. ఈ ఒప్పందం విలువ ఎంతో తెలుసా? ఐదు, పది రూపాయిల స్నాక్ ఫుడ్, చిరుతిళ్లు అమ్మే ఈ కంపెనీ వాటాకు రూ. 78వేల కోట్లు వెల కట్టి చెల్లించారు.



ప్యాక్ స్నాక్స్ నుంచి చిప్స్, బేవరేజెస్ వంటి ఫుడ్ ప్రాసెసింగ్ విభాగాల్లో ఆధిపత్యం ఉన్న హల్దీరామ్స్‌కు దేశంలోని ప్రధాన నగరాల్లో రెస్టారెంట్లు ఉన్నాయి. పదివేలమంది వివిధ కేటగిరీ ఉద్యోగులు పనిచేస్తున్న ఈ సంస్థలో కనీస వార్షిక వేతనం రూ.1.20 లక్షలు. అసిస్టెంట్ మేనేజర్- రిటెయిల్ ఆపరేషన్స్ హోదాకు ఏడాదికి రూ.70 లక్షల వేతనం చెల్లిస్తున్నారు. అమూల్, హిందుస్థాన్ లీవర్, కోకాకోలా, నెస్లే, ఎం.టి.ఆర్. ఫుడ్స్, క్యాడ్‌బరీ ఇండియా, డాబర్ ఇండియా, ఆగ్రో టెక్ ఫుడ్స్, ఐ.టి.సి. లిమిటెడ్, బ్రిటానియా, పార్లే వంటి వివిధ కంపెనీలు ఈ కోవలో ఉన్నాయి.

కోర్సులేమున్నాయి?

ఇష్టం ఉన్నా ..లేకున్నా ఒకే తరహా కోర్సులు చేసి లక్షల్లో ఒకరిగా ఉద్యోగాన్వేషణలో సుదీర్ఘకాలం నిరీక్షించడం కంటే కాస్త భిన్నంగా ఆలోచించి... పుష్కలంగా ఉద్యోగాలున్నవైపు మరలడం మేలు. ఈ ఆలోచన ఉన్న యువత కోసం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి ప్రవేశించేందుకు వారధిగా ఎన్నో కోర్సులున్నాయి. చిరుతిళ్ల నుంచి లక్ష కోట్ల రూపాయల మార్కెట్‌గా అవతరించిన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో ప్రవేశానికి టెన్త్ క్లాస్ తర్వాత డిప్లొమా కోర్సులు, ఇంటర్ అనంతరం అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ఆఫర్ చేస్తున్నారు.

- ◆ ఫుడ్ అనాలిసిస్ అండ్ అస్యూరెన్స్ పాలిటెక్నిక్ డిప్లొమా
- ◆ డిప్లొమా ఇన్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ
- ◆ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ- ప్రిజర్వేషన్, మేనేజ్‌మెంట్ డిప్లొమా
- ◆ మూడేళ్ల బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ
- ◆ నాలుగేళ్ల బీటెక్ ఫుడ్ టెక్నాలజీ
- ◆ రెండేళ్ల ఎంటెక్ ఫుడ్ టెక్నాలజీ
- ◆ ఎంఎస్సీ ఫుడ్ టెక్నాలజీ

విభిన్న అవసరాలకు ఇలాంటి వేర్వేరు కోర్సులను వివిధ విద్యాసంస్థలు ఆఫర్ చేస్తున్నాయి. వీటిలో ఐఐటీలు, ఎన్ఐటీలు ఉండటం గమనార్హం. సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కూడా పలు కోర్సులను ఆఫర్ చేస్తోంది.

ఈ నైపుణ్యాలు అవసరం

ఈ కోర్సులు చేయడానికి కొన్ని నైపుణ్యాలను పెంపొందించుకోవాలి.

ఫుడ్ సైన్స్‌లో ఆసక్తి: ఆహార సాంకేతిక కోర్సు చేసేందుకు ముందుగా ఈ రంగంపై నిజమైన ఆసక్తి ఉండాలి. ఆహార పదార్థాల శాస్త్రీయ పరిశీలన, వాటిని శుద్ధి ప్రక్రియ ద్వారా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్న అభిలాష ఉండాలి. సాటి మిత్రులు సాఫ్ట్‌వేర్ జాబ్స్ చేస్తుంటే తాను ఫుడ్ టెక్నాలజిస్టుగా స్థిరపడేందుకు మానసికంగా సిద్ధపడాలి.

ప్రజారోగ్యం, పౌష్టికాహారంపై దృష్టి: ఆహారపు మౌలిక ప్రయోజనం దేహానికి పోషక విలువలు అందించడం. ఈ శాస్త్రంపై దృష్టి పెట్టిన విద్యార్థికి ప్రజారోగ్యం, పౌష్టికాహారంపై ఆసక్తి అవసరం. ఆహారశాస్త్ర నిపుణుడిగా పోషక విలువలున్న ఆహారం అందుబాటులోకి తీసుకురావాలన్న జిజ్ఞాస ఉండాలి. ముఖ్యంగా ఈ విషయంలో సమాజంలో వస్తున్న కొత్త ధోరణులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండాలి. ఉదాహరణకు ప్రస్తుతం ఎరువులు, రసాయనాలతో కలుషితమవుతున్న ఆహారం స్థానంలో సేంద్రియ ఎరువులు వాడే ఆర్గానిక్ కూరగాయలు, పండ్లకు జనాదరణ లభిస్తోంది. ఫుడ్ టెక్నాలజిస్టు కావాలనుకునే యువత నూతన ధోరణులను ఒడిసిపట్టుకోగలగాలి.

సాంకేతికతపై పట్టు: ఆహార శుద్ధిలో టెక్నాలజీని విరివిగా వినియోగిస్తారు. ఆహార ఉత్పత్తి నుంచి వినియోగదారుడు ఆరగించేందుకు అనువుగా సిద్ధం చేసేంతవరకూ ప్రతి దశలోనూ సాంకేతిక పరిజ్ఞాన వినియోగం అవసరం. ఇందుకు సాఫ్ట్‌వేర్‌లపై అవగాహనతో పాటు అవసరమైతే స్వయంగా సాఫ్ట్‌వేర్ రూపకల్పన చేయగలగాలి.

సమస్యా పరిష్కార సామర్థ్యం: మిగతా ఉద్యోగ నిర్వహణలో అవసరమైనట్లుగానే ఫుడ్ ప్రాసెసింగ్, ఫుడ్ టెక్నాలజీ రంగాల్లోనూ సమస్యా పరిష్కార నైపుణ్యం అవసరం. బ్రిటానియా, హిందుస్థాన్ లీవర్ వంటి వేగంగా ఉత్పత్తి జరిగే భారీ కంపెనీల్లో ఏ హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నా విభిన్న సమస్యలు ఉత్పన్నమవుతాయి. వీటిలో కొన్ని సాంకేతికపరమైనవైతే, మరికొన్ని వాటి ఉద్యోగులతో సంబంధాల విషయంలో కావచ్చు. సమస్య ఏదైనా దాన్ని అధిగమించి తయారీ ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలూ తలెత్తకుండా చూడాలి.

వినియోగదారుల మార్కెట్‌పై అవగాహన: మనదేశంలో ప్రతి ఐదు మైళ్లకు ప్రజల ఆహార అలవాట్లలో అంతరాలుంటాయని ఆహారశాస్త్ర నిపుణులు అంటారు. కుల, మత ప్రాంతాలను బట్టి ప్రజల ఈ మార్పులుంటున్నాయి. దక్షిణాదిలో వరి, ఉత్తరాదిన గోధుమ ప్రధాన ఆహారం. అలాగే ప్రజలు స్ట్రీట్ ఫుడ్ నుంచి ఫైవ్ స్టార్ హోటల్ ఆహారం వరకు ఆదరిస్తుంటారు. సీజనల్‌గానూ ఆహార అలవాట్లలో వ్యత్యాసాలుంటాయి. వీటన్నింటిపై ఆహారశాస్త్ర నిపుణులకు లోతైన అవగాహన ఉండాలి. దీనివల్ల పనిచేస్తున్న కంపెనీలో రాణించగలుగుతారు.

ఫుడ్ టెక్ కోర్సుల్లో ఏం నేర్పుతారు?

ఆహార ఉత్పత్తి, శుద్ధి, చెడిపోకుండా నిల్వ చేయడం, ప్యాకింగ్, లేబిలింగ్, నాణ్యతా నిర్వహణ, పంపిణీ దశలను ఫుడ్ టెక్నాలజీలో అధ్యయనం చేస్తారు. సంక్షిప్తంగా చెప్పాలంటే ముడి సరుకును తినేందుకు అనుకూలమైన పౌష్టికాహారంగా మార్చడమే ఈ శాస్త్రంలో నేర్చుకునే నైపుణ్యం.

ఫుడ్ టెక్నాలజీ కోర్సులను చేస్తే హాస్పిటల్స్, కేటరింగ్ సంస్థలు, రెస్టారెంట్లు, భారీ మాల్స్‌లో ఫుడ్ కోర్ట్, ఎయిర్ పోర్టులు, షిప్పింగ్ పోర్టుల్లోని ఆహారశాలల్లో వృత్తి నిపుణులుగా రాణించవచ్చు.

ఉద్యోగాలెక్కడ?

ఫుడ్ టెక్నాలజీలో గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లకు వివిధ తరహా కంపెనీల్లో ఉద్యోగావకాశాలున్నాయి. ప్యాక్ ఫుడ్‌లో అగ్రగామిగా ఉన్న ఐ.టి.సి. కంపెనీ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు వస్తుంటే మిగతా అనేక కంపెనీలు ఆఫ్ క్యాంపస్ విధానంలో ఎంపిక చేసుకుంటున్నాయి. రెస్టారెంట్స్, కార్పొరేట్ హాస్పిటల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు, సాఫ్ట్ డ్రింక్ తయారీ కంపెనీలు ఆహార నాణ్యతా ప్రమాణాల సంస్థలు, ప్యాకేజింగ్, పరిశోధన కంపెనీల్లో అర్హత గలవారికి అనేక అవకాశాలు సిద్ధంగా ఉన్నాయి.

అర్హతలను బట్టి ఫుడ్ టెక్నాలజీ పరిశ్రమలో వివిధ పొజిషన్లుంటాయి. క్వాలిటీ మేనేజర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, న్యూట్రిషనిస్ట్, రిసెర్చ్ సైంటిస్ట్, రిసెర్చ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఫుడ్ మేనేజర్, ఫుడ్ కెమిస్ట్, ప్రొడక్షన్ మేనేజర్, క్వాలిటీ ఎగ్జిక్యూటివ్, ఫుడ్ ప్రొడక్ట్ డెవలపర్, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్, పర్చేజింగ్ మేనేజర్ వంటి హోదాల్లో సంస్థలు మంచి ప్యాకేజీతో నియమించుకుంటున్నాయి.



- యస్.వి. సురేష్,
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

సిడ్బిలో కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్టులు

భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన లఖ్‌నవూ ప్రధాన కేంద్రంగా ఉన్న స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బి).. ఒప్పంద ప్రాతిపదికన 22 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

- ● కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్: 19
- ● అకౌంట్స్ అండ్ ట్యాక్స్ కన్సల్టెంట్ (ఏటీసీ): 03

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ.
వయసు: 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
పని ప్రదేశాలు: ముంబయి, లఖ్‌నవూ, న్యూదిల్లీ, అహ్మదాబాద్, చెన్నై.
ఎంపిక: సైకోమెట్రిక్ టెస్ట్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10-10-2024. **వెబ్‌సైట్:** www.sidbi.in/

ఎన్‌బీఆర్ఐలో స్టెనోగ్రాఫర్లు

సీఎస్ఐఆర్- కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన ఉత్తర్‌ప్రదేశ్, లఖ్‌నవూలోని నేషనల్ బొటానికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌బీఆర్ఐ)..6 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

● జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్: 01 ● జూనియర్ స్టెనోగ్రాఫర్ (హిందీ/ఇంగ్లిష్): 04 ● సెక్యూరిటీ ఆఫీసర్: 01

అర్హత: ఇంటర్మీడియట్, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీతో పాటు పని అనుభవం. **వయసు:** జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టులకు 27 ఏళ్లు; జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు 30 ఏళ్లు; సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది. **వేతనం:** జూనియర్ స్టెనోగ్రాఫర్‌లకు నెలకు రూ.25,500-రూ.52,575; జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌లకు రూ.35,400-రూ.1,12,400; సెక్యూరిటీ ఆఫీసర్‌లకు రూ.44,900-రూ.1,42,400. **దరఖాస్తు ఫీజు:** రూ.100; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు మినహాయింపు ఉంటుంది. **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, పని అనుభవం ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 21-10-2024. **వెబ్‌సైట్:** https://nbri.res.in/

వాక్-ఇన్స్

ఐఐఓఆర్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రిసెర్చ్ (ఐఐఓఆర్).. తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టులకి దరఖాస్తులు కోరుతోంది..

● యంగ్ ప్రొఫెషనల్-1: 01 ● యంగ్ ప్రొఫెషనల్-2: 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిగ్రీ (అగ్రికల్చర్/ హార్టికల్చర్/బయో టెక్నాలజీ) పీజీ (పాథాలజీ/ జువాలజీ/బోటనీ), పీహెచ్‌డీతో పాటు పని అనుభవం. **వేతనం:** నెలకు యంగ్ ప్రొఫెషనల్- 1 కు రూ.30,000; యంగ్ ప్రొఫెషనల్- 2కు రూ.42,000.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా. **ఇంటర్వ్యూ తేదీ:** 17-10-2024.
వేదిక: ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రిసెర్చ్ (ఐఐఓఆర్), రాజేంద్రనగర్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://www.icar-iior.org.in/home

ఈఎస్ఐసీలో సీనియర్ రెసిడెంట్లు

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) హాస్పిటల్ - బెంగళూరులోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, పీజీఐఎంఎస్ఆర్ అండ్ మెడికల్ హాస్పిటల్.. ఒప్పంద ప్రాతిపదికన 13 సీనియర్ రెసిడెంట్ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
విభాగాలు: ఎమర్జెన్సీ మెడిసిన్, ఎఫ్ఎంటీ, పీడియాట్రిక్స్ (ఎన్ఐసీయూ).
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీతో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు రూ.67,700.
వయసు: 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/పీడబ్ల్యూబీడీలకు సడలింపు ఉంటుంది. **ఇంటర్వ్యూ తేదీ:** 15-10-2024.
వేదిక: అకడమిక్ బ్లాక్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ అండ్ పీజీఐఎంఎస్ఆర్, రాజాజీనగర్, బెంగళూరు. **వెబ్‌సైట్:** https://www.esic.gov.in/

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో సూపర్‌వైజరీ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) శాశ్వత ప్రాతిపదికన సూపర్‌వైజరీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. అభ్యర్థులను ఆన్‌లైన్ టెస్ట్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

1. **అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్)–3:** మూడేళ్ల మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా చేయాలి. షిప్‌యార్డ్/ డాక్‌యార్డ్/ ఇంజినీరింగ్ కంపెనీ/ ప్రభుత్వ సంస్థల్లో ఏడేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. ఇది కాకుండా రెండేళ్లు మెకానికల్ సూపర్‌వైజర్‌గా పనిచేయాలి.
2. **అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)–8:** మూడేళ్ల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా చేయాలి. ఏడేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. లేదా ఐటీఐ చదివి ఎలక్ట్రికల్ పనుల్లో 22 ఏళ్ల అనుభవం ఉండాలి.
3. **అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రానిక్స్)–1:** ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా పూర్తిచేయాలి. ఏడేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. లేదా ఐటీఐ చదివి ఎలక్ట్రానిక్స్ మెకానిక్‌గా 22 సంవత్సరాల అనుభవం ఉండాలి.
4. **అసిస్టెంట్ ఇంజినీర్ (మెయింటెనెన్స్)–3:** మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా పాసై.. ఏడేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. లేదా ఐటీఐ చదివి 22 ఏళ్ల అనుభవం సంపాదించాలి.
5. **అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–1:** ఏదైనా డిగ్రీ 60 శాతం మార్కులతో పాసవ్వాలి. లేదా కమర్షియల్ ప్రాక్టీస్/ కంప్యూటర్ ఇంజినీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఏడేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. శాప్, ఎంఎస్-ప్రాజెక్ట్, ఎంఎస్-ఆఫీసుల్లో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.
6. **అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్–2:** ఎస్ఎస్ఎల్‌సీ, నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్, నాగ్‌పూర్ నిర్వహించే సబ్-ఆఫీసర్స్ కోర్సు పాసవ్వాలి. ఫైర్ ఫైటింగ్, అనుబంధ కార్యక్రమాల్లో ఏడేళ్ల అనుభవం ఉండాలి.
   - ◆ ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేయొచ్చు. మిగతా అన్ని పోస్టుల దరఖాస్తుకూ అనర్హులు.
7. **అకౌంటెంట్–2:** ఎం.కాం. పాసై ఫైనాన్స్/ అకౌంటింగ్‌లో ఏడేళ్ల అనుభవం ఉండాలి. లేదా డిగ్రీతో పాటు సీఏ/సీఎంఏ ఇంటర్మీడియట్ పాసవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.

వయసు: అన్ని పోస్టులకూ 30.10.2024 నాటికి 45 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులకు ఐదేళ్ల మినహాయింపు ఉంటుంది. మాజీ సైనికోద్యోగులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.700. ఎస్సీ/ ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.

ఎంపిక రెండు దశల్లో ..

ఫేజ్-1లో ఆన్‌లైన్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్ - 40 మార్కులు, డిస్క్రిప్టివ్ టైప్ - 40 మార్కులు) నిర్వహిస్తారు.

ఫేజ్-2లో ఉద్యోగానుభవం పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలి. దీనికి 20 మార్కులు. వ్యవధి 10 నిమిషాలు

- ◆ ఆబ్జెక్టివ్ ఆన్‌లైన్ టెస్ట్‌లో రెండు పార్టులుంటాయి. పార్ట్-ఏలో జనరల్ నాలెడ్జ్ (5 మార్కులు), జనరల్ ఇంగ్లిష్ (5 మార్కులు), రీజనింగ్ (5 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (5 మార్కులు), డిసిప్లెయిన్ రిలేటెడ్ (20 మార్కులు). పార్ట్-ఏ 40 మార్కులకు ఉంటుంది. దీని వ్యవధి 45 నిమిషాలు.
- ◆ పార్ట్-బీలో డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు 40 మార్కులు. వ్యవధి 90 నిమిషాలు.
- ◆ సిలబస్ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.
- ◆ ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ రెండింటిలోనూ అన్‌రిజర్వ్‌డ్ అభ్యర్థులు 50 శాతం, ఓబీసీలు 45 శాతం, ఎస్సీ/ఎస్టీలు, దివ్యాంగులు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.
- ◆ ఆన్‌లైన్ పరీక్షను కొచ్చిలోగానీ.. కేరళలో ఎక్కడైనాగానీ నిర్వహిస్తారు.
- ◆ ధ్రువపత్రాల పరిశీలన తర్వాత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సీఎస్ఎల్, కొచ్చిలో నిర్వహిస్తారు. దీని వ్యవధి పది నిమిషాలు మించకూడదు.
- ◆ మొదటి, రెండో దశల్లో సాధించిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక చేస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 30.10.2024
వెబ్‌సైట్: http://www.cochinshipyard.in/

సీజీఎల్‌కు సిద్ధమయ్యేదెలా?

పార్ట్‌టైమ్ జాబ్ చేసుకుంటూ.. ఎస్ఎస్‌సీ సీజీఎల్–2025కు ప్రిపేరవుతున్నాను. 365 రోజుల్లో దీనికెలా సన్నద్ధం కావాలి? **- విజయ్‌ప్రకాశ్**



■ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లో, సంస్థల్లో, విభాగాల్లో గ్రూప్ బి, గ్రూప్ సి ఉద్యోగులను నియమిస్తారు. ఈ పరీక్షలను రెండు దశల్లో టైర్ 1, టైర్ 2 రూపంలో నిర్వహిస్తారు. ఒక్కో ఉద్యోగానికి కనీసం వంద మంది పోటీ పడతారు. టైర్ 1 పరీక్ష జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్‌ల్లో వంద ప్రశ్నలు, ఒక్కో ప్రశ్నకు రెండు మార్కుల చొప్పున రెండు వందల మార్కులకు ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికీ అరమార్కు తగ్గిస్తారు. టైర్ 1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించినవారు టైర్ 2 పరీక్షలు రాయాలి.

టైర్ 2లో రెండు పేపర్లు. మొదటి పేపర్లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్, రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్, డేటా ఎంట్రీ స్పీడ్ టెస్టుల్లో ప్రశ్నలు ఇస్తారు. రెండో పేపర్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులో ఉంటుంది. మొదటి పేపర్ కంపల్సరీ అయితే, రెండో పేపర్ స్టాటిస్టికల్ ఆఫీసర్/ ఇన్వెస్టిగేటర్ లాంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసినవారికి మాత్రమే. టైర్ 2 పరీక్షలో కూడా తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కులుంటాయి.

సన్నద్ధత విషయానికి వస్తే..

- ముందుగా సిలబస్, పరీక్షా పద్ధతి, ప్రశ్నల సరళి గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.
- రోజుకు కనీసం ఆరు గంటల చొప్పున ఏడాది కృషి చేయాలి.
- ఒక్కో రోజు ఒక సబ్జెక్టుపై శ్రద్ధపెట్టి చదవాలి.
- ఈ పరీక్షల్లో సరైన సమాధానాలను తక్కువ సమయంలో గుర్తించాలి కాబట్టి, వీలున్నన్ని మాక్ టెస్టులు రాయాలి.
- ప్రాథమిక అంశాలపై, ఫార్ములాలపై మంచి పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్ వార్తా పత్రికల్ని చదువుతూ ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాలి.



- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ పుస్తకాలు, ఆన్‌లైన్ మెటీరియల్, వార్తా పత్రికలను క్రమం తప్పకుండా చదవాలి.
- ఇవన్నీ చదువుతూ సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి.
- పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేసి, సాధన చేయాలి.
- ఎప్పటికప్పుడు చదివినవాటిని పునశ్చరణ చేసుకోవాలి.
- సమయ నిర్వహణ చాలా ముఖ్యం కాబట్టి, వేగంగా సమాధానం గుర్తించే పద్ధతుల్ని నేర్చుకోవాలి.

ఈ పరీక్ష రాస్తున్నవారిలో కొంతమందితో తరచుగా మాట్లాడుతూ, సన్నద్ధతను మెరుగుపర్చుకోండి. గతంలో విజయం సాధించినవారి అనుభవాలను తెలుసుకొని ఈ పరీక్షలో విజయం సాధించే ప్రయత్నం చేయండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్‌ఫ్రమ్‌హోమ్

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: క్యానిబాల్స్ మీడియా ప్రై.లి.
నైపుణ్యం: సోషల్ మీడియా మార్కెటింగ్ స్టైపెండ్: రూ.3,000
☛ internshala.com/i/0c6f35

ఆర్కిటెక్చర్
సంస్థ: అసైన్‌మెంట్ వేల్
నైపుణ్యాలు: 3డీస్ మ్యాక్స్, ఆడోక్యాడ్, ఆటోడెస్క్ రెవిట్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/f37a8e

ఆండ్రాయిడ్ యాప్ డెవలప్‌మెంట్
సంస్థ: బ్రేవ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబొరేటరీ
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, ఫైర్‌బేస్, జావా, కాట్లిన్, రెస్ట్ ఏపీఐ, ఎక్స్ఎంఎల్ స్టైపెండ్: రూ.15,000-25,000
☛ internshala.com/i/0b750a

పిక్సెల్‌బ్రిడ్జెస్‌లో

1. వీడియో ఎడిటింగ్/మేకింగ్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.9,000
☛ internshala.com/i/802fc2

2. గ్రాఫిక్ డిజైన్
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్ స్టైపెండ్: రూ.9,000
☛ internshala.com/i/13860e

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: కెరియర్ క్రౌన్
నైపుణ్యం: బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్) స్టైపెండ్: రూ.2,000
☛ internshala.com/i/0fb2ce

దరఖాస్తు గడువు: అక్టోబరు 31

మలయాళం ట్రాన్‌స్క్రిప్షన్
సంస్థ: ఇండికా ఏఐ ప్రై.లి.
నైపుణ్యాలు: మలయాళం మాట్లాడటం, రాయడం, ట్రాన్‌స్క్రిప్షన్
స్టైపెండ్: రూ.6,000
☛ internshala.com/i/daf37d

డిజిటల్ ఇప్సమ్ సంస్థలో..

1. మోషన్ గ్రాఫిక్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫ్లాష్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, యానిమేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/09ed84

దరఖాస్తు గడువు: అక్టోబరు 30

2. సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
నైపుణ్యాలు: డిజిటల్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ యాడ్‌వర్డ్స్, గూగుల్ అనలిటిక్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 31
☛ internshala.com/i/5da385

చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in

(c) eenadu